# ప్రత్యేక తెలంగాణ

## ఉద్యమాల చరిత్ర



శోభా గాంధి

ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల చరిత్ర

శోభా గాంధి

# ప్రత్యేక తెలంగాణా ఉద్యమాల చరిత్ర

శోభాగాంధి

www.etelangana.org

# తెలంగాణా అమరవీరుల స్మారకస్థూపం సమాచారం

1969 ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో పోలీసుల తుపాకీ గుండ్లకు నేలకొరిగిన 360 మంది అమరవీరుల స్మారకస్థూపం ఇది. వాళ్ళంతా సామాన్యులే కాని అపురూపమైన సాహసాలు, త్యాగాలు, బలిదానాలు చేసి అసామాన్యులైనారు. అమరవీరులైనారు. అసంపూర్తి ఆశయాన్ని మనకు వదిలిపెట్టి 'మంచు పల్లకి' ఎక్కి మరలి రాకుండా వెళ్ళిపోయారు. ఈ స్మారకస్థూపం వారి త్యాగాలకు ప్రతిరూపం. ప్రత్యేక తెలంగాణాను సాధించమని చెప్పే ఒక నిరంతర సందేశం.

31 మే 1969 నాడు తెలంగాణా అమరవీరుల స్మారకస్థూపాన్ని నెలకొల్పాలని నిర్ణయం జరిగింది. తర్వాత 23 ఫిబ్రవరి 1970 నాడు అసెంబ్లీ ఎదురుగా వున్న గన్‌రాక్ పార్కులో నగర మున్సిపల్ మేయర్ లక్ష్మీనారాయణ స్థూపం పనులకు శంకుస్థాపన చేశారు. పోలీసులు ఆ కార్యక్రమాన్ని జరుగనియ్యరాదని ఉదయం నుండే పెద్ద ఎత్తున కాపల కాశారు. నాయకులు హఠాత్తుగా ప్రత్యక్షమై ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు చెన్నారెడ్డిని, మల్లికార్జున్‌ను, మేయర్ లక్ష్మీనారాయణను, టి. గోవింద్ సింగ్‌ను అరెస్టు చేశారు. దానికి నిరసనగా మరునాడు నగరంలో బంద్ జరిగింది. 25వ తేదీనాడు సికింద్రాబాదులోని క్లాక్‌టవర్ గార్డెన్‌లో మరో అమరవీరుల స్మారక స్థూపానికి కూడా శంకుస్థాపన జరిగింది. ఆ కార్యక్రమం నగర మున్సిపల్ ఉప మేయర్ శ్రీమతి మ్యాడం రామచంద్రయ్య ఆధ్వర్యంలో జరిగింది. అక్కడ కూడా అరెస్టులు, అల్లర్లు జరిగాయి. 28వ తేదీనాడు గన్‌రాక్‌పార్కులో పోలీసులు, స్థాపించిన శిలాఫలకాన్ని తొలగించినందుకు దానిని తిరిగి అప్పగించాలని సత్యాగ్రహం చేసిన 12 మందిని అరెస్టు చేశారు. ఇదీ ఆంధ్ర పాలకుల ప్రజాస్వామ్యం. అమరవీరుల స్థూపాలను కూడా స్థాపించుకునే స్వాతంత్ర్యం, హక్కులు తెలంగాణా ప్రజలకు లేవని తెలిసిపోయింది. హైద్రాబాదు మున్సిపల్ కార్పొరేషన్‌లోని అత్యధిక మున్సిపల్ కౌన్సిలర్ల కృషివలన ఆ స్థూపం స్థాపించబడింది. ఆ గొప్పతనం నగర ప్రజలకు దక్కుతుంది తప్ప, రాష్ట్ర ప్రభుత్వానికి కాదు.



www.etelangana.org

1975లో దాని నిర్మాణం పూర్తి అయింది. ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదలచేయకుండా ఎన్నో ఆటంకాలను సృష్టించింది. చివరికి ఆ స్థూపాన్ని రూపొందించిన శిల్పాచార్యుడికి కూడా సుమారు 75 వేల రూపాయల నష్టం వాటిల్లింది. మరో విషాదం ఏమిటనగా ఆ స్థూపానికి ఇప్పటివరకు ఆవిష్కరణ జరుగలేదు. ఒక వేళ ఆ స్థూపాన్ని ఆవిష్కరిస్తే తెలంగాణా ఉద్యమాన్ని నిద్రలేపినట్టవుతుందని పాలకుల భయమేమో! తెలంగాణా నాయకులు కూడా దానిని ఆవిష్కరించలేదు. అయితేనేమి. ప్రతిసంవత్సరం ప్రజలే విద్రోహ దినం నాడు (నవంబర్ ఒకటి) ఆ స్థూపం దగ్గర ఆ అమరవీరులకు నివాళులు అర్పిస్తారు. ఇటీవల ఆధునికీకరణ చేస్తున్నపుడు ఆ స్థూపం పాక్షికంగా ధ్వంసం అయ్యింది. ఇది అమరవీరుల పట్ల అపచారమే.

అంతర్జాతీయ ఖ్యాతి పొందిన కళాకారుడు, శిల్పి మరియు జె.ఎన్.టి.యు లో ఆచార్యుడుగా పని చేస్తున్న శ్రీ ఎక్కా యాదగిరిరావుగారు ఆ స్థూపాన్ని నిర్మించారు. ఆయనది అసలు పాలమూరు జిల్లా కాని హైద్రాబాదు పాతనగరంలో చదువుకొని స్థిరపడినారు. 'మా నెత్తురే కంకరగా ప్రాజెక్టులు కట్టినాం' అనే పాలమూరు గడ్డ బిడ్డ కావుననే అంత అందంగా, రసాత్మకంగా ఆ స్థూపాన్ని సృష్టించారు. ఆ స్థూపనిర్మాణాన్ని, ఆ స్థూపం అందించే సందేశాన్ని మనం పరిశీలించాలి.

స్థూపం అడుగుభాగం నల్లరాయితో తయారు చేయబడింది. నాలుగు వైపుల వున్న ఆ శిలాఫలకాలపై ప్రతివైపు తొమ్మిది చొప్పున చిన్న చిన్న రంధ్రాలు కనబడుతాయి. అవి అమరవీరుల శరీరంలోకి దూసుకుపోయిన బుల్లెట్ గుర్తులే కాక అప్పటి తొమ్మిది తెలంగాణా జిల్లాలకు సంకేతం.

స్థూపం ఎర్రరంగు రాయితో నిర్మించబడింది. ఎరుపు రంగు త్యాగానికి, సాహసానికి చిహ్నం. అక్కడ ఒక మకరతోరణం కనబడుతుంది. ఆ మకర తోరణం నిర్మాణ పద్ధతిని మన దేశంలో మొదటి స్థూపమైన సాంచీ స్థూపం నుండి స్వీకరించారు. ఆ మకరతోరణాన్ని శిలాఫలకాన్ని తొలిచి మలిచారు తప్ప దానికి అతికించలేదు. ఆ శిలాఫలకానికి నలుమూలలా పుష్పాలను చెక్కారు. అవి ఆ అమరవీరులకు అర్పించే నివాళులకు సంకేతం.

శోభాగాంధి

స్థూపం మధ్యభాగంలో ఒక స్తంభం కనబడుతుంది. ఏవైపు నుండి చూసినా దానిపై తొమ్మిది గీతలు కనబడుతాయి. అవి కూడా తొమ్మిది జిల్లాల తెలంగాణాకు ఒక సంకేతం.

స్థూపం పైభాగంలో అశోకుని ధర్మ చక్రం మనకు దర్శనమిస్తుంది. అది ధర్మం, శాంతి, సహనాలకే గుర్తుకాదు, ఆ అమరవీరులు ధర్మ సంస్థాపనకోసమే ప్రాణాలు బలిపెట్టారని మనకు స్ఫురిస్తుంది.

శీర్షభాగంలో తెలుపు వర్ణంలోనున్న తొమ్మిది రేకులుగలిగిన పుష్పం ఆ స్థూపం పై నిలబడివుంది. ఆ మల్లెపువ్వు తెలుపు స్వచ్ఛతకు సంకేతం. ప్రాణాలు వదిలిన అమరవీరుల త్యాగానికి, నిజాయితీకి, సాహసానికి ఆ వర్ణం ఒక సంకేతమే కాదు సందేశం కూడా. వాళ్ల పవిత్ర ఆశయం ఎన్నడూ వాడిపోదని, మాసిపోదని ఆ తొమ్మిది రేకుల తెలంగాణా పుష్పం మనల్ని సదా ఉత్తేజితుల్ని చేస్తుంది. కర్తవ్యం వైపు నడిపిస్తుంది. కార్యోన్ముఖుల్ని చేస్తుంది.

పంజాబులోని జలియన్‌వాలా బాగ్‌లో వున్న అమరవీరుల స్థూపం ఎంత పవిత్రమో, ఢిల్లీలో వున్న అమర్‌జవాన్, ఇండియా గేట్ ఎంత పవిత్రమో, తెలంగాణా ప్రజలకు హైద్రాబాదు, సికింద్రాబాదులలో వున్న ఈ అమరవీరుల స్థూపాలు అంత పవిత్రమైనవి.

**- శోభాగాంధి**



www.etelangana.org

# విషయ సూచిక

**ముందుమాటలు**


1. సి. విఠల్, శ్రీధర్‌రావు దేశ్‌పాండే

2. ఆచార్య కొత్తపల్లి జయశంకర్
మాజీ వైస్ ఛాన్స్‌లర్, కాకతీయ యూనివర్సిటీ.

3. నివేదన - శోభా గాంధి

**I ముల్కీ ఉద్యమాల చారిత్రక నేపథ్యం (1422-1938) ... 1**

1. దక్కన్‌లో బహమనీ సుల్తాన్‌ల కాలం నాటి ముల్కీ ఉద్యమాలు ... 3
2. ఆసఫ్‌జాహీల కాలంలో తలెత్తిన ముల్కీ ఉద్యమాలు ... 5
3. ముల్కీ ఉద్యమం 'గాడ్ ఫాదర్' మహారాజ సర్ కిషన్ పర్‌షాద్ ... 7
4. ముల్కీల హక్కుల పరిరక్షణకు 7వ నిజాం మొదటి ఫర్మానా ... 9
5. హైదరాబాద్ ఫర్ హైద్రాబాదీస్ ... 9

**II గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమం (1948-52) ... 11**

1. 'ఆపరేషన్ పోలో' పోలీస్ యాక్షన్ ... 13
2. 'మిడుతల దండు' దాడి ... 13
3. రామాచారి పిలుపు ... 14
4. ఉద్యమానికి శ్రీకారం చుట్టిన వరంగల్లు ... 15
5. అగ్గిపిడుగులైన హైద్రాబాదు విద్యార్థులు ... 17
6. విద్యార్థిగా ఉద్యమంలోకి దూకిన కేశవరావ్ జాదవ్ ... 17
7. ఉద్యమానికి ఊతమిచ్చిన కాళోజీ నారాయణరావ్, జయశంకర్‌లు ... 19
8. ప్రభుత్వ నిర్బంధ విధానం ... 20
9. తెలంగాణా 'గోస'ను అర్థం చేసుకున్న నెహ్రూ ... 20




www.etelangana.org

**III. తెలంగాణా ఆంధ్రవిలీన ప్రయత్నాలు - పెద్దమనుషుల ఒడంబడిక (1952-56) ... 23**

1. విశాలాంధ్రలో ప్రజారాజ్యం .... 25
2. రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం నియామకం .... 26
3. తెలంగాణా ప్రజల అనుమానాలు, భయాలు .... 27
4. విలీనాన్ని వ్యతిరేకించిన రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం .... 28
5. విడాకులు తీసుకోవచ్చని నెహ్రూగారి జోస్యం .... 30
6. పెద్దమనుషుల ఒప్పందం .... 30

**IV. పెద్దమనుషుల ఒప్పందం ఉల్లంఘనలు, అన్యాయాలు, అవహేళనలు (1956-68) ... 35**

1. చేసిన సంతకాలు ఆరకముందే ఒప్పందం ఉల్లంఘన .... 37
2. ఆంధ్రుల దృష్టిలో తెలంగాణా ఒక ఆక్రమిత ప్రాంతం .... 37
3. అంత్యక్రియలలో కూడా వివక్షత .... 39
4. వలసలు, వ్యవసాయభూముల దురాక్రమణలు .... 39
5. శ్రీ సదాశివగారి జ్ఞాపకాలు - అనుభవాలు .... 42
6. వలస వెల్లువలో తెలంగాణా .... 44
7. ఉద్యోగులలో అసంతృప్తి .... 45
8. ఉపాధ్యాయులలో అసంతృప్తి .... 45
9. తెలంగాణా మిగులు నిధుల సమస్య .... 46
10. పొగరాజుకుంది - అగ్గి అంటుకుంది .... 47
11. హైస్కూల్ విద్యార్థుల నేపథ్యం .... 48
12. గాయపడిన బెబ్బులి - మర్రి చెన్నారెడ్డి .... 49

**V. 1969 ఉద్యమం - అగ్నిగుండంగా మారిన తెలంగాణా ... 51**

1. వికసించిన విద్యుత్తేజం. .... 53
2. ఉద్యమంలోకి ఉరికిన ఉస్మానియా యూనివర్శిటీ .... 54
3. ఉస్మానియా యూనివర్శిటీలో తెలంగాణా ఉద్యమ నేపథ్యం. .... 55
4. ఊపందుకున్న ఉద్యమం. .... 56
5. తొలి లాఠీచార్జీ .... 58
6. తొలి పోలీసు కాల్పులు. .... 59
7. ఆంధ్రా ఉద్యోగులను వెనక్కిపంపే జి.వో. జారీ. .... 61
8. తొలి అమరవీరుడు శంకర్. .... 62
9. పోరుగల్లుగా మారిన ఓరుగల్లు - కాళోజీ డిమాండ్. .... 63
10. తెలంగాణా ప్రజాసమితి ఆవిర్భావం. .... 65
11. జన సముద్రంగా మారిన రెడ్డి హాస్టల్ సదస్సు .... 66
12. ఉద్యమంలోకి ఉపాధ్యాయులు, ఉద్యోగులు. .... 68
13. సుప్రీం కోర్టు తీర్పు - వెల్లువెత్తిన నిరసనలు. .... 69
14. రక్తసిక్తమైన సికింద్రాబాదు. .... 70
15. తెలంగాణా ఉద్యమ కవి వేణు సంకోజు 'జ్ఞాపకాల గాయాలు'. .... 71
16. చెన్నారెడ్డి రంగ ప్రవేశం. .... 73
17. మళ్ళీ నెత్తురు 'సాకబోసిన' మేడే. .... 74
18. శ్రీ దాశరథి రంగాచార్యగారి దృష్టిలో తెలంగాణా ఆత్మ తత్వం. .... 76
19. ప్రజల్ని నిలువునా ముంచే మామా అల్లుళ్లు. .... 78
20. ఉద్యోగుల నాయకుడు అమోస్ భర్తరఫ్. .... 80
21. వామపక్ష పార్టీల పాత్ర. .... 82
22. తెలంగాణా గడ్డ బిడ్డలు - మట్టిలో మాణిక్యాలు. .... 83
23. అగ్నిగుండంగా మారిన జంటనగరాలు. .... 84
24. అమరవీరుడు ప్రేమ్ కిశోర్. .... 85
25. కర్ఫ్యూలో జనజీవనం. .... 87
26. అర్ధ రాత్రి అనుకోని అతిథి - ప్రధాన మంత్రి. .... 89
27. కార్మికుల సమ్మెలు. .... 90
28. తెలంగాణా ఉద్యోగుల నిరవధిక సమ్మె - సస్పెన్షన్లు. .... 90
29. జర్నలిస్టు పాశం యాదగిరిగారి 'ఆనాటి ముచ్చట్లు'. .... 91
30. చరిత్రను రికార్డు చేసిన 'ఆబిడ్స్ చౌరాస్తా'. .... 93





www.etelangana.org

31. సంయమనం పాటించిన శ్రీధరరెడ్డి. .... 94

32. ముషీరాబాదు జైలులోపల...... .... 95

33. అగ్రనాయకుల అరెస్టులు, రాజమండ్రి జైలుకు తరలింపులు. .... 97

34. తెలంగాణా మంత్రుల రాజీనామాల ప్రహసనం. .... 98

35. ముఖ్యమంత్రి రాజీనామా - చెలరేగిన జన సందోహం. .... 99

36. డాక్టర్ గోపాల్ కిషన్ అరెస్టు. .... 101

37. తెలంగాణా పతాక దినోత్సవం. .... 104

38. కొత్తగూడెంలో పోలీసు కాల్పులు. .... 105

39. మేం ముందుకు పోతాం - ప్రపంచం మావెంట వస్తుంది. .... 106

40. సికింద్రాబాదు 'చేపల బావి' అమరవీరుడు రవీంద్రనాథ్. .... 107

41. వరంగల్లులో కాళోజీ అరెస్టు. .... 107

42. లాఠీలు విరిగి రక్తం చిందిన పంద్రా ఆగస్టు. .... 108

43. పార్లమెంటులో దద్దరిల్లిన తెలంగాణా. .... 109

44. అగ్రనాయకుల విడుదల. .... 110

45. Come September కాదు Bad September. .... 110

46. దోపిడి లేని నవ తెలంగాణా. .... 111

47. ఏరుదాటినాం ఇక తెప్ప తగలేయండి. .... 112

48. మాట వినని విద్యార్థులు - గోవింద్ నిరాహార దీక్ష. .... 114

49. మల్లికార్జున్ నిరాహార దీక్ష. .... 117

50. ఉద్యమం విరమణ చెన్నారెడ్డి ప్రకటన. .... 121

51. నష్టాలపై ప్రభుత్వం అంచనాలు వివరాలు. .... 123

52. మూగబోయిన అగ్ని వీణ. .... 124

53. అనుభవాలు - గుణపాఠాలు. .... 124

54. కొందరు అమరవీరుల ఫోటోలు, వివరాలు. .... 131

55. సభలు, సత్యాగ్రహాల ఫోటోలు, వివరాలు. .... 142

56. కాల్పులలో హతులు, వికలాంగులైనవారి వివరాలు. .... 161

57. BIBLIOGRAPHY .... 164




# ఇవాల్టి కోసం
# నిన్నటి ఉజ్వల జ్ఞాపకాలు

ఎప్పుడయినా ఒక వర్తమాన ప్రజాసంచలనం గతాన్ని అన్వేషిస్తుంది. చరిత్రను తవ్విపోస్తుంది. పురాస్మృతిలో ఎక్కడయినా తనకు సారూప్యతలు కనబడతాయా అని వెతుకుతుంది. తాను సగర్వంగా వారసత్వం వహించగలిగిన సంప్రదాయాన్ని వెతికిపట్టుకోవడానికి ప్రయత్నిస్తుంది. తాను ఎంత ఘనమైన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నానో, ఎంతటి మహత్తర చరిత్రకు వారసురాలినో చెప్పకోవడానికి అది చాలా అవసరం. అట్లాగే ఆ గత పోరాటాలు ఏయే మార్గాల గుండా నడిచాయో, ఏయే విజయాలు సాధించాయో, ఏ అపజయాలకు గురయ్యాయో తెలుసుకోవడం కూడా ప్రతిపోరాటానికి అవసరమే. గుణపాఠాలు నేర్చుకోవడానికి, పూర్వీకులు చేసిన తప్పులు చేయకుండా ఉండడానికి, వారు సాధించిన విజయాలను ఇంకా ముందుకు తీసుకుపోవడానికి ఈ గతం అన్వేషణ, పరిశీలన, మననం చాలా అవసరం. గతవర్తమానాల మధ్య నిరంతరసంభాషణలోనే చరిత్ర నిర్మాణమవుతుందని ఇ.హెచ్.కార్ అన్న మాటకు అర్థం అదే.

ఈ గత అన్వేషణ, నిన్నటి ఉజ్వల జ్ఞాపకాల స్మరణ ఇటీవలి కాలంలో, ముఖ్యంగా తెలంగాణ ప్రత్యేకరాష్ట్ర ఆకాంక్షల ఉద్యమంలో చాలా ఎక్కువగా జరుగుతున్నాయి. ఇవాళ్టిపోరాటంలో పాల్గొంటున్న వాళ్లలో ఉత్తేజం నింపడం కోసం గత వైభవాన్ని తలపోసుకోవడం చాలా ఎక్కువగా జరుగుతున్నది. ఇవాళ్టి పోరాటంలో నిన్నటి పోరాటపు పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం కోసం గతచరిత్ర అధ్యయనం, విశ్లేషణ, పునర్వ్యాఖ్యానం పెరుగు తున్నాయి.

www.etelangana.org

ఇవాళ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలు ఒక కఠిన వాస్తవం. యాభై సంవత్సరాల ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రజలను అన్ని రకాల దోపిడీకి, పీడనకు, అన్యాయానికి గురి చేసినతర్వాత, అన్ని రక్షణలనూ ఒప్పందాలనూ హామీలనూ ఉల్లఘించిన తర్వాత, ఇక సమైక్య రాష్ట్రంలో మనుగడ అసాధ్యమని అర్థమైన తెలంగాణ తండ్లాట అనివార్యంగానూ సహజంగానూ ప్రత్యేక రాష్ట్ర వాంఛగా వ్యక్తమవుతున్నది. ఇది ఒక సహజమైన, అనివార్యమైన, న్యాయమైన, ప్రజాస్వామిక మైన ఆకాంక్ష.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలు మళ్లీ వెల్లువెత్తుతున్న గత పది సంవత్స రాల కాలం తెలంగాణ చరిత్రలోకెల్లా ఉజ్వలమైంది. ఈ పది సంవత్సరాలలో రాజకీయ సంచలనాల స్థితిగతులు ఎట్లా ఉన్నప్పటికీ, సాంస్కృతిక వికాసం మాత్రం అపురూపంగా, అద్భుతంగా సాగుతున్నది. తెలంగాణ రాజకీయ ఉద్యమం తనముందు పెట్టుకున్న లక్ష్యాలను ఏదో ఒకనాటికి సాధించవచ్చు. సాధించలేక పోవచ్చు. కాని ఈ పది సంవత్సరాల సాహిత్య, సాంస్కృతిక, మేధో ప్రజ్వలనాన్ని, ఈ ప్రజ్వలనం అనేక రూపాలలో పొందిన, పొందుతున్న వ్యక్తీకరణలను తుడి చెయ్యడం మాత్రం ఎవరికీ సాధ్యం కాదు. ఈ సాహిత్య కళా మేధో రూపాలు ప్రతిఫలించిన సామాజిక సంచలనాన్ని, ఈ వ్యక్తీకరణలు మేల్కొలిపిన ఆకాంక్షలను విస్మరించడం ఎవరికయినా అసాధ్యం. తెలంగాణ ప్రజల ప్రగాఢ ఆకాంక్షలను ప్రతిఫలిస్తూ తెలంగాణ సాహిత్యకారులు, కళాకారులు, మేధావులు, ఆలోచనాపరులు గొప్ప అభినివేశంతో గానం చేసిన స్వాభిమానం, స్వయం నిర్ణయాధికార వాంఛ ఇక ఎన్నటికీ తుడిచివెయ్యడానికి వీలులేని విధంగా చరిత్రలో నమోదయ్యాయి. అవుతున్నాయి. శాతవాహనుల నాటినుంచో, ఇంకా ముందు నుంచో గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని తనలో సంలీనం చేసుకున్న ఈ గడ్డ గత పది సంవత్సరాల ఆత్మగౌరవ, స్వయం నిర్ణయాధికార, స్వతంత్ర అస్తిత్వ పోరాటంలో భాగంగా ఎంత మంది కవులను, రచయితలను, గాయకులను, కళాకారులను, సాంస్కృతిక కార్యకర్తలను, ఉపన్యాసకులను, విశ్లేషకులను అట్టడగు మట్టిపొరలనుంచి పైకి ఎత్తిపట్టిందో, ఎంతమంది బుద్ధిజీవులకు కొత్త కలాలనూ గళాలనూ అందజేసిందో ఎంతమంది ఆలోచనలకు పదును పెట్టిందో చూస్తే ఇంత పెద్దఎత్తున సాంస్కృతిక ప్రజ్వలనాలు జరిగిన సందర్భాలు చరిత్రలోనే అతి అరుదుగా కనిపిస్తాయి.

ఈ మహా సాంస్కృతిక ప్రజ్వలనంలో చరిత్ర పరిశీలన ఒక ముఖ్యమైన భాగం. ఒక ఉద్యమంలో గతచరిత్ర అధ్యయనం ఎంతగా పెరిగితే అంతగా ఆ ఉద్యమం విస్తరిస్తుంది. ఆత్మపరిశీలనకు పూనుకుంటుంది. పాత తప్పలను సరిచేసుకుంటుంది. గతంలో ప్రవేశించలేకపోయిన జీవన రంగాలలోకి ప్రవేశి స్తుంది. గతంలో చేపట్టలేకపోయిన పోరాట రూపాలను చేపడుతుంది. గతం కన్న ఎక్కువ ప్రభావశీలంగా పురోగమిస్తుంది. గత పది పన్నెండు సంవత్సరాల తెలంగాణ ప్రత్యేకరాష్ట్ర ఉద్యమ విస్తరణలోని కీలకాంశం ఈ గత చరిత్ర అధ్యయనమే. ఆ అధ్యయనానికి అవకాశమిస్తున్న అనేక పుస్తకాలలో 2002లో మొదటిసారి వెలువడి ఇప్పటికి రెండుసార్లు పునర్ముద్రణ పొందిన ఈ పుస్తకానికి గణనీయమైన స్థానం ఉంది.

అప్పటిదాకా నాలుగైదు సంవత్సరాలపాటు విభిన్న ప్రజాసమూహాలలో, ప్రజా సంఘాలలో, మేధో సంచలనాలలో విస్ఫోటనమవుతూ, అప్పడప్పడే రాజకీయ వ్యక్తీకరణ పొందుతున్న తెలంగాణ స్వతంత్ర అస్తిత్వ ఆకాంక్షల సందర్భంలో ఈ పుస్తకం మొదటసారి వెలువడింది. కుతుబ్ షాహి, అసఫ్‌జాహి పాలనలోని ముల్కీ ఉద్యమాల

www.etelangana.org

చారిత్రక నేపథ్యం దగ్గర ప్రారంభించి, 1948-52 గైర్ ముల్కీ గో బ్యాక్ ఉద్యమాన్ని 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని సవివరంగా చర్చించిన పుస్తకం ఇది. ఈ మూడు నాలుగువందల తెలంగాణ చరిత్రలో మరెన్నో ప్రజా ఉద్యమాలు, సంచలనాలు ఉన్నాయిగాని, ఈ పుస్తకం లక్ష్యం ప్రత్యేక తెలంగాణ అస్తిత్వ ఉద్యమాల చరిత్రను చెప్పడం మాత్రమే. ఆ చరిత్రను చెప్పడం ద్వారా ఇవాళ్టి ఉద్యమానికి గతకాలపు ఘనతను గుర్తుచేయడమే. ఆ కర్తవ్యాన్ని ఈ పుస్తకం సమర్థంగా నేరవేర్చిందనీ చూపడానికి మూడు పునర్ముద్రణలే సాక్ష్యం. రచయిత లోకేశ్వర్‌కు హృదయ పూర్వకమైన అభినందనలు.

ఈ పుస్తకాన్ని 1969 ఉద్యమంతో మాత్రమే ఆపివేయకుండా, ఆ తర్వాతి ఉద్యమాల చరిత్రను కూడా ఇందులో భాగం చేస్తే బాగుండేది. ఇప్పటికైనా ఆ పనికి పూనుకుని తర్వాతి కూర్పులో ప్రత్యేకతెలంగాణ ఉద్యమాల చరిత్రను వర్తమానం దాకా కొనసాగించాలని ఆశిస్తున్నాను.

**ఎన్. వేణుగోపాల్**

హైదరాబాదు, ఏప్రిల్ 23, 2007

## మై అకేలేహీ చలాథా జాని బేమంజిల్
## మగర్ లోగ్‌సాథ్ ఆతే రహే ఔర్ కార్వాఁ బన్తాగయా

**- సాహిర్ లూధియాన్వి**

(గమ్యం వైపు నేనొక్కన్నే బయలుదేరినాను. కాని ప్రజలు నా వెనుక వస్తూనే ఉన్నారు. పెద్ద జనప్రవాహం ఏర్పడింది)

1996లో 25 ఏళ్ల సుషుప్తి తర్వాత వర్తమాన తెలంగాణ ఉద్యమం ఒక చిన్న పాయలాగా మొదలై ఇప్పుడొక ఉదృతమైన జనప్రవాహంగా మారింది. సైద్ధాంతిక, దృక్పథానికి రాజకీయ పరిణితిని సంతరించుకుని, ఒకవైపు తెలంగాణ ద్రోహులనుండి, దళారి రాజకీయ వర్గాల నుండి తనని తాను రక్షించుకుంటూ ఉద్యమం ముందుకు సాగుతూనే ఉన్నది. ఎన్నెన్నో ఒడిదొడుకులు, ద్రోహాలు, వెన్నుపోట్లు, పాలక వర్గాల ప్రలోభాలు, మాయోపాయాలు, అభివృద్ధి మంత్రాలు, గతితార్కిక కోస్తావాదుల ప్యాకేజీలు... ఇట్లా ఈ పదేళ్లుగా ఉద్యమాన్ని నిర్వీర్యం చేయటానికి పాలక వర్గాలు పడరాని పాట్లు పడినాయి. ఇంకా ఆ ప్రయాస పడుతూనే ఉన్నాయి. అయితే ఉద్యమం ఎంత జగరూకత, సంయమనం, రాజకీయ పరిణితిని ప్రదర్శించిందంటే... పాలక వర్గాల కుట్రలను వమ్ముచేసి సజీవంగా నిలబడింది. పాలక వర్గాల కోస్తా మీడియాల ధాటి పోలీస్‌లను తట్టుకొని భావ చైతన్యాన్ని ప్రజల్లోకి సింక్ చేయగలిగింది.

ఇదంతా 1996 నుంచి గొప్ప కమిట్‌మెంట్‌తో, అకుంఠిత దీక్షతో తెలంగాణ ఉద్యమకారులు చేసిన కృషి ఫలితం. 1996 నవంబర్ 1న తెలంగాణ ప్రజాసమితి ఆధ్వర్యంలో వరంగల్‌లో బ్రహ్మాండమైన సదస్సుతో ప్రారంభమైన వర్తమాన తెలంగాణ ఉద్యమ కార్యక్రమాలు ఇక మునుముందుకే సాగాయి. 1996 డిశంబర్‌లో హైదరాబాద్‌లో అటు తర్వాత తెలంగాణలోని అనేక పట్టణాలలో... గోదావరిఖని, కరీంనగర్, సిద్ధిపేట, జనగాం, సూర్యపేట, బోనగిరి సదస్సులు అపూర్వమైన ప్రజాస్పందనతో విజయవంతమైనాయి. ఈ క్రమంలోనే తెలంగాణ మహాసభ, తెలంగాణ జనసభ, తెలంగాణ ఐక్యవేదికలు ఏర్పాటై తెలంగాణ ఉద్యమాన్ని ఉదృతం చేసినాయి. 2001 నాటికి తెలంగాణలోని కవులు, రచయితలు, కళాకారులు కూడా సంఘటితమై మొదట తెలంగాణ సాంస్కృతిక వేదికను అటు తర్వాత తెలంగాణ రచయితల వేదికను ఏర్పాటు చేశారు. తెలంగాణ రచయితల వేదిక ఆవిర్భావ సభ 2001 లో వరంగల్‌లో అపూర్వంగా జరిగింది. ఒక రోజంతా సాగిన సభలు తెలంగాణ సాహిత్య సాంస్కృతిక వైభవాన్ని భాషా సాంస్కృతిక అస్థిత్వాన్ని, సమున్నతంగా చాటినాయి. వేదిక ఆధ్వర్యంలో 'తెలంగాణ సోయి' సాహిత్య పత్రిక ప్రారంభమైంది. అక్కడ్నించి నల్లగొండ, నిజామాబాద్, కరీంనగర్, సిద్ధిపేట, ఆదిలాబాద్, హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లలో సభలను నిర్వహించి తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు ఉన్న ప్రత్యేక భాషా సాంస్కృతిక అస్తిత్వ కోణాన్ని బలంగా చాటి



www.etelangana.org

చెప్పింది. తెలంగాణలో ఉన్న అన్ని శిబిరాల రచయితలను, కవులను, కళాకారులను ఐక్యం చేసిల ప్రజల ఆకాంక్షల పక్షాన నిలిచేందుకు కృషి చేసింది.

తెరవే ఆవిర్భవించే సమయంలోనే ఉద్యోగ వర్గాలలో కదలిక ప్రారంభమైంది. ఆ కదలిక తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆవిర్భావానికి దారితీసింది. మరోవైపు తెలంగాణ రాజకీయ రంగంలో అప్పటికి ఉన్న శూన్యాన్ని భర్తీ చేసి తెలంగాణ రాజకీయ వాతావరణాన్ని మలుపు తిప్పిన తెలంగాణ రాష్ట్ర సమితికి ప్రాణం పోసింది ఆనాటి ఉద్యమ వాతావరణం. టిఆర్ఎస్‌ని అక్కున చేర్చుకున్నారు. ప్రజల పార్టీ ఏర్పడిన కొద్ది మాసాలకే రాష్ట్రంలో పంచాయితీ ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో టిఆర్ఎస్‌కి అఖండ విజయాన్ని చేకూర్చి తమ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రభలంగా వెల్లడించారు. 2004 ఎన్నికల నాటికి టిఆర్ఎస్ ఒక బలమైన రాజకీయశక్తిగా ఎదిగింది. అధికారంలో స్థిరపడిపోయిన తెలుగుదేశం పార్టీని ఓడించాలంటే ప్రజల తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష ఒక్కటే శరణ్యం అనే స్పృహతో కాంగ్రేస్ టిఆర్ఎస్‌ని ఒప్పించి పొత్తు పెట్టుకున్నది తెలంగాణ రాష్ట్రాన్ని వాగ్దానం చేసి గద్దె నెక్కింది. తెలంగాణ ప్రజలిచ్చిన అఖండ విజయాన్ని వెక్కిరిస్తూ, వారి ఆకాంక్షలను వమ్ముచేస్తూ ద్రోహానికి కాంగ్రేస్ ఒడిగడ్తున్నది. ఇదంతా వేరే చర్చ.

అయితే 2004 అసెంబ్లీ ఎన్నికల తర్వాతల టిఆర్ఎస్ తన కార్యకలాపాలని ఢిల్లీలో లాబీయింగ్‌కే పరిమితం చేసింది. ప్రజల సమస్యలను, పార్టీ నిర్మాణాన్ని గాలికి వదిలేసింది. కేంద్ర మంత్రి వర్గంలోను, కొన్నాళ్లు రాష్ట్రమంత్రి వర్గంలోనూ కొనసాగి నిర్వీర్యతకు లోనయింది. తెలంగాణ అంశాన్ని సోనియా పాదాల చెంతకు చేర్చింది. ఉద్యమంలో ఒక నిరాశ, నిర్లిప్తత, చాటుకుంటున్న వేళ... ఈలాంటి వాతావరణంలో ఉద్యమాన్ని సజీవంగా ఉంచడంలో తెలంగాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ ఉద్యోగుల సంఘం, తెలంగాణ రచయితల వేదిక ఇతర ప్రజాసంఘాల కృషి, దీక్షా కారణమని చెప్పక తప్పదు. ఈ అన్ని కార్యక్రమాలలో ఈ మట్టిలో పుట్టిపెరిగిన వందలాది పాటకవులు, కవిగాయకులు, వాగ్గేయకారుల కృషి ఈ తెలంగాణ విముక్తి పోరాట చరిత్ర ఏనాటికి మరువలేనిది. మొదటే చెప్పినట్లు పాయలాగా మొదలైన తెలంగాణ ఉద్యమం ఇవ్వాల అన్ని వర్గాల, సెక్షన్ల ప్రజలను ఐక్య సంఘటనల్లోకి సమీకృతం చేసి ఉద్యమాన్ని మహా ప్రజా ఉద్యమంగా మార్చింది. తెలంగాణ ఉద్యోగుల, ఉపాధ్యాయుల, కార్మికుల ఐక్యకార్యాచరణ కమిటి, కళాకారుల తెలంగాణ ధూంధాం కమిటి, ప్రజాసంఘాల ఐక్యకార్యాచరణ కమిటి, తెలంగాణ విద్యార్థి సంఘం తెలంగాణ జర్నలిస్టుల ఫోరం, ప్రవాస తెలంగాణీయుల టిడిఎఫ్ ఇట్లా ఉద్యమం గుణాత్మకంగా అభివృద్ధి చెందింది. 1986లోనే ఏర్పాటైన తెలంగాణ ఇన్ఫర్మేషన్ ట్రస్టు ఈ అన్ని ఉద్యమాలకు అంతస్సూత్రంగా ఉన్నది. 1992లో తెలంగాణా స్టూడెంట్ లిబరేషన్ ఆర్గనైజేషన్ (టిఎస్ఎల్ఓ) 1996 ప్రాంతాలలో తెలంగాణా స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టిఎస్ఓ) మరియు తెలంగాణా స్టూడెంట్ ఫ్రంట్ (టిఎస్ఎఫ్)లు ఆవిర్భవించి ప్రాథమిక స్థాయిలో అయితేనేం తమవంతు కృషిని కొనసాగించినాయి.

శోభాగాంధి

ఈ క్రమంలో ఈ నేలతల్లి విముక్తి కోసం తమ గళాలు, కలాలు పదునుపెట్టుకొని ఊకుమ్ముడిగా పాలకవర్గాలకై ఎక్కుపెట్టి తమదైన సాహిత్యాన్ని సృజించారు. రచయితలు, కవులు, కళాకారులు, మేధావులు, పాటలు, కవిత్వం, కథలు, నవలలు, రాజకీయార్థిక విశ్లేషణలు... ఇట్లా ఏ రంగంలో ఉన్నవారు ఆ రంగంలో గొంతెత్తినారు. అటువంటి అపూర్వమైన కృషిలో భాగస్వామిగా ఉన్న సాంస్కృతిక సైనికుడు లోకేశ్వర్ (శోభాగాంధి).

నవంబర్ 2002లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల చరిత్రను రచించి ఈ తరానికి కనుమరుగై పోతున్న సమీప చరిత్రను అందించాడు. లోకేశ్వర్ అందించిన ఈ చరిత్రను ప్రజలెంతగా ఆదరించారంటే ఈ పుస్తకంలోని అనేక చాప్టర్లు, పత్రికల్లో మళ్లీ మళ్లీ పునర్ముద్రణకు నోచుకున్నాయి. ఈ పుస్తకం కంటె ముందు 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని రికార్డు చేసిన పుస్తకాలు అచ్చయినవి కొన్నే. ప్రముఖంగా పేర్కొనదగిన గ్రంథం ఆదిరాజు వెంకటేశ్వరరావు, బి..ఎస్.ఎస్. రామచంద్రరావులు రాసిన 'తెలంగాణ పోరాటం'. అయితే అవిపుడు ఎవరికీ అందుబాటులో లేకపోవడం ఒక విషాదం. అటువంటి స్థితిలో ఈ పుస్తకం ఉద్యమానికి ఒక ప్రేమ పూర్వక కానుకగా అందింది. తనకన్న ముందు అచ్చయిన పుస్తకాలను సేకరించడం, నేలమాళిగల్లో ఆనాటి దినపత్రికల్లో మైక్రోఫిల్ముల్లో నిక్షిప్తమైన తెలంగాణ చరిత్రను వెలుగులోకి తీసుకురావడం ఎంత ప్రయాసనో లోకేశ్వర్‌కి... చరిత్ర పురా తత్వకాలలో నిమగ్నమైన సంగిశెట్టి లాంటి అనేక మంది చరిత్ర పరిశోధనకులకు ఎరుకే. సంగిశెట్టి అంటాడు... తెలంగాణ చరిత్ర పరిశోధన అంటే పురావస్తు పరిశోధన లాంటిదే. అంటే తెలంగాణ చరిత్రకు సంబంధించిన సమాచార సేకరణ కత్తి మీద సాములాంటిది. పరిశోధనకు మెటీరియల్ దొరకదు. దొరికినా క్షీణ దశలో ఉంటాయి. అయితే వాటిలోంచే తెలంగాణ చరిత్ర పునర్‌నిర్మాణం చేసుకోవలసి ఉన్నది. లోకేశ్వర్ ఈ పుస్తకం అటువంటి చరిత్ర పునర్ నిర్మాణంలో ఒక ఎన్నదగిన మైలురాయిగా మేం భావిస్తున్నాం.

నవంబర్, 2002లో వెలువడిన ఈ పుస్తకం తన చారిత్రక కర్తవ్యాన్ని నిర్వహించిందనీ, తను ఏ లక్ష్యాలతో, ఏ ఆకాంక్షలతో ఈ పుస్తకాన్ని రచించాడో అవి నెరవేరినాయని మేం భావిస్తున్నాం. ప్రతి రాత్రికి సూర్యోదయం ఉంటుంది. అంతిమంగా సత్యమే జయిస్తుంది. కావున తెలంగాణాను సాధించితీరుతాం. సాధించిన తెలంగాణను ప్రజాస్వామిక తెలంగాణాగా మలుచుకుంటాం. ఆ ఆశతోనే ఈ పుస్తకం రాశాను. ఎంతో కొంత ఉద్యమానికి తోడ్పడాలనే, ఉపయోగపడాలనే నిండు విశ్వాసంతో ఈ పుస్తకం రాశాను" అని మొదట ముద్రణకు నివేదనలో రాసుకున్నాడు. ఆయన ఆశ పూర్తిగా నెరవేరింది. కనుకనే పుస్తకానికి డిమాండ్ ఇంకా ఉంది. రెండో ముద్రణకు వెళుతున్నది.

ఇక ఈ పుస్తకం నెరవేర్చిన ఇంకా నెరవేర్చవల్సిన చారిత్రక కర్తవ్యాలు రెండున్నాయని మేము భావిస్తున్నాం.

1. ఒక సంవత్సరం పాటు ఈ రాష్ట్రాన్ని అట్టుడికించిన ఒక మహా ప్రజా ఉద్యమ చరిత్రను ప్రజలకు అందజేసి ఆ ఉద్యమ స్ఫూర్తిని, ఆనాటి ప్రజా ఉద్యమంలో ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు చూపిన చొరవ, త్యాగనిరతి, చావుకు కూడా వెరవని తెగువ ఇవ్వాళ్టి నవతరానికి తెలియజేసి ఉద్యమంలోకి సమీకరించడం.

శోభాగాంధి

www.etelangana.org

2. 1969 మహా ఉద్యమం అవకాశవాద దళారి రాజకీయ వర్గాల వలన ద్రోహానికి, వంచనకు గురి అయ్యింది. విద్యార్థుల, ఉద్యోగుల, వివిధ సెక్షన్ల ప్రజల త్యాగాలు వృదా అయినాయి. 370 మంది రక్తతర్పణం బూడిదలో పోసిన పన్నీరయ్యింది. 1969 ఉద్యమ ద్రోహాల నుండి గుణపాఠం నేర్చుకొని ఇవ్వాల్టి వర్తమాన తెలంగాణ ఉద్యమాన్ని అవకాశవాద, దళారి రాజకీయ వర్గాల నుండి ఉద్యమాన్ని రక్షించుకొని ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష సాకారం పొందేటందుకు ముందుకు సాగడం.

ఈ పుస్తకం వచ్చేనాటికే తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆవిర్భవించింది. 1969 ఉద్యమంలో ఉద్యోగులు నిర్వహించిన వీరోచిత పోరాటాల స్ఫూర్తితో, ఉద్యోగరంగంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివక్షను అంతం చేసేందుకు ఉద్యమించడం, అంతిమంగా తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల సాధనకోసం సహచర ప్రజా సంఘాలతో భుజం భుజం కలిపి పనిచేయడం అనే స్పష్టమైన లక్ష్యాలతో 25.7.2001న తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆవిర్భవించి తన కార్యకలాపాలను విస్తృతం చేసింది, చేస్తున్నది. తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆవిర్భావంలోనూ, కార్యాచరణను రూపొందించడంలోనూ లోకేశ్వర్ భూమిక ముఖ్యమైనది. సంవత్సరం గడిచేటప్పటికే సంఘం కార్యకలాపాలు ప్రజల దృష్టిని ఆకర్శించాయి. సంఘం మొదటి వార్షికోత్సవ సభలోనే లోకేశ్వర్ రాసిన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించాం. ముప్పయ్ నలభై మందితో మొదలైన సంఘం 5 ఏళ్లలోనే అన్ని జిల్లాలలో యూనిట్లను ఏర్పర్చుకో గలిగింది. అనేక సమస్యల మీద ఉద్యమించింది. రాజకీయ వర్గాలను నిలదీసింది. ప్రజలను కదిలించగలిగింది. నిర్వీర్యతకు, నిర్లిప్తతకు గురి అయిన ఉద్యమాన్ని సజీవంగా ఉంచడంలో నిరంతరం శ్రమించింది. సంఘం రూపొందించి డైరీ ఒక ఉద్యమకరదీపికగా ప్రజల మన్ననలను పొందింది. అన్ని రంగాలలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను, వివక్షను అద్దంపట్టే గణాంకాలను సేకరించి డైరీలో పొందు పర్చాం. ఈ కృషిలో కూడా లోకేశ్వర్ తనవంతు బాధ్యతను నెరవేర్చాడు. డైరీ ఆవిష్కరణ ప్రముఖంగా చర్చనీయాంశాలుగా మార్చాయి. 610 జీవో అములుపై ఏర్పాటైన శాసన సభా సంఘం, గిర్‌గ్లానీ కమీషన్‌లకు ఇతోధికంగా సమాచారం అందించింది. వారి సిఫారసుల అమలుకు డిమాండు చేస్తూ పోరాటాలు నిర్వహించింది. 610 జీవోను భూస్థాపితం చేయబూనుకున్న జీవో 72 రద్దుకు ఉద్యమించి విజయం సాధించింది.

మొత్తంగా తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను తెలంగాణ ఉద్యమంలోకి సమీకరించే మహత్తర ఐక్య సంఘటన ఏర్పాటుకు ప్రధాన భూమికను పోషించింది. 1969లో ఉద్యోగుల పోరాట వారసత్వాన్ని స్వీకరించింది. అందుకు లోకేశ్వర్ పుస్తకం ఇచ్చిన ప్రేరణను ఎట్లా లెక్కించగలం? ఈ పుస్తకం రెండో ముద్రణ వస్తున్న సందర్భం ఏమిటంటె... 1969లో ప్రధాన భూమికను పోషించిన విద్యార్థులు... ఇవ్వాళ వర్తమాన తెలంగాణ ఉద్యమంలోకి భాగస్వాములవుతున్న వేళ సెప్టెంబర్ 17, 2006న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలో వేలాది మంది విద్యార్థులతో విద్యార్థి సమ్మేళనం జరుగబోతున్నది. ఉద్యోగ వర్గానికి స్ఫూర్తి, ప్రేరణను అందించిన ఈ పుస్తకం విద్యార్థులను ఉద్యమంలోకి సమీకరించడంలో అదే రకమైన స్ఫూర్తిని, ప్రేరణను అందించగలుగుతుందని మా ప్రగాఢ విశ్వాసం.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల చరిత్ర రెండో ముద్రణకు వయస్సు రీత్యా, జీవితానుభవం రీత్యా చిన్నవాళ్లమైన మమ్ములను ముందుమాట రాయమన్నాడు లోకేశ్వర్. లోకేశ్వర్ వినయపూర్వకంగా మా కిచ్చిన ఈ చారిత్రక అవకాశానికి ఎంతో గౌరవంతో మరింత ఎక్కువ మురిపెంతో ఈ ముందుమాట రాస్తున్నాం. రెండో ముద్రణలో వర్తమాన తెలంగాణ ఉద్యమ చరిత్రను కూడా జతచేసి పుస్తకాన్ని అప్‌డేట్ చేయమని అడిగినపుడు వర్తమాన తెలంగాణ ఉద్యమం ఇంకా వర్తమానంగానే ఉన్నది. అది తన లక్ష్యమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిననాడు చరిత్రగా మారుతుంది. ఆ చరిత్రనూ తప్పకుండా భావితరాలకు అందిస్తాను అని భరోసా ఇచ్చాడు. ఆ భరోసాను నిభాయిస్తాడన్న నమ్మకం మాకూ ఉన్నది.

స్పార్టకస్ ఉరికంబం ఎక్కేముందు అన్న చివరిమాటలు "నేను లక్షమందితో తిరిగి వస్తాను". 1969 మహా ప్రజా ఉద్యమం నిలకడగా మరింత పరిణితితో మళ్లీ నిర్మాణమవుతున్నది, తెలంగాణను అలుముకుంటున్నది. ఈ అపూర్వ చారిత్రక సన్నివేశంలో లోకేశ్వర్ శరీరం, మేధస్సు, సమస్త శక్తులను ఉద్యమానికి పునరంకితం చేయాల్సి ఉన్నదని భావిస్తూ...

ఉద్యమాభివందనాలతో

**సి. విఠల్**
సెక్రెటరీ జనరల్,
తెలంగాణా ఉద్యోగుల జె.యె.సి.

**శ్రీధరరావు దేశ్‌పాండే**
కార్యదర్శి
తెలంగాణా విద్యావంతుల వేదిక,
హైదరాబాద్ నగరశాఖ.

**కాళోజీ జయంతి**
9-9-2006.

హయాత్ లేకేచలో కాయినాత్ లేకేచలో
చెలేతో సారే జమానేకో సాత్ లేకే చలో
- మగ్దూం

శోభాగాంధి

శోభాగాంధి
www.etelangana.org

# ముందు మాట

ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రతిరోజు నమాజ్ చదివిన తరువాత దేవునితో "అల్లా! మద్రాసీలను ఎల్లప్పుడు సుభిక్షంగా ఉంచుము" అని ప్రార్థించేవాడట. ఆ రోజుల్లో హైద్రాబాదు రాష్ట్రం వారికి 'మద్రాసీ' అంటే అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉండే తెలుగువారని అర్థం. నిజాం ప్రార్థనలోని అంతరార్థం ఆయన అంతరంగికులకు కూడ అర్థం అయ్యేది కాదు. 'ఇదేమిటి, మా ప్రభువు తమ రాజ్యంలోని ప్రజల క్షేమం కొరకు కాక పరాయి రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం గురించి ప్రార్థిస్తాడు" అని బాధపడేవారట. కొన్నాళ్ళ తర్వాత కొందరు ధైర్యం తెచ్చుకొని తమ మనోభావాన్ని నిజాం నవాబుకు విన్నవించుకున్నారట. అప్పుడు నిజాం నవాబు "పిచ్చినాయనలారా! మద్రాసీలు సుభిక్షంగా లేకపోతే వారిక్కడికి వచ్చి మీ నోళ్ళు కొట్టే ప్రమాదం ఉంటుంది. కనుక మీ క్షేమంకోరే నేనీ ప్రార్థన చేస్తున్నాను అని వివరించినాడట. ఈ మాటలు ఇప్పటి తరాల వారికి నమ్మశక్యంగా ఉండకపోవచ్చు. కానీ నాతరం వారికి ఆ రోజుల్లో ప్రతివారి నోట నలిగిన మాటలే.

దేశానికి స్వాతంత్ర్యం రాకముందే విశాలాంధ్ర వాదం మొదలయింది. కనుక భవిష్యత్తులో హైద్రాబాద్ (తెలంగాణా) వారికి రాబోయే ప్రమాదాన్ని నిజాం నవాబు ఏనాడో పసికట్టడం ఒక విశేషమే. నిజానికి విశాలాంధ్ర వాదాన్ని తెలంగాణాలోని అత్యధికులు ఎప్పుడు సమర్థించలేదు. విశాలాంధ్ర పట్ల వారి వ్యతిరేకత 1946-48 మధ్యకాలంలో మరింత ప్రస్ఫుటమైంది. అప్పుడు రజాకార్ల అరాచక చర్యలను తట్టుకోలేని కొందరు హైదరాబాదు రాష్ట్రవాసులు తలదాచుకోవడానికి పొరుగు రాష్ట్రాలకు వలసవెళ్ళవలసి వచ్చింది. కొందరు నాగ్‌పూర్ వెళ్ళితే మరికొందరు విజయవాడ, కర్నూలు పట్టణాలకు వెళ్ళారు. నాగ్‌పూర్ వెళ్ళినవారికి అక్కడి స్థానికులు అత్యంత ఆప్యాయతతో ఆశ్రయమిచ్చినారు. ఆ విధంగా నాగ్‌పూర్‌కు వెళ్ళిన శరణార్థులలో పి.వి. నరసింహారావు కూడా ఉన్నాడు. విజయవాడ, కర్నూలుకు వెళ్ళినవారికి మాత్రం చేదు అనుభవాలు ఎదురయినవి. నిజాం రాష్ట్రం నుండి వచ్చిన వారందరూ బాగా ధనవంతులని భావించి వారి కొరకు ఇంటి అద్దెలను, హోటలు రేట్లను, నిత్యావసర వస్తువుల ధరలను అనేక రెట్లు పెంచడమే కాక వారిపట్ల అమర్యాదగా ప్రవర్తించినారు. అటువంటి చేదు అనుభవాలను చవిచూసినవారు కొందరు ఇప్పటికీ జీవించి ఉన్నారు.

ఈ విషయాలను ప్రస్తావించే ఉద్దేశం ప్రత్యేక తెలంగాణా వాదం ఈనాటిదికాదని తెలుపుటకే. ఆంధ్ర ప్రదేశ్ అవతరణకు దశాబ్దాల ముందే ఈ



ప్రాంతవు ప్రజలు విశాలాంధ్ర పట్ల తమ వ్యతిరేకతను చాలా స్పష్టంగా వ్యక్తపరిచినారు. దానికి కారణం ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో వారికి న్యాయం జరగదనే అనుమానం. రాష్ట్రావతరణ జరిగి నలభై ఆరు సంవత్సరాలు గడిచినా ఇంకా ఈ నినాదం కొనసాగుతూనే ఉన్నది. దీనికి కారణం విశాల తెలుగు రాష్ట్రంలో ఈ ప్రాంతానికి న్యాయ్యం జరగని చేదు అనుభవాలు, ఇక ముందు కూడ న్యాయం జరగదనే గట్టి నమ్మకం. ఈ రాష్ట్రంలో ఏ పార్టీలు అధికారాన్ని హస్తగతం చేసుకున్నా, ఏ పార్టీలు ప్రతి పక్షంలో ఉన్నా, ఏ పార్టీలు పాలక వర్గాలతో మిత్రపక్షాలుగా వ్యవహరించినా, ఏ ప్రాంతవు నాయకులు రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్నా తెలంగాణా ప్రాంతం నిరంతర, నిరాటంక దోపిడికి గురి అవుతూనే ఉన్నది. ఈ పరిస్థితులపై ఎప్పటికీ ఏదో ఒక రూపంలో చర్చ జరుగుతూనే ఉన్నది. గత ఆరు సంవత్సరాలనుండి మళ్ళీ ఈ చర్చలు చాలా విస్తృత స్థాయిలో జరిగి ఉద్యమస్థాయికి చేరినవి.

ఈ కాలంలో తెలంగాణా సమస్యపై విశేషమైన రచనలు కూడ వెలువడినవి. ఈ రచనల పరంపరలో ఇప్పుడు పాఠకలోకానికి అందనున్నది, శోభాగాంధి రచించిన "ప్రత్యేక తెలంగాణా ఉద్యమాల చరిత్ర". ఇది ఒక పరిశోధనాత్మక గ్రంథం. విషయసేకరణ కొరకు రచయిత్రి చేసిన ప్రయత్నం, పడిన శ్రమ, కావించిన విశ్లేషణ శ్లాఘనీయం. తెలంగాణా సమస్య గురించి వర్తమానంతోపాటు గతాన్ని గురించి కూడ తెలుసుకోవటం, ముఖ్యంగా ఈ తరంవారికి చాలా అవసరం.

ప్రత్యేక తెలంగాణా వాదం కేవలం ఒక రాజకీయ నినాదం కాదు. దానికి బలమైన ఆర్థిక కారణాలున్నవి, ప్రబలమైన సాంస్కృతిక దృక్కోణం ఉన్నది. సుదీర్ఘమైన చారిత్రక నేపథ్యం ఉన్నది. ఈ చారిత్రక నేపథ్యం గురించి సరియైన అవగాహన లేనిదే ప్రత్యేక రాష్ట్రం వాదాన్ని అర్థవంతగా ముందుకుసాగించలేము. ఈ తరుణంలో, చారిత్రక సంఘటనలను క్రోడీకరించిన ఇటువంటి గ్రంథం రావటంవలన తెలంగాణా ఉద్యమం మరింత ఊపిరి పోసుకునే అవకాశ మున్నదనుటలో సందేహం లేదు.

రచయిత్రి శోభాగాంధిని హృదయపూర్వకంగా అభినందిస్తూ ఇటువంటి రచనలు ఇంకా కొనసాగించాలని ఆశిస్తూ.....

హన్మకొండ
ఒకటి నవంబర్, 2002

కొత్తపల్లి జయశంకర్
మాజీ వైస్ ఛాన్సలర్,
కాకతీయ యూనివర్సిటీ




www.etelangana.org

# నివేదన

చరిత్ర, సాంఘిక శాస్త్రాలు ఇక అక్కరలేదని ఏలినవారు అంటున్న నేపథ్యంలో, వాటిని కాలనాళికలో పెట్టి భూస్థాపితం చేస్తాం అంటున్న సందర్భంలో జాతీయ, అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించి చరిత్రను సృష్టించిన "ప్రత్యేక తెలంగాణా ఉద్యమాల చరిత్రను" చరిత్రలో రికార్డు చేసి ఈనాటి యువతరానికి మరియు వచ్చేతరాలవారికి అందించాలనే బాధ్యతతో, కర్తవ్యంతో ఈ పుస్తకాన్ని రాశాను.

ఒక్క నాకే కాదు మొత్తం తెలంగాణాకే source of inspirtion అయిన the Grand old man of Telangana 'కాళోజీ'గారికి ముందు వినమ్రంగా నమస్కరిస్తున్నాను. ఆయన అడుగుజాడలలో నడవాలని వేసే తప్పటడుగుల ప్రయత్నమే ఈ తొలి రచన.

ఇదొక జాతిపోరాటం. జాతి అస్థిత్వ పోరాటం. ఈ ఉపశ్రేణి పోరాటం తప్పకుండా విజయం సాధిస్తుంది. 300 సంవత్సరాల బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని, 200 సంవత్సరాల ఫ్యూడల్ నిరంకుశ నిజాం రాచరికాన్ని పారదోలినాం మరి అటువంటప్పుడు 50 సంవత్సరాల ఆంధ్రుల వలస పెత్తనాన్ని వదిలించుకోలేమా? ప్రతి పీడనకు ముగింపు ఉంటుంది. ప్రతి రాత్రికి సూర్యోదయం ఉంటుంది. అంతిమంగా సత్యమే జయిస్తుంది. కావున తెలంగాణాను సాధించితీరుతాం. సాధించిన తెలంగాణాను ప్రజాస్వామిక తెలంగాణాగా మలుచుకుంటాం. ఆ ఆశతోనే ఈ పుస్తకం రాశాను. ఎంతో కొంత ఉద్యమానికి తోడ్పడాలనే, ఉపయోగపడాలనే నిండు విశ్వాసంతోనే ఈ పుస్తకం రాశాను.

ప్రత్యేక తెలంగాణాకోసం పోరాడటం అంటే రాజ్యాంగంలోని పవిత్ర ఆశయాలైన dignity and honour of all individuals కోసం Justice, Liberty and Equality కోసం పోరాడటమేనని బలంగా నమ్ముతున్నాను. అయితే ఆంధ్ర పీడనకు మాత్రమే వ్యతిరేకులం తప్ప ఆంధ్ర ప్రజలకు వ్యతిరేకులంగాదు. మమ్మల్ని అర్థం చేసుకొని మాకు మద్దతు ఇచ్చే వారంతా మా మిత్రులే. వారి 'సు' స్నేహానికి మా కృతజ్ఞతలు.



నేలతల్లి ఋణాన్ని, మట్టి ఋణాన్ని ఎంతో కొంత తీర్చుకోవాలన్న తపనతో, నేర్చుకున్న చదువును ఎంతో కొంత సార్థకం చేసుకోవాలన్న ఆశయంతో, అక్షరాల ఋణాన్ని ఎంతో కొంత తిరిగి చెల్లించుకోవాలన్న కోరికతో ఈ పుస్తకం రాశాను. ఇది పరిపూర్ణ రచన కాదని నాకు బాగా తెలుసు. సహృదయులు సూచనలు చేస్తే (కనీసం ఫోనులోనైనా) రెండవ ప్రచురణలో సరిదిద్దుకుంటాను.

జ్ఞానం సామాజిక సృష్టి. రచనకూడా సామాజిక సృష్టి. అంతే తప్ప నా గొప్పతనం అంటూ వుంటే, గింటే అది కొంతవరకు మాత్రమే. సరిగ్గా 50 సంవత్సరాల క్రిందటి (1952 నాటి) దినపత్రికలను, 33 సంవత్సరాల క్రిందటి (1969-70 నాటి) అనేక దినపత్రికలను నేలమాళిగలోనుండి దుమ్ములో దుమ్మై తీసి ఇచ్చిన జనాబ్ 'ఒబైదుల్లా' రికార్డ్ అసిస్టెంట్, స్టేట్ సెంట్రల్ లైబ్రెరీ దోస్తుకు నా సలాములు, నా శుక్రియాలు. అట్లనే శ్రీ ఉమామహేశ్వరరావు, యూనివర్సిటి లైబ్రేరీయన్‌కు నా కృతజ్ఞతలు. మైక్రోఫిల్మ్‌లనుండి జిరాక్స్‌లు తీసిఇచ్చిన ఆర్కియాలజి శాఖవారికి, అమెరికన్ రీసర్చ్ సెంటర్ వారికి నా కృతజ్ఞతలు. బిబ్లియోగ్రఫీలో సూచించిన అనేక పుస్తకాలను, పత్రికలను ఉపయోగించుకున్నందుకు ఆ రచయితలందరికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

ఒక పత్రికలో నేను తెలంగాణాపై రాసిన వ్యాసాన్ని చూసి ప్రశంసిస్తూ దాన్ని వివరంగా రాస్తే ఒక పుస్తకమే అవుతుందిగా అని కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టిన బి.ఎస్. రాములన్నకు, తర్వాత ఈ ప్రయత్నాన్ని ప్రోత్సహించి, అమరవీరుల ఫోటోలు తప్పకుండ వేయాలని సలహా ఇచ్చిన మిత్రుడు శ్రీధర్ దేశ్‌పాండేకు నా కృతజ్ఞతలు.

నాతో అక్షరాభ్యాసం చేయించినట్లు నా పుస్తకానికి ముందు మాట రాసిచ్చిన మాన్యులు ఆచార్య జయశంకర్, మాజీ వైస్ ఛాన్సలర్, (కాకతీయ యూనివర్సిటి) గారికి మరియు డా॥ నందిని సిధారెడ్డి, తెలంగాణా రచయితల వేదిక అధ్యక్షుడికి నా కృతజ్ఞతా పూర్వక నమస్కారాలు.

అడగగానే అనేక విషయాలను ఓపికగా విప్పి చెప్పిన పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ రాజూర్కర్‌గారికి మాన్యులు డాక్టర్ సదాశివగారికి, ప్రియమిత్రులు వేణు సంకోజు, పాశం యాదగిరిగార్లకు ఎలా గౌరవం తెలుపగలను, ఒక కృతజ్ఞతలతో తప్ప!

శోభాగాంధి

www.etelangana.org

హాస్పిటల్‌లో పేషెంటుగా ఉండికూడా పుస్తకంలోని అచ్చుతప్పుల్ని దిద్ది అనేక అమూల్యమైన సలహాలు ఇచ్చిన డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్‌గారికి కృతజ్ఞతలు చెప్పినా ఇంకా ఋణపడే వుంటాను.

డి.టి.పి.కి అన్ని హంగులు సమకూర్చిన శ్రీ సంగెం సూర్యారావు, బి.సి. టైమ్స్ సంపాదకుడికి, ఓపికగా డి.టి.పి. చేసిన మంచనపల్లి నవీన్ కుమార్ గౌడ్‌గారిని నేను మరువగలనా? వారిద్దరికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

తెలంగాణా అమరవీరుల స్మారక స్థూపం రూపశిల్పి, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన కళాకారులు, ఆచార్య ఎక్కా యాదగిరిరావుగారు ఆ స్మారక స్థూపాన్ని ముఖచిత్రంపై ముద్రించుకుంటానని అడుగగానే దయతో అనుమతి ఇచ్చినందుకు కృతజ్ఞతలు. అట్లనే ఆ స్థూపం ఫోటోలు తీసిన మిత్రుడు ఆర్.వీరేష్‌బాబు (ఎ.ఆర్.పి.ఎస్.) ఫోటోగ్రాఫర్‌గారికి కూడా కృతజ్ఞతలు.

"ఇంకొంచెం సుగంధం రాసి, మరికొంచెం సువర్ణం పూసి" అన్నట్లు కవర్‌పేజీని అందంగా సృష్టించిన తమ్ముడు ఏలే లక్ష్మణ్‌కు నా ఆశీస్సులు. ఈ పనిలో సహకరించిన వేణుకు స్నేహాభినందనలు. అట్లనే అమరవీరుల ఫోటోలు, సభలు, సత్యాగ్రహాలకు సంబంధించిన ఫోటోలు అందజేసిన 'అన్న' తెలంగాణా ప్రభాకర్‌కు మరియు శ్రీమతి పి. వెంకటమ్మ (చిన్నక్క)గారికి కృతజ్ఞతలు. పోలీసు కాల్పులు మరియు క్షతగాత్రుల వివరాలను అందజేసిన డా॥ అంబటి సురేంద్రరాజు, 'గోల్కొండ ఖిల్లా' మాస పత్రిక గౌరవ సంపాదకుడికి నా స్నేహాభినందనలు.

గురుదేవులు, రాజనీతి శాస్త్రం ఆచార్యులు, కె. మధుసూదన్‌రెడ్డిగారికి మరియు రచనలు చేయమని అనేక అమూల్యమైన, అపురూపమైన పుస్తకాలు అందజేసే ప్రముఖ సినిమా దర్శకుడు శ్రీ బి.నర్సింగరావుగారికి నా కృతజ్ఞతా పూర్వక నమస్కారాలు.

ఈ రచనలో పడి మునుగుతూ, తేలుతూ నేను ఏ మాత్రం సమయం ఇవ్వని నా పిల్లలు సమతకు, గాంధీకి నా ఆశీస్సులు.

**- శోభాగాంధి**

23-10-2002



# 1422 - 1939

# ముల్కీ ఉద్యమాల చారిత్రక నేపథ్యం

www.etelangana.org

## దక్కన్‌లో బహమనీ సుల్తాన్‌ల కాలం నాటి ముల్కీ ఉద్యమాలు :

దక్కన్ రాజకీయ చరిత్రలో ముల్కీ ఉద్యమాలు ముఖ్యపాత్రను నిర్వహించాయి. ఈనాటి ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ఆ చరిత్రకు కొనసాగింపుగానే అర్థం చేసుకోవాలి... నేటి ఉద్యమం పునాదులు, మూలాలు మనకు ఐదు వందల సంవత్సరాల క్రిందటి చరిత్రలో కనబడుతాయి.

1294-1351 మధ్య కాలంలో ఖిల్జీ, తుగ్లక్ సైన్యాలతో పాటు దక్షిణాదికివచ్చి స్థిరపడిన వారందరిని దక్కనీలు అన్నారు. వీరిలో హిందువులు, ముస్లింలు ఉన్నారు. వీరు బహమనీ సుల్తానుల కాలంలో దక్కనీలుగా అనగా స్థానికులుగా పదవులు, ఉద్యోగాలు నిర్వహించారు. ఈ బహమనీ సుల్తానుల పరిపాలనాకాలంలోనే ఇరాక్, ఇరాన్, టర్కీ, అరేబియా దేశాల నుండి అనేకులు వలస వచ్చి స్థిరపడినారు. వీరందరిని ఆఫాకీలు అనేవారు. అనగా స్థానికేతరులు అని అర్థం. దక్కనీలు ముల్కీలుగా, ఆఫాకీలు గైర్ ముల్కీలుగా వ్యవహరింపబడ సాగారు.

ఆ కాలంలో వర్తక వాణిజ్యాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయసహకారాలు అందచేసేది. పన్నుల మినహాయింపునిచ్చి సౌకర్యాలు కలుగజేసేది. విదేశాల నుండి వచ్చిన ఆఫాకీలు వర్తక వాణిజ్యాలలో చేరి ఆర్థికంగా స్థితిపరులైనారు. సైన్యంలో మరియు ఇతర ఉద్యోగాలలో ప్రముఖ స్థానాలను ఆక్రమించారు. మంత్రిపదవులు సంపాదించారు. దక్కనీలంతా అన్ని రంగాలలో రెండవశ్రేణి పౌరులుగా ఉండేవారు. మొత్తం రాజ్యసంపదలో ఆఫాకీలదే పైచెయ్యి. సంపదలో దక్కనీలవాటా అతి తక్కువ. వారికి చిన్న చిన్న ఉద్యోగాలు మాత్రమే దక్కాయి. ప్రభుత్వంలో పరిపాలనలో ఆఫాకీలే ఆధిక్యం సంపాదించి అన్ని ప్రయోజనాలు పొందారు.

దీనివలన ఆఫాకీలకు, దక్కనీలకు అన్ని రంగాలలో అంతరాలు పెరిగిపోయి శత్రుత్వం ఏర్పడింది. దీనికితోడు మతవిభేదాలు కూడా తోడైనాయి. ఆఫాకీలంతా షియాలు. దక్కనీలంతా సున్నీలు.

ఒకటవ అహమ్మద్‌షా (క్రీ.శ. 1422-1435) కాలంలోనే ఈ విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఆయన ప్రధాని హసన్ ఆఫాకి. ప్రధానమంత్రి



www.etelangana.org

హసన్ నాయకత్వంలో సుల్తాన్ గుజరాత్ మీదికి దండయాత్ర చేశాడు. సైన్యంలో క్రింది స్థాయివారంతా దక్కనీలు. వారి సహాయనిరాకరణ వలన యుద్ధంలో ప్రధాని హసన్ ఓడిపోయాడు. ప్రధాని ఫిర్యాదుపై సుల్తాన్ అనేకమంది దక్కనీలను ఖైదు చేశాడు. ఉద్యోగాలనుండి తొలగించాడు.

రెండవ అహమ్మద్‌షా (క్రీ.శ. 1436-1458) కాలంలో ఈ వైషమ్యాలు మరింత తీవ్రమైనాయి. మళ్లీ గుజరాతు పై దాడి అదే ప్రధాని హసన్ నాయకత్వంలో జరిగింది. మొత్తం పదివేల సైన్యంలో ఏడువేలమంది దక్కనీలు. మొత్తానికి యుద్ధంలో విజయం సాధించి రాజ్యానికి తిరిగి వస్తుండగా రాత్రిపూట అడవిలో ఒకచోట విశ్రాంతి తీసుకునే సమయంలో దక్కనీలు తమ సేనలతో ప్రధానికి, ఆఫాకీలకు విడిగా కొంతదూరం విడిది చేశారు. ఆ వార్త శత్రువుకు తెలిసి ప్రధాని హసన్‌పై దాడిచేసి అతడిని మరియు మిగతా సైనికులను చంపారు. చావు తప్పించుకున్న కొంతమంది ఆఫాకీ సైనికులు చాకన్ దుర్గంలో తలదాచుకుని ఆ వార్త సుల్తాన్‌కు చెప్పేందుకు ఇద్దరు దూతల్ని పంపారు. ఈలోగా దక్కనీలు సుల్తాన్‌కు ఒక లేఖ రాసి ప్రధాని హసన్ చెప్పినా వినకుండా అడవిగుండా ప్రయాణంచేసి చావు తెచ్చుకున్నాడని మిగతా ఆఫాకీ సైనికులంతా శత్రువుతో లొంగిపోయే ఆలోచనలో చాకన్ దుర్గంలో తలదాచుకున్నారని తెలిపారు. ఆ లేఖను నమ్మి సుల్తాన్ ఆ ఇద్దరు దూతల్ని రాగానే అక్కడికక్కడే వధించాడు. దాన్ని ప్రోత్సాహంగా తీసుకుని దక్కనీ నాయకులు చాకన్ దుర్గంలో ఉన్న ఆఫాకీలను విందుకు పిలిచి వారు విందులు కుడుస్తుండగా వారందర్నీ నరికి చంపారు. చివరికి సుల్తానుకు నిజం తెలిసి దక్కన్ సైనిక కుట్రదారుల్ని చంపించి మిగతా వారిని ఖైదు చేశాడు. మళ్లీ ఆఫాకీలకు సన్మానాలు చేసి పూర్వవైభవాన్ని కల్పించాడు.

మూడవ అహమ్మద్‌షా (క్రీ.శ. 1463-1482) కాలంలో ప్రధానిగా మళ్లీ ఆఫాకీనే నియమించారు. ఆయన పేరు గవాన్. ఈయన చొరవతో రాజధాని బీదర్‌లో మూడంతస్తుల పెద్ద విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. అందులో అతి పెద్ద గ్రంథాలయాన్ని నిర్మించారు. అక్కడ ఆచార్యులు, విద్యార్థులు అందరు ఆఫాకీలే. చదువు పూర్తికాగానే వారందరు రాజుగారి కొలువులో ఉన్నత ఉద్యోగాలు, పదవులు సంపాదించుకున్నారు. దక్కనీలకు చిన్న చిన్న ఉద్యోగాలే



దొరికాయి. ప్రధాని గవాన్ పరిపాలనా సంస్కరణలు అమలుచేయగా అవి దక్కనీకలకు పూర్తినష్టం కలిగించాయి. ఫలితంగా బీదర్ పట్టణంలో అఫాకీలకు, దక్కనీలకు తీవ్ర ఘర్షణలు జరిగి అనేకమంది మరణించారు.

ఇటువంటి ముల్కీ, గైర్ ముల్కీ అంతఃకలహాలు అనేకం జరిగి చివరికి 1521లో బహమనీ రాజ్యం అంతరించిపోయింది. దాని స్థానంలో ఐదు రాజ్యాలు ఏర్పడినాయి. అందులో గోల్కొండలో కుతుబ్ షాహీ రాజ్యం ఒకటి.

## సంయమనం పాటించిన కతుబ్‌షాహీలు :

1512లో గోల్కొండలో స్వతంత్ర కుతుబ్‌షాహీ రాజ్యాన్ని స్థాపించిన కులీకుతుబ్‌షా కూడా ఆఫాకీ ఐనా, బహమనీ రాజ్యంలోని ముల్కీ నాన్ ముల్కీ ఉద్యమాల ఫలితంగా సంభవించిన రాజ్యపతనం నుండి గుణపాఠాలు నేర్చుకొని మళ్లీ అవి పునరావృతం కాకుండా జాగ్రత్త పడ్డాడు. ఈయన స్థానికులకే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చాడు. స్థానిక భాష తెలుగును ప్రోత్సహించాడు. అబుల్‌హసన్ తానీషా కాలంలో మాదన్న మహామంత్రిగా, అక్కన్న పేష్కారుగా పనిచేశారు. ఖుతుబ్‌షాహీ రాజులు స్థానికుల చరిత్రను, భాషా సంస్కృతులను గౌరవించటం వలన ముల్కీ సమస్య తలెత్తలేదు.

## ఆసఫ్‌జాహీల కాలంలో తలెత్తిన ముల్కీ ఉద్యమాలు :

ఐదవ నిజాం కాలంలోనే ముల్కీ సమస్య మళ్లీ తలెత్తి ఉద్యమాలు బయలుదేరాయి. అవి ఈనాటివరకు రావణకాష్టంలా కాలుతూనే ఉన్నాయి. సమస్య అదే. సందర్భం మాత్రం వేరు, వర్గాలు వేరు.

మొదటి నిజాం దక్కన్‌కు వచ్చినపుడు తనవెంట విశ్వాసపాత్రులైన అనుచరుల్ని తీసుకువచ్చారు. అందులో ముస్లింలతోపాటు హిందువులు ముఖ్యంగా కాయస్తులు ఉన్నారు. వీరంతా జాగీర్లు, మంత్రి పదవులతోపాటు ఉన్నత ఉద్యోగాలన్నీ చేజిక్కించుకున్నారు. 1857 సిపాయి విప్లవం జరిగాక మొఘల్ రాజ్యం అంతరించగానే ఢిల్లీ, లక్నో, ముర్షిదాబాద్, అవధ్ రాజ్యాల నుండి పదవులు, ఉద్యోగాలు కోల్పోయిన వారంతా ఏ కల్లోలం లేని నిజాం రాజ్యంలోకి వలస వచ్చారు. శాంతిభద్రతలతో జీవించటానికి వారికి దక్కన్


www.etelangana.org

ఒక్కటే కనబడింది. ఒక ఉద్యోగులేగాక కవులు, కళాకారులు, వృత్తి విద్యానైపుణ్యం కలిగిన వారంతా హైదరాబాద్‌కు తరలివచ్చారు. ఐదవ నిజాం కాలంలో ప్రధాని సర్ సాలార్‌జంగ్ చేపట్టిన పరిపాలనా సంస్కరణల వలన కాయస్తులు, ఖత్రీలు పెద్ద సంఖ్యలో ఉద్యోగాల కోసం వలసవచ్చారు. హైదరాబాద్ సివిల్ సర్వీసు స్థాపించిన సర్ సాలార్‌జంగ్ తప్పనిసరియై అలీగఢ్ విశ్వవిద్యాలయం నుండి విద్యావంతులైన వారిని హైద్రాబాద్‌కు ఆహ్వానించాడు. ఈ విధంగా ఉద్యోగాల కోసం వలసలు ప్రారంభమైనాయి. బయటినుండి వచ్చిన ఉద్యోగులు స్థానిక ఉద్యోగులకు తగు శిక్షణ ఇచ్చి, వారికి బాధ్యతలు అప్పగించి వెనుకకు తిరిగిపోతారని సాలార్‌జంగ్ అనుకున్నారు. కాని అలా జరుగక నాన్ ముల్కీలు ఇక్కడే తిష్టవేసుకుని ఉన్న ఉద్యోగాలేగాక, రాబోయే ఉద్యోగాలలో కూడా తమవారినే నియమించుకుని స్థానికులకు అన్యాయం చేసి వారిని అణిచివేశారు.

ఇటువంటి పరిస్థితులలో ముల్కీ, నాన్ ముల్కీ ఉద్యమాలు ఐదవ నిజాం కాలంలో బలంగా తలెత్తాయి. ఆ రోజులలో నిజాం అంతరింగిక కార్యదర్శి పదవికి చాలా ప్రాముఖ్యత ఉండేది. ఈ పదవీ నియామకం విషయంలో నిజాంకు దివాన్ సర్‌సాలార్‌జంగ్‌కు అభిప్రాయభేదాలు తలెత్తాయి. సాలార్ జంగ్ గారికి బ్రిటిష్‌వారి మద్దతు ఉండటంవలన చివరికి ఆయన మాటే నెగ్గింది. నిజాం పరిస్థితి బలహీనమయ్యింది. చేసేదిలేక పరిపాలనా వ్యవహారాలలో, ఉద్యోగ నియామకాలలో దివాన్‌కు అన్ని అధికారాలు ఇచ్చాడు. దానితో సాలార్‌జంగ్ అనేకమంది స్థానికులను ఉద్యోగాల నుండి తొలగించి బయటివారిని నియమించాడు.

ఈ కాలంలోనే ఉత్తరప్రదేశ్ నుండి బిల్‌గ్రామి వంశానికి చెందిన అనేక మంది ఇక్కడికి వచ్చి ఉన్నతోద్యోగాలు ఆక్రమించారు. అలాగే బెంగాల్ నుండి అఘోర్‌నాథ్ చటోపాధ్యాయ మొదలగువారు, తమిళదేశం నుండి ఇంగ్లీషు బాగా వచ్చినవారు హైద్రాబాద్‌కు వలస వచ్చారు. దీనితో స్థానికుల జీవితాలు చిందరవందర అయినాయి. వారందరూ నిజాం నవాబుకు మొరపెట్టుకున్నారు. ఉద్యోగులందరు ముల్కీ, నాన్ ముల్కీలుగా నిట్టనిలువుగా చీలి పోయారు.



ఆరవ నిజాం మహబూబ్ అలీ కాలంలో 1880లో ఫార్సీ స్థానంలో ఉర్దూ అధికారభాషగా మారింది. అది ప్రజల భాష. ఇంగ్లీషును తప్పని సరి భాషగా ప్రవేశపెట్టారు. అయితే ఉర్దూ, ఇంగ్లీషులలో ఏకకాలంలో సమానమైన ప్రావీణ్యంలేక ఉద్యోగనియామకాలలో స్థానికులకు ప్రాతినిధ్యం తగ్గసాగింది. అదొక సంధియుగం. ఆ మారుతున్న కాలంలో స్థానికులకు ప్రత్యేకంగా కొంత కాలం శిక్షణ, ప్రోత్సాహం ఇస్తే వారు తమ నైపుణ్యం పెంచుకునేవారు. అట్లా జరగక ఇతర రాష్ట్రాల నుండి వచ్చినవారు ఉద్యోగాలను ఆక్రమించుకోసాగారు. పైగా చేసేది ఒకే ఉద్యోగమైనా స్థానికేతరులకు ఎక్కువ జీతభత్యాలిచ్చి స్థానికులను రెండవ తరగతి పౌరులుగా అవమానించారు. ముల్కీ ఉద్యమాన్ని శాంతపరచటానికి ప్రభుత్వం ప్రత్యేక హైదరాబాద్ సివిల్ సర్వీసును ఏర్పరచింది. మరియు 1883లో ప్రత్యేక గజిట్‌ను ప్రకటించి ఇక ఉద్యోగాలన్నీ అర్హతల ప్రకారం నాన్ ముల్కీల జోక్యం లేకుండా ముల్కీలకే ఇవ్వాలని నిర్ణయించింది.

**ముల్కీ ఉద్యమం 'గాడ్ ఫాదర్' మహారాజా సర్ కిషన్ పర్‌షాద్ :**

1910 చివరి దశకంలో మహరాజా సర్ కిషన్ పర్‌షాద్ ముల్కీలకు మద్దతుగా కొండంత అండగా నిలిచాడు. ఆయన స్థానికేతరుల మీద యుద్ధం ప్రకటించాడు. ఇదేకాలంలో బ్రిటిష్‌వారు కూడా ఆంగ్లేయులను మరియు ఇతరులను హైద్రాబాద్‌కు రప్పించి ఉద్యోగాలలో జొప్పించారు. 1901లో కాసన్‌వాకర్ నైజాం దర్బారులో ఫైనాన్స్ సెక్రటరీగా నియమించబడి తర్వాత ఫైనాన్స్ మినిస్టర్‌గా చేశారు. ఇతను 1912 వరకు పదవిలో కొనసాగి ఇష్టం వచ్చినట్లు బయటివారిని ఉద్యోగాలలో నియమించి అరాచకం సృష్టించాడు. నాన్ ముల్కీల విషయం ప్రజలలో పెద్ద చర్చనీయాంశం అయ్యింది. విద్యావంతులలో భయాందోళనలు నెలకొని ఇక తమకు ఉద్యోగాలు దొరకవన్న నిరాశా నిస్పృహల చివరి అంచుకు చేరుకున్నారు. ముల్కీ ఉద్యోగులలో కూడా తమకు ఇక పదోన్నతులు రావని అభద్రతా భావంలో మునిగిపోయారు. జీతభత్యాల వ్యత్యాసం కూడా వారిని అవమానపరిచింది. అసంతృప్తి సర్వత్రా వ్యాపించి ప్రభుత్వ పాలనాయంత్రాంగం ముల్కీ, నాన్ ముల్కీలుగా స్పష్టంగా రెండు ముక్కలయ్యింది. మహరాజా సర్ కిషన్ పర్‌షాద్ గారికి వాకర్‌కు మధ్య ప్రత్యక్ష యుద్ధం ప్రారంభం అయ్యింది.


www.etelangana.org

ఈ కాలంలోనే ఓ చిరుద్యోగి నెలకు 200 రూపాయల జీతంతో హోంశాఖలో మొహతమీమ్‌గా పనిచేసే అతను ఆ ముల్కీ ఉద్యమంలో చురుకుగా పాల్గొని దివాన్ కిషన్ పర్షాద్‌గారికి అండగా నిలిచాడు. అతను స్వయంగా కవి. నాన్ ముల్కీలపై అతను ఉర్దూలో ద్వేషంతో రాసిన వచన కవిత ఇది.

మా ఉద్యోగాలన్నీ అపహరించి మీ వారికి అప్పగించావు
నీ కుట్రలన్నీ అమలైతే ఇక చిరుద్యోగాలే మా గతి
నీ వైస్రాయికి భయపడి ఈ దుర్మార్గం చేస్తున్నావేమో
అది నీ అధోగతి
స్థానికుల అష్టకష్టాలకూ కాస్త భయపడు
మా కష్టాలను కూడా కొంచెం కనికరించు
ఏదో ఒకరోజు నువ్వు నీ అంతిమ ప్రయాణానికి సిద్ధం కావాలి.

ఈ కవిత ప్రజాభిప్రాయానికి ప్రతిబింబం. వాకర్‌ను ఉద్దేశించి రాసిందే ఈ కవిత. దీన్ని ఒక రాజకీయ కవితగా అందరూ గుర్తించారు. ఆ రోజుల్లో ఇది ముల్కీ ఉద్యమ గీతంగా, ఉద్యోగుల ఉద్యమ గీతంగా ప్రచారం పొందింది. తత్ఫలితంగా ఈ కవిత్వం రాసిన ఆ చిరుద్యోగిని క్రమశిక్షణాచర్య కింద దూర ప్రాంతానికి బదిలీచేశారు.

మహారాజా సర్ కిషన్ పర్షాద్ వలన ఆ ఉద్యమం పాక్షికంగా విజయం సాధించింది. నాన్ ముల్కీల ఉద్యోగాలన్నీ తాత్కాలిక ఉద్యోగాలుగా పరిగణించబడ్డాయి. తర్వాత కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలన్నీ రాజకీయ నియామకాల ద్వారా కాక రాతపరీక్షల ద్వారా నింపబడ్డాయి. ప్రమోషన్‌లలో స్థానికోద్యోగులకు న్యాయం జరిగింది. స్థానిక అభ్యర్థులకు తగినన్ని అర్హతలుంటే బయటివారిని నియమించరాదని ఆజ్ఞలు జారీ అయ్యాయి. ఈనాటి పాలకులు, ప్రజలు ముల్కీ ఉద్యమ విషయంలో మహారాజా సర్ కిషన్ పర్షాద్‌ను జ్ఞాపకం చేసుకోవాలి.

ఉర్దూభాషకు కూడా ముల్కీ, నాన్ ముల్కీ రంగులు పూశారు. భాషను రెండుగా చీల్చి ఉత్తరాది ఉర్దూ, దక్షిణాది ఉర్దూ అని విభజన చేశారు. నాగరీకులు మాత్రమే లఖ్నవీ ఉర్దూ మాట్లాడుతారనీ, అనాగరీకులు, అజ్ఞానులు మాత్రం దక్కనీ ఉర్దూ మాట్లాడుతారని యాస, భాషలను గాయపరిచారు.



1918లో ఉస్మానియా యూనివర్సిటీ ఉర్దూ బోధనాభాషగా ప్రారంభమైంది. అనేక శాస్త్ర గ్రంథాలను ఉర్దూలో అనువదించటానికి, క్రొత్త గ్రంథాలు ఉర్దూలో రాయటానికి ఉత్తర భారతదేశం నుంచి పండితుల్ని రప్పించగా వారంతా లఖ్నవీ ఉర్దూనే ప్రయోగించారు. 1948లో పోలీసు చర్య జరిగేవరకూ ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ ముల్కీలదే పెత్తనం.

**ముల్కీల హక్కుల పరిరక్షణకు ఏడవ నిజాం మొదటి ఫర్మానా :**

1919లో ఏడవ నిజాం మీర్‌ఉస్మాన్ అలీఖాన్ ఒక ఫర్మానా జారీచేశారు. అవే ముల్కీ నిబంధనలు. ప్రభుత్వ ఉద్యోగాలలో కేవలం ముల్కీలనే నియమించాలని ఆదేశించారు. ఈ ఫర్మానా ప్రకారం హైద్రాబాదు రాష్ట్రంలో జన్మించినవారు మాత్రమే ముల్కీలు. వీరే గాక ఇంకా ఎవరైనా గత 15 సంవత్సరాలనుండి వరుసగా హైద్రాబాదు రాష్ట్రంలో నివసిస్తూ తిరిగి వెనక్కి వెళ్లే ఆలోచన లేనివారు కూడా ముల్కీలేనని చెప్పారు.

1930 మొదటి దశకంలో పంజాబుకు చెందిన ఖాన్‌సాహెబ్‌లను డైరెక్టుగా అనేక ఉన్నత ఉద్యోగాలలో నియమించటం వలన మళ్లీ గొడవలు తలెత్తాయి. స్థానికుల ప్రమోషన్లు దెబ్బతినిపోయాయి. అన్ని శాఖలలో పరిస్థితి అలాగే ఉంది. దీనికి వ్యతిరేకంగా 1933లో నిజాం రాజుగారు ఒక ఫర్మానా తీసి రాష్ట్ర ఉద్యోగ నియామకాలలో సమర్థవంతమైన, విద్యావంతులైన ముల్కీలకే ప్రాధాన్యత ఇవ్వాలని హుకూం జారీచేశారు.

ఈ చర్యకు రాష్ట్రమంతా ముల్కీల వైపునుండి గొప్ప ప్రతిస్పందన వచ్చి నిజాం నవాబుగారికి కృతజ్ఞతా వందనములు తెలియజేశారు. హైద్రాబాద్‌లో జరిగిన ఒక పెద్ద జల్సాలో ముల్కీ ఉద్యమ నాయకులు కుమారి పద్మజా నాయుడు, డాక్టర్ లతీఫ్ సయీద్, బూర్గుల రామక్రిష్ణారావు, ముందుముల నర్సింగరావ్, మీర్ అక్బర్ అలీఖాన్ మొదలగువారు పాల్గొన్నారు. ఆ ప్రసంగాలలో నిజాం ప్రభువుగార్కి కృతజ్ఞతలు చెప్పారు.

**హైద్రాబాద్ ఫర్ హైద్రాబాదీస్ :**

ముల్కీ ఉద్యమం సాధించిన ఆ విజయం ప్రోత్సాహంతో 1934లో నిజాం ప్రజల సంఘం (ది నిజాం సబ్జెక్ట్స్ లీగ్) అను ఒక సంస్థను స్థాపించారు. దీనినే



www.etelangana.org

ఉర్దూలో "జమీయత్ రిఫాయామే నిజాం" అన్నారు. ఈ సంఘం "హైద్రాబాద్ ఫర్ హైద్రాబాదీన్" అని సంచలనాత్మక నినాదం ఇచ్చింది. చాలామంది మేధావులు ఈ సంఘంలో చురుకుగా పని చేశారు. సర్ నిజామత్ జంగ్ ఈ సంస్థ అధ్యక్షులు. పై ప్రముఖులే గాక మాజీ కోత్వాల్ రావ్ బహద్దూర్ వెంకట్రాం రెడ్డి, మాడపాటి హన్మంతరావు, వామన్ నాయక్, కాశీనాధ్ రావ్ వైద్య మొదలగువారు ఇందులో సభ్యులు. ముల్కీల హక్కుల రక్షణే ఈ సంస్థ లక్ష్యం. ఇది 1939 వరకు చురుకుగా పనిచేసింది. మజ్లిస్ ఆవిర్భావంతో ఇది నిర్వీర్యమైంది.

ఇదీ ముల్కీ ఉద్యమ చారిత్రిక నేపథ్యం.



# 1948-52

# గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమం

www.etelangana.org

నైజాం హైద్రాబాదు సంస్థానం మూడు భాషా ప్రాంతాలతో కలసి ఉండేది. సంస్థానపు రాజధాని హైద్రాబాదు నగరంతో సహా తెలుగుభాష మాట్లాడే ఎనిమిది జిల్లాలు తెలంగాణా ప్రాంతం, మరాఠీ మాట్లాడే ఐదు జిల్లాలు మరట్వాడా ప్రాంతం. కన్నడం మాట్లాడే మూడు జిల్లాలు కన్నడ ప్రాంతం. ఈ విధంగా హైద్రాబాదు సంస్థానంలోని మొత్తం జిల్లాల సంఖ్య పదహారు.

**'ఆపరేషన్ పోలో' పోలీస్ యాక్షన్ :**

1948 సెప్టెంబరు 13న భారత ప్రభుత్వం హైద్రాబాదు సంస్థానం పై పోలీసు చర్యను ప్రారంభించింది. జె.ఎన్. చౌదరి నాయకత్వాన భారత సైన్యం ఐదువైపుల నుండి హైద్రాబాదు సంస్థానంలోకి ప్రవేశించింది. ఐదు రోజులలో మిలటరీ చర్య పూర్తయ్యింది. దానికి "ఆపరేషన్ పోలో " అని పేరు. ఏల్ ఎడ్రూస్ నాయకత్వాన గల హైద్రాబాదు సైన్యం సెప్టెంబరు 17న భారత సైన్యానికి లొంగిపోయింది. సెప్టెంబరు 18న భారత సైన్యం హైద్రాబాదు నగరంలోకి ప్రవేశించింది. ఆ విధంగా నైజాం రాచరికం అంతమయ్యింది. హైద్రాబాదు రాష్ట్రంలో మిలిటరి గవర్నర్‌గా జె.ఎన్. చౌదరి నియమించబడి ఆ పదవిలో డిసెంబరు 1949 వరకు కొనసాగాడు. 1950లో ఒక పౌర ప్రభుత్వం సీనియర్ సివిల్ అధికారి అయిన వెల్లోడి ముఖ్యమంత్రిగా ఏర్పడింది. ఆ మంత్రి వర్గంలోకి హైద్రాబాదు స్టేట్ కాంగ్రేస్ నుండి ముగ్గురు సభ్యులను తీసుకున్నారు. నిజాం రాజును రాజ్ ప్రముఖ్‌గా పేర్కొన్నారు. 1952 సాధారణ ఎన్నికల తర్వాత బూర్గుల రామకృష్ణా రావు ముఖ్యమంత్రిగా నూతన ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యింది.

**'మిడతల దండు' దాడి :**

1948 నుండి 1952లో సాధారణ ఎన్నికలు జరిగి ప్రజాప్రభుత్వం ఏర్పడే వరకు హైద్రాబాదు రాష్ట్రం కేంద్ర ప్రభుత్వంచే నియమించబడిన మిలటరి మరియు సివిల్ అధికారుల పాలనలో ఉండేది. ఈ సంధికాలంలో ఆంధ్రా ప్రాంతం నుండి అనేక మంది ఆంధ్రులు ఉద్యోగాల కొరకు తెలంగాణా ప్రాంతాలకు రావటం ప్రారంభించారు. స్థానికేతరులైన మిలటరీ, సివిల్ అధికారుల పాలనలో ప్రభుత్వ యంత్రాంగం ఉండటం వలన వలసలు నిరాటంకంగా కొనసాగినాయి. అది వరకే ఆంధ్ర ప్రాంతంలో బ్రిటిష్ వారి క్రింద శిక్షణ పొంది అనుభవం ఉన్న



www.etelangana.org

ఉద్యోగుల్ని ఆ అధికారులు ఇక్కడికి రప్పించుకున్నారు. తెలంగాణా వారికి ఇంగ్లీష్ విద్యావిధానం నేపథ్యం లేదన్న సాకుతో కూడా ఆంధ్రా ప్రాంతం వారిని విచక్షణా రహితంగా ఉద్యోగాలలో నియమించారు. తెలంగాణాలో సెటిల్ అయిన ఆంధ్రావారు ఏ మాత్రం ఆలస్యం చేయక తమతమ బంధువులను, స్నేహితులను కూడా రప్పించుకొని తమశక్తి కొలది వారికి ఉద్యోగాలు, ఉపాధులు, వ్యాపారాలు చూపెట్టారు. ఆ విధంగా వలసవెల్లువ ప్రారంభమయ్యింది. పొట్ట చేతబట్టుకుని బ్రతుకు తెరువుకు వచ్చిన ఆ ఉద్యోగస్తులు తమ ఆధిక్యతా భావాలతో, ప్రవర్తనతో తెలంగాణా ప్రజల్ని ఉద్ధరించటానికి వచ్చిన సంస్కర్తలుగా ప్రవర్తించారు. అప్పటికే హైద్రాబాదు రాష్ట్రంలో ముల్కీనిబంధనలు అమలులో ఉన్నా వాటన్నింటిని నిర్లక్ష్యంచేసి దొంగ ముల్కీ సర్టిఫికేట్లతో ఉద్యోగాలలో చొరబడ్డారు. 1952 నాటికి హైద్రాబాదు రాష్ట్రంలోని ఎంప్లాయ్‌మెంటు ఆఫీసులలో 70 వేల మంది నిరుద్యోగులున్నారు. అప్పటి రిజర్వు పోలీసుల సంఖ్య 8 వేలు అందులోని మెజార్టీ స్థానికేతరులదే. అప్పటి వరకు నైజాం ప్రభుత్వ యంత్రాంగంలో "లంచాల వ్యవస్థ" అవినీతి పెద్దగా వ్యాపించలేదు. చాయ్ నాస్తాలతో, పాన్ సిగరెట్లతోనే ఉద్యోగులు సంతృప్తి చెంది ప్రజలకు పనులు చేసి పెట్టేవారు. కాని 1948-52 మధ్య కాలంలో ఆంధ్రానుండి వచ్చిన ఉద్యోగస్తుల వలన లంచాల వ్యవస్థ విపరీతంగా ఎక్కువైంది. నెల్లూరి కేశవస్వామి తన చార్మినార్ కథల సంపుటిలో ఒక చోట ఇలా అంటాడు. "మా బంధువుల్లో ఒకాయన యూనియన్ మిలటరితోబాటు సివిల్ టీంలో నల్లగొండకు తహసీల్దారుగా వచ్చాడు. ఆయనేదో నాకు దారి చూపిస్తాడన్న నమ్మకం నాకు ఉండేది. కాని తర్వాత్తర్వాత తెలిసింది. సివిల్ టీంలో వచ్చిన వారంతా రామాయణంలోని కిష్కింధాపుర నివాసుల వారసులనీ, రావణుని మరణానంతరం లంకను కొల్లగొట్టినట్టే ఇక్కడి తెలంగాణా ప్రాంతాన్నంతా దోచుకున్నారనీ, తమ చేతి కందినదల్లా వీలైనంత మట్టుకు తామే స్వాహా చేశారనీ, అప్పటినుండే తెలంగాణాలో ఇచ్చిపుచ్చుకునే ఆచారం ప్రబలంగా ప్రాకిందనీ......"

**రామాచారి పిలుపు :**

ఆంధ్రా ప్రాంతం నుండి 'మిడుతల దండులా' వచ్చిన వారికి వ్యతిరేకంగా "గైర్ ముల్కీ గో బ్యాక్ ఉద్యమం" ప్రారంభమైంది. పూర్వపు నైజాం ప్రభుత్వంలోని



లాయక్ అలీ మంత్రి వర్గంలో మంత్రిగా పని చేసి, 1952లో శాసన సభ్యుడిగా ఉన్న రామాచారి అను నాయకుడు 1952 ఆగస్టు చివరివారంలో "హైద్రాబాదు హితరక్షణ సమితి"ని స్థాపించి గైర్ ముల్కీలంతా వెనక్కు వెళ్లిపోవాలనే నినాదాన్ని ప్రారంభించాడు. వరంగల్లులోని హయగ్రీవాచారి ఆ ఉద్యమాన్ని ప్రోత్సహించాడు. బూర్గుల రామకృష్ణా రావు ముఖ్యమంత్రిగా ఉన్న మంత్రివర్గంలోని మంత్రులైన కొండా వెంకటరంగారెడ్డి మరియు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి గార్లు (స్వయాన మామా అల్లుళ్లు) పరోక్షంగా ఆ ఉద్యమానికి చేయుతనిచ్చారు. హైద్రాబాదు రాష్ట్రంలో బ్రాహ్మణుల పెత్తనాన్ని అడ్డుకుని తమ పలుకుబడి పెంచుకోవాలన్న ఆశతో ఆ ఇద్దరూ ఆ ఉద్యమాన్ని ప్రోత్సహించారని తర్వాత అధిష్టానవర్గం బెదిరింపులతో, బుజ్జగింపులతో మౌనం వహించి తటస్థంగా మారిపోయారని ఒక పరిశీలన. ఆ విధంగా చరిత్రలో మొదటిసారి తెలంగాణాకు ద్రోహం జరిగింది. అయినా ఆ మొదటి దశ ఉద్యమం ఎలా నడిచిందో మనం పరిశీలించాలి.

**ఉద్యమానికి శ్రీకారం చుట్టిన వరంగల్ :**

మొదట ఈ ఉద్యమం విద్యార్థుల ఆధ్వర్యంలో 1952 జూన్ 26న వరంగల్లులో ప్రారంభమయ్యింది. ఐదు రోజులు కొనసాగి జులై 31న ఈ క్రింది తీర్మానాన్ని ఆమోదిస్తూ విరమించబడింది.

"పోలీసు చర్య తర్వాత ప్రభుత్వోద్యోగాలలో దొంగముల్కీ సర్టిఫికేట్ల ద్వారా ప్రవేశించిన సంస్థానేతరులపై విచారణ సల్పి అలాంటి వారిని ప్రభుత్వం తొలిగించి సంస్థాన వాసుల నిరుద్యోగ సమస్య తీర్చాలనీ, ఇక ముందు ఇలాంటి ముల్కీ సర్టిఫికేట్లు సరైన ఋజువులేనిదే ఇవ్వరాదనీ విద్యార్థి యునియన్ కోరుతున్నది".

ఈ పై తీర్మానాన్ని వరంగల్ కాంగ్రేసు మున్సిపల్ కౌన్సిలర్ ఎ. బుచ్చయ్య ప్రవేశపెట్టి విద్యార్థులచే అంగీకరింపచేయటమే గాక హన్మకొండ హైస్కూలు విద్యార్థుల చేత కూడా అంగీకరింపచేశారు.

తరువాత ఆగస్టు 7న మళ్లీ ఈ ఉద్యమం ఖమ్మం మెట్టు పట్టణంలో తలెత్తింది. ఇవన్నీ "స్వాంటేనియస్ ఉద్యమాలు" హైద్రాబాదు రాష్ట్ర ప్రభుత్వంలో


www.etelangana.org

ఇతర రాష్ట్ర ఉద్యోగులకు అవకాశమిస్తున్నందుకు అలాగే ఇతర రాష్ట్ర విద్యార్థులకు ఇక్కడి స్కూళ్లు, కాలేజిలలో అడ్మిషన్లు ఇస్తున్నందుకు నిరసనగా స్థానిక విద్యార్థులు రెండు రోజులు సమ్మె చేశారు. నినాదాలు చేస్తూ వీధులలో ప్రదర్శనలు చేశారు. ఆ రాత్రి కొందరు విద్యార్థులు స్థానిక ఇన్‌స్పెక్టరు సెలవులో ఉండి పౌర దుస్తులతో బజారుకు వెళ్లుతుండగా ఆయన పై దౌర్జన్యం చేశారు.

ఆగస్టు 8న వరంగల్లు జిల్లా మానుకోటలో స్థానిక విద్యార్థులు సుమారు వెయ్యి మంది స్కూళ్లకు పోకుండా వీధులలో ప్రదర్శనలు చేస్తూ "బే ముల్కీలు వాపసు పోవాలని" నినాదాలు చేశారు. వరంగల్ విద్యార్థి సంఘం పిలుపు మేరకు ఆ సమ్మె జరిగింది.

అదే రోజు దినపత్రికలలో "ముల్కీ సర్టిఫికేట్ల జారీ నిబంధనల బిగింపు" అని వార్త వచ్చింది. ముల్కీ సర్టిఫికేట్లు ఇచ్చే నిబంధనలను దృఢం చేసే ఉద్దేశ్యంతో, సవరించేందుకు ఒక మంత్రి వర్గపు ఉపసంఘాన్ని ఏర్పాటు చేసే ఆలోచనలలో ప్రభుత్వం ఉన్నదని వార్త వచ్చింది.

తదుపరి ఆగస్టు చివరి వారంలో హైద్రాబాదు ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు వరంగల్లు వచ్చి ఒక సభలో ప్రసంగిస్తూ "విద్యార్థులు ఉద్వేగాలకు లోనుకావద్దనీ, అనవసర వాద వివాదాలు మానుకొమ్మనీ, కొత్త కొత్త సంగతులు తెలుసుకోవటానికి కాలం వినియోగించమనీ ఉచిత సలహాలు ఇచ్చారు.

ఆగస్టు 26న హైద్రాబాదు, సికింద్రాబాదు జంటనగరాలలో సమ్మె మొదలయ్యింది. చాలా మంది విద్యార్థులు క్లాసులకు హాజరు కాకుండా సమ్మె చేశారు. సికింద్రాబాదులో నాన్ ముల్కీలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఊరేగింపు చేశారు. అక్కడక్కడ అల్లర్లు జరిగాయి. ఔరంగాబాదులో కూడా ప్రదర్శనలు జరిగాయి.

ఆగస్టు 27న వరంగల్లులో మళ్లీ విద్యార్థులు సమ్మె చేశారు. ముఖ్యమంత్రి గారు ఎన్ని హామీలు ఇచ్చినా పరాయివారికి సంస్థానంలో ఉద్యోగాలు ఇస్తున్నందుకు నిరసనగా ఆ రోజు నుండి నిరవధిక సమ్మె చేయాలని విద్యార్థుల ఐక్యకార్యాచరణ సమితి నిర్ణయించింది.



ఆగస్టు 29న గైర్ ముల్కీ ఆందోళనను కఠినంగా అణచటానికి ప్రభుత్వం పోలీసులకు "సుగ్రీవాజ్ఞల్ని" ఇచ్చింది. ప్రజలలో విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై, బస్సులపై గోడలపై నినాదాలు రాసేవారిని కఠినంగా శిక్షించమని ఆదేశాలు ఇచ్చింది.

దీని ఫలితంగా ఆగస్టు 30న హన్మకొండ హైస్కూలు విద్యార్థులపై లాఠీ చార్జ్ జరిగింది.

హన్మకొండ హైస్కూలు ఆవరణలో విద్యార్థులు శాంతి యుతంగా సభ నిర్వహించుకొంటుంటే పోలీసులు స్కూలు ఆవరణలోకి ప్రవేశించి లాఠీచార్జ్ చేయగా ఆర్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరు ఉద్యోగస్తులకు కూడా దెబ్బలు తగిలాయి. విద్యార్థులు విసిరిన రాళ్ల వల్ల ఐదుగురు పోలీసు జవాన్లకు గాయాలైనాయి.

## అగ్గిపిడుగులైన హైద్రాబాద్ విద్యార్థులు :

మరునాడు ఈ సంగతి తెలిసి హైద్రాబాదు విద్యార్థులు అగ్గిపిడుగులైనారు. అప్పటికే వారు మూడు రోజుల్నుండి సమ్మెలో ఉన్నారు. ఆ రోజు సైఫాబాదు కాలేజి నుండి పెద్ద ఊరేగింపు చేశారు. అందులో చాలా మంది స్కూలు విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఆ ఊరేగింపు ఫతేమైదాన్ చేరుకోగానే నిజాం కాలేజి గేట్లు విరగ్గొట్టి లోపలికి దూసుకుపోయి తరగతులకు హాజరౌతున్న విద్యార్థులను ఇవతలికి గుంజారు. కుర్చీలు, బెంచీలు విరగ్గొట్టారు. ఆ కాలేజి విద్యార్థులను కూడా కలుపుకుని ఇడ్లీసాంబర్ గోబ్యాక్, గోంగూరపచ్చడి గోబ్యాగ్ అని నినాదాలు చేస్తూ ఆబిడ్స్ దాకా వెళ్లారు. ఆ రోజు సాయంత్రం జరిగిన బహిరంగ సభలో అనేక మంది పురప్రముఖులు, మేధావులు, విద్యార్థులు ప్రసంగించారు. పోలీసు దౌర్జన్యాన్ని ఖండిస్తూ, గైర్ ముల్కీలంతా వెనుకకు వెళ్లిపోవాలని తీర్మానించారు. పెద్దపల్లి, సూర్యాపేట లాంటి పట్టణాలలో కూడా ప్రదర్శనలు, ఊరేగింపులు జరిగాయి.

## విద్యార్థిగా ఉద్యమంలోకి దూకిన కేశవరావ్ జాదవ్ :

సెప్టెంబర్ 4వ తేదీన హైద్రాబాదు పాతనగరంలోని సిటీ కాలేజీ విద్యార్థులు తెలంగాణా వారికే ఉద్యోగాలు దొరకాలి, ముల్కీలు కాని వారు వెనుకకు


www.etelangana.org

పోవాలని నినాదాలు చేస్తూ ఒక ఉరేగింపు తీశారు. అందులో ఒక విద్యార్థిగా ప్రస్తుతం తెలంగాణా ఐక్యవేదిక ఉద్యమ నాయకుడైన కేశవరావు జాదవ్ కూడా పాల్గొన్నారు. ఆ ఉరేగింపు మదీనా హోటల్ చౌరస్తా చేరుకునే సరికి ఎలాంటి హెచ్చరికలు చేయకుండానే పోలీసులు కాల్పులు జరుపగా అక్కడే ఒక విద్యార్థి మరణించాడు. గాయపడిన వారిని ఉస్మానియా హాస్పిటల్‌లో చేర్పించగా మరో విద్యార్థి మరణించాడు. ఈ అల్లర్ల వలన ప్రక్కనే ఉన్న హైకోర్టులో పని ఆగిపోయింది. దుకాణాలన్ని మూసేశారు. విద్యార్థులు హాస్పిటల్‌ను చుట్టుముట్టి మృత దేహాలను అప్పగించమని డిమాండ్ చేశారు. విషయం తెలిసి హాస్పిటల్ దగ్గరికి హోం మినిస్టర్ దిగంబర్ రావ్ బిందు, రాష్ట్ర కాంగ్రేస్ కార్యదర్శి బాకర్ అలీ మిర్జా, అసెంబ్లీలో పి.డి.ఏఫ్. ప్రతిపక్ష నాయకుడు వి.డి. దేశ్‌పాండే, శ్రీమతి పద్మజా నాయుడు (ఈమె 1933లో ముల్కీ ఉద్యమనాయకులలో ఒకరు) వచ్చి శవాలను వారి బంధువులకు అప్పగిస్తారని విద్యార్థులంతా ప్రశాంతంగా వెనక్కు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అది నాయకులు లేని ప్రజా ఉద్యమం.నీతి, నిజాయితీ కల్గిన విద్యార్థి ఉద్యమం. విద్యార్థులు ఆ నాయకుల విజ్ఞప్తులను లెక్కచేయక ఆవేశంతో పత్తర్‌గట్టీ పోలీసు స్టేషన్ వైపు ఉరేగింపు చేసి ఆ స్టేషన్‌ను తగలబెట్టారు. మదీనా వద్ద జరిగిన పోలీసు కాల్పులకు ఆ స్టేషన్ పోలీసులే కారణం. పోలీసు స్టేషన్ దహనం అయితున్నపుడు మళ్లీ కాల్పులు జరిగాయి. అందులో మరొక విద్యార్థి మరణించాడు. ఆరోజు మొత్తం నాలుగుసార్లు లాఠీచార్జీలు, రెండు మూడుసార్లు పోలీసు కాల్పులు జరిగాయి. సైన్యం రప్పించబడింది. మరునాడు నగరమంతా సంపూర్ణ హర్తాళ్ జరిగి దుకాణాలు మూసివేశారు. వర్తక సంఘాలు తమ మద్దతును పూర్తిగా తెలియచేశాయి. సెప్టెంబర్ 5న జంటనగరాలలో 16 గంటల కర్ఫ్యూ విధించబడింది. అల్లర్లు ఆగనందున మళ్లీ కాల్పులు. అందులో నలుగురు చనిపోయారు. అనేక మందికి గాయాలయ్యాయి. ఆ రోజు సుమారు 30 మందిని నిర్బంధంలోకి తీసుకున్నారు. రాళ్లు రువ్విన ఘటనలలో పోలీస్ కమిషనర్ శివకుమార్ కూడా గాయపడినారు. ఒక పోలీసు వ్యాన్‌ను అనేక బస్సులను దహనం చేశారు. ఆ సాయంత్రం ఫతేమైదాన్‌లో బహిరంగసభ జరిగింది. రాజకీయ నాయకులు ప్రసంగించారు. పి.డి.ఎఫ్. నాయకుడు వి.డి. దేశ్‌పాండే మాట్లాడుతూ ఉద్యోగాలలో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలన్న విద్యార్థుల డిమాండ్ న్యాయమైనదేనని ఒప్పుకున్నారు.



సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు మహాదేవ్‌సింగ్ పోలీసు కాల్పులను ఖండించాడు. గైర్ ముల్కీ ఉద్యమానికి సోషలిస్టు పార్టీ తమ సంపూర్ణ మద్దతును తెలియ చేసింది. ఆ రోజు సుల్తాన్ బజార్‌లో కృష్ణదేవరాయల భాషానిలయం, స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణా రావు హాజరయ్యారు. ఆయన కారును ఆందోళనాకారులు తగులబెట్టారు. ఆ రాత్రి ఆయన రేడియోలో ప్రసంగిస్తూ "రజాకార్, ఆజాద్ హైద్రాబాద్ సంఘ విద్రోహశక్తులు ఆ అల్లర్లకు కారణం" అని నిందించారు. హైద్రాబాదు రాష్ట్ర కాంగ్రేస్ అధ్యక్షుడు స్వామి రామానంద్ తీర్థ కూడా విద్యార్థులను సంఘ విద్రోహక శక్తులు రెచ్చగొట్టున్నాయని వ్యాఖ్యానించాడు. దాని తర్వాత ఆయన ఉప ఎన్నికల ప్రచారానికి వరంగల్ వెళ్లినపుడు కోపగించుకున్న ప్రజలు ఆయన కారును తగులబెట్టారు. చివరికి ఆయన సగం తగులబడ్డ కారులోనే హైద్రాబాదుకు తిరిగివెళ్లారు. హైద్రాబాదులో జరిగిన పోలీసు కాల్పులకు నిరసనగా బీదర్, ఔరంగాబాద్ లలో కూడా విద్యార్థుల ప్రదర్శనలు జరిగాయి.

**ఉద్యమానికి ఊతమిచ్చిన కాళోజీ నారాయణరావ్, జయశంకర్ గార్లు :**

వరంగల్లులో ఐదువేల మంది ఆజంజాహీ మిల్లుకార్మికులు అరగంటసేపు తమ పనిని ఆపి ప్రదర్శనలు, సమ్మె చేశారు. సెప్టెంబర్ 8న హన్మకొండలో పదివేల మంది విద్యార్థులు, పౌరులతో పెద్ద ఉరేగింపు, బహిరంగసభ జరిగింది. అందులో కాళోజి నారాయణ రావు గారు కూడా ఉన్నారు. ఆ నిరసన సభలో కాకతీయ పత్రికా సంపాదకుడు శ్రీనివాసరావు, వ్యాపారసంఘం కార్యదర్శి మృత్యుంజయలింగం, యువజనసంఘం కార్యదర్శి శ్రీ ఆబాగీ, సత్యనారాయణలు ప్రసంగించారు. అలాగే పౌర సంఘాల ఆధ్వర్యంలో కూడా నిరసన సభ జరిగింది. జయశంకర్‌గారు ఒక విద్యార్థిగా ఆ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. హైద్రాబాదులో జరిగే ఒక ప్రదర్శనలో పాల్గొనడానికి ఆయన బస్సులో హన్మకొండనుండి హైద్రాబాదుకు వస్తుంటే బొనగిరిలో బస్సు ఆపేశారు. హైద్రాబాదులో అప్పటికే పోలీసు కాల్పులు జరిగి కర్ఫ్యు విధించారని వార్త చేరింది. గైర్ ముల్కీ గోబ్యాక్ ఆందోళనా ఉధృతిని గమనించిన ప్రభుత్వం సెప్టెంబరు 7న ముల్కీ నిభంధనలు పరిశీలించటం కోసం నలుగురు మంత్రులతో ఒక ఉప సంఘాన్ని నియమించింది. అందులో కొండా వెంకటరంగారెడ్డి ఎక్సైజు


www.etelangana.org

శాఖ మంత్రి, డా॥ మేల్కొటే, ఆర్థిక మంత్రి, ఫూల్‌చంద్ గాంధీ విద్యాశాఖ మంత్రి మరియు నవాబ్ జంగ్, పబ్లిక్ వర్క్స్ శాఖ మంత్రి సభ్యులు. అమలులో ఉన్న ముల్కీ నిబంధనలను పరిశీలించటం, విద్యార్థులను ఇతర సంస్థలను కలుసుకుని వివిధ అభిప్రాయాలను సేకరించి నివేదిక సమర్పించటం ఆ ఉపసంఘం బాధ్యత. ఇదే గాక హైద్రాబాదులో పోలీసు కాల్పుల విచారణకోసం మరో న్యాయ విచారణ సంఘాన్ని ప్రభుత్వం నియమించింది. దానికి హైకోర్టు సిట్టింగ్ జడ్జి శ్రీపింగళి జగన్మోహనరెడ్డి గారు నియమించబడ్డారు.

**ప్రభుత్వ నిర్బంధ విధానం :**

ఈ ఆందోళనలో 18 మంది చనిపోయారని, వందలాది మంది గాయపడ్డారని అంచనా. జంటనగరాలలో వారం రోజుల పాటు స్కూళ్ళు, కాలేజీలు మూసివేశారు. సుమారు 350 మంది విద్యార్థులను, పత్రికా విలేఖరులను, యువకులను అరెస్టుచేసి వేధించారు. ఉద్యమం ఆగిన తర్వాత సెప్టెంబరు 13న సయ్యద్ అక్తర్ హుస్సేన్, ఎమ్.ఎల్.ఏ. ను ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం క్రింద అరెస్టు చేశారు. ఈయన 'అవామ్' అనే ఉర్దూ పత్రిక సంపాదకుడు. మరో ఉర్దూ పత్రికా సంపాదకురాలు బేగంసాదిక్ జహన్‌ను కూడా పి.డి. చట్టం క్రింద అరెస్టు చేశారు. కాని హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడం వలన ఆమె ఆ తర్వాత విడుదల అయ్యింది. తమ పత్రికలలో నిజాలు రాయటమే వారుచేసిన నేరం. కాల్పులలో చనిపోయిన వారిలో అరుణ అనే ఒక స్త్రీ, మహమ్మద్ ఖాన్ అనే ఒక రిక్షా కార్మికుడు, అన్సారీ అనే ఒక హకీం కూడా ఉన్నారు. బస్సులను తగులబెట్టుండగా షేక్ ముక్తార్ అనే వ్యక్తిపై కాల్పులు జరుపగా ఆయన అక్కడికక్కడే మరణించాడు. దీని వలన విద్యార్థులే గాక సామాన్య ప్రజలు కూడా ఏ విధంగా బలి అయ్యారో తెలుస్తుంది.

**తెలంగాణా 'గోస'ను అర్థం చేసుకున్న నెహ్రూ :**

ముల్కీ సమస్య రాజకీయ, మత సమస్య కాదని, ఆర్థిక పరమైన సమస్య అని ముఖ్యంగా ఎంప్లాయ్‌మెంటు ఆఫీసులలో నమోదుచేసుకున్న 70 వేల మంది నిరుద్యోగుల సమస్య అని, నాన్ ముల్కీలందర్ని వెనుకకు పంపి ఆ



స్థానాలలో స్థానికులను నియమించాలనీ 11సెప్టెంబరు విశాలాంధ్ర దిన పత్రికలో వి.డి. దేశ్‌పాండే, డా.. రాజ్‌బహాదూర్ గౌర్, వి.కె. ధాగే గార్లు ఒక ప్రకటన చేశారు. వీరు కమ్యూనిస్టు పార్టీ నాయకులు. ఆ విధంగా 1952 సెప్టెంబరులో జరిగిన గైర్ ముల్కీ ఆందోళన ఒక బూర్గుల రామకృష్ణా రావు మంత్రి వర్గాన్నే గాక అన్ని రాజకీయ పార్టీల వారిని ఒక కుదుపు కుదిపి వాస్తవాలపై దృష్టి మరలించింది. సెప్టెంబరు 26న ప్రధానమంత్రి నెహ్రూ హైద్రాబాదుకు వచ్చి సమస్య న్యాయ విచారణలో ఉన్నందున ప్రస్తుతం తానేమీ వాఖ్యానించనని తప్పుకున్నారు.

అయినా ప్రధాన మంత్రి పండిట్ జవహార్‌లాల్ నెహ్రు ఎప్పుడూ విశాలాంధ్ర స్థాపన ప్రతిపాదన పట్ల సుముఖంగా ఉండేవారు కాదు. 1953 అక్టోబరులో పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ "విశాలాంధ్ర వాదన వెనుక దురాక్రమణోద్దేశ ప్రేరిత సామ్రాజ్య వాదతత్వం దాగిఉంది" అని వాఖ్యానించాడు (ఇండియన్ ఎక్స్‌ప్రెస్, 17 అక్టోబరు 1953).



www.etelangana.org

**విశాలాంధ్రలో ప్రజారాజ్యం :**

1948 సెప్టెంబరులో హైద్రాబాదులో పోలీసు యాక్షన్ ముగియగానే ఆంధ్రాలోని సర్కారు జిల్లాలలో విశాలాంధ్ర నినాదం బలం పుంజుకుంది. 1949 నవంబరులో అయ్యదేవర కాళేశ్వరరావు విజయవాడలో "విశాలాంధ్ర మహాసభ"ను స్థాపించాడు. ఆ సంస్థ ఆంధ్ర తెలంగాణా విలీనానికి ప్రచారం ప్రారంభించింది. 1951 జులైలో బెంగుళూరులో జరిగిన అఖిలభారత కాంగ్రేస్ మహాసభలలో ఆయన విశాలాంధ్ర ప్రస్తావన తీసుకురాగా ప్రధాన మంత్రి నెహ్రూ దానిని 'లూజ్ టాక్' గా కొట్టిపారేశాడు. మరోవైపు కమ్యూనిష్టు పార్టీ తెలంగాణాలో సాయుధ పోరాటం చేస్తున్నప్పుడు 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' నినాదాన్ని ప్రచారం చేసింది. దాని రూపకర్త సుందరయ్యగారు. ఒకే జాతి ఒకే భాష ఒకే రాష్ట్రమన్నది కమ్యూనిస్టు పార్టీ ప్రచారం చేసింది.

1946లో ఆయన విశాలాంధ్రలో ప్రజారాజ్యం అన్న పుస్తకాన్ని రాసి ప్రజాశక్తి ప్రచురణల ద్వారా ప్రచారం చేశాడు. అంతకు పూర్వమే తెలంగాణాలో ఉన్న 'ఆంధ్రమహా సభ' ద్వారా ఒకే భాష, ఒకే రాష్ట్రం నినాదాన్ని ప్రచారం చేశారు. ఆయన అత్యుత్సాహంలో తొలిదశలో మరఠ్వాడాలోని ఐదు జిల్లాలు, కన్నడ ప్రాంతంలోని మూడు జిల్లాలను కూడా కల్పుకొని విశాలాంధ్ర ఏర్పడాలని సూచించగా దానిని పార్టీ కేంద్రకమిటీ తిరస్కరించి, తెలుగు భాష మాట్లాడే ప్రాంతాలతోనే విశాలాంధ్ర ఏర్పడాలని సూచించింది.

అయితే సుందరయ్యగారి కన్నా చాలా ముందే 1937లో ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యగారు ఆంధ్రా యూనివర్శిటీ వార్షికోత్సవ సంచికలో ఒక వ్యాసం రాసి నిజాం రాజుగా ఉండే విశాలాంధ్ర ఏర్పడాలని సూచించాడు. ఆ తర్వాత 1940లో వావిలాల గోపాలక్రిష్ణయ్యగారు విశాలాంధ్ర పుస్తకాన్ని రాశారు.

కొత్తగా ఏర్పడబోయే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని మద్రాసు ఉండాలని కాంగ్రేస్ పార్టీ డిమాండ్ చేస్తున్న రోజులలో విశాలాంధ్రకు రాజధాని హైద్రాబాదు ఉండాలని కమ్యూనిస్టు పార్టీ సూచించింది. హైద్రాబాదు రాజధానిగా ఉండాలన్న ఆలోచన ముందు కమ్యూనిస్టు పార్టీ వైపునుండి వచ్చింది.



www.etelangana.org

1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు కాంగ్రేస్ పార్టీ రాయలసీమవారిని సంతృప్తి పరచటానికి కేంద్ర స్థానమైన విజయవాడ బదులు కర్నూలును రాజధానిగా చేసింది. బహుశా విజయవాడ రాజధానిగా అయితే ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత కూడా అదే రాజధానిగా కొనసాగి ఆంధ్ర తెలంగాణా రాజకీయాలు ఈనాడు మరో విధంగా ఉండేవేమో - జగదేక సుందరి క్లియోపాత్రా ముక్కు కాస్త వంకరగా ఉంటే యూరపు రాజకీయాలు మరోక రకంగా ఉండేవన్నట్లు.

1952 ఎన్నికలలో ఆ పార్టీ తెలంగాణాలో ఘన విజయం సాధించినా ప్రభుత్వాన్ని ఏర్పరచలేక పోయింది. కాంగ్రేసుకు తెలంగాణాలో తక్కువ సీట్లు వచ్చినా మరాట్వాడా, కన్నడ ప్రాంతాలలో ఎక్కువ సీట్లు వచ్చినందున బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా కాంగ్రేసు పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. తెలంగాణాలో ఎక్కువ సీట్లు సాధించుకున్న కమ్యూనిస్టు పార్టీ అధికారాన్ని దక్కించుకోలేకపోయింది. అటు 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు కూడా కాంగ్రేసు పార్టీకి ఎన్.జి. రంగా, కృషికార్ లోక్ పార్టీ మరియు ప్రజా సోషలిస్టు పార్టీలు తమ మద్దతును అందించడంతో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి రాలేకపోయింది. కావున విశాలాంధ్ర ఏర్పడితే రెండు ప్రాంతాలలోని కమ్యూనిస్టుల సీట్ల ఆధిక్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయవచ్చునన్న ఆశతో కమ్యూనిస్టులు 1952లో విశాలాంధ్రలో ప్రజారాజ్యం అన్న నినాదాన్ని బలంగా ప్రచారం చేశారు.

### రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం నియామకం :

ఈ నేపథ్యంలో 1953లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం అవతరించింది. దానితో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఉద్యమం దేశవ్యాప్తంగా ఊపందుకుంది. అయితే అందరూ అనుకున్నట్లు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ఆంధ్ర రాష్ట్రం అవతరణతోనే జరుగలేదు. బ్రిటిష్‌వారి పరిపాలనలో ఒరియాభాష మాట్లాడే జిల్లాలనన్నింటిని బెంగాల్, మద్రాసు రాష్ట్రాలనుండి విడదీసి ప్రత్యేక ఒరిస్సా రాష్ట్రంగా ఏర్పరచారన్న సంగతి గమనించాలి. వివిధ రాష్ట్రాలలో ప్రజల ఒత్తిడులను తట్టుకోలేక కేంద్ర ప్రభుత్వం 1953 డిసెంబరులో రాష్ట్రాల పునర్విభజన సంఘాన్ని



(States Reorganisation Committee) నియమించింది. అది త్రిసభ్య కమిటీ. సయ్యద్ ఫజల్ అలీ దాని చైర్మన్. హెచ్.ఎన్. కుంజ్రు మరియు కె.యం. ఫణిక్కర్ సభ్యులు. ఈ ఎస్.ఆర్.సి. ఆవిర్భావంతో ఆంధ్రా ప్రాంతంలో మళ్లీ విశాలాంధ్ర ప్రయత్నాలకు కొత్త ఊపువచ్చింది. కాని తెలంగాణాలో మాత్రం విలీనం విషయంలో ఏకాభిప్రాయం లేదు. అప్పటికే 1952లో గైర్‌ముల్కీ ఉద్యమం నడిచింది. అనేక మంది మరణించారు. గాయపడినారు. పోలీసుల వేధింపులకు గురైనారు. విలీనానికి ముందే ఆంధ్రుల పెత్తనానికి, దోపిడీకి బలి అయ్యారు. కావున తెలంగాణా ప్రజలలో అనుమానాలు, భయం అట్లనే ఉన్నాయి. హైద్రాబాదు రాష్ట్ర కాంగ్రేస్ అధ్యక్షుడు కొండా వెంకటరంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి హయగ్రీవాచారి లాంటి ప్రముఖ కాంగ్రేసు నేతలు విలీనానికి విముఖులు కావటంతో హైద్రాబాదు రాష్ట్ర కాంగ్రేసులో విభేదాలు వచ్చాయి. విలీనం విషయంలో తెలంగాణా ప్రజల అనుమానాలు, భయాలు ఈక్రింది విధంగా ఉన్నాయి.

### తెలంగాణా ప్రజల అనుమానాలు, భయాలు :

1. ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుండి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. దానితో పోలిస్తే తెలంగాణా సగటు ఆదాయం చాలా ఎక్కువ. అనగా తెలంగాణా ఆర్థికంగా వెనుకబాటు తనంలో లేదు. అత్యధిక భూమిశిస్తుపన్ను మరియు ఎక్సైజు ఆదాయం వలన తెలంగాణాకు ఆంధ్రా కన్న సంవత్సరానికి ఐదుకోట్ల ఆదాయం, రాబడి ఎక్కువగా ఉంది. కావున విలీనం జరిగితే తెలంగాణా ప్రాంతం యొక్క అభివృద్ధికి వినియోగించవలసిన ఈ మిగులు ఆదాయాన్ని ఆంధ్ర రాష్ట్రంతో పంచుకోవల్సి వస్తుందన్న భయం తెలంగాణాకు ఉంది.

2. విశాలాంధ్ర ఏర్పడితే అభివృద్ధి పథకాల రూపకల్పనలో తమ ప్రాంతానికి తగినంత ప్రాధాన్యత లభించకపోవచ్చుననే భయం తెలంగాణా వారికి ఉంది. కృష్ణా, గోదావరి నదులపై కట్టబోయె ప్రాజెక్టులలో ఎక్కువ నీరు కొస్తా ఆంధ్రకే చెందే ప్రమాదం ఉంది. కావున నదీ జలాల వినియోగంలో తమవంతు వాటా తమకు దక్కదేమో అన్న భయం తెలంగాణా ప్రజలకు ఉంది.


www.etelangana.org

3. మరో ముఖ్యమైన కారణం విద్యా ఉద్యోగాలకు సంబంధించినది. బ్రిటిష్ వారి పుణ్యమా అని ఆంధ్రప్రాంతం వారు ఇంగ్లీష్ విద్యావిధానంలో, ఉన్నత విద్యలలో అభివృద్ధిని సాధించారు. నైజాం రాజరిక ఫ్యూడలిజం వలన తెలంగాణా ఇంగ్లీష్ భాషలో వెనుకబడటమే గాక విద్యాభివృద్ధి చాలా పరిమితం. అయినా ఎంత తక్కువ చదువుకున్నా తెలంగాణా ఉద్యోగాలు తెలంగాణా వారికే దొరుకుతాయి. ఒక వేళ విలీనం జరిగితే ఇంగ్లీష్ భాషలో మరియు విద్యలో అభివృద్ధి చెందిన ఆంధ్రావారితో తాము పోటీ పడలేమని, ఎక్కువ అర్హతలున్న వారికే ఉద్యోగాలు దక్కుతాయని, ఆంధ్రుల వలస మరింత ఎక్కువ అవుతుందని భయ పడ్డారు.

పై భయాలన్నీ సహేతుకాలే అని తర్వాత భవిష్యత్తు రుజువుచేసింది.

**విలీనాన్ని వ్యతిరేకించిన రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం :**

1954 జూన్, జులైలలో రాష్ట్రాల పునర్విభజన సంఘం హైద్రాబాదును సందర్శించి వివిధ సంస్థల, వ్యక్తుల అభిప్రాయాలను తెలుసుకుని వారినుండి మహాజరులను స్వీకరించి, పరిశీలించి 1955 సెప్టెంబరు 30న తన నివేదికను సమర్పించింది. హైద్రాబాదు రాష్ట్రం లోపలా, వెలుపలా ఉన్న ప్రజాభిప్రాయం ప్రకారం రాష్ట్రాన్ని విభజించాలని సూచించింది. మరాఠీ భాష మాట్లాడే ప్రాంతాలను మహారాష్ట్రలో విలీనం చేయాలని కన్నడ మాట్లాడే ప్రాంతాలను కర్నాటకలో విలీనం చేసి, తెలుగు మాట్లాడే (బీదర్‌తో సహా) ప్రాంతాలతో అనగా పదిజిల్లాలతో తెలంగాణా రాష్ట్రాన్ని అలాగే ఉంచాలని స్పష్టంగా సూచించింది. దాని పేరు "హైద్రాబాదు రాష్ట్రంగా" ఉండాలని కూడా చెప్పింది. అయితే 1961 సాధారణ ఎన్నికల తర్వాత అనగా ఐదు సంవత్సరాల తర్వాత హైద్రాబాదు రాష్ట్ర నూతన అసెంబ్లీలోని 2/3 వంతు మెజార్టీసభ్యులు విలీనానికి ఒప్పుకుంటే విశాలాంధ్రను ఏర్పాటు చేసుకోవచ్చని చాలా స్పష్టంగా చెప్పింది. ఈ కీలకమైన నిర్ణయం హైద్రాబాదు రాష్ట్ర అసెంబ్లీ మాత్రమే తీసుకోవాలని చెప్పటం గమనించదగిన అంశం.

రాష్ట్రాల పునర్విభజన సంఘం సిఫార్సులను కె.వి. రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి మొదలగు వారు అభినందించారు. కాని ఇటు తెలంగాణా కాంగ్రేసు వారిలో అటు విశాలాంధ్ర వాదుల్లో అది తీవ్రచర్చనీయాంశమైంది. విషాదం ఏమిటంటే



తెలంగాణా కాంగ్రేసు శాసనసభ్యులలో అత్యధికులు మరియు పది జిల్లాల కాంగ్రేసు కమిటీలో ఏడు కమిటీలు విశాలాంధ్ర ఏర్పాటుకు తమ సుముఖతను వ్యక్తం చేశాయి. హైద్రాబాదు శాసనసభలో ఈ అంశం చర్చకు వచ్చినపుడు సభలోని 174 మంది సభ్యులలో 147 మంది తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. వారిలో 103 మంది విశాలాంధ్రకు మద్దతు తెలుపగా 29మంది మాత్రమే ప్రత్యేక తెలంగాణా ఏర్పడాలని కోరారు. మిగిలిన 15 మంది తటస్థంగా ఉండిపోయారు. ఆంధ్రలో విశాలాంధ్రకు పూర్తి మద్దతు లభించింది. దాని వలన కాంగ్రేసు అధిష్ఠాన వర్గం విశాలాంధ్ర ఏర్పాటుకు ఒప్పుకుంది. అయినా కె.వి. రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి మరికొందరు తమ నిర్ణయాన్ని మార్చుకోలేదు. వారు ఒక ప్రతినిధి వర్గంగా ఢిల్లీ వెళ్ళి అప్పటి హోం మినిస్టర్ గోవింద్ వల్లభ్ పంత్‌ను కలిసి రాజకీయ, సాంస్కృతిక పరంగా రెండు ప్రాంతాల మధ్య తేడాలు ఉన్నాయని విలీనం అణిచివేతకు దారి తీస్తుందని చెప్పినా ఆయన అర్థం చేసుకోలేదు. ఈ వ్యత్యాసాల గురించి నెహ్రూగారికి స్పష్టంగా తెలియటంవల్లనే విశాలాంధ్ర ఆలోచన వెనుక దురాక్రమణోద్దేశ ప్రేరిత సామ్రాజ్య వాదతత్వం దాగిఉంది అని వాఖ్యానించారు. అటువంటి దశలో రెండు ప్రాంతాల మధ్య గల అభిప్రాయ భేదాలను తొలగించాలని కాంగ్రేసు అధిష్ఠాన వర్గం భావించి, 1956 ఫిబ్రవరి20న మొదటిసారిగా రెండు ప్రాంతాల నాయకుల్ని ఢిల్లీలో సమావేశ పరిచింది. ఒక్కొక ప్రాంతం నుండి నలుగురు నాయకులు హాజరయ్యారు.

**ఆంధ్రా ప్రాంతం నుండి :**

1. బెజవాడ గోపాలరెడ్డి, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి
2. నీలం సంజీవరెడ్డి, ఉప ముఖ్యమంత్రి
3. గౌతు లచ్చన్న, మంత్రి
4. అల్లూరి సత్యనారాయణ రాజు (ఆంధ్ర కాంగ్రేసు కమిటి అధ్యక్షుడు)

**తెలంగాణా ప్రాంతం నుండి :**

1. బూర్గుల రామకృష్ణారావు (హైద్రాబాదు రాష్ట్రముఖ్యమంత్రి)
2. కె.వి. రంగారెడ్డి, మంత్రి
3. మర్రి చెన్నారెడ్డి, మంత్రి
4. జె.వి. నర్సింగ్‌రావు (హైద్రాబాదు కాంగ్రేసు కమిటి అధ్యక్షుడు)


www.etelangana.org

## విడాకులు తీసుకోవచ్చని నెహ్రూగారి జోస్యం :

ఈ సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు విశాలాంధ్రకు తన సమ్మతం తెలుపగానే హైద్రాబాదులో నిరసనవెల్లువ తలెత్తింది. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే కాంగ్రేస్ పార్టీలోని మామా అల్లుళ్ల రెడ్డి గ్రూపు రాజకీయాలు తమ బ్రహ్మణ వర్గాన్ని తొక్కిపెడుతాయన్న భయంతో ఆయన విశాలాంధ్రవైపు మొగ్గుచూపాడని అంటారు. పైగా ఆంధ్ర కాంగ్రేస్ నాయకులైన నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి కలహాల మధ్య తనను మధ్యేమార్గ అభ్యర్థిగా రాబోయే ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా అంగీకరిస్తారని ఆశపడ్డాడు. ఇటు తెలంగాణాలో కాని అటు ఆంధ్రలో కాని కాంగ్రేస్ పార్టీ రాజకీయాలలో కులం ఒక బలమైన అంశంగా పనిచేసింది. ఈ భయం వలనే హైద్రాబాద్ స్టేట్ కాంగ్రేస్ నాయకులైన స్వామి రామానందతీర్థ మరియు మాడపాటి హనుమంతరావులు కూడా విశాలాంధ్రవైపే మొగ్గుచూపారు.

ఆ పరిస్థితిని అధ్యయనం చేయటానికి అఖిల భారత కాంగ్రేసు కమిటీ ఎస్.కె. పాటిల్‌ను హైద్రాబాదుకు పంపింది. ఆయన అన్ని వర్గాల వారితో మాట్లాడి వెనక్కు వెళ్లుతూ "తెలంగాణా ప్రాంతం ప్రజలు కోరనిదే విశాలాంధ్ర ఏర్పాటు జరగదని" అన్నారు. ఆ రోజుల్లోనే కేంద్ర హోం మంత్రి గోవింద్ వల్లభ్ పంత్ "తెలంగాణా ప్రాంతం ప్రజలు సమ్మతిస్తేనే విశాలాంధ్ర స్థాపన జరుగుతుందని" పార్లమెంటులో ప్రకటించారు. ఈ వాదవివాదాలు అలా కొనసాగుతున్నపుడే 1956 మార్చి5న ప్రధానమంత్రి నెహ్రూ నిజామాబాద్‌లోని ఒక సభలో మాట్లాడుతూ విశాలాంధ్ర స్థాపనకు అనుకూలంగా కేంద్రం నిర్ణయించినట్లు ప్రకటించారు. కాని ఆయనే మరో జోస్యం కూడా చెప్పారు.

"తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాలు కలిసి ఉండీ పొంతన కుదురక పోతే ఆలుమగలు విడాకులు ఇచ్చుకున్నట్లే కొంత కాలం తర్వాత రెండు ప్రాంతాలు విడిపోవచ్చు".

## పెద్దమనుషుల ఒప్పందం :

అట్లా చివరికి "పెద్ద మనుషుల ఒప్పందం" పై 1956 జులై 19న సంతకాలు జరిగాయి. పైన పేర్కొన్న రెండు ప్రాంతాల నాయకులు ఆ ఒడంబడికపై సంతకాలు చేశారు. ఆ పెద్ద మనుషుల ఒప్పందం (Gentlemen Agreement) వివరాలు ఇవి :-



## ఒప్పందపు నిబంధనలు :

1. రాష్ట్ర ప్రభుత్వపు ముఖ్య, సాధారణ పరిపాలనా విభాగాలపై అయ్యే ఖర్చు తగు నిష్పత్తిలో రెండు ప్రాంతాలు భరించాలి. తెలంగాణా ప్రాంతం నుండి వచ్చే మిగులు ఆదాయాన్ని ఆ ప్రాంతపు అభివృద్ధికే కేటాయించాలి. ఈ నిబంధనను అయిదేళ్ల తర్వాత సమీక్షించి అసెంబ్లీలోని తెలంగాణా శాసనసభ్యులు కోరిన పక్షంలో మరల అయిదేళ్ల పాటు వర్తింపచేయాలి.

2. తెలంగాణాలో మద్యపాన నిషేధాన్ని అసెంబ్లీలోని తెలంగాణా శాసన సభ్యులు కోరిన విధంగా అమలు చేయాలి.

3. తెలంగాణాలో ప్రస్తుతం అమలులో ఉన్న విద్యా సౌకర్యాలన్ని తెలంగాణా విద్యార్థులందరికి వర్తింపజేసి మరింతగా అభివృద్ధి చేయాలి. తెలంగాణాలోని సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశం తెలంగాణా విద్యార్థులకే పరిమితం చేయాలి. లేకపోతే రాష్ట్రం మొత్తం మీద 1/3 వంతు సీట్లను తెలంగాణా విద్యార్థులకు ప్రత్యేకంగా కేటాయించాలి. అయితే ఈ రెండింటిలో తెలంగాణా వారికి ఏది ప్రయోజనమైతే దానినే ఎంచుకోవచ్చు.

4. విశాలాంధ్రను ఏర్పాటు చేసినపుడు ఎక్కువైన [illegible] తీసివేయాల్సి వచ్చినపుడు ఆయా ప్రాంతాలకు తగిన నిష్పత్తిలోనే జరగాలి.

5. ఉద్యోగ నియామకాల్లో మాత్రం ఆయా ప్రాంతాల జనాభాను ప్రాతిపదికగా తీసుకోవాలి.

6. తెలంగాణాలోని సాధారణ పరిపాలన, న్యాయవిభాగాల్లో ఉర్దూ భాషకున్న ప్రస్తుత స్థానాన్ని మరో అయిదేళ్లపాటు కొనసాగించాలి. అయిదు సంవత్సరాల తర్వాత ప్రాంతీయ మండలి (Regional Council) పరిస్థితిని సమీక్షిస్తుంది. ఉద్యోగ నియామకాలకు తెలుగు భాషా పరిజ్ఞానం తప్పని సరి అనే నిబంధనను పెట్టకూడదు. అయితే ఉద్యోగంలో చేరిన రెండేళ్లకు ఉద్యోగులకై నిర్వహించే తెలుగు పరీక్షలో తప్పక ఉత్తీర్ణుడు కావాలి.


www.etelangana.org

7. తెలంగాణా ప్రాంతంలోని ఉద్యోగాల్లో చేరేందుకు 12 సంవత్సరాలు స్థానికుడై ఉండాలనే నిబంధన వంటి కొన్ని నియమాల్నికూడ రూపొందించాలి.

8. తెలంగాణా ప్రాంతంలోని వ్యవసాయిక భూముల అమ్మకం ప్రాంతీయ మండలి అధికార పరిధిలో ఉండాలి.

9. తెలంగాణా ప్రాంతపు బహుముఖాభివృద్ధికై ఒక ప్రాంతీయ మండలిని ఏర్పాటు చేయాలి.

10. ప్రాంతీయ మండలిలో 20 మంది సభ్యులుండాలి. వీరిలో 9 మంది అసెంబ్లీ సభ్యులై ఉండాలి. వీరిని జిల్లాకు ఒక్కరు చొప్పున ఆయా జిల్లాల సభ్యులు ఎన్నుకుంటారు. మరల 6 మంది సభ్యుల్ని అసెంబ్లీ నుండి గాని, పార్లమెంటు నుండి గాని తెలంగాణా అసెంబ్లీ సభ్యులు ఎన్నుకుంటారు. మరో 5 మంది సభ్యులు బయటివారై ఉంటారు. వీరిని తెలంగాణావారే ఎన్నుకుంటారు.

11. ప్రాంతీయ మండలి ఈ క్రింది విషయాల్లో నిర్ణయాధికారాన్ని కల్గి ఒక చట్టబద్ధమైన సంస్థగ రూపొందాలి.

(ఎ) తెలంగాణా ప్రాంతానికి సంబంధించినంతవరకు పై విషయాలతో పాటు సాధారణ ప్రణాళికలోని ప్రణాళిక, అభివృద్ధి విషయాలు, ఉద్యోగ నియామకాలపై అదుపును కలిగి ఉంటుంది.

(బి) ఈ ఒప్పందాన్ని ముందుగానే సవరించితే తప్ప పదేళ్ళ తర్వాత సమీక్షించాలి.

12. క్యాబినెట్ మంత్రుల నియామకం 60-40 నిష్పత్తిలో జరగాలి. తెలంగాణాకు చెందిన మంత్రుల్లో ఒకరు ముస్లిం అయిఉండాలి.

13. ముఖ్యమంత్రి ఆంధ్రప్రాంతం వాడయితే, ఉప ముఖ్యమంత్రి తెలంగాణా ప్రాంతానికి చెందిన వాడై ఉండాలి. ఒకవేళ ముఖ్యమంత్రి తెలంగాణా ప్రాంతానికి చెందిన వ్యక్తి అయితే ఉప ముఖ్యమంత్రి ఆంధ్ర ప్రాంతానికి చెందినవాడై ఉండాలి. హోంశాఖ, ఆర్థికశాఖ, రెవెన్యూ శాఖ ప్రణాళిక మరియు



అభివృద్ధి శాఖ, వాణిజ్యము మరియు పరిశ్రమల శాఖా - వీటిల్లో ఏదేని రెండు శాఖలు తెలంగాణావారికి అప్పగించాలి.

14. తెలంగాణాకు 1962 వరకు ప్రత్యేక కాంగ్రెసు కమిటి కావాలని హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు కమిటి అధ్యక్షుడు కోరాడు. ఇందుకు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటి అధ్యక్షుడు కూడ తన ఆమోదాన్ని తెలిపాడు.

రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఈ 'పెద్ద మనుషుల' ఒప్పందానికి స్థానం కల్పించి భారత ప్రభుత్వం చట్టబద్ధమైన మద్దతునిచ్చింది. ఒప్పందం ముసాయిదాను రూపొందించడంలో చెన్నారెడ్డి చురుకుగా పాల్గొని విలీనం తర్వాత ఏర్పడబోయే నూతన రాష్ట్రానికి, మైసూర్ రాష్ట్రాన్ని ఉదాహరిస్తూ హైద్రాబాదు రాష్ట్రం అని నామకరణం చేశాడు. దానికి కేంద్ర హోం మంత్రి గోవింద్ వల్లభ్ పంత్ వ్యతిరేకించారు. ఐక్యరాజ సమితిలో హైద్రాబాదు తగాదా ఉంది కావున ఆ పేరు వద్దన్నాడు. చివరికి ముసాయిదా బిల్లులో కొత్త రాష్ట్రానికి 'ఆంధ్ర-తెలంగాణా' అని పేరు పెట్టారు. అయితే ఈ రెండు ప్రాంతాల మధ్య భేదం స్పష్టంగా కన్పిస్తున్నదని ఆంధ్రనాయకులు ఆక్షేపణ తెలియచేయడంతో జాయింటు సెలెక్టు కమిటి 'ఆంధ్రప్రదేశ్'గా మార్చింది.

1956 నవంబరు 1న నెహ్రూ కొత్త రాష్ట్రానికి ప్రారంభోత్సవం చేశాడు. సంజీవరెడ్డి మొదటి ముఖ్యమంత్రి కాగా సి.ఎం. త్రివేది మొదటి గవర్నరుగ నియమితులయ్యారు.


www.etelangana.org

# 1956-1968

## పెద్దమనుషుల ఒప్పందం ఉల్లంఘనలు,

## అన్యాయాలు, అవహేళనలు

www.etelangana.org

### చేసిన సంతకాలు ఆరకముందే ఒప్పందం ఉల్లంఘన :

పెద్ద మనుషుల ఒప్పందం వలన తమకు న్యాయం జరుగుతుందని తెలంగాణా ప్రజలు అనుకోలేదు. అందరూ అనుమానించినట్లుగానే రాష్ట్రం అవతరించిన రోజే పెద్దమనుషుల ఒప్పందాన్ని ఉల్లంఘించారు. ఒడంబడిక ప్రకారం ముఖ్యమంత్రి ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారైతే ఉప ముఖ్యమంత్రి పదవి తెలంగాణా వారికి కేటాయించాలి. ఉప ముఖ్యమంత్రి పదవి నిరుపయోగమని ఆరోవేలు వంటిదని ప్రకటిస్తూ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి ఉప ముఖ్యమంత్రిని తెలంగాణా నుండి నియమించలేదు. ఆ పదవి ఉంటే భవిష్యత్తులో మళ్లీ ఏదైనా ప్రమాదం రావచ్చని ఆంధ్రుల భయం. పూర్వపు ఆంధ్ర రాష్ట్రంలో బెజవాడ గోపాల్‌రెడ్డి మంత్రి వర్గంలో ఒకరోజు ముందు వరకు తానే స్వయంగా అలంకరించిన ఉప ముఖ్యమంత్రి పదవి తెల్లారేసరికి ఆయనకు అనవసరమనిపించడం ఆశ్చర్యకరం.

### ఆంధ్రుల దృష్టిలో తెలంగాణా ఒక ఆక్రమిత ప్రాంతం :

మైసూర్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన వీరేంద్రపాటిల్ ఒకప్పుడు హైద్రాబాదు సంస్థానంలోని గుల్బర్గా ప్రాంతానికి చెందినవాడు. అంత మారుమూల ప్రాంతం అతనే మైసూర్ రాష్ట్రానికి (ఇప్పటి కర్నాటక) ముఖ్యమంత్రి కాగా, రాజధాని హైద్రాబాదుకు సంబంధించిన తెలంగాణా ప్రాంతం నుండి 1971 వరకు అనగా 15 సంవత్సరాలవరకు ఎవరూ, ఎందుకు ముఖ్యమంత్రి కాలేకపోయారు?

ప్రముఖ పాత్రికేయుడు పాశం యాదగిరిగారు ఇలా చెప్పారు. "మహారాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి కన్నంవార్. ఇతను ప్రత్యేక విదర్భ రాష్ట్రం కోరుతున్న నాగపూర్‌కు చెందినవాడు. మొదటిసారి ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం ఆ ప్రాంతంవారికే ఇచ్చారు. నిజానికి కన్నవార్ మహారాష్ట్రుడు కాదు. అతను పక్కా తెలంగాణా. కరీంనగర్‌కు చెందినవాడు. బి.సి. మున్నూరు కాపు. అతని పూర్వీకులు అక్కడికి వెళ్లి స్థిరపడినారు. అతను ఎక్కువగా చదువుకున్నవాడు కాదు. అతని ముఖ్యమంత్రి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ మహారాష్ట్ర కాంగ్రేసు నాయకులు ప్రధాన మంత్రి నెహ్రూను కలుసుకొని అనేక కారణాలు చెబుతూ



www.etelangana.org

'అతను నిరక్షరాస్యుడు' అని చెప్పినప్పుడు నెహ్రూ చమత్కారంగా "అయితే అతనే తప్పకుండా ముఖ్యమంత్రి పదవికి అర్హుడు. ఎందుకంటే ఈ దేశంలో చదువురాని కోట్లాది మందికి అతను ప్రతినిధి" అన్నాడట. చివరికి వై.బి.చవాన్ మద్దతుతో కన్నంవార్‌నే మహారాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా నియమించారు."

ఒక తెలంగాణావాడు తన రాష్ట్రం కాని రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి కాగా మరో తెలంగాణావాడు తన గడ్డమీద తాను 15 సంవత్సరాలవరకు ముఖ్యమంత్రి కాలేకపోయాడంటే ఎంత అన్యాయం? ఎంత విషాదం?

తెలంగాణా ఉద్యమం పుణ్యమా అని సమైక్యతావాది అయిన శ్రీపి.వి. నర్సింహారావుగారు 1971లో ముఖ్యమంత్రి అయ్యారు. అది మూన్నాళ్ల ముచ్చటే అయ్యింది. ఒక సంవత్సరం మూడు నెలలు 23 రోజులు మాత్రమే ఆయన ఆ పదవిలో ఉన్నారు. 11 నెలల రాష్ట్రపతి పాలన తర్వాత ఆంధ్ర నుండి వలస వచ్చి ఖమ్మం జిల్లాలో స్థిరపడిన జె.వెంగళరావు ముఖ్యమంత్రి అయ్యారు.

ఇక ఉప ముఖ్యమంత్రి పదవి సంగతి. చేసిన సంతకం ఆరకముందే ఉప ముఖ్యమంత్రి పదవి ఆరవవేలు వంటిదని, అక్కరలేదని ముఖ్యమంత్రి సంజీవరెడ్డి వాఖ్యానించాడు. మరి ఆయనకు తను ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉన్నప్పుడు ఆ జ్ఞానోదయం కలుగలేదా? ఆయన హయాం తర్వాత మూడేళ్లకు అనగా 1959లో సంజీవయ్య (దళితుడు) ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొండా వెంకటరంగారెడ్డిని ఉప ముఖ్యమంత్రిగా నియమించారు. అది రాజకీయాలలో కుల ప్రభావం, కాంగ్రేస్ గ్రూపుల ప్రభావమని తెలుస్తూనే ఉంది. ఆయన కూడా 1962 వరకు మూడు సంవత్సరాలు మాత్రమే ఉప ముఖ్యమంత్రిగా కొనసాగాడు. 1962లో ఆయన ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత నుండి 1969 వరకు ఆ పదవి 'గాయబ్' అయ్యింది. చివరికి మళ్లీ 1969లో తెలంగాణా ఉద్యమ భయం వలన రాజీబేరం కోసం, అగ్నిగుండంగా మారిన తెలంగాణాను చల్లబరచటం కోసం సమైక్యతావాది అయిన, కరీంనగర్‌కు చెందిన జె.వి. నర్సింగరావును ఉప ముఖ్యమంత్రిగా నియమించారు. ఆ తర్వాత అంతా గప్‌చుప్. అంతా గూడు పుఠాణి. ఎందుకీ అవమానాలు? ఎందుకీ అవహేళనలు? తెలంగాణా అంటే ఆక్రమించుకున్న ప్రాంతం అన్న ఆహంకారం తప్ప.



**అంత్యక్రియలలో కూడా వివక్షత :**

తెలంగాణావారి పట్ల బ్రతికున్నప్పుడే కాదు చివరికి మరణించిన తర్వాత కూడా వివక్షత చూపారు. ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు చనిపోయినప్పుడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగినాయి. ఆ కొద్ది రోజుల తర్వాత హైద్రాబాదు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామక్రిష్ణారావు చనిపోతే ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరుపలేదు. ఇటువంటి వివక్షత ఒక మాజీ ముఖ్యమంత్రి, అందులోనూ పెద్దమనుషుల ఒప్పందంపై సంతకం చేసిన వారిపట్లనే జరిగితే ఇక మామూలు తెలంగాణా ప్రజల గతి అధోగతి అయ్యింది. ఇన్ని అవహేళనలు జరిగినప్పుడు భావ సమైక్యత ఎలా సాధ్యమౌతుంది?

**వలసలు - వ్యవసాయ భూముల దురాక్రమణలు :**

1950 హైద్రాబాదు కౌల్దారీ మరియు వ్యవసాయ భూముల చట్టంలోని ఐదవ అధ్యాయానికి సంబంధించిన 47 నుండి 50 సెక్షన్ల ప్రకారం వ్యవసాయ భూముల బదిలీలు అనగా అమ్మకం మరియు కొనుగోలు విషయాలపై ఆంక్షలు ఉండేవి. దాని ప్రకారం తెలంగాణేతరులెవ్వరు తెలంగాణా వ్యవసాయభూములను కొనటం చట్ట విరుద్ధం. అయినా 1956 విలీనానికి ముందే ఈ చట్టాన్ని ఉల్లంఘించి నిజామాబాద్, వరంగల్ జిల్లాలలో ఆంధ్రా వారు భూముల్ని కొన్నారు. ఆ తర్వాత వచ్చిన పెద్దమనుషుల ఒప్పందంలోని 8వ అంశం ప్రకారం కూడా తెలంగాణాలోని వ్యవసాయ భూముల అమ్మకం మరియు కొనటం ప్రాంతీయ కమిటి అధికారానికి లోబడి ఉండాలి. దాని అనుమతి లేనిదే తెలంగాణేతరులెవ్వరు వ్యవసాయ భూముల్ని కొనరాదు.

అయినా తెలంగాణా ప్రాంతంలోని లక్షలాది ఎకరాల భూమిని ఆంధ్ర ప్రాంతం నుండి వలస వచ్చిన వారు తెలంగాణా ప్రాంతీయ కమిటీ అనుమతి లేకుండానే అగ్గువసగ్గువకు కొన్నారు. నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలలో ఈ వలసలు విపరీతంగా జరిగి భూములు పోగొట్టుకున్నవారు వ్యవసాయ కూలీలుగానో, పట్టణ ప్రాంతం హమాలీలుగానో మారిపోయారు.


www.etelangana.org

చివరికి 1968లో 1950 హైద్రాబాద్ కౌల్దారీ మరియు వ్యవసాయ భూముల చట్టంలోని 47 నుండి 50 వరకు గల సెక్షన్లను పూర్తిగా రద్దు చేయటం వలన వలసలకు గేట్లు ఎత్తివేసినట్లయింది.

వరంగల్, ఖమ్మం జిల్లాలోని గోదావరీ పరివాహక ప్రాంతాలలో 60 నుండి 80 శాతం మాగాణి భూమి స్థానిక రైతులనుండి ఆంధ్రా వలస వాదుల చేతుల్లోకి, భూస్వాముల చేతుల్లోకి వెళ్లిపోయింది. అలాగే నిజాం సాగర్ కింద ఉన్న సారవంతమైన భూమిలో 40 శాతం వరకు వారి ఆధీనంలోకి వెళ్లిపోయింది. ఆదిలాబాదు జిల్లా కడెం ప్రాజెక్ట్ కిందనున్న భూములు, నల్లగొండ జిల్లాలోని నాగర్జునసాగర్ కింద ఉన్న భూములు, మహబూబ్‌నగర్ జిల్లా రాజోలిబండ కాలువ కింద ఉన్న ఆలంపూర్, గద్వాల ప్రాంతం భూములు వారి ధృతరాష్ట్రకౌగిలిలో చిక్కుకున్నాయి. తెలంగాణా బక్క రైతులు మాత్రం బోరు బావులు, ఎండిపోయిన చెరువులు, కుంటలకింద వ్యవసాయం చేసుకుంటున్నారు. హైద్రాబాదుకు ఆనుకొని ఉన్న రంగారెడ్డి, మెదక్, నల్లగొండ జిల్లాలోని వ్యవసాయ భూముల్ని కుట్రప్రకారం నిర్వీర్యం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసి, అపార్టుమెంట్లను కట్టి కోట్లకు పడగలెత్తారు - ముందు రాజులు తర్వాత కాలంలో కమ్మ మహారాజులు. ఇట్లా తెలంగాణా నేలతల్లి వారి ఆక్రమణలకు గురైంది.

ఉద్యోగాలలోనే కాక వ్యవసాయ, వ్యాపారరంగాలలో కూడా వలస వెల్లువ తెలంగాణాను ముంచెత్తింది. మరి ఇటువంటి వలసలు విలీనం తర్వాతనైనా తెలంగాణా నుండి ఆంధ్రా ప్రాంతానికి ఎందుకు జరుగలేదు? తెలంగాణాలోని భూమిలేని ప్రజలు వ్యవసాయ కూలీలుగా మాత్రమే ఆంధ్ర ప్రాంతానికి వెళ్లటం జరిగింది. ఇందుకు విరుద్ధంగా ఆంధ్రులు ఇక్కడికి సాధారణ రైతులుగా వచ్చి భూస్వాములుగా స్థిరపడినారు. తెలంగాణా ప్రజలు తిరుపతి, అన్నవరం, సింహాచలం లాంటి పుణ్యక్షేత్రాలను దర్శించటంకోసం ఆంధ్రా ప్రాంతం వెళ్లారు తప్ప భూములను, ఉద్యోగాలను, వ్యాపారాలను ఆక్రమించటానికి మాత్రం ఎన్నడూ వెళ్లలేదు. రజాకారుల దురాగతాలను తప్పించుకొవటానికి తాత్కాలికంగా గుంటూరు, క్రిష్ణా జిల్లాలకు వెళ్లి తలదాచుకున్న మన పెద్దలకు ఎదురైన చేదు అనుభవాలను మనం ఎన్నడూ మరిచిపోలేము. అవహేళనలేకాక చివరికి ఇండ్ల కిరాయిలు, సరుకుల ధరలు విపరీతంగా పెంచి లాభాలు ఆర్జించారు.



కాలువలకోసం నీళ్లకోసం, తరిభూములకోసం వలస వచ్చినవారు ముందు తమ కుటుంబాలను ఆ తర్వాత బంధువులను, స్నేహితులను, చివరికి తమ చుట్టుపక్క గ్రామాలవారిని పిలిపించుకొని తమ వలసలను విస్తరించుకొని గ్రామాలకు గ్రామాలనే ఆక్రమించుకున్నారు. స్థానిక గ్రామాల పేర్లకు బదులు గుంటూరుపల్లె, బండారుపల్లె అని తమ ప్రాంతాలలోని స్వంతగ్రామాలపేర్లను ప్రచారంలోకి తేవటంమేగాక కాలనీలని, నగర్‌లని ఆ గ్రామాలకు తోకలను తగిలించుకున్నారు. హైద్రాబాదులో విజయనగర్‌కాలనీ, ఆంధ్రాకాలనీ, ఆశోక్‌నగర్, శాంతినగర్ మొదలగునవి. 'కాలనీ' అన్న పదమే వారి వలస మనస్తత్వాన్ని తెలియచేస్తుంది. పైగా వారు ఇక్కడి ప్రజల్ని ఉద్ధరించటానికి వచ్చినట్లు ఫోజులు కొట్టారు. విజేతల్లాగా ప్రవర్తించారు. కొత్త వ్యవసాయ పద్ధతుల్ని, కొత్త విత్తనాలని, వ్యవసాయ పంటలని తెలంగాణాకు పరిచయం చేసినట్లు ఘనత చాటుకున్నారు. వారు ఈ ప్రాంతాన్ని, ప్రజలను ఉద్ధరించటానికి రాలేదు. ఆంధ్రలో నాలుగెకరాల పొలం ఉన్నవారు ఇక్కడ నలభై ఎకరాలు సంపాదించుకోవటానికి, తమను తాము బాగుపరుచుకోవటానికి మాత్రమే వారు ఇక్కడికి వచ్చారు. వారు ప్రేమించింది ఇక్కడి ప్రజలను కాదు. ఇక్కడి నీటి కాలువలను, పెద్దప్రాజెక్టులను, ఇక్కడి తరిభూములను, అందులోని వ్యాపార పంటలను, లాభాల మూటలను మాత్రమే వారు ప్రేమించారు. సంపాదించిన ఆస్తులతో ఇక్కడి ప్రాంతాలను తిరిగి అభివృద్ధి చేయలేదు. కనీసం విద్యా సంస్థలను కూడా పెట్టలేదు. సామ్రాజ్యవాదుల్లాగా సంపాదించిన ఆస్తులను తమ ప్రాంతాలకు తరలించారు. చివరికి చాలా కాలం తర్వాత తెలంగాణా రైతులు పోటీకి వచ్చేసరికి, నీటిపారుదల సౌకర్యాలు సన్నగిల్లేసరికి వారిలో కొంత మంది పొలాలను అమ్ముకొని బిచాణా ఎత్తివేశారు. వారి దృష్టి నెల్లూరు జిల్లాలోని రొయ్యల చెరువులపై, అది సృష్టించే డాలర్ల సంపదపైపడి 'లాభాల బేహారులు'గా మారి అటువైపు వలస వెళ్లారు. రొయ్యలపంట పేరుతో అక్కడా భూమిని ఇక వ్యవసాయానికి పనికిరాకుండా చేశారు. మరి వారు ఎవరిని ఉద్ధరించినట్లు? తెలంగాణాకు వచ్చిన కుతుబ్‌షాహీలు, ఆసఫ్ జాహీలు కూడా ఈ ప్రాంతం ప్రజల్ని ఉద్ధరించటానికి వచ్చినట్లు వారెన్నడు అనలేదు. ఫోజులు కొట్టలేదు. పైగా ఇక్కడి జనజీవన స్రవంతిలో పాలలో నీళ్లలా కలిసిపోయారు.



www.etelangana.org

ఆహార పంటల్ని పండించి భూమి సారాన్ని కాపాడే తెలంగాణా రైతులకు వ్యాపార పంటల ఆశలను చూపి, కల్తీ విత్తనాలు, రసాయనిక ఎరువులు, మందులతో భూమి సారాన్ని సర్వనాశనం చేసి నత్తగుల్లలు కూడా బ్రతకలేనటువంటి భూములను సృష్టించి, రైతన్నలను ఆత్మహత్యలకు ఎవరు ప్రేరేపించినట్లు? ఎవరు ఎవర్ని ఉద్ధరించినట్లు? ఎవరు ఎవర్ని వాడుకున్నట్లు? లాభాలను, మార్కెట్లను ప్రేమించిందెవ్వరు? మనుషుల్ని, నేలతల్లిని ప్రేమించిందెవ్వరు? మనుషులమని అనుకుంటే గుండెల మీద చెయ్యి వేసుకుని ఆత్మ పరిశీలన చేసుకోవాలి. జంతువులాగా తృప్తిగా జీవించేబదులు మనిషిలాగా అసంతృప్తితో జీవించే ఒక సూఫీ తత్వం, సాధు తత్వం తెలంగాణా ప్రజలది. రాజులనీ, భోగభాగ్యాలనీ తిరస్కరించి కష్టాలని ఏరి కోరి వరించిన పోతన వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న పుడమి పుత్రులు ఈ తెలంగాణా ప్రజలు.

**శ్రీ సదాశివగారి జ్ఞాపకాలు - అనుభవాలు :**

తెలంగాణా ప్రముఖ సీనియర్ సాహితీవేత్త డాక్టర్ సామల సదాశివగారు ఆంధ్రుల వలస, వ్యవసాయ భూముల ఆక్రమణ, రాష్ట్రావతరణం మొదలగు చేదు జ్ఞాపకాలను ఇట్లా చెప్పుకొచ్చారు.

"మా నాయనగారి పేరు సామల నాగయ్యగారు. వారు 1947 లోనే స్కూలు టీచర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. "అవ్వల్ దర్జా" తెలంగాణా అభిమాని. 1948 పోలీసు యాక్షన్ తర్వాత ఆంధ్రా నుండి వలస వచ్చిన సివిల్ అధికారుల ప్రవర్తన, అంతకు ముందే నిజాంసాగర్ క్రింద వ్యవసాయ భూముల్ని అగ్గువసగ్గువకు కొని స్థిరపడిన కోస్తారైతుల ఆధిపత్యం, 1952లో చెలరేగిన గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమం మొదలగునవి అయన్ని బాగా ప్రభావితం చేశాయి. 1953-54 కాలంలో నేను ఆదిలాబాదు జిల్లా లక్సెట్టి పేటలో టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. అప్పటికీ ఆంధ్రా, తెలంగాణా విలీనం ఇంకా జరుగలేదు. రిటైర్ అయిన మా నాయనగారు నాతో పాటే ఉంటున్నారు. ఒక రోజు మా ఇంటికి ఒక ఆంధ్రా పెద్దమనిషి వచ్చాడు. అతిథి ఇంటికొస్తే "తలకాయ కోసి పీటవేసే సంస్కారం" తెలంగాణావారిది. కావున మేము అన్ని మర్యాదలు అతనికి చేశాం. తర్వాత ఆయన అసలు సంగతి బయటపెట్టాడు. అక్కడికి దగ్గరలోనే వున్న సర్‌సిల్క్ ఫ్యాక్టరీకి అతనొక కాంట్రాక్టర్. బాగానే సంపాదించినట్టుంది. లక్సెట్టిపేట



గోదావరీ నదీతీర ప్రాంతం కాబట్టి అక్కడ వ్యవసాయభూములు బాగా లాభదాయకం. వాటిని కొనుక్కుందామన్న ఆశతో ఎకరం ఏ రేటుకు దొరుకుతుందో తెలుసుకుందామని మా ఇంటికి వచ్చాడు. ఆయన మాటలన్నీ లోపలిగదిలో వున్న మా నాయనగారు విన్నారు. అంతే అగ్గిమీద గుగ్గిలమైపోయారు. వాణ్ణి వెంటనే అవతలికి పంపమని నన్ను కోప్పడినారు. అతిథి కదా అట్లా చేస్తే మర్యాదగా ఉండదు అని నేనెంత చెప్పినా వినలేదు. పంపించమని మొండిపట్టు పట్టాడు. ఈ లక్సెట్టిపేట కూడా మన ఊరు కాదు కదా. మనం కాగజ్‌నగర్ వాళ్లం. మన కెందుకు బాధ అని నేను సముదాయించబోయాను. "అయితే ఏం అయ్యింది. ఎక్కడున్నా మనం తెలంగాణా లోపలనే ఉంటం. మనది తెలంగాణా. వాళ్ళు ఈ తెలంగాణా లోపలికి రావొద్దు వస్తే మన భూములన్ని అగ్గువసగ్గువకు కొనుక్కుని మన నెత్తిమీదికే ఎక్కుతరు" అని గడ్‌బడ్ చేశాడు. చివరికి మా నాయిన పోరుపడలేక నేను ఆయనని అర్థాంతరంగానే వెనుకకు పంపించాను.

1969 ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని కూడా మా నాయినగారు చూశారు. "తెలంగాణా వస్తదా" అని కనిపించిన ప్రతి ఒక్కరినీ పదేపదే ఆశతో అడిగేవారు. తెలంగాణా రావాలని బలంగా కోరుకునేవాడు. చివరికి నిరాశతోనే 1972 లో చనిపోయారు. అప్పటికి ఆయన వయస్సు సుమారు 84 సంవత్సరాలు. మా నాయినగారి ఆశ ఇప్పటికీ అట్లనే మిగిలే వుంది. ఆయన పోయి 30 సంవత్సరాలైనా ఇంకా నెరవేరనేలేదు.

ఆదిలాబాదు సీనియర్ సిటీజన్ శ్రీ సదాశివగారు ఇంకా మాట్లాడుతూ ఇట్లా అన్నారు. "1956లో రాష్ట్రావతరణం జరిగిన తర్వాత ప్రతి సంవత్సరం నవంబరు ఒకటవ తారీఖున ఆదిలాబాదు జిల్లా కేంద్రంలోని క్లబ్బులో సాయంత్రం ఒక ఫంక్షన్ జరిగేది. అది అఫీషియల్ ఫంక్షన్. జిల్లా కలెక్టర్ అల్లాయార్‌ఖాన్ కూడా వచ్చేవారు. పట్టణంలోని ఉద్యోగస్తులందరూ దానికి విధిగా హాజరు అయ్యేవారు. అందులో ఒకరిద్దరు ఆంధ్రా అధికారులు కోస్తా ఆంధ్రావారి చరిత్ర, సంస్కృతి, భాషాగొప్పదనాల గురించి ఉపన్యాసాలు ఇచ్చేవారు. నేనెప్పుడూ ఆ పంక్షన్‌కి హాజరుకాలేదు. స్పష్టంగా చెప్పాలంటే బాయ్‌కాట్ చేసేవాణ్ణి.


www.etelangana.org

జిల్లా కలెక్టర్ అల్లాయార్‌ఖాన్ చాలా మంచి మనిషి. నవాబుల ఖాన్‌దాన్‌కి చెందిన వాడు. నా సంగతి గమనించి ఒకసారి "ఆ ఫంక్షన్లకు మీరెందుకు హాజరవుతలేరు" అని ప్రశ్నించాడు. దానికి నేను సమాధానంగా "నవంబరు ఒకటి నా దృష్టిలో బ్లాక్‌డే. అది సంతోషించదగ్గ సంగతికాదు. నిరసనగా దానిని ప్రతి సంవత్సరం నేను బాయ్‌కాట్ చేస్తాను. అది అఫీషియల్ ఫంక్షన్ అయితే కావొచ్చు. హాజరుకావాలని షరతుపెడితే మాత్రం నేను నా ఉద్యోగానికి రాజీనామాకైనా సిద్ధమే కాని హాజరు మాత్రం కాను. నా దృష్టిలో నవంబరు ఒకటవ తారీఖు ఒక బ్లాక్‌డే" అని ఖండితంగా చెప్పాను.

నా మాటలకు ఆయన స్పందిస్తూ "మేరే లియే భీ...... అని అర్థాంతరంగా, అర్థవంతంగా ఆగి నా కళ్ళలోకి చూసి నవ్వాడు". శ్రీ సదాశివగారి, వారి నాయనగారైన శ్రీ నాగయ్యగారి అనుభవాలు, అనగా రెండు తరాలవారి చేదు అనుభవాలు జాగ్రత్తగా పరిశీలిస్తే ఆంధ్రా, తెలంగాణా విలీనానికి ముందు, ఆ తర్వాత రెండు ప్రాంతాల ప్రజల మధ్యన "భావసమైక్యత" ఎంత చక్కగా వర్ధిల్లిందో మనకు తెలుస్తూనే వుంది.

**వలస వెల్లువలో తెలంగాణా :**

సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, భాషా రంగాలలో ఆంధ్రా ప్రాంతం నుండి వచ్చిన వారు తెలంగాణా ప్రజల్ని అనేక విధాలుగా అవమానించారు. తెలుగు రాదని తెలివిలేని వారనీ, ఇంగ్లీషు రాదనీ పరిపాలనలో అసమర్థులనీ, సోమరిపోతులనీ, కట్టుబొట్టు, పండుగలు, ఆచారాలు, ఆహారపద్ధతులు, వ్యవహారాలు అనాగరికమైనవని అవహేళన చేసేవారు. తమ సాంస్కృతిక సామ్రాజ్యవాద తత్వాన్ని, తెలంగాణా ప్రజలపై బలవంతంగా రుద్దారు. పత్రికలు, ప్రచారసాధనాలు, సినిమా రంగంలో తమ ఆధిక్యతను కొనసాగించారు. తెలంగాణా ప్రజలను రెండవ తరగతి పౌరులుగా పరిగణించారు. ఆ వలస వెల్లువ ఉప్పెనలా మారి తెలంగాణా ప్రజలను నిండా ముంచింది. నిట్ట నిలువునా పాతిపెట్టింది.



**ఉద్యోగులలో అసంతృప్తి :**

1965-66 భారత, పాకిస్తాన్ యుద్ధ కాలంలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 10% కోత విధించి పొదుపు చర్యలలో భాగంగా తాత్కాలిక ఉద్యోగులందరిని రాష్ట్ర వ్యాప్తంగా తొలగించింది. తెలంగాణాలో చాలా మంది ఇంజనీర్లు నిరుద్యోగులైనారు. వారంతా మేధావులు కావున పరిస్థితిని అధ్యయనం చేసి తెలంగాణాలో ఉన్న పర్మనెంటు పోస్టులన్నీ ఆంధ్రావారు ఆక్రమించారని, తాత్కాలిక, సూపర్ న్యూమరి పోస్టులన్నీ తెలంగాణావారికి కేటాయించారనీ ఫలితంగా తాము ఉద్యోగాలు కోల్పోయామనీ, తాము ఆక్రమించుకున్న పోస్టులన్ని ఖాళీ చేసి ఆంధ్రాకు వాపసు వెళ్లాలని ఆ పోస్టులలో తిరిగి తమను నియమించాలని పెద్ద ఎత్తున ప్రచారంచేశారు. వాస్తవానికి విలీనం తర్వాత పదోన్నతులు, పేస్కేళ్ల విషయంలో తెలంగాణా ఇంజనీర్లకు చాలా అన్యాయం జరిగింది.

**ఉపాధ్యాయులలో అసంతృప్తి :**

అట్లనే విలీనం తర్వాత పంచాయతిరాజ్ సంస్థల ఆవిర్భావం వలన తెలంగాణాలో అనేక స్కూళ్లు వచ్చాయి. కాని లెక్కలు, సైన్స్ టీచర్ల కొరత ఏర్పడింది. మిగతా పోస్టులకు తెలంగాణా టీచర్లు అందుబాటులో ఉన్నా అన్ని పోస్టులకు జిల్లా పరిషత్తు ఛైర్మెన్‌లను మంచి చేసుకొని అనేక మంది ఆంధ్రావారు తెలంగాణా టీచర్ పోస్టులలో చొరబడ్డారు. వారి సంఖ్య 1967 వచ్చేసరికి 4000లకు చేరుకుంది. ఇక టీచర్ ఉద్యోగాల భర్తీలో స్థంభన వచ్చేసరికి తెలంగాణా నిరుద్యోగ టీచర్లు అసంతృప్తికి గురి అయ్యారు. 1967లో తెలంగాణాలోని మిడిల్ స్కూళ్లలో టీచర్ పోస్టులను మిగులు నిధులను ఉపయోగించి నింపమనేసరికి మిగులు నిధులు లేవని ఆర్థిక శాఖ ప్రకటించి అగ్నికి ఆజ్యం పోసింది.

ఆంధ్ర, తెలంగాణా విలీనం జరుగగానే తెలంగాణాలో ఉన్న ఉద్యోగ ఖాళీలలో ఆంధ్ర ప్రాంతం వారిని ఇష్టం వచ్చినట్లు నియమించారు. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వమన్న నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారు. దొంగ ముల్కీ సర్టిఫికేట్లతో ఉద్యోగాలలో చొరబడ్డారు. ప్రజా ఉద్యోగ చట్టం 1957 (నివాస, నిబంధనలు)లను పూర్తిగా ఉల్లంఘించారు.


www.etelangana.org

విద్యాసంస్థలలో సీట్లన్ని తెలంగాణా విద్యార్థులకే కేటాయించబడ్డప్పటికీ తప్పుడు ముల్కీ సర్టిఫికేట్ల ద్వారా కానీ, ముల్కీ నిబంధనలను ఉల్లంఘించి కానీ ఆ సీట్లన్ని ఆంధ్రా విద్యార్థులకే కట్టబెట్టారు. తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన మిగులు నిధులను ఆంధ్రా ప్రాంతపు అభివృద్ధి కొరకు కేటాయించారు. ఫలితంగా తెలంగాణాలో అభివృద్ధి కుంటుపడింది.

ఉద్యోగస్తుల ప్రమోషన్ల విషయాలలో తెలంగాణా వారికి అన్యాయం జరిగింది. రెండు ప్రాంతాల సివిల్ సర్వీస్ అధికారుల సీనియార్టీలను కలిపి వేసి కామన్ సీనియారిటీ లిస్టులను రూపొందించి ఆంధ్రా ప్రాంతపు (అనగా పూర్వపు మద్రాస్) నియమ నిబంధనలు అమలు చేయటం వలన తెలంగాణా ఉద్యోగస్తులకు ప్రమోషన్లలో తీవ్ర అన్యాయాలు జరిగాయి. హై కోర్టులో పనిచేస్తున్న తెలంగాణాకు చెందిన న్యాయమూర్తులకే పదోన్నతులు, పేస్కేళ్ల విషయంలో అన్యాయం జరిగిందంటే ఇక సామాన్య ఉద్యోగస్తుల సంగతి చెప్పవలసిన పనేలేదు. అన్ని ప్రభుత్వ శాఖలలో పేస్కేళ్లలో వ్యత్యాసాలు పాటించబడ్డాయి. కోర్టులకు వెళ్లి తెలంగాణా ఉద్యోగులు తమకు అనుకూలంగా తీర్పులు తెచ్చుకున్నా వాటి అమలు జరుగలేదు.

**తెలంగాణా మిగులు నిధుల సమస్య :**

1964లో తెలంగాణా ప్రాంతీయ సంఘం ప్రభుత్వానికి ఒక సిఫార్సు చేస్తూ 'అవసరమైతే తెలంగాణా మిగులు నిధుల నుండి అయినా సరే డబ్బు ఖర్చుపెట్టి తెలంగాణా ప్రాంతంలోని సెకండరీ స్కూళ్లలో ఉపాధ్యాయులను భర్తీ చేయాలని' అన్నది. దానికి ప్రణాళిక మరియు ఆర్థిక శాఖ స్పందిస్తూ తెలంగాణాకు మిగులు నిధులు లేవనీ పైగా లోటు ఉన్నదని తన రిపోర్టు ప్రభుత్వానికి పంపింది. (విద్యపై సబ్ కమిటీ ఎనిమిదవ రిపోర్టు అనుబంధం, 25-1-1967). కాని గవర్నర్ గారు అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగిస్తూ 1961-66 మధ్య కాలంలో పేరుకపోయిన తెలంగాణా మిగులు నిధులు మొత్తం 30.54 కోట్లు అని అన్నారు. (సండే స్టాండర్డ్, 24-11-1968 దినపత్రిక). ఈ పరస్పర విరుద్ధ ప్రకటనలతో తెలంగాణా ప్రజలు తీవ్రంగా గాయపడినారు. నిధులు లేవన్న సాకుతో తెలంగాణాలో వున్న ఒకేఒక ప్రాజెక్ట్‌ను మూలకు పడేశారు. (కాని తర్వాత



తెలంగాణా ఉద్యమం తీవ్రమైన కాలంలో పోచంపాడు ప్రాజెక్ట్ బడ్జెట్‌ను అమాంతం రెండింతలు పెంచారు మరియు తెలంగాణా అభివృద్ధి కోసం 9కోట్ల రూపాయలు కేటాయించారు. అంటే దెబ్బకు దయ్యం కూడా జడుస్తుందన్న మాట) సుమారు వందకోట్లు తెలంగాణా మిగులు నిధులు ఉండాలన్న అసంతృప్తి, ఆందోళన కూడా రాబోయే ఉద్యమానికి తోడ్పడింది.

వీటన్నింటినీ చూస్తూ భరిస్తూ తెలంగాణా ప్రాంతీయ సంఘం దిష్టిబొమ్మలాగా మిగిలిపోయింది. ప్రాంతీయ సంఘానికి ఉండవలసిన చట్టపరమైన అధికారాలు దానికి లేకపోవటం ఒక కారణం. చివరకు తెలంగాణా ప్రజల అసంతృప్తి ఆవేదన 1968లో బద్దలై బయటకి వచ్చింది.

**పొగరాజుకుంది - అగ్గి అంటుకుంది :**

తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు తెలంగాణా ప్రజలు నిరసన సమావేశాలను ఏర్పాటుచేయడం ప్రారంభించారు. 1968 జులై 10న తెలంగాణా రక్షణల దినం (Telangana Safeguards Day) పాటించారు. హైద్రాబాదులో జరిగిన ఒక ఉద్యోగుల సమావేశంలో ప్రముఖ కార్మిక సంఘ నాయకుడైన మహాదేవ్ సింగ్ ప్రసంగిస్తూ "తెలంగాణా ప్రజల కోరికను మన్నించనట్లయితే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణా విడిపోవాల్సివస్తుందని" ప్రభుత్వాన్ని హెచ్చరించాడు.

తెలంగాణా ఉద్యోగులు ప్రచురించిన ఒక కరపత్రంలో తెలంగాణా 'జనజీవన ఘోష' ఈ క్రింది విధంగా అద్భుతంగా వ్యక్తమయ్యింది.

"1956కు పూర్వం తమిళదేశంలో ఇమడలేక, తమిళులతో వేగలేక "పెద్ద మనుషుల ఒప్పందం" సాకుతో కాలువల వెంబడి, పొలాల వెంబడి బ్రతకటానికి వలసవచ్చిన కోస్తా ఆంధ్ర వారిని తెలంగాణా ఆదరించి అక్కున చేర్చుకుంది. ఇంటికి చుట్టమొస్తే తలకాయకోసి పీటవేసే సాంప్రదాయం తెలంగాణా ప్రజలది. అందుకే వలస వచ్చిన వారిని "చార్‌సౌసాల్ షహర్" లోని ప్రతి గల్లీ గల్లీ స్వాగతం పలికింది. దోస్తానాతో స్నేహ హస్తం చాచి ఆశ్రయమిచ్చింది. ఆతిథ్యమిచ్చింది. వ్యవసాయంలో, ప్రభుత్వ ఉద్యోగాలలో, పరిశ్రమలలో "సల్లగ బతకండ్రి బిడ్డా"


www.etelangana.org

అని చోటిచ్చింది. ఆ విధంగా తెలంగాణాలో వలసపాలకులు అడ్డా బిఠాయించిండ్రు. పొట్టలు చేతబట్టుకుని వచ్చిన వారే ఇక్కడి ప్రజల పొట్టలు కొట్టటం మొదలు బెట్టిండ్రు. చివరికి ఈనాడు మన ఇంట్లో మనమే పరాయివాళ్లమయిపోయినం. మన తెలంగాణాలో మనమే కాందిశీకులుగా మారిపోయినం.

అన్ని రంగాలలో అన్యాయాలకు గురైనం. పెద్దన్నల పెత్తనానికి, సవతి తల్లి ద్వేషానికి బలైనం. చివరికి మన భాష మన యాస కూడా అపహాస్యాలకు గురైంది. తెలుగురాని వాళ్ళంగా తెలివిలేని వాళ్లంగా ముద్రలు వేయబడ్డం. పనిచేతగాని సోమరిపోతులమని బద్నాం చేయబడ్డం. ఇంగ్లీషు రాని అనాగరికులమని నిందలకు గురైనం.

ఇక ఇప్పుడు మన చరిత్రను మనమే తిరిగి రాసుకుందాం. ఇప్పుడు "ఇసాబ్ - కితాబ్" తెరిచి లెక్కలు తేల్చుకోవల్సిన సమయం దగ్గరకొచ్చింది. అబ్ ఆంధ్రావాలోంకో హర్ ఏక్ పైసా చుకానాహీ పడేగా ! జుఖానే వాలా హైతో సారీ దునియా భీ జుఖ్‌తీ హై ."

## హైస్కూల్ విద్యార్థుల నేపథ్యం :

తెలంగాణాలో మొదటినుండి స్కూల్ విద్యార్థుల సంఘాలు, కాలేజీ విద్యార్థుల సంఘాల మాదిరిగా బలమైన నిర్మాణం కలిగి ఉండేవి. 1952 గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమంలో వీరు చురుకుగా పాల్గొని రాజకీయంగా, నిర్మాణపరంగా చైతన్యవంతంగా ఉండేవారు. 1967లో ప్రభుత్వం పెంచిన స్కూల్ ఫీజులకు వ్యతిరేకంగా తెలంగాణా అంతటా విద్యార్థులు సమ్మె చేసి విజయం సాధించారు. ఆ విజయోత్సాహంతోనే 1967లో ఉస్మానియా యూనివర్సిటి వైస్‌ఛాన్సలర్ పదవికాలంలో ప్రభుత్వ జోక్యానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో కూడా వీరు చురుకుగా పాల్గొన్నారు. ఈ నేపథ్యంతో ఒక సంవత్సరం తర్వాత ప్రారంభమైన ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో వీరు పూర్తి స్థాయిలో పాల్గొన్నారు.



## గాయపడిన బెబ్బులి - డా॥ మర్రి చెన్నారెడ్డి :

ఉత్తరాది దినపత్రికలు చెన్నారెడ్డిని 'ఫైర్ యీటర్'గా పేర్కొనేవి. ఆయన 1967 సాధారణ ఎన్నికలలో అసెంబ్లీకి గెలిచి రాష్ట్ర క్యాబినెట్ మూడవ ర్యాంకు మంత్రిగా చేరిన తర్వాత ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి చివరకు మిగిలిన తన ఏకైక ప్రతిద్వంద్వి చెన్నారెడ్డిని కేంద్రంలో ఉక్కు, గనుల శాఖా మంత్రిగా పంపి చేతులు దులుపుకున్నాడు. ముందు కేంద్ర మంత్రిగా చేరిన తర్వాత ఆయన రాష్ట్రం నుండి రాజ్యసభకు ఎన్నికైనారు. తలనొప్పి వదిలిందనుకున్న బ్రహ్మానందరెడ్డికి అతి త్వరలోనే చెన్నారెడ్డి మళ్ళీ అంతకన్న ప్రమాదంగా మారి దయ్యమై పట్టుకున్నాడు.

తెలంగాణాలో చెన్నారెడ్డికి ప్రధాన ప్రతిద్వంద్వి వందేమాతరం రామచంద్రరావు. 1967 అసెంబ్లీ ఎన్నికలలో చెన్నారెడ్డి ఈయనను ఓడించారు. అయితే ఆ ఎన్నిక చెల్లనేరదని, చెన్నారెడ్డి ఎన్నికలలో అక్రమపద్ధతులకు పాల్పడ్డారని వందేమాతరం రామచంద్రరావు హైకోర్టుకు వెళ్లగా ఏప్రిల్ 26, 1968న హైకోర్టు చెన్నారెడ్డికి వ్యతిరేకంగా తీర్పునిచ్చింది. అతని ఎన్నికను రద్దు చేస్తూ భవిష్యత్తులో ఆరు సంవత్సరాలవరకు ఏ ఎన్నికలలోను పోటీ చేయరాదని ఆదేశించింది. రాజ్యసభ సభ్యుడిగా ఆయన పదవి స్వీకారం ఏప్రిల్ 26న చేయవలసి వుంది. ఆయన కేంద్ర మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేసి హైకోర్టును స్టే కోసం ఆశ్రయించగా ఏప్రిల్ 30న హైకోర్టు స్టే అప్పీలును తిరస్కరించింది. చెన్నారెడ్డి మళ్ళీ సుప్రీం కోర్టుకు పరుగెత్తగా నవంబర్ 68లో అక్కడ కూడా వ్యతిరేకంగానే తీర్పు వచ్చింది. పైగా సుప్రీంకోర్టు అతడిని తీవ్ర పదజాలంతో 'నేరాలలోకెల్లా హీనమైన నేరం' అని వ్యాఖ్యానించింది. కనీసం ఆ ఆరు సంవత్సరాల శిక్షనైనా తగ్గించమని కేంద్ర ఎన్నికల సంఘానికి అప్పీలు చేసుకోగా అక్కడా చుక్కెదురయ్యింది.

తొలిదశ కోర్టు వ్యవహారాలలో ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డి తనకు సహాయం చేసే దశలో ఉండి కూడా కావాలనే తటస్థంగా ఉన్నాడని చెన్నారెడ్డి గాయపడ్డాడు. ఒక ఇంటర్వ్యూలో చెన్నారెడ్డి ఇలా అన్నారు. "బ్రహ్మానందరెడ్డికి సన్నిహితుడనై, కుటుంబ మిత్రులుగా మెలగేవాళ్ళం. కేంద్రంలో ఉక్కుమంత్రిగా ఉండగా లండన్ వెళ్ళినప్పుడు, ఆయన భార్య రాఘవమ్మకు సంబంధించిన


www.etelangana.org

ఎక్స్‌రే ఫోటోలు తీసుకెళ్లి డాక్టర్లను ముందుగా సంప్రదించాను. కాని బ్రహ్మానందరెడ్డి నాకు గోతులు త్రవ్వటం ప్రారంభించాడు". (ప్రసారిక సంచికలో ఎన్.ఇన్నయ్య ఇంటర్వ్యూ).

చివరికి రాజకీయ నిరుద్యోగిగా ఉంటూనే అతి త్వరలో 'కలిసివచ్చిన అదృష్టం' లాంటి తెలంగాణా ఉద్యమంలోకి దూరి బ్రహ్మానందరెడ్డి పై తన పగ తీర్చుకున్నాడు.

ఇట్లా అనేక కారణాల కలయిక, అనేక అసంతృప్తుల కలయిక వలన ప్రత్యేక తెలంగాణా ఉద్యమం 1969లో ఆవిర్భవించింది.

# 1969 ఉద్యమం

# అగ్నిగుండంగా మారిన తెలంగాణా



www.etelangana.org

## వికసించిన విద్యుత్తేజం :

"ఒక జాతిని వేరొక జాతీ,
పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా? ఇకపై సాగదు."

- శ్రీశ్రీ

ఖమ్మం జిల్లా పాల్వంచలోని థర్మల్ పవర్ స్టేషన్‌లో 1969 జనవరి 5న నిప్పురాజుకుంది. తెలంగాణా బొగ్గు, గోదావరి జలాల సహాయంతో నిర్మించిన ఆ విద్యుత్ కేంద్రంలో పనిచేసే ఉద్యోగుల్లో మెజార్టీవర్గం మాత్రం ఆంధ్ర ప్రాంతం వారే. జనవరి పది నుండి నిరాహారదీక్షలు చేయాలని నిర్ణయం జరిగింది. ఉద్యోగులలో తెలంగాణాకాని వారిని వెనుకకు పంపించాలని, తెలంగాణా రక్షణలు అమలు చేయాలని వారి డిమాండ్లు. వారు తెలంగాణా ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడు చొక్కారావుకు ఒక మెమోరాండం కూడా సమర్పించారు. దినసరివేతనం కార్మిక నాయకుడు కృష్ణ నిరాహార దీక్ష ప్రారంభించాడు. ఆ అగ్ని జిల్లా కేంద్రం ఖమ్మం పట్టణానికి వ్యాపించింది.

జనవరి 9న ఆ పట్టణంలో రవీంద్రనాథ్ అనే బి.ఏ. చదువుకుంటున్న విద్యార్థి మరియు నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడు గాంధీచౌక్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించాడు. అతనితో పాటు ఖమ్మం మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు మరియు కవి అయిన శ్రీ కవిరాజమూర్తి కూడా నిరహారదీక్షలో పాల్గొన్నారు. ఆంధ్రా నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, తెలంగాణా రక్షణలను అమలు చేయాలని విద్యార్థులు పెద్ద ఊరేగింపు చేశారు. ఆంధ్ర అని కనిపించిన బోర్డులన్నీ పీకేశారు. ఆంధ్రా బ్యాంక్ మీద దాడి చేశారు. బస్సులపై రాళ్లు రువ్వారు. "తెలంగాణా రక్షణ సమితి" అను సంస్థను స్థాపించి తెలంగాణా అభివృద్ధి కోసం వంద కోట్లు ఖర్చుచేయాలని, పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలనీ, పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణాకు ప్రాముఖ్యత ఇవ్వాలనీ తెలంగాణేతర ఉద్యోగుల్ని వెనక్కి పంపి ఆ స్థానాలలో తెలంగాణా నిరుద్యోగులకు అవకాశాలు కల్పించాలని తీర్మానాలు చేశారు. మరునాడే జనవరి 10న ఆ ఉద్యమం నిజామాబాదుకు పాకింది. విద్యార్థి పరిషత్



www.etelangana.org

అధ్యక్షుడు ఎ.ఎస్. పోశెట్టి నాయకత్వంలో విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలు బహిష్కరించి పట్టణంలో ఊరేగింపు చేశారు. 'నాన్ ముల్కీ గో బ్యాక్' అని నినాదాలు చేస్తూ జిల్లా కలెక్టరుకు, ఎస్.పి.కి మెమోరాండం సమర్పించారు. జూన్ 12న ఖమ్మంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. వార్తలు సరిగా రాయని, రాసినా వక్రీకరించిన దిన పత్రికలను తగులబెట్టారు. విజయవాడ వెళ్లే రైళ్లను ఖమ్మం స్టేషన్‌లో గంటల తరబడి ఆపివేశారు. మరి కొంతమంది నిరాహారదీక్షలో కూచున్నారు.

## ఉద్యమంలోకి ఉరికిన ఉస్మానియా యూనివర్సిటీ :

అదే రోజు హైద్రాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో అన్ని కాలేజీల విద్యార్థి సంఘాల సర్వసభ్య సమావేశం జరిగింది. అందుకు పెద్ద మనుషుల ఒప్పందాన్ని హాస్యాస్పదం చేసిన ప్రభుత్వ వైఖరిని అంతా నిశితంగా విమర్శించారు. తెలంగాణా రక్షణల అమలుకై జనవరి 15 నుండి నిరసన సమ్మె చేయాలని నిర్ణయం చేశారు. మంత్రి వర్గంలోని 9 మంది మంత్రులు మరియు తెలంగాణా శాసనసభ్యులు రాజీనామాలు ఇవ్వాలనీ, తెలంగాణాకు 70 కోట్ల నిధులను విడుదల చేయాలని, తెలంగాణా నిధుల దుర్వినియోగం పై న్యాయవిచారణ జరిపించాలని, పెద్ద మనుషుల ఒప్పందాన్ని తు.చ. తప్పకుండా అమలు పరచాలనీ, ముల్కీ నిబంధనలను ఉల్లంఘించిన వారిని కఠినంగా శిక్షించాలనీ, నాన్ ముల్కీలను వెంటనే వెనకకు పంపించాలని తీర్మానాలు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వెంకట్రామా రెడ్డి సభకు అధ్యక్షత వహించాడు. ఈ సమావేశం జిల్లాలలో కొనసాగుతున్న విద్యార్థి ఉద్యమాలకు తన మద్దతు తెలిపింది. అటు ఖమ్మంలో రవీంద్రనాథ్ నిరవధిక నిరాహారదీక్ష కొనసాగుతున్నది. అతనితో పాటు అనురాధ అనే 9 సంవత్సరాల విద్యార్థిని కూడా నిరహారదీక్ష ప్రారంభించింది. జనవరి 13న ఉస్మానియా యూనివర్సిటీలో "తెలంగాణా విద్యార్థుల కార్యాచరణ సమితి" ఏర్పడింది. మొదటి సారిగా ప్రత్యేక తెలంగాణా మా లక్ష్యం అని విద్యార్థులు ప్రకటించారు. ఆ కార్యాచరణ సమితి మల్లికార్జున్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. అతను మెడికల్ విద్యార్థి. ఆయన విద్యార్థులు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంకావాలని పిలుపు ఇచ్చాడు.



## ఉస్మానియా యూనివర్సిటీలో తెలంగాణా ఉద్యమ నేపథ్యం :

1967లో ఎన్నికలు జరిగిన తర్వాత కాసు బ్రహ్మానందరెడ్డి బలమైన ముఖ్యమంత్రిగా స్థానం సంపాదించుకున్నాడు. దీనికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి వామపక్షపార్టీలైన సి.పి.ఐ. మరియు సి.పి.యం.లు ఎన్నికలలో ఒకరినొకరు ఓడించుకొని కాంగ్రేస్ పార్టీని సంపూర్ణ మెజార్టీతో గెలిపించాయి. రెండవది అంత వరకు కాంగ్రేస్ పార్టీలో ముఖ్యమంత్రి వర్గానికి వ్యతిరేక గ్రూపు నాయకుడైన ఎ.సి.సుబ్బారెడ్డి మరణించడంతో మరియు మరోప్రతిద్వంద్వి చెన్నారెడ్డి రాష్ట్ర రాజకీయాలకు దూరంగా ఢిల్లీలో కేంద్ర మంత్రిగా ఉండటం వలన ముఖ్యమంత్రి, పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ బలమైన నాయకుడిగా స్థిరపడినారు. రాష్ట్రంలో ఆయనకు ఎదురేలేదు కాని ఉస్మానియా యూనివర్సిటీలో మాత్రం ఆయనకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం బయలుదేరింది. అందులోనుండి వచ్చిందే ప్రత్యేక తెలంగాణా ఉద్యమం.

అప్పటి సంగతులను ఉస్మానియా యూనివర్సిటి రాజనీతి శాస్త్రం రిటైర్డ్ ప్రొఫెసర్ డా॥ ఎన్.జి. రాజూర్కర్‌గారు ఇలా చెప్పారు :

"1967లో ఉస్మానియా యూనివర్సిటి వైస్‌ఛాన్సలర్ డా॥ డి.ఎస్. రెడ్డిగారు అతను ఆంధ్రా ప్రాంతానికి చెందినవారు. అప్పటికే వైస్ ఛాన్సలర్‌గా రెండు టర్మ్‌లు పనిచేసి మూడవ టర్మ్‌లోకి ప్రవేశించారు. మొదటిసారి అతని నియామకం 1957లో జరిగినప్పుడు మెజార్టీ విద్యార్థులు, అధ్యాపక వర్గం ఆ నియామకాన్ని వ్యతిరేకించి తెలంగాణావారికే ఆ పదవి ఇవ్వాలని ఉద్యమించారు. 1952 గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమ నేపథ్యం నుండి వారు ఆ డిమాండ్ చేశారు. ఐనా అతనే నియమించబడి మూడవ టర్మ్‌లోకి ప్రవేశించారు. అయితే 1967లో ముఖ్యమంత్రిగారికి వైస్‌ఛాన్సలర్‌తో ఏవో కారణాల వలన పొత్తు కుదరక ఒక కొత్త చట్టాన్ని తీసుకవచ్చి ఆ పదవి కాలాన్ని ఐదు సంవత్సరాలనుండి మూడు సంవత్సరాలకు కుదించి డి.ఎస్.రెడ్డిని తొలగించి ఆ స్థానంలో డా॥ నర్సింహారావును కొత్త వి.సి.గా నియమించారు. విశ్వవిద్యాలయం ప్రత్యేక ప్రతిపత్తిలో ప్రభుత్వ రాజకీయ జోక్యం తగదని మెజార్టీ విద్యార్థులు మరియు అధ్యాపక వర్గం ఉద్యమించింది. జైపాల్ రెడ్డి నాయకత్వంలో విద్యార్థులు


www.etelangana.org

ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా సమ్మెచేసారు. డి.ఎస్.రెడ్డిగారు కోర్టుకు వెళ్ళి తనకు అనుకూలంగా తీర్పుతెచ్చుకొని మళ్ళీ పదవిలో కొనసాగారు. అట్లా ముఖ్యమంత్రికి మొదటి ఎదురు దెబ్బ ఉస్మానియా యూనివర్సిటిలోనే తగిలింది. ఆ తర్వాత 1968లో జరిగిన యూనివర్సిటి విద్యార్థి సంఘం ఎన్నికలలో ముఖ్యమంత్రిని వ్యతిరేకించే విద్యార్థి వర్గం మెజార్టీ స్థానాలను సంపాదించుకుంది. వీరే తర్వాత కాలంలో ప్రత్యేక తెలంగాణా ఉద్యమ నిర్మాతలు. జైపాల్‌రెడ్డి మాత్రం ముఖ్యమంత్రికి దగ్గరై సమైక్యతావాదిగా మారిపోయారు. ఇదీ ఉస్మానియా యూనివర్సిటిలో తెలంగాణా ఉద్యమ నేపథ్యం.

విద్యార్థుల కార్యాచరణ సమితి ఏర్పాటుతో విద్యార్థులలో రెండు వర్గాలు ఏర్పడినాయి. వెంకట్రామిరెడ్డి నాయకత్వంలోని గ్రూపు కేవలం తెలంగాణా రక్షణల అమలుకు మాత్రమే పరిమితం. కాని వారి లక్ష్యం రాష్ట్ర సమైక్యత. ఈ గ్రూపులో త్వరలోనే సి.పి.ఐ. కి చెందిన విద్యార్థి ఫేడరేషన్ వారు చేరి దాన్ని బలంగా నిర్మించి ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి కౌంటర్ ఉద్యమాన్ని నడిపారు. ఈ విధంగా విద్యార్థులు సేఫ్‌గార్డ్ మరియు సపరేటిస్టులు అని రెండు గ్రూపులుగా చీలిపోయారు. క్రమంగా నగరవాతావరణం రాజకీయంగా వేడిని పుంజుకుంది.

**ఊపందుకున్న ఉద్యమం :**

జనవరి 13న నగరంలో పురప్రముఖులందరు ఒక సమావేశం ఏర్పాటుచేసి "తెలంగాణా పరిరక్షణల కమిటీ"ని స్థాపించారు. దాని చైర్మన్ కాటం లక్ష్మినారాయణ, స్వాతంత్ర్య సమరయోధులు. మిగతా సభ్యులు మహాదేవ్ సింగ్ (సోషలిస్టు పార్టీ), సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ (మజ్లీస్), ఇ.వి. పద్మనాభన్ (కార్పొరేటర్), సంతపురి రఘువీరరావ్ (వకీలు), ఎన్.మాధవరావు, జాఫర్‌హుస్సేన్ మొదలగువారు. వీరు విద్యార్థుల ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. జనవరి 15న విద్యార్థుల క్లాసుల బహిష్కరణ సమ్మె విజయవంతమయ్యింది. స్కూలు విద్యార్థులు కూడా సమ్మెలో చేరారు. నిజాం కాలేజీ నుండి కోఠీ వరకు పెద్ద ఉరేగింపు బయలుదేరింది. కోఠీలో బహిరంగ సభ జరిగింది. మల్లికార్జున్, పుల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పులివీరన్న, గోపాల్, మదుసుధన్‌రెడ్డి మొదలగు విద్యార్థినాయకులు ఆ సభలో ఆవేశపూరిత ప్రసంగాలు చేశారు. ఆఖరిలో 9 మంది తెలంగాణా మంత్రుల దిష్టి బొమ్మలను దహనం చేశారు.



ఆ రోజు పాల్వంచలో ఉద్యమం తీవ్రం అయ్యింది. ఆ విద్యుత్ కేంద్రంలో పనిచేసే తెలంగాణా ఉద్యోగులు తెలంగాణా రక్షణల అమలు కోసం హై కోర్టుకు వెళ్ళగా ముల్కీ నిబంధనలు అటానమస్ సంస్థలకు, కార్పొరేషన్లకు వర్తించవని తీర్పువచ్చింది. దానితో వారి మనోభావాలు తీవ్రంగా గాయపడినాయి. ఇక తెలంగాణా రక్షణలు కాదు, ప్రత్యేక తెలంగాణా కావాలనే నిర్ణయానికి వారు వచ్చారు. ఆంధ్రాప్రాంతం ఉద్యోగులు నివసించే కాలనీలలోని ఇళ్లకు నీరు, విద్యుచ్ఛక్తి సరఫరాలు బందు చేశారు. నాన్ ముల్కీలు గో బ్యాక్ అని ఉరేగింపు చేశారు. బాధితులు తమ కుటుంబాలను భయాందోళనలతో ఆంధ్రకు తరలించ ప్రారంభించారు. ఖమ్మంలో రవీంద్రనాథ్ ఆరోగ్యం క్షీణిస్తుండటంతో అక్కడి శాసనసభ్యుడు జలగం వెంగళరావు ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలని ప్రకటన చేశాడు. తెలంగాణాలోని మిగతా జిల్లాలలో ఉద్యమం ఊపందుకుంది.

జనవరి 16న రెండు వర్గాల విద్యార్థులు నగరంలో వేరువేరు ఉరేగింపులు జరిపారు. ప్రత్యేక తెలంగాణాను కోరే విద్యార్థుల కేంద్రస్థానం నిజాం కాలేజి. కేవలం తెలంగాణాకు రక్షణలు కోరే విద్యార్థుల కేంద్రస్థానం కోఠీలోని వివేకవర్ధని కాలేజి. సపరేటిస్టుల ఉరేగింపు నిజాం కాలేజీ నుండి బయిలుదేరి సచివాలయానికి వెళ్లి అక్కడ గంటల తరబడి ధర్నా చేసింది. సచివాలయం దిగ్బంధనమయ్యింది. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను తగులబెట్టారు. పోలీసులు సచివాలయానికి వెళ్లే రోడ్లపై ఎన్ని ఆంక్షలు విధించినా, గస్తీపెట్టినా విద్యార్థులు వందల సంఖ్యలో జమ అయ్యారు. సేఫ్‌గార్డు విద్యార్థుల ఉరేగింపు వివేకవర్ధని కాలేజీ నుండి నిజాం కాలేజీకి వెళ్లింది. రక్షణల విషయంలో తెలంగాణా మంత్రుల మౌనం పై ఈ వర్గం కూడా ఆగ్రహం ప్రదర్శించి వారి దిష్టిబొమ్మల్ని తగులబెట్టింది. సచివాలయం గేటు దగ్గర జరిపిన సభలో మల్లికార్జున్ మాట్లాడుతూ ఈ ఉద్యమం ఆంధ్రులకు వ్యక్తిగతంగా వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ డి.ఎస్. రెడ్డి ఒక ప్రకటన చేస్తూ విద్యార్థులు ఉద్యమం విరమించి క్లాసులకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ఆయన సలహాను పాటించలేదు.


www.etelangana.org

**తొలి లాఠీచార్జీ :**

జనవరి 18 న నగరంలో మొదటి సారి పోలీసు లాఠీచార్జీ జరిగింది. బాష్పవాయువు ప్రయోగించారు. ఆ రోజు మల్లికార్జున్, శ్రీధర్ రెడ్డి నాయకత్వంలో 'సపరేటిస్టు' విద్యార్థులు నిజాం కాలేజీ నుండి పెద్ద ఊరేగింపుగా బయలుదేరి కోఠీ వైపు వెళ్లుతున్నారు. ఊరేగింపు ఆబిడ్స్ చౌరస్తాలోకి రాగానే దానికి ఎదురుగా 'సేఫ్‌గార్డ్స్' విద్యార్థుల ఊరేగింపు వచ్చింది. వారు కోఠీ నుండి బయలు దేరి అబిడ్స్‌కు వస్తున్నారు. ఆ ఊరేగింపుకు వెంకట్రామ రెడ్డి మరియు విద్యార్థి ఫెడరేషన్ నాయకుడు సదానంద్ నాయకత్వం వహించారు. సదానంద్ మంచి వక్త. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ బాషలలో అనర్గళంగా ఉపన్యసించే శక్తి అతనికుంది. పైగా స్థానికుడు. అతను తన సహచరులను రెచ్చగొట్టటంవల్ల వాతావరణం ఉద్రిక్తమయ్యింది. ఇరు వర్గాల వారు నినాదాలు చేసుకుంటూ ముందుకు తోసుకువస్తున్నారు. పోలీసులు ప్రమాదాన్ని పసిగట్టి ఆబిడ్స్ చౌరస్తాలో రెండు గ్రూపులకు మధ్య బారికేడ్లలాగా నిలుచున్నారు. రెండు వైపుల నుండి నినాదాలతో దిక్కులు మారుమ్రోగుతున్నాయి. ఎవరూ వెనక్కి వెళ్లటం లేదు. ఈలోగా ఎవరో ఏమూల నుండో రాళ్లువిసిరారు. రెండు వర్గాల గుంపులు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. పోలీసుల చేతుల్లో ఉన్న లాఠీలను గుంజుకుని ఒకరినొకరు కొట్టుకున్నారు. అప్పుడు పోలీసులు లాఠీ చార్జీ చేస్తూ టియర్‌గ్యాస్ వదిలారు. గుంపులు రెడ్డీ హాస్టల్ వైపు, సాగర్‌టాకీస్ వైపు పరుగులు తీశాయి. ఆ లాఠీ చార్జీలో ఆర్ట్స్ కాలేజి అధ్యక్షుడు రమాకాంత్ రెడ్డి తీవ్రంగా గాయపడినాడు. తలకు అనేక కుట్లు పడ్డాయి. పులివీరన్నకు కూడా తలపగిలింది. అతను లా కాలేజీ విద్యార్థి.

తెలంగాణా ఉద్యోగులు హైద్రాబాదు నగరంలో ఒక సమావేశం జరిపి తెలంగాణాలో పని చేస్తున్న ఆరు వేల మంది నాన్ ముల్కీలను ఆంధ్రాకు వెనుకకు పంపకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ప్రభుత్వానికి అల్టిమేటమ్ ఇచ్చారు.

దీనికి తోడు రాష్ట్ర శాసనసభలోని ఐదు ప్రతిపక్ష పార్టీలైన భారతీయ జనసంఘ్, మజ్లీస్, సంయుక్తసోషలిస్టు పార్టీ మరియు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఒక ప్రకటన చేస్తూ ఒక వేళ ముఖ్యమంత్రి చొరవ తీసుకోక పోతే తాము కూడా విద్యార్థులతో కలిసి తెలంగాణా రక్షణల అమలు కోసం ఉద్యమిస్తామని హెచ్చరించారు.



పరిస్థితి చేయిదాటిపోయిందని గమనించిన ముఖ్యమంత్రి, బ్రహ్మానందరెడ్డి మరునాడే అనగా జనవరి 19న ఒక అఖిల పక్ష సమావేశాన్ని నగరంలో ఏర్పాటు చేశారు. అందులో రెండు ప్రధాన సమస్యలు చర్చించబడ్డాయి. తెలంగాణాలో ముల్కీ నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న ఆంధ్రా ఉద్యోగులను వెనక్కు పంపటం మరియు తెలంగాణా మిగులు నిధులెన్నో లెక్క తేల్చి చెప్పటం. మిగులు నిధుల లెక్క తేల్చటానికి ఒక సీనియర్ అధికారిని నియమిస్తామని, తెలంగాణాలో పని చేస్తున్న ఆంధ్ర ఉద్యోగుల్ని వెనకకు పంపిస్తామని తెలంగాణా రక్షణలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి హామి ఇచ్చి విద్యార్థులను ఆందోళన విరమించమని విజ్ఞప్తి చేశారు. ఆ వాగ్దానాన్ని నమ్మే ప్రసక్తేలేదని ప్రత్యేక తెలంగాణానే తమ ధ్యేయమని మల్లికార్జున్ ప్రకటించారు.

ఈ అఖిల పక్ష ఒప్పందంపై సంతకాలు చేసినవారిలో కొందరు తెలంగాణా ఉద్యమం ఉధృత స్థాయికి వచ్చేవరకు మెల్లగా జారుకున్నారు. అఖిలపక్షపు ఒప్పందం ప్రకారం లెక్కలు తీస్తే తెలంగాణా ప్రాంతంలో 4,500 మంది గైర్ ముల్కీలు పనిచేస్తున్నట్లు తేలింది. వారిని ఆంధ్ర ప్రాంతానికి తరలించటానికి జి.వో. తీసుకరాగా హైకోర్టు మరియు సుప్రీం కోర్టు అడ్డుకున్నవి. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకై ముఖ్యమంత్రి తెలంగాణాకు ప్రత్యేకంగా 2000 ఉద్యోగాలు కొత్తగా కల్పించాడు.

అఖిలపక్షపు ఒప్పందంలోని రెండవ అంశం తెలంగాణా మిగులు నిధులు. కుమార్ లలిత్ లెక్కలు తీస్తే ఇవి 34.10 కోట్లు వచ్చింది. భార్గవ్ కమిటి తేల్చిన నిధులు 28.34 కోట్లు. (ఈ రిపోర్టు మాత్రం ప్రచురణకు నోచుకోలేదు.)

**తొలి పోలీసు కాల్పులు :**

జనవరి 20 సోమవారం నాడు శంషాబాదులో పాఠశాల విద్యార్థులపై పోలీసు కాల్పులు జరిగాయి. ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో ఇవే మొదటి పోలీసు కాల్పులు. రైల్వేస్టేషన్ పై దాడి చేసిన విద్యార్థి గుంపుల్ని చెదరగొట్టటానికి కాల్పులు జరిగాయి. 5 గురు విద్యార్థులు గాయపడ్డారు. వారి వయస్సు 11-16 సంవత్సరాల మధ్య ఉంటుంది.


www.etelangana.org

ఇంత జరుగుతున్నా తెలంగాణా మంత్రులు, శాసన సభ్యులు మాత్రం మౌన ప్రేక్షకుల పాత్ర వహించారు.

జనవరి 21న కోపోద్రిక్తులయిన నగర విద్యార్థులు శంషాబాదు కాల్పుల్ని ఖండించటానికి నిజాం కాలేజీలో నిరసనసభ జరిపారు. సుమారు 2 వేల మంది విద్యార్థులు ఆ సభకు హాజరయ్యారు. నిజాం కాలేజీ మైదానంలో సభ జరిగింది. ఎవరి నోటనైనా "పోలీస్ జులుం బంద్ కరో" అన్న నినాదమే. గోపాల్ చాలా ఆవేశపూరితంగా ఉపన్యసించేవాడు. అతని ఉపన్యాసం నడుస్తున్నపుడు కాల్పులలో గాయపడ్డ విద్యార్థి ఒకరు ఉస్మానియా హాస్పిటల్‌లో మరణించాడన్న వార్త వ్యాపించింది. అది కేవలం పుకారు అని తర్వాత తెలిసింది. విద్యార్థులలో కోపం, ఆవేశం కట్టలు తెగింది. సభ అయిపోగానే విద్యార్థులు కాలేజీ మెయిన్ గేటు వద్దకు పోలీసు జులుం బంద్ కరో అంటూ నినాదాలు చేస్తూ ముందుకు దూసుకువచ్చారు. రోడ్డు మీద ఫతేమైదాన్ ముందు పూర్తిగా పోలీసు బందోబస్తు ఉంది. ఈలోగా కాలేజీ లోపల్నుండి పోలీసులున్న వైపు రాళ్లు, ఇటుకముక్కలు విసురబడసాగాయి. నాయకులు ఎంత వారిస్తున్నా విద్యార్థుల నినాదాలు, రాళ్లురప్పల వర్షం ఆగలేదు. ఒకరిద్దరు పోలీసులకు తలలు పగిలాయి. పరిస్థితిని గమనించి పోలీసులు అవతలనుండి కాలేజిలోకి బాష్పవాయివు గోళాలను వదిలారు. కొందరు విద్యార్థులు మండుతున్న ఆ గోళాలను పట్టుకుని తిరిగి పోలీసులవైపు విసిరికొట్టారు. మరి కొందరు ఆ గోళాలను చేత్తో పట్టుకుని అక్కడే ఉన్న నీళ్ల తొట్టిలోకి విసిరేశారు. ఆ నీళ్లతొట్టిలోనే దస్తీలను తడుపుకుని కళ్లకు అద్దుకుంటూ బాష్ప వాయువులను లెక్కచేయకుండా పోలీసుల వైపు రాళ్లను విసరసాగారు. ఇక తప్పనిసరై పోలీసులు కాలేజిలోకి దూసుకొచ్చారు. విచక్షణా రహితంగా లాఠీ చార్జీ చేశారు. చాలా మందికి కాళ్లు చేతులు విరిగాయి. తలలు పగిలాయి. రెండో వైపు గేటులో నుండి తప్పించుకుని పారిపోదామని ప్రయత్నిస్తే పోలీసులు ఆ గేటువైపు నుండి కూడా లోపలికి దూసుకొచ్చారు. ఆ తొక్కిసలాటలో విద్యార్థులు సైకిలు స్టాండుకు సంబంధించిన ముళ్లకంచె, ఇనుప సీకులపై పడిపోగా అనేక మందికి తీవ్రగాయాలయ్యాయి. గత్యంతరం లేక చాలా మంది గోడలు దూకి అవతల కింగ్‌కోఠీ రోడ్డువైపు పారిపోయారు. పోలీసులు విద్యార్థులనేకాక కాలేజీలో పనిచేసే సిబ్బందిని కూడా చితకబాదారు. లాబ్‌లలో



పని చేసే ఐదుగురు అటెండెర్లకు తీవ్ర గాయాలైనాయి. శ్రీధర్ రెడ్డి, పుల్లారెడ్డి, పులి వీరన్న, మధుసూదన్ రెడ్డిలతో సహా మొత్తం 34 మందిని నిర్బంధంలోకి తీసుకున్నారు.

**ఆంధ్రా ఉద్యోగులను వెనక్కి పంపే జి.వో. జారీ :**

ఈ కాలంలోనే ఉద్యమ ఉధృతిని గమనించిన కేంద్ర ప్రభుత్వం జస్టిస్ భార్గవ అధ్యక్షతన ఒక కమిటీని నియమించి తెలంగాణా మిగులు నిధుల లెక్కలు తేల్చమని ఆదేశించింది. కాని ఆ కమిటీ రిపోర్టు సమర్పించినా అది ప్రచురణకు నోచుకోలేదు. తర్వాత కాలంలో కూడా కేంద్ర ప్రభుత్వం జస్టిస్ వాంఛూ అధ్యక్షతన మరో కమిటీని నియమించి తెలంగాణా ప్రజలకు ప్రత్యామ్నాయ ఉద్యోగ అవకాశాలను సూచించమని ఆదేశించింది. ఆ రిపోర్టును కూడా తొక్కి పెట్టారు.

జనవరి 22న తెలంగాణా రక్షణలను అమలు చేయటానికి ప్రభుత్వం ఉత్వర్వులు ఇస్తూ ఒక జి.వో. ను జారీచేసింది. దాని ప్రకారం వచ్చే నెల ఫిబ్రవరి 28లోగా నాన్ ముల్కీ ఉద్యోగులను వాపస్ పంపిస్తామని, జి.వో.ను నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామనీ, హెచ్చరికలు చేశారు. తెలంగాణా మిగులు నిధుల పరిశీలన కోసం ఢిల్లీ నుండి ఒక బృందం వస్తున్నదని కూడా తెలిసింది. ఈ హామీలను దృష్టిలో పెట్టుకుని ఖమ్మంలో రవీంద్రనాథ్ తన 17 రోజుల నిరవధిక నిరాహారదీక్షను వెంకట్రామా రెడ్డి, విద్యార్థి నాయకుడి చొరవతో విరమించాడు. దీని వెనుక జలగం వెంగళరావు కృషి కూడా ఉంది. దీనితో ఒక వర్గం విద్యార్థులు చేసే తెలంగాణా రక్షణల అమలు ఉద్యమం చల్లారి పోయింది.

ఇదే రోజు ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థులకు సానుభూతిగా ఒక రోజు సమ్మె చేశారు. అడ్మినిస్ట్రేటీవ్ భవనం ముందు వారు ప్రదర్శనలు చేశారు. ఆరోజు మొదలు నిజాం కాలేజి నుండి ఉద్యమ వేదిక శాశ్వతంగా యూనవర్సిటీ క్యాంపస్‌లోకి మారింది. విద్యార్థులంతా సిబ్బందితో కలిసి ప్రదర్శనలు చేశారు. వైస్ చాన్స్‌లర్ గారి హెచ్చరికలను వారు బేఖాతరు చేశారు.


www.etelangana.org

**తొలి అమరవీరుడు శంకర్ :**

జనవరి 24న సదాశివపేటలో కాల్పులు జరిగాయి. 14 మందికి గాయాలయ్యాయి. ఈ కాల్పులలో గాయపడి మరునాడు గాంధీ హాస్పిటల్‌లో చనిపోయిన యువకుని పేరు శంకర్. అతని వయస్సు17 సంవత్సరాలు. ఇతను 1969 తెలంగాణా ఉద్యమంలో తొలి అమరుడు. సదాశివపేటలో అతని అంత్యక్రియలలో మూడు వేల మంది ప్రజలు పాల్గొన్నారు. గాయపడిన వారినందరినీ సికింద్రాబాదు గాంధీ ఆసుపత్రిలో చేర్చారు. మరునాడు 25న ఇంజనీరింగ్ కాలేజీ వద్ద విద్యార్థుల సభ జరుగుతున్నపుడు "గాయపడిన వారు చావు బ్రతుకుల్లో ఉన్నారు. వారికి ఎక్కించటానికి ఆసుపత్రిలో రక్తం లేదు" అన్న వార్త అందింది. ఆ వార్త వినగానే విద్యార్థులు అర్థాంతరంగా సభను ముగించి, గుంపులు గుంపులుగా పరిగెత్తుకుంటూ గాంధీ ఆసుపత్రికి చేరుకుని రక్తదానాలు చేశారు. ప్రాణదానాలు చేశారు. ఆరోజుల్లో విద్యార్థులకు స్కూటర్లు, సైకిలు మోటార్లు ఉండేవి కావు. అప్పటికి రోడ్డుపై ఇంకా ఆటోలు ఎక్కువ లేవు. వారంతా యూనివర్సిటి నుండి సికింద్రాబాదులోని గాంధీ ఆసుపత్రి వరకూ పరిగెత్తే దృశ్యం ఒక అపూర్వసన్నివేశం. ఆ విద్యార్థుల త్యాగం, మానవత్వాన్ని దినపత్రికలన్నీ ప్రశంసించాయి.

ఆ రోజే హైకోర్టులో నాన్ ముల్కీ ఉద్యోగులను ఆంధ్రప్రాంతానికి బదిలీ చేసే జి.వో. పై ఒక రిట్ పిటీషన్‌ను ఆంధ్రా ఉద్యోగులు వేశారు. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులైన 14, 16 ఆర్టికల్స్‌కు ఆ జి.వో. వ్యతిరేకమైనదని వాదనలు ప్రారంభమైనాయి. జి.వో. వచ్చిన మూడవ రోజునే దానిపై రిట్ వేయడం గమనించదగిన అంశం.

తెలంగాణా అంతటా నిరాహారదీక్షలు, సమ్మెలు కొనసాగుతున్నాయి. జమ్మికుంటలో ఆంధ్ర ఉద్యోగులను విద్యార్థులు ఘెరావ్ చేశారు. తెలంగాణా మంత్రులందరికి గాజులను బహుమతులుగా పంపించారు.

జనవరి 27న మార్చి మొదటి వారంలో హైద్రాబాదులో తెలంగాణా సదస్సు ఏర్పాటు చేయాలని విద్యార్థి కార్యాచరణ సమితి నిర్ణయించింది. అందుకోసం 35 మంది విద్యార్థి నాయకులంతా తెలంగాణా జిల్లాలలో విస్తృత పర్యటనలకు



బయలుదేరారు. ఆ రోజు నల్లగొండ పట్టణంలో ఉప సర్వేయర్‌గా పనిచేస్తున్న రంగాచార్యులు అను ఆంధ్రా ఉద్యోగిని గుర్తు తెలియని వారు రాత్రిపూట అతని ఇంటికివెళ్ళి పెట్రోల్ పోసి తగులబెట్టారు. మరునాడు అతను చనిపోయాడు. దానితో ఆంధ్రులలో భయాందోళనలు చెలరేగాయి. ఫలితంగా జి.వో.కు వ్యతిరేకంగా ఆంధ్రా ప్రాంతంలో కౌంటర్ ఉద్యమం బయలుదేరింది. రైళ్లపై దాడులు చేశారు. రాజధాని హైద్రాబాదు నుండి ఆంధ్రకు మార్చాలని డిమాండ్ బయలుదేరింది. ఆందోళన శృతిమించి నాగార్జున సాగర్‌లోని విజయపురిలో పోలీసు కాల్పులు జరిగి ఒక విద్యార్థి మృతి చెందగా మరొకరు గాయపడినారు.

**పోరుగల్లుగా మారిన ఓరుగల్లు - కాళోజీ డిమాండ్ :**

"ప్రతి ఇల్లు రాజకీయపు బడిగా రూపొందు
ప్రతి అర్భకున్ని యోధను చేసినాము
అన్ని భాషలవారికి ఆమోదయోగ్యంగా అంగుష్టముద్రలు అర్పించినాము
బడియందు నిలబడు అలవాటు గలవాన్ని
నిలిపి ఎన్నికల గెలిపించినాము"

- కాళోజీ 'షాద్' రామేశ్వరరావు

జనవరి 28న వరంగల్‌లో కాళోజీ నారాయణరావు గారి అధ్యక్షతన తెలంగాణా విమోచనోద్యమ సమితి సదస్సు జరిగింది. ముఖ్యమంత్రి రాజీనామా చేయాలనీ, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలనీ తీర్మానాలు చేశారు. మరునాడు వరంగల్, నిజామాబాదు పట్టణాలలో పెద్ద ఎత్తున అల్లర్లు జరిగాయి. వరంగల్ పట్టణంలో ఆంధ్ర ప్రాంతంవారి దుకాణాలు, మిల్లులను ఆవేశపూరితంగా ఉన్న ప్రజలు తగులబెట్టారు. విలీనానికి ముందే ఎక్కువగా వలసలు జరిగిన జిల్లాలు ఇవే. మంటలను ఆర్పటానికి ఫైర్ ఇంజన్లు వచ్చాయి. కాని త్రాగేనీటికే కొరత ఉన్న వరంగల్‌లో మంటలను ఆర్పటానికి నీళ్లు లభించలేదు. హైద్రాబాదుతో సహా అనేక జిల్లాలలో అల్లర్లు వ్యాపించాయి. జి.వో.కు వ్యతిరేకంగా ఆంధ్రాలో ఉద్యమం తీవ్రమయ్యింది. నందిగామ ప్రజలు గుంపులు గుంపులుగా లారీలలో బయలుదేరి రాళ్లు రప్పలు కట్టెలతో కోదాడ మీదికి దాడి చేశారు. ఆ రెండు గ్రామాల ప్రజలు ముఖాముఖీ యుద్ధం చేసుకున్నారు. ప్రభుత్వం శాంతి రక్షణ


www.etelangana.org

చర్యల కోసం హైద్రాబాదు, నల్లగొండ, వరంగల్, కోదాడ, కొత్తగూడెం, విజయవాడ, గుంటూరు, వైజాగ్‌లలో సైన్యాన్ని దింపింది. సైన్యం ఆ పట్టణాలలో ఫ్లాగ్ మార్చ్‌లను నిర్వహించింది. శ్రీ వెంకటేశ్వర, ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులు ఆ జి.వో.ను రద్దు చేయాలని, సమైక్యాంధ్ర కొనసాగాలని ఉద్యమం ప్రారంభించారు. అనేక పట్టణాలలో బంద్‌లు నిర్వహించారు.

జనవరి 30న గజ్వేల్‌లో కాల్పులు జరిగాయి. నర్సింహ్మలు అనే 12 సంవత్సరాల 7వ తరగతి విద్యార్థి ఆ కాల్పులలో మరణించాడు.

ఉద్యమం శాంతియుతంగా నడపాలని విద్యార్థులను కోరుతూ నగరంలో మల్లికార్జున్ ఒక ప్రకటన చేశారు.

జనవరి 31న హైకోర్టులో జి.వో.కు వ్యతిరేకంగా మరొక రిట్ దాఖలు చేశారు. 5గురు తెలంగాణా ఉద్యోగినులు ఆ రిట్ వేశారు. తమ భర్తలు ఆంధ్రావారనీ, ఆ జి.వో. అమలులోకి వస్తే తమ కుటుంబాలు దెబ్బతింటాయని వారి వాదన. చివరికి ఫిబ్రవరి 3న ఆ జి.వో. రాజ్యంగ విరుద్ధమని, అందులోని 3వ సెక్షన్ ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని హైకోర్టు తీర్పునిస్తూ ఆ జి.వో.ను కొట్టివేసింది. వెంటనే మరునాడే రాష్ట్ర ప్రభుత్వం ఆ తీర్పు పై మరో పిటీషన్ వేయగా హైకోర్టు ఆ తీర్పు పై స్టే ఇచ్చి తదుపరి విచారణకు డివిజన్ బెంచీని ఆదేశించింది. ఫిబ్రవరి 18న సుప్రీం కోర్టు కూడా ఆ జి.వో. అమలు పై స్టే ఇచ్చి ఉద్యోగులను ఆంధ్రా ప్రాంతానికి వాపసు చేయరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఫిబ్రవరి 20న హైకోర్టు మరో తీర్పునిస్తూ ముల్కీ నిబంధనలు రాజ్యాంగ సమ్మతమేనని అయితే నాన్ ముల్కీ ఉద్యోగులను వెనుకకు పంపకుండా వారికి ఉన్న చోటునే సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. నాన్ ముల్కీలు తెలంగాణాలో సూపర్ న్యూమరీ పోస్టులలో కొనసాగే విధానానికి తెలంగాణా ఉద్యోగ సంఘాలు తీవ్రనిరసన తెలియ చేశాయి. అటు ఆంధ్రా ప్రాంతంలో అసలు ముల్కీ నిబంధనలనే పూర్తిగా రద్దు చేయాలని విద్యార్థులు సమ్మె చేశారు.

ఫిబ్రవరి 22న రాష్ట్ర ప్రభుత్వం 5 గురు మంత్రులతో ఒక ఉపసంఘాన్ని నియమించి రాష్ట్ర ఉద్యోగుల ఉమ్మడి సీనియార్టీలిస్టు సిద్ధం చేయమని సూచించింది.



తెలంగాణా అన్ని జిల్లాలలో ఈ "మడత పేచీ"ల వల్ల ప్రజలు ఆగ్రహావేశాలకు గురి అయ్యారు. హైద్రాబాదు నగరంలో జరిగిన ఒక పౌరసదస్సులో అన్ని రంగాలవారు, వృత్తులవారు పాల్గొని రాజకీయాలకు అతీతంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని తీర్మానిస్తూ పోలీసు దౌర్జన్యాలను తీవ్రంగా ఖండించారు. ప్రత్యేక తెలంగాణా విషయంలో నగర జనసంఘ్ పార్టీ శాఖలో భిన్నాభి ప్రాయాలతో చీలిక వచ్చింది. ఉద్యమాన్ని సమర్థించినందుకు ఆ పార్టీ నగర కార్యదర్శి యం. జగన్మోహనరెడ్డిని పార్టీనుండి బహిష్కరించారు. ఫిబ్రవరి 23న మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకటరంగారెడ్డి తెలంగాణా సమస్య పై చర్చకు అన్ని పార్టీల నాయకులను ఆహ్వానించారు. 1952 తర్వాత ఆయన మళ్లీ ప్రత్యేక తెలంగాణా కోసం రంగంలోకి దిగాడు.

ఫిబ్రవరి 25న తాండూరులో పోలీసు కాల్పులు జరిగాయి. ఫిబ్రవరి 28న రాజ్యసభ ముల్కీ నిబంధనలు మరో ఐదు సంవత్సరాలు పొడిగించటానికి ప్రవేశపెట్టబడిన బిల్లును ఆమోదించింది.

**తెలంగాణా ప్రజాసమితి ఆవిర్భావం :**

ఫిబ్రవరి 28న హైద్రాబాదులో మొదటిసారి తెలంగాణా ప్రజా సమితి ఆవిర్భవించింది. దీనిని యువకులు, మేధావులే స్థాపించారు తప్ప రాజకీయ నాయకులు కాదు. ఆ యువకులంతా 25-30 సంవత్సరాలలోపు వారే. వీరికెవ్వరికీ రాజకీయ పార్టీల అనుబంధంలేదు. వారంతా లాయర్లు, టీచర్లు, జర్నలిస్టులుగా పని చేస్తున్నవారు. దానికి అధ్యక్షునిగా మదన్‌మోహన్ నియమించబడ్డారు. అతను సిద్ధిపేటకు సంబంధించిన యువ లాయర్. ఎటువంటి రాజకీయ అనుబంధాలు లేవు. ఆ యువకులందరూ విద్యార్థులు కొనసాగిస్తున్న ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి మద్దతుగా తెలంగాణా ప్రజా సమితిని స్థాపించారు. విద్యార్థులతో, ఉద్యోగులతో కలసి ఉద్యమాన్ని నిర్మించటమే దాని లక్ష్యం. నిజానికి 1952 గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమమే గాని లేదా 1969 ప్రత్యేక తెలంగాణా ఉద్యమమే గాని ఏ రాజకీయ విశ్వాసాలు లేని విద్యార్థులు, యువకుల ద్వారానే తప్ప వృత్తి రాజకీయ నాయకుల ద్వారా ప్రారంభంకాలేదన్న సంగతి జాగ్రత్తగా గమనించాలి.


www.etelangana.org

మార్చి 3న తెలంగాణా బందుకు, శాంతియుత సత్యాగ్రహాలకు, పికెటింగ్‌లకు పిలుపు ఇచ్చారు. ఆ రోజు నగరంలో బొల్లారం రైల్వే స్టేషన్ పై ప్రజలు దాడి చేశారు. ఇంత జరుగుతున్నా తెలంగాణా మంత్రులు, శాసనసభ్యులు మాత్రం తమ మౌనాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. కావున ప్రజా ఉద్యమం నిర్మించాలని మేధావులు నిర్ణయించారు. మార్చి 3 న తెలంగాణా బంద్ ప్రశాంతంగా జరిగింది. అన్ని జిల్లాలలో బంద్ సంపూర్ణంగా విజయవంతమయ్యింది. అప్పుడు తెలంగాణా శాసనసభ్యులలో కదలిక వచ్చింది.

మార్చి 15 లోగా తెలంగాణా రక్షణలను అమలు చేయకపోతే అసెంబ్లీలో సహాయనిరాకరణ చేయగలమని 52 మంది తెలంగాణా శాసన సభ్యులు హెచ్చరించారు.

మార్చి 7న సుప్రీంకోర్టు ముల్కీ నిబంధనల అమలుపై ఇంతకు ముందు తనిచ్చిన స్టే ఉత్తర్వులను ధృవీకరిస్తూ ఆ స్టేను ఎత్తివేయాలన్న రాష్ట్ర ప్రభుత్వపు రిట్‌ను తిరస్కరించింది. తదుపరి విచారణను 17కు వాయిదా వేస్తూ సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించడాన్ని కూడా నిలిపివేసింది. తిరిగి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారయ్యింది.

**జనసముద్రంగా మారిన రెడ్డి హాస్టల్ సదస్సు :**

"జబ్ హమ్ అప్నా హిస్సా మాంగేఁగే
పురా హిస్సా మాంగేఁగే
ఏక్ ఖేత్ నహీఁ, ఏక్ దేశ్ నహీఁ
సారీ దునియా మాంగేఁగే
చాంద్ సితారే మాంగేఁగే"

- ఫైజ్ అహమ్మద్ ఫైజ్.

మార్చి 8, 9 న రెండు రోజులు హైద్రాబాదులోని రెడ్డి హాస్టల్‌లో తెలంగాణా సదస్సు జరిగింది. దానికి గత రెండు నెలలుగా సన్నాహాలు చేయటం వలన విద్యార్థి నాయకుల విస్తృత పర్యటనలు, ప్రచారం చేయటం వలన విజయవంతం కావటమే గాక భవిష్యత్తులో జరుగబోయే ఉద్యమానికి మార్గదర్శకంగా



పనిచేసింది. మొదటి రోజు సదస్సుకు తెలంగాణా మూలమూలల్నుండి 15 వేల మంది హాజరయ్యారు. రెడ్డి హాస్టల్ మైదానం జనంతో నిండిపోయింది. శ్రీమతి సదాలక్ష్మి అధ్యక్షత వహించగా ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ రావాడ సత్యనారాయణ ప్రారంభోపన్యాసం చేశారు. విద్యార్థి నాయకులే గాక వందేమాతరం రామచంద్రారావు, ఎస్.బి. గిరి మొదలగు రాజకీయ నాయకులు కూడా ప్రసంగించారు. ప్రత్యేక తెలంగాణా ఒక్కటే పరిష్కార మార్గం అని అందరూ ముక్తకంఠంతో ఘోషించారు. రెండో రోజు సదస్సులో ప్రత్యేక తెలంగాణా ఏర్పడే వరకు విద్యార్థులు నిరవధిక సమ్మె చేయాలని తీర్మానించారు. ఆ సాయంత్రం అపూర్వమైన బహిరంగ సభ జరిగింది. 30 వేల మంది ప్రజలు వచ్చారు. మైదానం సరిపోలేదు. ఇసిక వేస్తే రాలనంత జనం "జై తెలంగాణా జైజై తెలంగాణా" నినాదాలతో భూమి ఆకాశాలు దద్దరిల్లాయి. చోటులేక చెట్ల కొమ్మల మీద ఎక్కికూర్చుని ఓపికగా, శ్రద్ధగా ఉపన్యాసాలు విన్నారు. హాస్టలు చుట్టు ప్రక్కల బిల్డింగ్‌లపైన ఎక్కడచూసినా జనమే. ప్రజాశక్తి ప్రవాహంలాగా కదలి వచ్చింది. అర్థ రాత్రి దాటిన తర్వాత కూడా సభ జరిగింది. వచ్చిన 30 వేల మంది ప్రజల చేత ప్రత్యేక తెలంగాణాను సాధించి తీరుతామని "ప్రతిజ్ఞ" చదివించారు. అదొక జనఘోష. మల్లికార్జున్, శ్రీధర్ రెడ్డి, పుల్లారెడ్డి, మహాదేవ్ సింగ్, సదాలక్ష్మి మొదలగువారు రక్తాన్ని పరుగులు పెట్టించి ఉద్రూతలూగించే ఉపన్యాసాలు ఇచ్చారు. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా విద్యార్థుల శక్తి ఏమిటో, ప్రజా ఉద్యమం అంటే ఏమిటో ఆ రెండు రోజుల సదస్సులు రుజువు చేశాయి.

మార్చి 11 నుండి విద్యార్థుల నిరవధిక సమ్మె ప్రారంభమయ్యింది. ఉద్యమానికి మద్దతుగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల కార్యాచరణ సమితి ఏర్పడింది. ఉద్యోగుల నాయకుడు కె.ఆర్. అమోస్, ఉపాధ్యాయుల నాయకుడు బాలకృష్ణారెడ్డి.

మార్చి 12న గత 9 రోజుల్నుండి నిరహారదీక్షలో ఉన్న 65 సంవత్సరాల వృద్ధుడిని పోలీసులు అరెస్టు చేసి ఉస్మానియా దవాఖానాలో చేర్పించి బలవంతంగా సెలైన్ ఎక్కించారు. అతని పేరు కొర్రపాటి పట్టాభి రామయ్య పదహారణాల ఆంధ్రుడు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వాడు. మాజీ


www.etelangana.org

కమ్యూనిస్టు, తెలంగాణా ఉద్యమానికి ఇతను ప్రారంభం నుండి తన మద్దతును తెలియ చేస్తున్నాడు. అతనిని దవాఖానాలో చేర్పించినా తన మౌనదీక్షను కొనసాగించాడు. అతడిని అరెస్టు చేయగా అదే శిబిరంలో విద్యార్థులు నిరాహారదీక్షలను కొనసాగించారు. ఇదే రోజు తెలంగాణా మంత్రుల ఇళ్ల వద్ద సత్యాగ్రహం చేసిన 15 మంది విద్యార్థులను అరెస్టు చేశారు.

మార్చి 13న ముఖ్యమంత్రి ఒక ప్రకటన చేస్తూ ప్రతి సంవత్సరం తెలంగాణాకు కేటాయించే బడ్జెట్‌కు అదనంగా 9 కోట్ల రూపాయలను, అనగా ప్రతి జిల్లాకు ఒక కోటి చొప్పున ఇస్తున్నానని ప్రకటించాడు. తెలంగాణా విషయాలు చూసేందుకు అదనంగా ఒక ముఖ్య కార్యదర్శిని నియమించాడు. పోచంపాడు ప్రాజెక్ట్ నిధులను రెండింతలు పెంచాడు. ఇదంతా ఏడుస్తున్న తెలంగాణా ప్రజల కన్నీళ్లను తుడిచే ప్రయత్నం.

మార్చి 14న జె. చొక్కారావు అధ్యక్షతన గల ప్రాంతీయ సంఘం కూడా తన నివేదికలో ఉద్యోగుల పట్ల ప్రభుత్వం పక్షపాతంతో వ్యవహరిస్తున్నట్లు తీవ్రంగా విమర్శించింది.

మార్చి 15న ఉస్మానియా యూనివర్సిటీ స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రత్యేక తపాలాబిళ్ల ఆవిష్కరణ కోసం రాష్ట్ర గవర్నర్ ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చారు. ఆ సభలో 200 మంది విద్యార్థులు లేచి నిలబడి గవర్నర్ గోబ్యాక్ అని నినాదాలు చేస్తూ వేదిక పైకి దూసుకు వచ్చారు. పోలీసులు గవర్నర్ ముందే వారిపై లాఠీ చార్జీ చేసి శ్రీధర్ రెడ్డితో సహా అనేక మందిని అరెస్టు చేశారు. మరునాడు కూడా గవర్నర్ అబిడ్స్‌లోని నెహ్రూ విగ్రహాన్ని ఆవిష్కరించటానికి వెళ్లగా అక్కడా ఇదే పరిస్థితి ఎదురయ్యింది. ఆ రోజు అసెంబ్లీలోకి చొచ్చుకొని పోయి నినాదాలు చేసిన 14 మంది విద్యార్థులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుచగా ఒక్కొక్కరికి రెండేసి రూపాయల చొప్పున జరిమానా విధించారు.

## ఉద్యమంలోకి ఉపాధ్యాయులు, ఉద్యోగులు :

మార్చి 17న ఉపాధ్యాయులు, ఉద్యోగులు 'పోరాటదినం' పాటించారు. విద్యార్థులు "ప్రజాస్వామ్య రక్షణ దినాన్ని" పాటిస్తూ ప్రభుత్వ కార్యాలయాల ముందు పికెటింగ్ చేశారు. వంద మందికి పైగా అరెస్టు చేశారు. ఇదే రోజు సుప్రీంకోర్టులో



ముల్కీ నిబంధనలపై వాద ప్రతివాదనలు ప్రారంభమైనాయి. ఫలితంగా ప్రభుత్వం ముల్కీ నిబంధనల విషయంలో స్టేటస్‌కో పాటించింది. ఆంధ్రాలో ఎన్.జి. రంగా ప్రత్యేక తెలంగాణాకు తన సంపూర్ణ మద్దతు ప్రకటించాడు. కాని అప్పటికి ఆంధ్రలో ముల్కీ వ్యతిరేక ఉద్యమం చల్లబడింది. మార్చి 20న మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకటరంగారెడ్డి ఒక ప్రకటన చేస్తూ తెలంగాణా రక్షణలను అమలు చేయకపోతే సత్యాగ్రహం చేస్తానని హెచ్చరించాడు.

మార్చి 21న ప్రభుత్వ దమననీతిని ఖండిస్తూ 8 మంది తెలంగాణా శాసన సభ్యులు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు సాగిస్తున్న ఉద్యమానికి తమ మద్దతు ప్రకటించారు. కొండా వెంకటరంగా రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ప్రత్యేక తెలంగాణా తన లక్ష్యంగా ప్రకటించాడు. ఈ రెండు ప్రకటనల వలన ఉద్యమానికి కొత్త చైతన్యం వచ్చింది.

మార్చి 22 న కొండా లక్ష్మణ్ బాపూజీ మరియు తెలంగాణా ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడు జె. చొక్కారావులు ఢిల్లీలో ప్రధానమంత్రిని కలిసి తెలంగాణాకు స్వపరిపాలనా ప్రతిపత్తి గురించి చర్చించారు. కేంద్రం ఇకనైనా చొరవచూపాలని వాదించారు. మార్చి 24న ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని నగర పోరసమితి నిర్ణయించింది. ఆ రోజు నగరంలో మంత్రులు ప్రసంగించిన సభలో రాళ్లు, చెప్పులు, టమాటలు విసిరారు. మంత్రుల కార్లు ఎక్కడకనబడినా ఘెరావ్ చేయటం ప్రారంభించారు. మార్చి 26న నాన్ ముల్కీలను ఉద్యోగాలలోనుండి తొలిగించాలని సచివాలయం ముందు తెలంగాణా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరహారదీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. కాని ఆ రాత్రే దానితో పాటు నగరంలో ఉన్న అన్ని నిరాహారదీక్షా శిబిరాలను పోలీసులు కూల్చివేశారు. ఆ చర్యను ఖండిస్తూ భావిపరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని మల్లికార్జున్ హెచ్చరించాడు. అన్ని జిల్లాలలో తెలంగాణా సదస్సులు జరుగుతున్నాయి. ఆ మరునాడు ప్రత్యేక తెలంగాణానే ఏకైక మార్గం అని తెలంగాణా రీజినల్ కమిటీ మాజీ అధ్యక్షుడు అచ్యుతరెడ్డి ప్రకటించాడు.

## సుప్రీం కోర్టు తీర్పు - వెల్లువెత్తిన నిరసనలు :

మార్చి 29న ముల్కీ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. తెలంగాణాలోని ఆంధ్ర ఉద్యోగులను వెనుకకు పంపే జి.వో.ను


www.etelangana.org

కూడా కొట్టివేసింది. ఈ వార్త విన్న వెంటనే ఆగ్రహించిన యూనివర్సిటీ విద్యార్థులు సమీపంలో వున్న జామే ఉస్మానియా రైలు స్టేషన్ పై దాడి చేసి దానికి నిప్పు పెట్టారు. పొరపాటున మంటలలో చిక్కుకుని ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మరణించారు. ప్రదర్శనలు చేసిన 60 మంది విద్యార్థులను వరంగల్లులో అరెస్టు చేశారు. అక్కడ జరిగిన సదస్సులో ఎప్రిల్ 9 లోగా ప్రత్యేక తెలంగాణా ఏర్పడకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని వరంగల్ విద్యార్థులు ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు.

అదే రోజు 29న కొండా లక్ష్మణ్ బాపూజీ తన మంత్రి పదవికి రాజీనామా చేశాడు. మేఘాలయవలె ప్రాంతీయ ప్రతిపత్తిని ఆయన కోరాడు. దీని ప్రకారం ప్రణాళిక, అభివృద్ధి, బడ్జెట్, ఉద్యోగాలు తెలంగాణా నిర్వహించుకుంటుంది. ఈ సూచనలకు ప్రధాని, ముఖ్యమంత్రి, హై కమాండ్ అంగీకరించనందున మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రత్యేక తెలంగాణా ఒకటే పరిష్కారమన్నాడు.

మార్చి 30న ఆయన ప్రత్యేక తెలంగాణా కాంగ్రేసు సమితిని ఏర్పరచాడు.

ఏప్రిల్ 3న ఎనిమిది మంది తెలంగాణా శాసనసభ్యులు తమ మౌనాన్ని వీడి ప్రత్యేక తెలంగాణానే ఏకైక మార్గం అని ప్రకటించారు. దీనితో ఉద్యమానికి కొత్త ఉత్సాహం వచ్చింది.

**రక్తసిక్తమైన సికింద్రాబాదు :**

ఏప్రిల్ 5 న హైద్రాబాదు నగరంలో ఉద్యమం మరో మలుపు తిరిగింది. నగరంలో మొదటి సారిగా పోలీసు కాల్పులు సికింద్రాబాదులో జరిగాయి. సికింద్రాబాదు అంజలి టాకీసు చౌరస్తాలో ఉన్న బురుగు మహదేవ్ హాలులో కమ్యూనిస్టు పార్టీ బహిరంగ సభ జరిపింది. ఆ పార్టీ రాష్ట్ర సమైక్యతను కోరుతూనే తెలంగాణా రక్షణల అమలు కోసం డిమాండు చేసింది. కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులైన రాజబహద్దూర్ గౌర్, మగ్దూం, నీలంరాజశేఖర్‌రెడ్డి మొదలగు వారు హాజరయ్యారు. ఆ సభకు నగర కార్మిక నాయకుడు సత్యనారాయణరెడ్డి అధ్యక్షత వహించి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని విమర్శిస్తుండగా సభలో గందరగోళం చెలరేగింది. జై తెలంగాణా నినాదాలతో హాలు దద్దరిల్లింది. పోలీసులు జోక్యం చేసుకుని సపరేటిస్టులను అవతలికి నెట్టివేశారు. హాలు బయట అప్పటికే రోడ్డు



మీద వందల మంది ప్రత్యేక తెలంగాణా వాదులు నిలబడి కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేయసాగారు. గొడవలు మొదలై రాళ్లవర్షం కురిసింది. రెండు వర్గాల వారు కొట్టుకోవడం ప్రారంభించగా టియర్ గ్యాస్‌ను వదిలారు. పోలీసులు లాఠీలతో రోడ్డు మీద వున్న ప్రతి ఒక్కరినీ కొట్టారు. ఎదురుగా ఉన్న ఆనంద్‌భవన్ హోటల్‌లోకి కూడా ప్రవేశించి కస్టమర్స్ అందర్నీ చితగ్గొట్టారు. చివరికి పరిస్థితి అదుపులోకి రాక పోలీసులు కాల్పులు జరిపారు. స్పాట్‌లో ముగ్గురు చనిపోయారు. 27 మందికి గాయాలయ్యాయి. ఈ లెక్కలన్నీ ప్రభుత్వం సూచించినవే. అనధికార లెక్కలు ఇంకా ఎక్కువే. ఈ కాల్పులు, పోలీసు దౌర్జన్యంతో నగరమంతా భగ్గుమంది.

**తెలంగాణా ఉద్యమ కవి వేణూ సంకోజు 'జ్ఞాపకాల గాయాలు' :**

"గుజ్రే జమానే యాద్ ఆతీహై
దర్ద్ పురానే యాద్ ఆతీహై"

ఈనాటి ప్రముఖ తెలంగాణా ఉద్యమ కవి శ్రీ వేణుసంకోజు ఆనాటి తన అనుభవాన్ని ఇలా చెప్పారు. "అప్పుడు మేము విద్యార్థులం. నేను నా మిత్రులు రాజేందర్, ప్రకాష్ మరియు మల్లయ్యలం కలిసి ఆ సమావేశానికి వెళ్లాము. గొడవలు ప్రారంభంకాగానే మా మిత్రుడు ప్రకాష్ మేము వారిస్తున్నా వినక అవతల ఏమౌతుందో తెలుసుకుందామన్న ఉత్సాహంతో హాలు బయటకి వెళ్లాడు. అప్పటికే పోలీసు కాల్పులు మొదలయ్యాయి. ప్రకాష్ పోలీసుల దృష్టిలో పడ్డాడు. అతనిని పట్టుకోవటానికి వారు రాగానే భయపడి కంగారుగా పక్కనున్న గల్లీలోకి పరుగు తీశాడు. అయినా అతనిని పోలీసులు తరుముతుంటే ప్రాణ భయంతో మూసివున్న ఒక ఇంటి గేటు పైనుండి దుమికి ఆ ఇంటిలోపల ఒక స్థంబంపక్కన దాక్కున్నాడు. అది గమనించిన పోలీసులు ఆ ఇంటి గేటును తామే తీసుకొని లోపలికి వెళ్లి ప్రకాష్‌ను పట్టుకొని కొట్టుకుంటు,- ఇంటి ముందున్న రోడ్డుమీదికి తీసుకొచ్చి అతి సమీపంనుండి అతడిని కాల్చివేశారు. తమను తాము సమర్థించుకోవటానికి మృతుడి చేతిలో గ్యాసునునె డబ్బా, మరోక చేతిలో కొంత దూదిని పెట్టారు. అతను దహన కాండకు పాల్పడుతుండగా తాము కాల్చి వేశామని దొంగ కేసు బనాయించారు. ప్రకాష్ చనిపోయేనాటికి అతని వయస్సు నిండా 18 సంవత్సరాలు కూడా లేవు. అతను ఇప్పటికి మా కళ్లల్లో కదులుతూనే వుంటాడు."


www.etelangana.org

మరునాడు నగరంలోనూ, జిల్లాలలోనూ మూకుమ్మడి అరెస్టులు జరిగాయి. వారందర్నీ ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం క్రింద అరెస్టు చేశారు. ఈ ఉద్యమంలో పి.డి. చట్టాన్ని ఉపయోగించడం కూడా ఇదే మొదటిసారి. మల్లికార్జున్, మదన్‌మోహన్‌లను అరెస్టు చేశారు. మదన్‌మోహన్ స్థానంలో ప్రజాసమితి అధ్యక్షుడుగా ఎస్.బి. గిరి నియమించబడ్డాడు. అరెస్టు అయిన వారిలో కొంత మంది శాసన సభ్యులు, జర్నలిస్టులు, కార్మిక నాయకులు, అడ్వకేట్లు కూడా ఉన్నారు.

ఏప్రిల్ 9న గద్వాలలో కాల్పులు జరిగాయి. హైద్రాబాదు నగరంలో శాసనసభ్యులతో సహా వందలాది మంది సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టు అయ్యారు. ఎస్.బి. గిరి స్థానంలో తెలంగాణా ప్రజా సమితి అధ్యక్షురాలిగా శ్రీమతి సదాలక్ష్మి ఎన్నికయ్యారు.

ఈ సెగలు పొగలు ఢిల్లీ దాకా వ్యాపించి ఏప్రిల్ 11న ప్రధానమంత్రి లోకసభలో సమస్య పరిష్కారానికి అష్టసూత్ర పథకాన్ని సూచించారు. వాటి ముఖ్య వివరాలు :

1. తెలంగాణా మిగులు నిధుల లెక్కలు తేల్చటానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తితో ఒక సంఘాన్ని నియమించటం.

2. ముఖ్యమంత్రి అధ్యక్షుడుగా తెలంగాణా అభివృద్ధి కమిటీ నియామకం.

3. తెలంగాణా రక్షణల అమలు కోసం ఒక ప్రత్యేక సంస్థను నియమించటం.

ప్రధానమంత్రి పథకం ఎవరినీ సంతృప్తి పరచలేదు. తెలంగాణా కాంగ్రేసు నాయకులు నిరాశకు గురి అయ్యారు.

ఏప్రిల్ 15న ముందు నిర్ణయించిన ప్రకారం తెలంగాణా పోరాటదినం పాటించబడింది. నిజామాబాద్, మహబూబ్ నగర్‌లలో కాల్పులు జరిగాయి. తెలంగాణాలో ఉద్యోగుల నిరవధిక సమ్మె కూడా ప్రారంభమయ్యింది. నగరంతో సహా జిల్లాలలో పోలీసులకు ప్రజలకు ఘర్షణలు జరిగాయి.



**చెన్నారెడ్డి రంగ ప్రవేశం :**

ఏప్రిల్ 21న కాంగ్రేసు నాయకుడు మర్రి చెన్నారెడ్డి గారు ప్రత్యేక తెలంగాణాను సమర్థిస్తూ రంగ ప్రవేశం చేశారు. ఏప్రిల్ నెల చివరివరకు ఉద్యమం వృత్తి రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా విద్యార్థులు, యువకుల నాయకత్వంలోనే జరిగింది. అంతవరకు రాజకీయ నాయకులు పరిస్థితిని జాగ్రత్తగా అంచనా వేస్తూ తర్వాత ఉద్యమంలోకి ప్రవేశించారు. ముందు శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ తన మంత్రి పదవికి రాజీనామా ఇచ్చి మరికొంత మందిని కలుపుకొని తెలంగాణా కాంగ్రేస్ కమిటీని స్థాపించాడు. తర్వాత కొద్ది రోజులకు అనగా ఏప్రిల్ 21న డా॥ మర్రి చెన్నారెడ్డి రంగప్రవేశం చేశారు. అప్పటికే ఉద్యమం విస్తృతమైన ప్రజా ఉద్యమంగా మారింది. అటు కేంద్ర ప్రభుత్వం ఉద్యమాన్ని కేవలం విద్యార్థులు చేసే ఉద్యమంగా, శాంతి భద్రతల సమస్యగా భావిస్తూంది. ఇటువంటి పరిస్థితిలో కేంద్రంతో, ప్రధాన మంత్రితో చర్చలు చేయటానికి రాజకీయ అనుభవం కలిగిన డా॥ చెన్నారెడ్డి, కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి వారు తప్ప విద్యార్థులు, యువకులైన మల్లికార్జున్, మదన్‌మోహన్‌లు కాదని తెలంగాణా ప్రజా సమితి భావించింది.

డా॥ చెన్నారెడ్డి నాయకత్వంతో ఉద్యమం రెండవ దశలోకి ప్రవేశించింది. మరునాడే శ్రీధర్‌రెడ్డిని ప్రభుత్వం ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం క్రింద అరెస్టు చేసింది. తిరిగి విడుదల కాగానే అతను అండర్‌గ్రౌండుకు వెళ్లి చాలా కాలం పోలీసులకు చిక్కకుండా ఉద్యమాన్ని నిర్వహించాడు.

నూతనంగా ఏర్పడిన తెలంగాణా ప్రజాసమితి మేడేనాడు 'డిమాండ్స్ డే' తెలంగాణా అంతటా జరుపమని పిలుపునిచ్చింది. హైద్రాబాదు నగరంలో చార్మినార్ నుండి రాజ్‌భవన్ వరకు ఒక ఊరేగింపు, సికింద్రాబాదు నుండి రాజభవన్‌కు మరో ఊరేగింపు జరిపి సంయుక్తంగా గవర్నర్‌కు మహజరు సమర్పించాలని నిర్ణయించారు. పోలీసు కమీషనర్ ఊరేగింపుకు అనుమతి చార్మినార్ నుండి కాక నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్ నుండి ఇచ్చాడు. అయినా ఊరేగింపు చార్మినార్ నుండి బయలుదేరుతుందని, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని తెలంగాణా ప్రజాసమితి పిలుపునిచ్చింది. ప్రభుత్వానికి అదొక పెద్ద సవాలుగా మారింది. చారిత్రాత్మకమైన మేడే నాడు జంటనగరాలు మొత్తం రక్తసిక్తంగా మారాయి.


www.etelangana.org

### మళ్ళీ నెత్తురు 'సాకబోసిన' మేడే :

మల్లికార్జున్, మదన్‌మోహన్, కేశవరావ్ జాదవ్‌లు చార్మినార్ నుండి ప్రారంభమయ్యే ఉరేగింపుకు సారధ్యం వహించారు. పోలీసులు ఉదయం నుండే చార్మినార్‌కు వచ్చే అన్ని దారుల్ని మూసేశారు. బస్సులు, రిక్షాలు అన్ని బందు అయినాయి. ప్రతి అంగుళం అంగుళం పోలీసులు పహరా చేశారు. అయినా ప్రజలు రహస్యంగా కాలినడకన బయలుదేరి గల్లీల నుండి చార్మినార్ ప్రాంతానికి చేరుకుని మక్కామసీదులో, చార్మినార్ దవాఖానాలో, సమీపంలోని శివుని గుడిలో, ఇరానీ హోటళ్లలో జమ అయినారు. ప్రజలు కనబడగానే పోలీసులు లాఠీలతో తరిమారు. అయినా మళ్లీ వారు గుమిగూడి చార్మినార్‌కు రాసాగారు. ఆ రోజు చార్మినార్ లక్ష్మీదేవాలయంలో పూజలు జరుగుతున్నాయి. కొందరు నాయకులు ఆ పూజలకు తమ కుటుంబాల స్త్రీల వెంబడి వస్తున్నట్లుగా హారతి కర్పూరం పళ్లాలు, కొబ్బరి కాయలు, పట్టుకొని మారువేషాలలో భక్తులలాగా బయలుదేరారు. పోలీసులకు ఎవరిని ఆపాలో ఎవరిని పంపాలో తెలియక తికమకపడ్డారు. అలా వేలాదిమంది చార్మినార్ దగ్గర జమ అయినారు. ఈలోగా హఠాత్తుగా నాయకులంతా ప్రత్యక్షమైనారు. "జై తెలంగాణా జైజై తెలంగాణా" నినాదాలు దద్దరిల్లాయి. పోలీసులు ఉలికిపడ్డారు. ప్రజలు అలలు అలలుగా ప్రవాహం మాదిరిగా తరలి రాసాగారు. ఆపటం కష్టమయ్యింది.

చార్మినార్ దగ్గర గుమికూడిన ప్రజాసమూహాన్ని ఉద్దేశించి మాజీ ఉప ముఖ్యమంత్రి, కురువృద్ధుడైన కొండా వెంకటరంగారెడ్డి ప్రసంగించారు. తరువాత ఆయన నాయకత్వంలో ఊరేగింపు బయలుదేరింది. జన ప్రవాహాన్ని ఆపటం కష్టమయ్యింది. మదీనాబిల్డింగ్ దగ్గరికి వచ్చేసరికి గొడవలు మొదలైనాయి. టియర్‌గ్యాస్ వదిలారు. దానికి జవాబుగా రాళ్ల వర్షం కురిసింది. జనాన్ని చెదరగొట్టటానికి అనేక సార్లు లాఠీచార్జీ చేశారు. టియర్ గ్యాస్ వదిలారు. అరెస్టు చేసిన వారిని తరలించటానికి పోలీస్ వ్యాన్‌లు సరిపోలేదు. దెబ్బలు తింటూ చెదిరిపోయిన ప్రజలు మళ్లీ మళ్లీ గుమికూడుకున్నారు. సిద్ధి అంబర్ బజార్ మసీదు దగ్గరికి ఊరేగింపు రాగానే పోలీసు కాల్పులు జరిగాయి. పోలీసులపై రాళ్ల వర్షం కురుస్తూనే ఉంది. అక్కడిక్కడే ముగ్గురు మరణించారు. గాయపడినవారి సంఖ్య లెక్కలేదు. గుళ్ల దెబ్బలకు గాయపడిన ప్రజలు రోడ్డు



మీదే గంటల తరబడి పడి ఉన్నారు. సమీపంలోనే ఉస్మానియా దవాఖానా ఉన్నా పోలీసులు తీసుకొనివెళ్లలేదు. ఒక ప్రైవేటు జీపులో ప్రజలే వారిని ఉస్మానియా ఆస్పత్రికి తీసికెళ్లారు.

సిద్దంబర్ బజార్ చౌరస్తా నుండి మోజంజాహి మార్కెటు వరకు వీధులన్నీ రణరంగాలైనాయి. అదొక యుద్ధభూమిని తలపించింది. పోలీసులకు ప్రజలకు మధ్య హోరాహోరీ పోరాటం జరిగింది. ప్రజలు వీరోచితంగా ప్రాణాల్ని తృణప్రాయంగా ఎంచి తిరగబడ్డారు. కాల్పులు జరిగినంత సేపు గల్లీలలోకి తప్పుకున్నారు. తర్వాత మళ్లీ రోడ్లపై వచ్చి రాళ్లురప్పలు విసిరారు. ఉరేగింపు వెళ్లే దారిలో దుకాణాలన్నీ స్వచ్ఛందంగా మూతబడ్డాయి. రోడ్లపై యువకులు, విద్యార్థులు నిస్సహాయంగా లాఠీ దెబ్బలు, గోలీ దెబ్బలు తింటుంటే ప్రక్కనున్న భవనాల నుండి, కిటికీల నుండి తొంగి చూస్తున్న స్త్రీలు పిల్లలే కాక పురుషులు కూడా బోరుమని ఏడ్చేశారు. మహారాజ్ గంజ్ పోలీసుస్టేషన్‌ను పూర్తిగా తగులబెట్టారు. సెంట్రీ ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపాడు. అందులో కొందరు మరణించారు. అక్కడ పోలీసు స్టేషన్ ముందున్న వ్యాన్‌ను, ఇన్‌స్పెక్టర్ల సైకిల్ మోటర్లను పూర్తిగా తగులబెట్టారు. అక్కడి వీధిలో పోలీసులు, ప్రజలు ముఖాముఖి పోరాటం చేశారు. వారంతా మలబార్ పోలీసులు. ఎటువంటి సానుభూతి లేక ప్రజలపై దౌర్జన్యం చేశారు. మోజంజాహీ మార్కెటులో రెండు గంటల సేపు ప్రత్యక్షయుద్ధం జరిగింది. పోలీసులు ఆత్మరక్షణలో పడి ఇష్టంవచ్చినట్లు కాల్పులు జరిపారు. అట్లా బలిదానాలు, ఆత్మత్యాగాలు చేస్తూ, రక్తాన్ని ధారబోస్తూ ఆ ఉరేగింపు పబ్లిక్ గార్డెన్స్‌కు చేరుకుంది.

సికింద్రాబాదునుండి బయలుదేరిన ఉరేగింపుకు ఎస్.బి. గిరి, నాగం కృష్ణ, గౌతులచ్చన్నలు నాయకత్వం వహించారు. గౌతులచ్చన్న స్వతంత్ర పార్టీ నాయకుడు. ఆ పార్టీ మొదటి నుండి ప్రత్యేక తెలంగాణాను సమర్థిస్తున్నది. సికింద్రాబాదులో ఊరేగింపు వెళ్ళే దారిలో దుకాణాలన్ని మూసేశారు. ఉరేగింపు మున్సిపల్ ఆఫీసు, పరేడ్ గ్రౌండ్ దగ్గరకి రాగానే ఎస్.బి.గిరిని అరెస్టు చేశారు. అల్లర్లు, లాఠీ చార్జీలు వీధివీధినా జరిగాయి. సికింద్రాబాదు బోట్స్‌క్లబ్ దగ్గరికి రాగానే ఊరేగింపు జనసముద్రమయ్యింది. అక్కడ గౌతులచ్చన్న ప్రసంగించారు. టాంకుబండ్, సెక్రటేరియట్ దాటి ఉరేగింపు పబ్లిక్ గార్డెన్ చేరుకొని చార్మినార్ నుండి వచ్చిన ఉరేగింపులో కలిసింది. నాంపల్లిరోడ్డులో ఒక మిలటరీ బస్సును, పోలీసు జీపును పూర్తిగా దహనం చేశారు.


www.etelangana.org

నగరంలో కనీవినీ ఎరుగని ఊరేగింపు లక్డీకాపూల్, ఖైరాతాబాద్‌ల గుండా రాజభవన్‌కు చేరుకుంది. అడుగడుగునా రక్త తర్పణాలు, అశ్రు అభిషేకాలు. హోరాహోరి వీధి పోరాటాలు జరిగాయి. చివరికి రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు మహాజరు సమర్పించటానికి వెళ్లిన బృందంపై కూడా ఆ ప్రాంగణంలోనే లాఠీ-చార్జ్ జరిగింది. ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాలన్న ఒకే ఒక్క డిమాండ్‌తో ఆ మహాజరును సమర్పించారు. లోపల గవర్నర్ ఖండుబాయి దేశాయి గారితో డెలిగేషన్ సభ్యులు మాట్లాడుతుండగానే బయట ప్రజలకు, పోలీసులకు యుద్ధం కొనసాగింది. మళ్లీ కాల్పులు జరిగాయి. తుపాకి గుళ్ల దెబ్బలు తాకిన ఎంతో మంది రాజ్‌భవన్ ఎదురుగా ఉన్న రైలు పట్టాలపై పడి పోయి హాహాకారాలు చేస్తున్న దృశ్యాలు కనబడినవి. అక్కడి కాల్పులలో యం.కె. ఉమేందర్‌రావు అను విద్యార్థి నాయకుడు, సికింద్రాబాదు సాయం కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడు మరణించాడు. ఆ రోజులలో అతని తల్లి కాశీ యాత్రకు వెళ్లింది. ఇంటిలో అతని చెల్లెలు మాత్రమే ఉంది. మిత్రులు ఆమెకు ఆ మరణ వార్తను తెలియజేసి వారే అంత్యక్రియలు జరిపించారు. అనధికార లెక్కల ప్రకారం ఆరోజు కాల్పులలో 20 మంది వరకు చనిపోయారని వందలాది మంది గాయపడ్డారని తెల్సింది. అట్లా హైద్రాబాదు నగర చరిత్రలో మేడే 1969 ఒక 'బ్లాక్ డే'గా ఎప్పుడూ గుర్తుండి పోతుంది.

### శ్రీ దాశరథి రంగాచార్యగారి దృష్టిలో తెలంగాణా ఆత్మ తత్వం :

ఈ సందర్భంలో మాన్యులు శ్రీ దాశరథి రంగాచార్యులుగారు ఒక ఇంటర్వ్యూలో వెలిబుచ్చిన తెలంగాణా ఆత్మ తత్వాన్ని ఒకసారి దర్శించుకుందాం.

"తెలంగాణా బిడ్డ ఆవేశపరుడు. అంతర్ముఖిత్వం, తిరగబడే తత్వం రెండూ సమపాళ్లలో ఉంటాయి. తెలంగాణా మనిషిలో భోళాతనం, లౌక్యం తెలియని అమాయకత్వం, ముక్కుసూటితనం, సంపదకోసం అంగలార్చకపోవటం, ధర్మాగ్రహం వంటి గుణగణాలు ఇక్కడి సాదా మనిషి ఆత్మను పట్టిస్తాయి. వ్యక్తిగతంగా చూసినా, సామాజికంగా చూసినా న్యాయమైన పోరాటాలు ఈ గడ్డ మీద తప్ప ఇంకో చోట వచ్చే అవకాశం లేదు".



మరునాడు మే 2న జంటనగరాలలో సంపూర్ణ హర్తాళ్ మరియు బంద్ జరిగింది. జరిగిన హింసాకాండ, ప్రాణనష్టానికి మొత్తం తెలంగాణా నివ్వెరపోయింది. నగరంలో కనీవినీ ఎరుగని అల్లర్లు అవి. ఆ రోజున జరిగిన అల్లర్లకు బాధ్యులని ప్రముఖ అడ్వకేటు మరియు కార్పొరేటరు ఇ.వి. పద్మనాభన్‌ను అరెస్టు చేశారు. ఆ రోజు రాత్రి సికింద్రాబాదులో జేమ్స్ స్ట్రీట్ నుండి వోల్డ్ ఘాస్ మండికి వెళ్ళుతున్న పోలీసు వ్యాన్‌పై బాంబు విసరగా ఫారుఖ్ అలీ అను కానిస్టేబుల్ అక్కడిక్కడే మరణించాడు. మిగతావారు గాయపడినారు. నరేందర్ (20) అను సికింద్రాబాదులోని ఆవుల మందకు చెందిన పాల వ్యాపారి మరియు మల్కాజిగిరికి చెందిన కుమార్ (21) అను ప్రింటింగ్ ప్రెస్ కార్మికుడు ఆ బాంబును విసిరారు. వీరిని ఆ తర్వాత అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాదులో ప్రముఖ విద్యార్థి నాయకుడు పి.జె. సూరిని అతని ఇంటిలో బాంబులు తయారు చేసే సామాగ్రి దొరికిందని అరెస్టు చేశారు.

మే 15న కొండా వెంకట రంగారెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేసి ప్రత్యేక తెలంగాణాకు తన మద్దతు ప్రకటించాడు. ఈయన ప్రవేశంతో ప్రత్యేక ఉద్యమ స్వరూపం మారింది. ఉద్యోగుల, విద్యార్థుల అలజడి కాక, అదనపు నిధులు, ఆధిపత్యం, దోపిడి మొదలగునవన్నీ చర్చకు వచ్చాయి. 125 కోట్ల వరకు అదనపు నిధులున్నాయన్నారు. 78 కోట్లు అన్నాడు కొండా లక్ష్మణ్. కేంద్ర ప్రభుత్వం పంపిన ఆడిటర్ జనరల్ 34.10 కోట్లు అన్నాడు. ఇది తక్కువ అంచనా అన్నారు తెలంగాణా నాయకులు.

"సర్ఫరోషీ కీ తమన్నా
అబ్ హమారే దిల్ మే హై"

- రాంప్రసాద్ బిస్మిల్

మే 17న నగరంలో తెలంగాణా 'మృత వీరుల దినం'ను పాటించారు. వీధివీధినా వాడవాడలా ఆ మృత వీరులకు శ్రద్ధాంజలి అర్పించారు. "లాఠీ, గోలీ ఖాయింగే తెలంగాణా లేయింగే" అని నినాదాలు ఇచ్చారు.

మే 18న చెన్నారెడ్డి ప్రధాన మంత్రిని సవాలు చేశాడు. ప్రత్యేక తెలంగాణా విషయమై 15 రోజుల నోటీసులో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తే, అందులో ఓడిపోతే ఉద్యమం విరమిస్తానన్నాడు.


www.etelangana.org

మే 20న ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రావాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో యూనివర్సిటీ లెక్చరర్లు, ప్రొఫెసర్లు తెలంగాణా సదస్సును ఏర్పాటు చేసి తెలంగాణా ఎన్ని రకాల దోపిడీలకు అణిచి వేతలకు గురి అవుతున్నదో పరిశోధించిన పేపర్లను సమర్పించారు. ఆ సభకు ప్రొఫెసర్ మంజూర్ ఆలం అధ్యక్షత వహించారు. శ్రీ జయశంకర్, బషీరోద్దీన్, పెన్నా లక్ష్మీ కాంతరావు, శ్రీధర స్వామి, తోట ఆనందరావు మొదలగు వారు తమ సెమినార్ పత్రాలను సమర్పించారు. ఆ సదస్సు ముగింపు ఉత్సవంలో మర్రి చెన్నారెడ్డిగారు ప్రసంగించారు. ఆ పేపర్లన్నీ కలిపి "Telangana movement and investigative focus" అన్న పుస్తకం ప్రచురించగా అందులో "డా॥ కె.ఎల్.రావు-నాగర్జున సాగర్" అని శ్రీ జయశంకర్ గారు రాసిన వ్యాసం పై పార్లమెంటులో చర్చ జరిగింది. తర్వాత ఆ విషయం పై ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధిగారు శ్రీ జయశంకర్ మరియు ఇతరులను ఢిల్లీకి పిలిపించి చర్చించటం కూడా జరిగింది.

**ప్రజల్ని నిలువునా ముంచే మామా అల్లుళ్లు :**

మే 23న తెలంగాణా ప్రజా సమితి మదన్‌మోహన్ అధ్యక్షుని స్థానంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకొంది. దానితో జరుగుతున్న ఉద్యమానికి ఆయన ప్రత్యక్ష సారధ్యం వహించాడు. ఒక ఇంటర్వ్యూలో ఆయన తెలంగాణా ఉద్యమంలోకి ఎలా ప్రవేశించాడో సుదీర్ఘంగా ఇలా వివరించాడు: "తెలంగాణా ఉద్యమం 1969 జనవరిలో ప్రారంభమైనప్పుడు నేను సుప్రీంకోర్టులో నా కేసు విచారణ సందర్భంగా ఢిల్లీలో ఉన్నాను. కొందరు మిత్రులు నావద్దకు వస్తూపోతూ సంప్రదించారు. నేనొకటే చెప్పాను. ఆందోళనను విమర్శించి, వ్యతిరేకించవద్దని. ప్రధాని చాలామార్లు కబురుచేసి మాట్లాడింది నాతో. జనవరిలో ప్రారంభించినవారు ఒకటి రెండు సంఘటనలతోనే తెలంగాణా వచ్చేస్తుందనుకున్నారు. మంత్రి పదవులు పంచుకొన్నారు కొందరు. ఫిబ్రవరిలో యిక లాభం లేదని ఎవరి బిస్తరు వారు సర్దుకున్నారు - మల్లికార్జున్‌తో సహా. మళ్ళీ మార్చిలో బంద్ జరగటంతో ఊపిరి వచ్చింది. బ్రహ్మానందరెడ్డి నన్ను కాంగ్రేసు అధ్యక్షుడుగా వుండమని రాయబారాలు పంపించాడు. రబ్బరుస్టాంపుగా వుండాలని ఆయన ఉద్దేశం. అదిమాత్రం వీలుకాదని చెప్పాను. ఏప్రిల్‌లో యింటికొస్తుండగా ప్రధాని పిలచి, వారం రోజుల్లో పరిస్థితిగురించి



వ్రాయమన్నది. ఏప్రిల్ మొదటివారంలో కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వపు మద్దతుతో బూర్గుల హాలులో సమావేశం జరిపింది. ఆరోజు నేను నా భార్య చిత్రా టాకీస్‌లో మొదటి ఆట చూస్తున్నాము. సినిమా పూర్తిఅయి బయటపడేసరికి బీభత్సంగా వుంది. వెంటనే పోలీసులను కలుసుకుందామనుకున్నాను. కాని వారెవరో బయటినుండి వచ్చినవారు. అదీగాక రోడ్డుపై పోలీస్ చర్యకు ఆటంకపడటం నాయకలక్షణం కాదు. ఇంటికొచ్చి సికింద్రాబాద్‌లో మిత్రులకు ఫోనుచేసి విషయం తెలుసుకున్నాను. వెంటనే ప్రధానితో ఫోనులో మట్లాడాను. హైదరాబాద్‌కే వచ్చిన హోం కార్యదర్శితో మాట్లాడమంది. అతనేదో సర్వీస్ వ్యవహారాలకై వచ్చాడు. దాని వలన ఏం ప్రయోజనం? అయినా పోలీస్‌తో ఉద్యమాన్ని అణచేప్రయత్నం మంచిది కాదని చెప్పాను.

ఏప్రిల్ 10న ఢిల్లీకి పిలిస్తే వెళ్ళాము. స్పీకర్ గనుక సంజీవరెడ్డి అందులో పాల్గొనలేదు. నేనే ఆందోళనకు వెనుకవున్నట్లు ప్రధానికి అప్పటికే అభిప్రాయం కలిగించాడు బ్రహ్మానందరెడ్డి. మే 1న జరిగిన ఊరేగింపు సందర్భంలోనూ నేను వెనుకనుండి సలహాలు ఇచ్చాను కాని చేరలేదు. (ఏప్రిల్ 21న ఆయన ప్రత్యేక తెలంగాణాను సమర్థిస్తూ ప్రకటన చేశాడు.) అందరూ నాదగ్గరకు వచ్చారు. లిఖిత పూర్వకంగా నేను చెప్పినట్లు వింటానని వ్రాసి ఇస్తే వస్తానన్నాను. అందరు ఒప్పుకున్న తర్వాత రంగంలోకి దిగాను. దిగిన తర్వాత వెనుకంజలేదనేది అందరికీ తెలుసు. (ప్రసారిత ఇంటర్వ్యూ - ఎన్.ఇన్నయ్య).

తెలంగాణా కాంగ్రేసు కమిటీ ప్రత్యేకంగా ఏర్పడింది. దానికి అధ్యక్షుడుగా కొండా లక్ష్మణ్ బాపూజీని నియమించారు. అయితే చెన్నారెడ్డి ప్రవేశం వలన తెలంగాణా ఉద్యమం రెండుగా చీలిపోయింది. మరో పోటీ తెలంగాణా ప్రజా సమితి కూడా ఏర్పడింది. దాని అధ్యక్షుడు విద్యార్థి నాయకుడైన శ్రీధర్‌రెడ్డి. మెజారిటీ విద్యార్థులు ఇతని వెంబడే ఉన్నారు. వారిలో ప్రముఖులు పి.జె. సూరి, సంతపురి రఘువీరరావు, జి.యం. అంజయ్య మొదలగు వారు. త్వరలోనే రాజకీయ నాయకులైన వందేమాతరం రామచందర్ రావు, బద్రీవిశాల్ పిట్టీ, ఇ.వి. పద్మనాభన్, ఎస్.బి. గిరి మొదలగు వారు ఈ పోటీ సంస్థను పూర్తిగా సమర్థించారు. కేవలం ప్రత్యేక తెలంగాణా రాష్ట్రమే గాక దోపిడీకి, అవినీతికి కూడా వ్యతిరేకంగా పోరాడుతాననీ, నైతిక విలువలు పాటిస్తానని ఆయన


www.etelangana.org

అన్నారు. విద్యార్థుల నీతి నిజాయితీలకు ప్రతినిధిగా ఆయన నిలిచారు. చాలా కాలం శ్రీధర్‌రెడ్డి అండర్ గ్రౌండులో ఉండి జిల్లాలన్నీ తిరుగుతూ ఉద్యమాన్ని నిర్వహించాడు. చివరికి చెవిపోటునొప్పితో బాధపడుతూ ఒక స్నేహితుడి ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నపుడు అతనిని పోలీసులు నగరంలోనే అరెస్టు చేశారు.

చెన్నారెడ్డి తెలంగాణా ప్రజాసమితి బాధ్యత తీసుకోగానే శ్రీధర్ రెడ్డి నాయకత్వంలో 30 మంది విద్యార్థులు ఒక ప్రకటన చేస్తూ విద్యార్థుల ఉద్యమంలో రాజకీయ నాయకుల ప్రవేశాన్ని, జోక్యాన్ని తీవ్రంగా ఖండించారు. వీరు ఉద్యమాన్ని హైజాక్ చేసి తమ స్వార్థం కోసం దాన్ని నట్టేట్లో ముంచుతారని ముందే ఊహించి సుదీర్ఘ ప్రకటనలు చేశారు. జి.యం. అంజయ్య అనేక ఉదాహరణలిస్తూ 1952 గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమం నుండి అర్ధాంతరంగా ఉపసంహరించుకున్న చరిత్ర కొండా వెంకటరంగారెడ్డి మరియు చెన్నారెడ్డి గార్లకున్నదని, అలాగే పెద్ద మనుషుల ఒప్పందంపై సంతకాలు చేసి కాంగ్రేసు అధిష్టాన వర్గంతో లాలూచీ పడి విలీనానికి తలలూపారని, లొంగిపోయారని ఇక భవిష్యత్తులో మళ్లీ మరోసారి మోసగిస్తారని సరిగ్గానే జోస్యం చెప్పారు. 1952లో 1956లో రెండుసార్లు మోసం చేసిన నాయకుడిని మరోసారి ఎలా నమ్ముతారని వందేమాతరం రామచంద్రరావు ప్రజలను సూటిగా ప్రశ్నించారు. చెన్నారెడ్డి అప్పటికే రాజకీయ నిరుద్యోగి అన్న సంగతి కూడా ఆయన గుర్తుచేశారు. అది వందేమాతరం రామచంద్రరావుగారి పుణ్యమే. చెన్నారెడ్డిగారు కేంద్రంలో ఉక్కు, గనుల శాఖ మంత్రిగా ఉన్నపుడు ఆయన ఎన్నిక చెల్లనేరదని రామచంద్రరావు సుప్రీంకోర్టులో కేసు వేసి గెలిచాడు. ఫలితంగా చెన్నారెడ్డి మంత్రి పదవి ఊడింది. అప్పట్నించీ ఆయన రాజకీయ నిరుద్యోగంతో బాధపడుతున్నాడు. చెన్నారెడ్డి రాజకీయ అధికారం అవతల ఉంటే, వి.బి. రాజు (ఆయన తెలంగాణా ప్రాంతం వాడు) రాజకీయ అధికారంలోపలుంటే ప్రభుత్వాలకు ప్రమాదం అన్న నానుడి హైద్రాబాదులో అప్పటికే చెలామణీలో ఉండేది.

**ఉద్యోగుల నాయకుడు అమోస్ భర్తరఫ్ :**

మే 24న తెలంగాణా ఎన్.జి. వో.ల నాయకుడు కె.ఆర్. అమోస్ ఉద్యోగుల సభలో మాట్లాడుతూ జూన్ ఒకటిలోగా ప్రత్యేక తెలంగాణా ఏర్పడకపోతే రక్తపాతం



తప్పదు అని ప్రభుత్వాన్ని హెచ్చరించాడు. ఒక ఉద్యోగి ప్రభుత్వానికి ఒక రాజకీయ హెచ్చరిక చేయడం గొప్ప సాహసం. దీనికి ప్రభుత్వం వెంటనే స్పందించి 26వ తేదీన తెలంగాణా ఉపాధ్యాయుల, ఉద్యోగ సంఘాల గుర్తింపులను రద్దుచేసింది. కె.ఆర్. అమోస్ శాంతిభద్రతలకు భంగం కలిగించే రీతిలో ఉద్యోగులను రెచ్చగొడుతున్నాడని రాజ్యాంగంలోని ఆర్టికల్ 311 క్లాజ్ 2 క్రింద గవర్నర్ ఆతనిని ఉద్యోగం నుండి భర్తరఫ్ చేశాడు. ఈ చర్యతో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వానికి మధ్య ప్రత్యక్ష యుద్ధం ప్రారంభమయ్యింది.

ఇదే రోజు జడ్చర్లలో పోలీసు కాల్పులు జరుపగా ఒకరు మృతి చెంది నలుగురికి గాయాలయ్యాయి. ఇవన్నీ ప్రభుత్వ లెక్కలే. పత్రికల వార్తలే. మృతుల సంఖ్య ఉన్నదున్నట్లు రాయవద్దని పత్రికలకు ప్రభుత్వం సూచించింది.

ఆ రోజు ఆబిడ్స్ చౌరస్తాలో శ్రీమతి సదాలక్ష్మి నాయకత్వంలో సత్యాగ్రహం చేసిన పలువురిని నిర్బంధంలోకి తీసుకున్నారు. జిల్లాలలో కూడా సత్యాగ్రహాలు, నిర్బంధాలు రోజువారీ కార్యక్రమాలయినాయి.

మే 27న అమోస్‌ను పి.డి. చట్టం క్రింద అరెస్టు చేశారు. సదాలక్ష్మి, రాజారామ్, గోవింద్ సింగ్‌లను కూడా అరెస్టు చేసి గుర్తు తెలియని చోటుకు తరలించారు. అమోస్ అరెస్టుకు నిరసనగా మరియు ప్రత్యేక తెలంగాణా కోసం నిరవధిక సమ్మె చేస్తామని ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల గుర్తింపు రద్దు రాజ్యాంగ విరుద్ధమని పలు సంఘాలు విమర్శించాయి. మరునాడే అమోస్ భర్తరఫ్ పై హైకోర్టులో ఒక రిట్ దాఖలు చేశారు. దానికి ప్రతిచర్యగా ప్రభుత్వం తెలంగాణాకు సంబంధించిన 15 మంది ఉద్యోగ నాయకుల్ని ఉద్యోగాల నుండి సస్పెండ్ చేసింది. అందులో బి. స్వామినాథం కూడా ఉన్నారు.

అధిష్టాన వర్గం కాంగ్రేసు పార్టీ నుండి కొంత మంది తెలంగాణా శాసన సభ్యుల్ని బహిష్కరించింది. వారు కె. అచ్యుతరెడ్డి, పి. నర్సింగరావు, యం.యం.హాషిం, టి. అంజయ్య, జి. రాజారాం, సి. మాణిక్‌రావు మరియు ఎస్.వెంకట్ రాంరెడ్డి.


www.etelangana.org

## వామపక్ష పార్టీల పాత్ర :

మే 29న నగరంలోని "మార్క్సిస్టు ఫోరం" (మేధావుల అధ్యయన సంస్థ) అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు, కార్యదర్శి పి. రంగయ్యలు ఒక ప్రకటన చేస్తూ శ్రీధర్‌రెడ్డితో కలసి ప్రత్యేక తెలంగాణా కోసం పని చేయాలని నిర్ణయించారు. ఈ ఫోరం తో పాటు వివిధ నక్సలైటు గ్రూపు పార్టీలు కూడా ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని సమర్థించాయి. అయితే దోపిడీ, వేదన లేని తెలంగాణా కావాలని సూచించాయి. సి.పి.ఐ. పార్టీ సుమారుగా పారలల్ ఉద్యమాన్ని నడిపింది. రాష్ట్ర సమైక్యతను కోరుతూనే తెలంగాణాకు అన్యాయం జరిగింది వాస్తవమేనని కావున తెలంగాణా రక్షణలను పూర్తిగా అమలు చేయాలని, తక్షణమే తెలంగాణా అభివృద్ధికి వంద కోట్లు కేటాయించాలని, పోలీసు దౌర్జన్యాలను అరికట్టాలని, ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాలని అనేక ఉద్యమాలు నడిపింది. దానికి సంబంధించిన అనుబంధ సంస్థలు (AITUC, AISF, AIYF) లు సమ్మెలు చేశాయి. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు డాక్టర్ రాజ్‌బహద్దూర్ గౌర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలని వారం రోజులు పైగా నిరవధిక నిరాహారదీక్ష కొనసాగించగా కొండా లక్ష్మణ్ బాపూజీ స్వయంగా నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. సికింద్రాబాదులో బూరుగుమహదేవ్ హాలులో సి.పి.ఐ. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కార్మిక నాయకుడు సత్యనారాయణరెడ్డి సికింద్రాబాదులోని బూర్గు మహాదేవ్ హాలు వద్ద ఏప్రిల్ 5న జరిగిన పోలీసు కాల్పుల విషాదాన్ని తట్టుకోలేక కొద్దిరోజులలోనే గుండెపోటుతో హఠాత్తుగా మరణించాడు. ఆ విధంగా సి.పి.ఐ. పార్టీ తన పాలసీకి అనుగుణంగా తెలంగాణా ప్రజలకు సానుభూతిగా అండగా నిలుచుంది. "ప్రత్యేక తెలంగాణా కోసం పోరాడే వారి మీద మాకు కోపం లేదు. తెలంగాణాను ఇటువంటి పరిస్థితికి తెచ్చిన వారిమీదే మా కోపం" అని స్పష్టంగా ప్రకటించింది.

కమ్యూనిస్టు పార్టీ నాయకుడు మగ్దూం మోహియొద్దీన్ అప్పటికే రాష్ట్రనాయకుడు. అతను స్వతహాగా హైద్రాబాదీ. 1969లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో ప్రజల మనోభావాలని గమనించిన ఆయన పార్టీ అంతర్గత సమావేశాలలో తెలంగాణా ప్రాంతీయ సంఘానికి చట్టబద్ధత కోసం, తెలంగాణా వారికి ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమీషన్ కోసం తమ పార్టీ డిమాండ్ చేయాలని



తీర్మానం ప్రవేశపెట్టినట్లు తెలిసింది. అయితే దురదృష్ట వశాత్తు ఉద్యమం నడుస్తున్న ఆగస్టు నెలలోనే ఆయన మరణించారు. అటు ప్రక్కన సి.పి.యం. పార్టీ మాత్రం విశాలాంధ్రలో ప్రజారాజ్యం నినాదాన్ని పట్టుకుని తెలంగాణా ప్రజలకు దూరంగా, తటస్థంగా ఉండిపోయింది.

## తెలంగాణా గడ్డ బిడ్డలు మట్టిలోపలి మాణిక్యాలు :

మే29న పరీక్షలు బహిష్కరించాలని మల్లికార్జున్ విద్యార్థులకు విజ్ఞప్తి చేశాడు. వైస్‌చాన్సలర్‌కు ఒక వినతిపత్రం కూడా ఇచ్చారు. మరునాడు జైళ్లల్లో వున్న విద్యార్థులు అమోస్‌ను ఉద్యోగం నుండి భర్తరఫ్ చేసినదానికి నిరసనగా నిరవధిక నిరహారదీక్ష ప్రారంభించారు. ఆ ఉద్యమంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థుల ఐక్యత ఆట్లా వర్ధిల్లింది. దోపిడికి ఆస్కారం లేని నవసమాజ నిర్మాణమే తెలంగాణా లక్ష్యం అని జి.యం. అంజయ్య ప్రకటించాడు. అతను సోషలిస్టు ఉద్యమ ప్రభావిత విద్యార్థి నాయకుడు. తర్వాత కాలంలో అతను సికింద్రాబాదు అడ్డగుట్టలో వేలాది గుడిసెలు వేయించి దరిద్ర నారాయణులకు, గుడిసెవాసులకు ఆరాధ్యదైవమయ్యాడు. అతను చనిపోయిన రోజున ఆ పేదసాదలు తమ అశ్రుఅభిషేకాలతో అతనికి వీడ్కోలు పలికారు. వందలాది మంది గుడిసెవాసులు పాల్గొన్న అతడి అంతిమ యాత్ర ఒక గొప్ప "ఆఖరి గౌరవయాత్ర". ఆనాటి తెలంగాణా ఉద్యమం "మట్టిలో నుండి మాణిక్యాల్ని" వెలికి తీసిందనటానికే ఈ ఉదాహరణ. తెలంగాణా ఉద్యమం నుండి ఉత్పత్తి అయిన చాలా మంది విద్యార్థులు, యువకులు ఆ తరువాత 1970-80 దశకాలలో అనేక ఉద్యమాలలో సమరశీలమైన పాత్ర వహించారు. స్వాతంత్ర్యోద్యమ వందేమాతర "తరం" తర్వాత కాలంలో ఎలా నిప్పులాగా బ్రతికిందో ఈ తెలంగాణా తరం కూడా ఆ తర్వాత అలాగే ఆ పోరాట వారసత్వాన్ని కొనసాగించింది. వారిలో నేటికి కొంత మంది సజీవులే. వారు తాము ఎత్తిన జండాను ఇంకా దించనే లేదు. అలాంటివారిలో శ్రీ కాళోజీ నారాయణరావు, జయశంకర్, కేశవరావ్ జాదవ్‌లు కొందరు మాత్రమే. ఇంకా చాలా మంది ఉన్నారు.- "ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని తమ కళ్లతో చూసి చనిపోవటానికి".

మే 31న ఉద్యోగం లేని అమోస్‌కు అండగా నిలబడతూ ప్రజలు పత్రికా కార్యాలయాలకు తమ విరాళాలను పంపారు. ప్రజల నైతిక, ఆర్థిక మద్దతు



www.etelangana.org

ఉద్యమానికి గొప్ప ఉత్సాహాన్నిచ్చింది. ఆ రోజు భారతీయ క్రాంతి దళ్ అధ్యక్షుడు చౌదరీ చరణసింగ్ ప్రత్యేక తెలంగాణాకు తమ పార్టీ మద్దతును ప్రకటించాడు. స్వతంత్ర పార్టీ, సంయుక్త సోషలిస్టు పార్టీలు కూడా అప్పటికే తమ మద్దతు ప్రకటించాయి. ఆరోజు నగరంలో తెలంగాణా మృతవీరుల స్మారక చిహ్నాన్ని నెలకొల్పాలని శ్రీధర్‌రెడ్డి నిర్ణయించాడు. తర్వాత కాలంలో అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌రాక్ పార్కులో ప్రముఖ తెలంగాణా కళాకారుడు, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన శిల్పి శ్రీ ఎక్కా యాదగిరిరావు గారు ఈ మృతవీరుల స్మారక స్థూపాన్ని రూపొందించాడు. (ఈ పుస్తకం ముఖ చిత్రం పైనున్న బొమ్మ అదే.)

జూన్ నెల మొదటి వారంలో జంటనగరాలలో జరిగిన మారణకాండ, ప్రభుత్వ దౌర్జన్యం యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. అంతకు ముందు ఫ్రాన్స్, పాకిస్తాన్, అర్జెంటైనాలలో జరిగిన విద్యార్థుల ఉద్యమాలు ఈ తెలంగాణా విద్యార్థి ఉద్యమం ముందు దిగదుడుపే అని పత్రికలు వాఖ్యానించాయి. స్వాతంత్ర్యం తర్వాత భారతదేశ చరిత్రలోనే ఇటువంటి విద్యార్థి, ప్రజా ఉద్యమాలు జరుగలేదని, ఇదే ప్రథమం అని ఫార్వర్డ్ బ్లాక్, భారతీయ క్రాంతి దళ్ లాంటి పార్టీలు ప్రశంసించాయి.

## అగ్నిగుండంగా మారిన జంటనగరాలు :

"ఒక వీరుడు మరణిస్తే
వేల కొలది ప్రభవింతురు"
- ఆవంత్స సోమసుందర్.

జూన్ 2వ తేదీ సోమవారం నుండి నాలుగు రోజులు కొనసాగిన అల్లర్లు, మారణకాండలో ప్రభుత్వ లెక్కల ప్రకారమే 30 మందికి పైగా మరణించారు. వందలాది మందికి గాయాలైనాయి. శాశ్వతంగా అవిటివారైనారు. అనధికార లెక్కలు తెలుసుకుంటే గుండెలు బద్దలౌతాయి. ఎన్ని సార్లు కర్ఫ్యూ విధించినా పరిస్థితి అదుపులోకి రానందున 33 గంటల పాటు నిరవధిక కర్ఫ్యూ విధించారు. జన జీవితం స్తంభించి పోయింది. అనేక జీవితాలు అల్లకల్లోలాలయినాయి. కుటుంబాలు కూలిపోయాయి. 4వ తేదీ బుధవారం నాడు జంటనగరాలలో 14 సార్లు కాల్పులు జరుగగా అక్కడికక్కడే రోడ్లమీద ఆ క్షణాలలోనే తొమ్మిది



మంది ప్రాణాలు విడిచారు. అందులో ఆరుగురు హైద్రాబాదులో, ముగ్గురు సికింద్రాబాదులో మరణించారు. కర్ఫ్యూ ఉన్న సమయంలో ఏడు సార్లు కాల్పులు జరిగాయి. బాష్పవాయువు, లాఠీచార్జీలకు లెక్కలేదు. యువకులను, విద్యార్థులను తెలంగాణా పోలీసులు లాఠీలతో కొట్టేటపుడు వారికి తమ పిల్లలు జ్ఞాపకం వచ్చి కండ్లల్లో నీళ్లు తిరిగాయని ఇప్పటికీ రిటైర్డు పోలీసులు చెప్పుతుంటారు. తెలంగాణా పోలీసుల్ని నక్సలైట్లను అణచటానికి ఆంధ్రా ప్రాంతానికి పంపి, మలబారు పోలీసుల్ని తెలంగాణాలో నియమించారు. వారికి ఇక్కడివారితో తాదాత్మ్యం లేనందున భాష రానందున క్రూరంగా ప్రవర్తించారు.

"నరకలోకపు జాగిలమ్ములు
గొలుసు త్రెంచుకు
ఉరికి పడ్డాయ్"
- శ్రీశ్రీ

హైద్రాబాదు నగరంలోని ఆబిడ్స్ చౌరస్తా సమీపంలో ఒక ప్రముఖ హోటల్ మరియు లాడ్జింగ్ ఉంది. దాని పేరు దుర్గావిలాస్. అది కోస్తా ఆంధ్రా వారిది. తెలంగాణా ఉద్యమాన్ని అణచటానికి ఆంధ్రానుండి కిరాయి గుండాలను, రౌడీలను తీసుకువచ్చి అందులో ఉంచారు.

## అమరవీరుడు ప్రేమ్ కిశోర్ :

"దమ్ నిక్‌లే ఇస్ దేశ్ కే ఖాతిర్
బస్ ఇత్‌నా అర్మాన్ హై
ఏక్ బార్ ఇస్ రాహ్ మే మర్‌నా
సౌ జన్మోంకే సమాన్ హై"

జూన్ 2వ తేదిన తెలంగాణా ప్రజాసమితి పిలుపుమేరకు నగరమంతా బందుకు ప్రతిస్పందించి సహకరించినా ఆ హోటల్ మాత్రం తెరిచే ఉంది. బందు చేయమని ప్రజలు వెళ్లి అడ్డినప్పుడు గొడవలు చెలరేగాయి. లోపలున్న రౌడీలు కారం పొడి కత్తులతో దాడి చేశారు. ఒక గంట సేపు హోటల్ ముందు రోడ్డుపై రెండు వర్గాలవారికి హోరాహోరి పోరాటం జర్గింది. హోటల్‌లోకి


www.etelangana.org

దూసుకుపోయిన ప్రేమ్ కిషోర్ అనే యువకుణ్ణి రౌడీలు ముందు షట్టర్లు దింపిలోపల చిక్కుకుపోయిన అతణ్ణి ఆ తర్వాత కత్తులతో పొడిచారు. ఆతని వయస్సు 18 సంవత్సరాలు మెకానిక్‌గా పనిచేసేవాడు. రౌడీలు షట్టర్లు మూయగానే లోపలనుండి ప్రేమ్ కిషోర్ అరుపులు వినిపించాయి. ప్రజలు అప్పటికే ప్రమాదాన్ని పసిగట్టి హాహాకారాలు చేశారు. కొంత మంది యువకులు ప్రాణాలకు తెగించి ఎలక్ట్రిక్ స్తంభం ఎక్కి హోటల్ బాల్కనీల గుండా కిటికీలలోకి దూరి హోటల్‌లోకి ప్రవేశించారు. అప్పటికే ప్రేమ్ కిషోర్ ప్రాణాలు కొన ఊపిరిన ఉన్నాయి. అభిమన్యుడిలా పద్మవ్యూహంలో చిక్కి తీవ్రంగా గాయపడిన ఆయువకుడిని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లటానికి పోలీసులు సహకరించలేదు. దారిన వెళ్లే ఒక ప్రైవేటు కారులో అతడిని ఉస్మానియాకు తీసుకెళ్లుతుంటే దారిలోనే ప్రాణాలు విడిచాడు.

"దిక్కుమొక్కులేని జనం
ఒక్కొక్కరు ఒక అగ్నికణం"

కర్ఫ్యూను లెక్కచేయని జనం వీధులలోకి పోలీసులతో గెరిల్లా పద్ధతిలో దాగుడుమూతలాడారు. ప్రజలు రోడ్లపై బారికేడ్లను నిర్మించారు. రోడ్లకు అడ్డంగా టెలిఫోన్ స్తంభాలను పీకి పడేశారు. చెత్తకుండీలను దొర్లించుకువచ్చి గోడలు కట్టారు. ఫుట్‌పాత్‌లను పగుల గొట్టి పెద్ద పెద్ద బండరాళ్లను రోడ్లపై వేశారు. కొన్ని చోట్ల టెలిఫోను వైర్లతో, ముళ్లకంచెలతో తమకు పోలీసులకు మధ్య సరిహద్దులను నిర్మించుకున్నారు. ఫైరింజన్లు, పోలీసు వాహనాలు దిగ్బంధనం చేయబడినాయి. పోలీసుకాల్పులలో ఉద్యమకారులే గాక అల్లర్లతో సంబంధంలేని సామాన్య ప్రజలు కూడా చనిపోయారో ఈ క్రింది ఘటనలు వివరిస్తాయి.

పాతనగరం అలియాబాదులో 4వ తేదీ బుధవారం నాడు పోలీసు కాల్పులు జరుగుతున్నాయి. మెయిన్ రోడ్డుమీదే టి. వెంకటేశ్వరరావు అనే న్యాయవాది ఇల్లు. పోలీసు కాల్పుల చప్పుడు అవుతుంటే ఏమీ తెలియని ఆయన చిన్న కొడుకు బయటి అరుగుమీద నిలుచుని చూస్తుంది. ఆ బాబును లోపలికి లాగటానికి ఆయన ఆదుర్దాగా ఇవతలికి వచ్చి పాపతో సహా ఇంట్లోకి వెళ్లబోతున్నాడు. గుండు దెబ్బ తలకు తగిలి ఆ తలుపుదగ్గరే క్రిందపడి ప్రాణాలు విడిచాడు. మెదడు చిట్లి అరుగుపై పడింది. ఇదే ప్రాంతం షక్కర్ గంజ్‌లో ఒక స్త్రీ ఇంట్లో బియ్యం



చేసుకుంటుంటే తూటా తగిలి గాయపడింది. కవాడీగూడాలో ఆకుల నరేందర్ అనే 18 సంవత్సరాల విద్యార్థి తన ఇంట్లో మేడపై కూచుని హెచ్.యస్.సి. పరీక్షలకోసం ప్రిపేర్ అవుతుండగా తూటాతగిలి అక్కడిక్కడే మరణించాడు. పుస్తకాలు రక్తపుమడుగులో తడిసిపోయాయి.

చాదర్‌ఘాట్‌లో 18 సంవత్సరాల రేణుక అనే బాలిక గుండ్ల దెబ్బలకు మరణించింది.

బేగంపేట బ్రాహ్మణ్‌వాడలో బట్టలు ఉతుక్కుంటున్న ముగ్గురు స్త్రీలకు తూటాలు తగిలాయి.

ఒక ప్రాంతంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంట్లో చొరబడి అతడి కొడుకు తన తండ్రి ఉద్యోగం గురించి చెప్తున్నా వినకుండా చితకబాదారు. మలబారు పోలీసులకు మన భాషరాక పోవటం దీనికి ఒక కారణం.

సికింద్రాబాదు కోనేరు సమీపంలోని ఒక ఇంటి ముందు ఆ ఇల్లాలు చంకలో 5 సంవత్సరాల కొడుకును ఎత్తుకుని సంఘటనలు చూస్తుండగా గుళ్ల వర్షం కురిసి ఆ తల్లి కొడుకులిద్దరూ మరణించారు.

పెండ్లి చూడటానికి వెళ్తున్న వీరకుమారి అనే 18 సంవత్సరాల యువతి సికింద్రాబాదులోని ఓల్డ్‌ఘూస్ మండీ ప్రాంతంలో తూటా తగిలి గాయపడింది. హఠాత్తుగా కాల్పులు జరుగటంతో భయం వలన తాను పరిగెత్తలేక పోయానని చెప్పింది.

అదే ప్రాంతంలో పుట్టుకతో బధిరుడైన ఒక వృద్ధుడు కాల్పులు జరుగుతుంటే వినబడక తన త్రోవన తాను వెడుతున్నాడు. బుల్లెట్ వచ్చి తొడమీద తగిలినపుడుగాని కాల్పుల సంగతి అతనికి తెలియరాలేదు.

**కర్ఫ్యూలో జనజీవనం :**

ఈ సంఘటనలన్నీ ఒక్క బుధవారం నాడే జరిగినాయి. ఇంతేగాక కర్ఫ్యూ అమలులో ఉన్నపుడు ప్రజల సాధారణ రోజువారీ జీవితం ఎట్లా ఇబ్బందులకు గురిఅయ్యిందో, కర్ఫ్యూలో జనజీవనం ఎలా అల్లకల్లోలమైందో గమనించండి:


www.etelangana.org

అల్లర్లు రెండవ దినం ప్రారంభమైనాయి. చాలా మందికి ఇంకా జీతాలు రాలేదు. జీతాలు వచ్చినా సరుకులు కొనటానికి దుకాణాలు తెరిచి లేవు. అందరి ఇళ్లల్లో సరుకులు నిండుకున్నాయి. ప్రక్కింట్లో నుండి చేబదులు తీసుకురావాలన్నా అందరి ఇళ్లల్లోనూ అదే పరిస్థితి. రోజు కూలీనాలి చేసుకునే వారి పరిస్థితి మరీ అధ్వాన్నం. ఆస్పత్రికి వెళ్లవలసిన ఎమర్జెన్సీ కేసులు అంతే సంగతి. దైవాధీనం. కనీసం వీధిలోకి వెళ్లి బజారు నల్లాలో నీళ్లు పట్టుకోవాలన్నా తుపాకీ తూటాల భయం. పోలీసు లాఠీల భయం. గల్లీలలో చిన్నచిన్న దుకాణాల్ని రహస్యంగా సగం సగం తెరిచి, భయం భయంగా సరుకుల్ని అమ్మేవారు. కర్ఫ్యూ ఎత్తివేయగానే లేదా సడలించగానే ధరలు చుక్కల్ని తాకాయి. 30 పైసల చార్మినార్ సిగరెట్ పెట్టె 50 పైసలకమ్మారు. టమాటలు, బెండకాయలు, వంకాయలు కిలో 2 1/2, 3 రూపాయలకు అమ్మారు. ఎక్కడైనా ఒక చిన్న హోటల్ తెరిచి ఉంటే టీ, కాఫీలు పాలు, శక్కర లేకుండా అమ్మారు. ఇక దినపత్రికల సంగతి చెప్పనక్కర్లేదు. ప్రజలకు తిండిలేకున్నా సరే తెలంగాణా ఉద్యమం వార్తలు కావాలె. బ్లాకులో పేపర్లు ఎక్కువ ధరకు అమ్మినా సంతోషంగా కొనుక్కున్నారు. ప్రతి ఇంట్లో పురాణ శ్రవణం లాగా ఎవరో ఒకరు పేపరు పెద్దగా చదువుతుంటే అందరూ చుట్టుకూర్చుని శ్రద్ధగా వార్తలు వినేవారు. రేడియోలో ప్రాంతీయ వార్తలు ఎప్పుడు వస్తయా అని ఎదురుచూపులతో గడిపేవారు. వార్తలు చదువుతూ, వింటూ కళ్ల నీళ్లు పెట్టుకునేవారు. ఉద్రేకపడేవారు, సర్కారుకు శాపాలు పెట్టేవారు. పిల్లల్ని ఆందోళనలో పాల్గొనకుండా ఆపటం పెద్దలకు తలనొప్పిగా పరిణమించింది. వారిని ఇళ్లల్లో బంధించి, తలుపులకు తాళాలు వేసేవారు. పిల్లలకు, అవతలకు వెళ్లి సాహసాలు చేయాలని మహా కుతూహలంగా ఉండేది. ఒక వాడలోని పిల్లవాడు జైలులో వుంటే ఆ వాడకట్టు వాళ్లందరూ మిఠాయిలు, పండ్లు పట్టుకుని జైలుకెళ్లి "ములాఖాత్" చేసి వాడిని పరామర్శించేవారు. ఈ తెలంగాణా ఉద్యమం వలన తెలంగాణా ప్రజలలో ఒక నూతన పోరాట సంస్కృతి వ్యాపించింది. అందుకే "ఈ తెలంగాణా గడ్డ పోరాటాల పురిటిబిడ్డ" అని అంటారు. అది నైజాం వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేకపోరాటమే గానివ్వండి, దున్నేవానికే భూమి పోరాటమే కానివ్వండి, ప్రత్యేక తెలంగాణా పోరాటమే కానివ్వండి ఈ గడ్డబిడ్డలు సుఖం అనేదే లేకుండా అనేక పోరాటాల్ని "సిల్‌సిలాగా" కొనసాగిస్తూనే ఉన్నారు. "తన చరిత్రను తానే పఠించి పక్కున నవ్వెను ధరిత్రి". ఇది తెలంగాణా నేల తల్లికి మాత్రమే వర్తిస్తుంది. కష్టాల్ని ఏరి, కోరి వరించిన పోతన పోరాట వారసత్వం ఇదేనేమో!



ఆ రోజు వరంగల్ పట్టణంలో 24 గంటల కర్ఫ్యూ విధించబడింది. పోలీసు కాల్పులలో ముగ్గురు చనిపోయారు.

**అర్థరాత్రి అనుకోని అతిథి - ప్రధాన మంత్రి :**

ఆ బుధవారం, జూన్ 4వ తేదీన ఇంటలిజెన్స్ రిపోర్టులు అందుకున్న ప్రధానమంత్రి ఇందిరాగాంధి ఒక క్షణం ఆలస్యం చేయకుండా హైద్రాబాదు నగరానికి అర్థరాత్రి వచ్చి తెల్లారేవరకు విద్యార్థి నాయకులు, తెలంగాణా ప్రజాసమితి నాయకులతో సహా అన్ని పార్టీలవారిని సుమారు 45 మందిని కలిసింది. అందరితో విడివిడిగా సమావేశమై వారివారి అభిప్రాయాల్ని తెలుసుకుని చర్చించింది. ఆమె విలేఖరులతో మాట్లాడుతూ "33 గంటల నిరంతర కర్ఫ్యూ వార్తవిని ఆందోళన చెంది వచ్చానని, శాంతి కోసం తెలంగాణా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని, ప్రశాంత పరిస్థితులు ఏర్పడగానే అన్ని విషయాలూ చర్చించుకోవచ్చని" అన్నారు. వెంటనే ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేసి రాష్ట్రపతిపాలన విధించాలని తెలంగాణా ప్రజాసమితి మళ్లీ విజ్ఞప్తి చేసింది.

ఇంత జరిగినా తెలంగాణా మంత్రులు, శాసన సభ్యులు ఉద్యమానికి మద్దతు ఇచ్చారే కాని పదవులకు మాత్రం రాజీనామా ఇవ్వలేదు.

జూన్ 5న సికింద్రాబాదులో జరిగిన పోలీసుల కాల్పులలో షఫీక్ అహమ్మద్ అను వెస్లీ బాయిస్ మల్టీపర్పస్ స్కూల్ విద్యార్థి మృతి చెందాడు.

జూన్ 6న హైద్రాబాదు నగరంలో తెలంగాణా రచయితల సదస్సు జరిగింది. శ్రీకాళోజీ నారాయణరావుగారు అధ్యక్షుడిగా ఒక కమిటీ ఏర్పడింది. ఆ సదస్సుకు హాజరయిన రచయితలంతా ప్రత్యేక తెలంగాణా కొరకు పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు.

అదే రోజు రాష్ట్ర ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం ప్రారంభించింది. అనేక పట్టణాలలో దర్నాలు జరిగాయి. నగరంలో డాక్టర్ రాజ్‌బహద్దూర్ గౌర్ నిరవధిక నిరాహారదీక్ష ప్రారంభించారు.


www.etelangana.org

**కార్మికుల సమ్మెలు :**

జూన్ 7న ఆ మూడు రోజుల పోలీసు కాల్పులకు నిరసనగా జంటనగరాలలోని 2½ లక్షల మంది కార్మికులు సమ్మె చేశారు. అన్ని జిల్లాల్లోని తెలంగాణా కార్మికులు హైద్రాబాదులో ఒక సదస్సు జరుపుకుని ఒక కార్యాచరణ సమితిని ఏర్పాటు చేసుకున్నారు. దాని అధ్యక్షుడు గోవింద్ సింగ్. ఆ రోజు సుమారు 110 ఫ్యాక్టరీలలో సమ్మెజరిగింది. సనత్‌నగర్‌లోని ఆల్విన్, ఆస్బెస్టాస్, ఆంధ్ర ఎలక్ట్రికల్స్, కవాడీగూడాలోని ప్రాగాటూల్స్, బాలానగర్‌లోని ప్రభుత్వ యాజమాన్యానికి చెందిన సింథటిక్ డ్రగ్స్‌లలో సంపూర్ణ సమ్మె జరిగింది. కొన్ని చోట్ల సమ్మెలలో సి.పి.ఐ.కి చెందిన ఏ.ఐ.టి.యు.సి. కార్మికులు కూడా పాల్గొన్నారు. తెలంగాణా రక్షణల కోసం, రాష్ట్రపతి పాలన విధింపు కోసం తాము సమ్మె చేస్తున్నామని వారు ప్రకటించారు.

జూన్ 10 నుండి నిరవధిక సమ్మె ప్రారంభించబోతున్నమని తెలంగాణా ఎన్.జి.వో.ల సంఘం ప్రకటించింది. వారితో పాటు పదివేల మంది విద్యుత్ కార్మికులు కూడా సమ్మెలో పాల్గొంటామని ప్రభుత్వానికి నోటీసు ఇచ్చారు.

ఈ రోజు కేంద్ర హోంమంత్రి వై.బి. చవాన్ హైద్రాబాదు సందర్శించాడు. అన్ని వర్గాలవారు రాష్ట్రపతిపాలనకు డిమాండు చేశారు.

**తెలంగాణా ఉద్యోగుల నిరవధిక సమ్మె - సస్పెన్షన్లు :**

జూన్ 10 నుండి మొత్తం తెలంగాణాలో తెలంగాణా ఉద్యోగుల నిరవధిక సమ్మె ప్రారంభమయ్యింది. పాఠశాలలు ప్రారంభం కాగానే తాము సమ్మెలో చేరుతామని తెలంగాణా ఉపాధ్యాయులు ప్రకటించారు. అన్ని ప్రభుత్వ శాఖలలోనూ సమ్మె సంపూర్ణంగా విజయవంతమైంది. పాల్వంచ థర్మల్ పవర్ స్టేషన్‌లో కార్మికుల సమ్మె వలన రాష్ట్రంలో విద్యుత్ కొరత, కోత ఏర్పడ్డాయి.

జూన్ 12న తెలంగాణా ప్రజాసమితి మరియు విద్యార్థికార్యాచరణ సమితిలు ఒక ప్రకటన చేస్తూ ప్రభుత్వ దమన నీతికి వ్యతిరేకంగా జూన్ 16న తెలంగాణా బంద్ జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చింది.



ఈ పిలుపుతో ప్రభుత్వానికి ఆగ్రహం వచ్చి జూన్ 14న 29 మంది తెలంగాణా ఉపాధ్యాయ నాయకుల్ని ఉద్యోగాలనుండి సస్పెండ్ చేసింది. వారిలో పి. రామబ్రహ్మం, బాలకృష్ణారెడ్డి, ఎ. నర్సింహారెడ్డి మొదలగు ప్రముఖ ఉపాధ్యాయ సంఘం నాయకులున్నారు. వారు ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో పాల్గొంటున్నారని ప్రభుత్వం ఫిర్యాదు. ఆ మరునాడే స్కూళ్లు కాలేజీలు తెరిచే తేదిని కూడా నిరవధికంగా వాయిదా వేసింది.

జూన్ 16న తెలంగాణా బంద్ సంపూర్ణంగా విజయవంతమయ్యింది. ఒక వనపర్తిలో మాత్రం పోలీసు కాల్పులు జరిగాయి. నగరంలో లక్షలాది మంది పారిశ్రామిక కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. బస్సులే కాదు చివరికి రిక్షాలు కూడా రోడ్లపై నడవలేదు. రిక్షా కార్మికుల సంఘం కూడా బందుకు తమ మద్దతును తెలియ చేసింది.

జూన్ 20న తెలంగాణా ఉద్యోగుల సంఘం నాయకులైన ఎస్.ఎల్.ఎన్. చారిని, బి.స్వామినాధంను ప్రభుత్వం అరెస్టు చేసింది. అమోస్ అప్పటికింకా జైలులోనే ఉన్నారు. ఆ రోజు ఆబిడ్స్‌లో ప్రజలు సత్యాగ్రహం చేసి పెద్ద సంఖ్యలో అరెస్టు అయ్యారు. ఆ సత్యాగ్రహం సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ పటాన్ని రెండు ముక్కలు చేసి తెలంగాణా పటాన్ని అక్కడే ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీకి కేరింతల మధ్య బహుకరించారు. ఆంధ్రా ముక్కను చించివేసి తగులబెట్టారు. ఈ సన్నివేశం ప్రజామనోభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

**జర్నలిస్టు పాశం యాదగిరిగారి 'ఆనాటి ముచ్చట్లు' :**

జూన్ 21న తెలంగాణా అంతటా జరిగిన సత్యాగ్రహంలో ఐదు వేల మంది అరెస్టు అయినారు. సత్యాగ్రహులపై క్రూరంగా లాఠీచార్జీ జరిగింది. జైళ్లన్ని నిండిపోయి చోటు లేక నగరంలో సిటీ కాలేజిని జైలుగా మార్చారు. అనేక స్కూళ్లను జైళ్లుగా మార్చారు. ఈ నాటి ప్రముఖ తెలంగాణా జర్నలిస్టు పాశం యాదగిరి ఆ నాటి ముచ్చట్లను వర్ణిస్తూ ఇలా చెప్పారు. "అప్పుడు మేం గౌలిగూడా బస్ డిపో వెనుక ఉండేవాళ్లం. నేను పాతనగరంలోని ధర్మవంత్ హైస్కూలు విద్యార్థిని. చాలా చిన్న వాణ్ణి. ఒక రోజు జై తెలంగాణా నినాదాలు చేస్తూ, సత్యాగ్రహం చేసి అరెస్టు అయ్యాను. జైలుకు తీసికెళ్లి 'సర్కారీ మెహమాన్'ను


www.etelangana.org

కాబట్టి చక్కగా అతిథి మర్యాదలు చేసి కమ్మటి భోజనం పెడ్తారనుకున్నాను. నాకు ఆ అదృష్టం దొరకలేదు. నగరంలో అరెస్టైన నన్ను మిగతా స్నేహితులను వ్యాన్ ఎక్కించి కూకట్‌పల్లి అవతల చాలా దూరం అడివిలో దింపేశారు. అదీ పనిష్మెంట్. ఖాళీ వ్యాన్ వెనక్కి వెళ్లింది. జేబులో పైసలు లేవు. మేము ఆకలితో నడుస్తూ, కాళ్లు పీకుతుండగా ఏ అర్ధరాత్రో ఇంటికి చేరాం”.

ఈ తెలంగాణా ఉద్యమం చరిత్రలోనే ఒక అపూర్వ ఉద్యమమని భారతీయ క్రాంతి దళ్, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు ప్రకటన చేసి తమ మద్దతును తెలియచేశాయి.

జూన్ 24న ఢిల్లీలో తెలంగాణా నాయకులతో ప్రధాని చర్చలు జరిపారు. ఫలితం శూన్యం. తెలంగాణా కాదు సరికదా కనీసం రాష్ట్రపతిపాలనకు కూడా ఒప్పుకోలేదు. ఈ వార్త తెలిసి ప్రజలు తండోపతండాలుగా సత్యాగ్రహంలోకి దూకారు. సిటీ సివిల్ కోర్టు ఆవరణలోనే సత్యాగ్రహులపై లాఠీచార్జీ జరిగింది. పబ్లిక్‌గార్డెన్ ఎదురుగా ఉన్న పోలీసు కంట్రోలు రూంలో అరెస్టు చేయబడ్డ మహిళా సత్యాగ్రహులపై కూడా లాఠీచార్జీ జరిగింది.

ఆ రోజు మొదటి సారిగా ఆబిడ్స్‌లో జర్నలిస్టులు సత్యాగ్రహం చేసి అరెస్టు అయ్యారు. తాము కూడా ప్రతిరోజు సత్యాగ్రహంలో పాల్గొంటామని నగర స్వర్ణకారుల సంఘం ప్రకటించింది. దుకాణాలలోపని చేసే గుమస్తాల సంఘం నాయకుడు పి. వాసుదేవ్ కూడా ఇలాంటి ప్రకటన చేశాడు. ఈ రెండు ప్రకటనలవల్ల తెలంగాణా ప్రజా ఉద్యమం పునాదులు ఎంతలోతైనవో ప్రభుత్వానికి తెలిసింది.

ఆ రోజు తెలంగాణా అంతటా రైళ్ల రాకపోకలకు అంతరాయం కల్గింది. అనేక రైల్వే స్టేషన్లను తగులబెట్టారు.

జూన్ 25న హైద్రాబాదులో జరిగిన సత్యాగ్రహం స్వాతంత్రోద్యమ కాలం నాటి పోరాటదృశ్యాలను జ్ఞాపకానికి తెచ్చింది. అనేక సంఘటనలతో హైద్రాబాదు దద్దరిల్లింది. ఆ రోజు మొత్తం తెలంగాణాలో 50 వేల మంది సత్యాగ్రహం చేసి అరెస్టయ్యారని పత్రికలే రాశాయి. జైళ్లు నోళ్లు తెరుచుకున్నాయి. ఆరోజు అల్లర్లతో హైద్రాబాదు అగ్నిగుండంగా మారిపోయింది. అనేక జిల్లాలో, పట్టణాలలో కూడా అదే పరిస్థితి.



## చరిత్రను రికార్డు చేసిన 'ఆబిడ్స్ చౌరస్తా' :

“ప్రజలే చరిత్ర నిర్మాతలు
చారిత్రక చోదక శక్తులు”

ఆ రోజు ఆబిడ్స్ చౌరస్తాలో జరుగబోయే సత్యాగ్రహం ఆపాలని పోలీసులు ఉదయం నుండి ఆబిడ్స్‌కు చేరుకునే అన్ని మార్గాలను దిగ్బంధనం చేశారు. వీధులలో సైన్యం ఫ్లాగ్ మార్చ్‌చేసి ప్రజలలో భయం సృష్టించాలని ప్రయత్నం చేసింది. అయినా ప్రజలు బెదరలేదు. బస్సులన్నింటినీ ప్రభుత్వమే బందు చేసింది. అయినా ప్రజలు కాలినడకన వచ్చారు. పెద్ద ఎత్తున కాల్పులు జరుగుతాయని పుకార్లను సృష్టించింది. అయినా జనం ప్రభంజనంలా మారిపోయారు. ఆ రోజు విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులే కాక స్త్రీలు, పిల్లలు, వృద్ధులు అందరూ కదలివచ్చారు. లాయర్లు, డాక్టర్లు, వ్యాపారస్తులు, కార్మికులు కూడా సత్యాగ్రహానికి తరలివచ్చారు. ఆ జన ప్రవాహాన్ని ఆపటం పోలీసులకు చాతకాలేదు. సత్యాగ్రహం చేస్తున్న వేలాది మందిని ఎట్లా అరెస్టు చేయాలో, ఎట్లా తీసుకెళ్లాలో వారికి తోచలేదు. చివరికి ఆ జన సముద్రాలను చెదరగొట్టటానికి విపరీతంగా, విచక్షణారహితంగా లాఠీ చార్జీ చేసి టియర్ గ్యాస్‌లను వదిలారు. పోలీసులు ప్రజలను లాఠీలతో కొడ్తుంటే లాఠీలే విరిగిపోయాయి. తెలంగాణా నేలతల్లి రక్తసిక్తమయ్యింది. ఒళ్లంతా గాయాలమయ మయ్యింది. ఆబిడ్స్‌లో పోలీసులు యువకుల్ని లాఠీలతో కొడుతూ టియర్ గ్యాస్ వదులుతుంటే అనేక మంది యువకులు తమ షర్టులను చింపుకుని ఛాతీలను చూపిస్తూ దమ్ముంటే కాల్చమని సవాలు చేసారు. భవనాలపై నిలబడి, కిటికీలలో నుండి చూస్తున్న చాలా మంది ప్రజలు ఆ యువకులు, విద్యార్థులు తింటున్న దెబ్బల్ని చూసి హాహాకారాలు చేశారు. కంటతడిపెడ్తూ గొల్లున ఏడిచారు. సమీప దుకాణంలో పని చేస్తున్న ఒక యువకుడిని పోలీసులు అకారణంగా కొడ్తుంటే, ఆ యువకుడు గోడుగోడున ఏడుస్తూ తాను సత్యాగ్రహిని కాదని పని చేసే నౌకరునని మొత్తుకున్నా వినలేదు. చివరికి అతడి తల పగిలింది. అంత వరకు తనను కాల్చమని ఛాతీ చూపించిన మరో యువకుడు పరుగుపరుగున అక్కడికి వచ్చి తన షర్టుని చింపి ఆ యువకుడి తలకు కట్టుకట్టాడు. ఇటువంటి అపూర్వ, మానవతా దృశ్యాలు ఆ ఉద్యమంలో ఎన్నో జరిగాయి.


www.etelangana.org

"ఇతరేతర శక్తులు లేస్తే
పడిపోయెను పేకమేడలై!
పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్ర పుట్టెను"

- శ్రీశ్రీ

లాఠీ చార్జీ, బాష్పవాయువుల నుండి తప్పించుకోవటానికి ప్రజలు సమీపంలో ఉన్న ప్యాలెసుటాకీసు, సాగర్‌టాకీసులలోకి దూరారు. అయినా పోలీసులు వారిని వెంబడించి తరిమితరిమికొట్టారు. ఇంతలో అక్కడికి వచ్చిన సర్వేఆఫ్ ఇండియా జీపును ప్రజలు పూర్తిగా తగులబెట్టారు. ఆ మంటల్ని ఆర్పటానికి వచ్చిన ఫైర్ ఇంజన్ చక్రాలలో గాలిని తీసివేసి దాన్ని కూడా తగులబెట్టారు. అల్లర్లు నాంపల్లి, మోజంజాహీ మార్కెట్టు, సుల్తాన్ బాజార్‌లకు వ్యాపించాయి. విద్యానగర్ రైల్వే స్టేషన్‌లో వేలాది మంది ప్రజలు రైలు పట్టాలపై భైఠాయించి రైళ్లు రాకపోకలకు భంగం కల్గించారు.

## సంయమనం పాటించిన శ్రీధర్‌రెడ్డి :

ఆబిడ్స్‌లో సత్యాగ్రహం చేస్తున్న ప్రజలు అక్కడికి సమీపంలో వున్న బృందావన్ హోటల్ ముందు (దుర్గావిలాస్ హోటల్ కూడా వీరిదే) వేలాది మంది ఆగ్రహావేశాలతో గుమికూడారు. అప్పటికే ఆ హోటల్ మీద వారికి చాలా ద్వేషం ఉంది. జూన్ 2వ తేదీన ప్రేమ్ కిషోర్ అను యువకుణ్ణి ఆ హోటల్ వారు కత్తులతో పొడిచిచంపారు. ఆంధ్రానుండి దిగుమతి చేసుకున్న కిరాయి గుండాలకు ఆ హోటల్ బసగా మారింది. ఈ కారణాల వలన గుమికూడిన ప్రజలు హోటల్‌పై దాడి చేసి బోర్డును పీకేశారు. అందులోకి దూరి గ్లాసులు ప్లేట్లు బద్దలు కొట్టటమే గాక ఫర్నిచర్‌ను ఇవతలికి లాక్కొచ్చి రోడ్డు మీద కుప్పగా పోసి తగులబెట్టారు. ప్రేమ్ కిషోర్ అమర్‌హై అని నినాదాలు చేశారు. ఈలోగా ఆబిడ్స్ పోలీసుస్టేషన్ పైకూడా దాడిచేశారు. ఈ హోటల్ పై భాగం టెర్రేస్ పై దాక్కున్న కిరాయి రౌడీలు క్రిందున్న ప్రజలపై రాళ్లు సోడాసీసాలు విసరటం ప్రారంభించారు. రెచ్చిపోయిన గుంపులు మళ్లీ హోటల్ లోపలికి చొచ్చుకుని వెళ్లగా లోపలి గుండాలు కారంపొడి, చైన్లు, కత్తులతో దాడి చేశారు. ఆ యుద్ధం



రెండు గంటల పాటు కొనసాగింది. చివరికి పోలీసులు కాల్పులు జరుపటానికి సిద్ధపడ్డారు. ఆ దశలో శ్రీధర్ రెడ్డి మరి కొంతమంది యువకులు పోలీసులకు, ప్రజలకు మధ్య బారికేడ్లలాగా నిలుచుని ఇరువర్గాల వారిని (పోలీసులను, ప్రజలను) శాంతింపచేసే ప్రయత్నాలు చేశారు. అనేక సార్లు శ్రీధర్ రెడ్డి రెండు చేతులు ఎత్తి రెండు వైపులా దండం పెట్టాడు. ఒక దశలో కాల్పులు జరిపేదుంటే ముందు నన్ను కాల్చిచంపండి అని వేడుకుంటూ తన లాల్చీని చింపుకుని ఛాతీని చూపించాడు. అప్పుడు పోలీసులు వెనక్కి తగ్గారు. లేకపోతే ఆ రోజు చాలా మంది ప్రాణాలు గాలిలో కలిసేవి. ఇటువంటి అద్భుత సాహసదృశ్యాలు, మానవతా దృశ్యాలు ఆ ఉద్యమంలో ఎన్నో జరిగాయి. మామూలు ప్రజలు ఎన్నో వీరోచిత సాహసకార్యాలు చేశారు.

సికింద్రాబాదులోని రాష్ట్రపతిరోడ్డులో విశ్వకర్మజట్టు ప్రత్యేకంగా సత్యాగ్రహం చేసి అరెస్టయ్యింది. అరెస్టు చేసిన వేలాది మందిని సిటీకాలేజికి తరలించారు. కోపం పట్టలేని ప్రజలు అక్కడి ప్రిన్సిపాల్ ఆఫీసును పూర్తిగా తగులబెట్టారు.

## ముషీరాబాద్ జైలు లోపల.......... :

"జై"లు, జైలు, "జై"లు
"జై"లు కొడితే జైలు
జైలు కెడితే "జై"లు
జైలు లో మళ్ళీ "జై జై" లు.
"జై జై" లలో ఖైదీ ఐన జైలు.

- వేణు సంకోజు.

(ఐక్య విద్యార్థి మాసపత్రిక, 1972)

అదే రోజు రాత్రి ముషీరాబాదు జైలులో సత్యాగ్రహులపై లోపలున్న ఖైదీలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీని వెనుక జైలు అధికారుల ప్రోత్సాహం కూడా ఉంది. ఆ రోజు రాత్రి భోజనాల సమయంలో ఖైదీలకు ఇచ్చే రేషన్ విషయమై సత్యాగ్రహులకు ఖైదీలకు గొడవ జరిగింది. దాన్ని సాకుగా తీసుకుని ఖైదీలు గూడుపుఠాణీ చేసి ఒక పద్ధతి ప్రకారం పొయ్యికట్టెలు, కారం, గంటెలు, మొదలగు వంట సామానులతో నిరాయుధులైన సత్యాగ్రహులపై దాడిచేసి



www.etelangana.org

తీవ్రంగా కొట్టారు. గొడవలు చెలరేగగానే పోలీసులు జోక్యం చేసుకుని మళ్లీ సత్యాగ్రహులనే టార్గెట్లుగా చేసి కొట్టారు. జైలు ఆవరణలో గాలిలోకి కాల్పులు జరిపారు. డెబ్బై మంది సత్యాగ్రహులకు రక్తపాతంతో తీవ్రగాయాలైనాయి.

జైలులోపల పోలీసుల విజిల్సు, అరుపులు, కాల్పుల చప్పుడు, హాహాకారాలు, జై తెలంగాణా నినాదాల వలన లోపల ఏదో ప్రమాదం జరిగిందని జైలుచుట్టు ప్రక్కల ఇళ్లలోని వారికి తెలిసి పోయింది. క్షణాలలో వార్త పట్టణమంతా ప్రాకింది. నగరం నలుమూలల్నుండి సత్యాగ్రహ ఖైదీల తల్లి దండ్రులు, బంధుమిత్రులు, రాజకీయ నాయకులు తండోపతండాలుగా ముషీరాబాదు జైలుకు చేరుకున్నారు. స్త్రీలు పిల్లల రోదనలతో పరిసరాలు దద్దరిల్లాయి. ప్రజలు జైలును చుట్టు ముట్టి తమ వారిని వెంటనే చూడాలని పట్టుబట్టారు. తమ వారిని పేరు పేరునా జైలు గోడలకు ఇవతల నిలబడి పిలువసాగారు. గేట్లను దబదబా బాదారు. రాళ్లు విసరటం మొదలయ్యింది.

జైలు అధికారులపై తిట్లు శాపనార్థాలు మొదలైనాయి. రోడ్లపై గాయపడినవారిని ఆస్పత్రికి పంపమని ప్రజలు జైలు ముందు భైఠాయించారు. దానివలన గాయపడిన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లటానికి కూడా వీలు లేకండా జైలు ముందు, రోడ్లపైన ప్రజాసమూహాలు పోగైనాయి. అందరీ కళ్లల్లోనూ తమ వారికేమైందో అన్న ఆందోళనా, ఆదుర్దా. కొంతమంది లోపలికి దూసుకుపోయే ప్రయత్నాలు చేశారు. చివరికి వారిని చెదరగొట్టటానికి మళ్లీ పోలీసులు లాఠీచార్జీ చేసి, టియర్ గ్యాస్ వదలవలసి వచ్చింది. ఈలోగా జైలు ఇవతలి నుండి పెట్రోలుతో తడిపిన గుడ్డలను కిటీకీల నుండి లోపలికి విసిరివేయగా జైలు ఆఫీసు తగలబడటం మొదలయ్యింది. దాన్ని ఆర్పటానికి ఫైర్ ఇంజన్లు వచ్చినా ప్రజలు దారి ఇవ్వనందున దూరంగానే ఆగిపోయాయి. జైలులోపల గొడవల సంగతి తెల్సి కాంగ్రేసు నాయకుడు పార్లమెంటు సభ్యుడైన జి. వెంకటస్వామి జీపులో జైలు దగ్గరికి రాగానే ఆయన జీపు బోల్తాపడి ఆయన తలకు తీవ్రగాయాలై ఆసుపత్రి పాలైనాడు. పోలీసులు పేల్చిన తూటా తన జీపు టైరుకు తగలటం వల్లనే జీపు బోల్తాపడిందని ఆయన కోలుకున్న తర్వాత చెప్పాడు. చివరికి జైలు దగ్గర పోగైన ప్రజలందర్ని చెదరగొట్టి గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లారు.



ఈ జైలు గొడవల వలన చాలా రోజుల వరకు జైలు "ములాఖాత్‌లు" రద్దు చేశారు.

**అగ్రనాయకుల అరెస్టులు - రాజమండ్రి జైలుకు తరలింపులు :**

ఆ రోజు రాత్రి ప్రభుత్వం 16 మంది అగ్రనాయకులను అరెస్టు చేసి తెల్లవారకముందే తెలంగాణా సరిహద్దుల్ని దాటించి రాజమండ్రి జైలుకు పంపించింది. మర్రి చెన్నారెడ్డి, కొండా లక్ష్మణ్ బాపూజీ, బద్రి విశాల్ పిట్టీ, హాషిం, అచ్యుత రెడ్డి, సి. మాణిక్యరావు, ఇ.వి. పద్మనాభన్, సంతపురి రఘువీరరావు, శంకర్‌రావ్ బిలోలికర్ మొదలైన వారు వారిలో ఉన్నారు. తెల్లవారి ప్రజలు నిద్రలేచేసరికి నాయకుల అరెస్టులు వారికి ఆశ్చర్యాన్ని, ఆగ్రహాన్ని కల్గించాయి.

అట్లా తెలంగాణా ఉద్యమంలో జూన్ 25 తేదీ ఒక మరుపురాని దినంగా, ఒక రక్తపాత దినంగా మిగిలిపోయింది. తెల్లవారి జూన్ 26న అగ్రనాయకుల అరెస్టులకు, జైలులో సత్యాగ్రహులపై దౌర్జన్యానికి నిరసనగా ఎటువంటి పిలుపు లేకుండా ప్రజలు స్వచ్ఛందంగా జంటనగరాల బందును నిర్వహించారు. మళ్లీ లాఠీచార్జీలు నిత్యకృత్యమైపోయాయి. పారిశ్రామిక కార్మికులు మళ్లీ సమ్మె చేశారు. ఘట్కేసర్‌లో వున్న బ్రూక్‌బాండ్ కార్మికులు మొదటిసారి సమ్మెలోకి దిగారు. ఒక సందర్భంలో రెచ్చిపోయిన ప్రజలు పోలీసుల చేతిలో నుండి తుపాకులను గుంజుకునే ప్రయత్నం చేశారు.

అగ్రనాయకుల అరెస్టులకు నిరసనగా పార్లమెంటు సభ్యులైన డాక్టరు మేల్కోటే, సంగం లక్ష్మీబాయమ్మలు తమ లోక్‌సభ స్థానాలకు రాజీనామా ఇస్తామని సంసిద్ధతను తెలియచేశారు.

ఉస్మానియా యూనివర్సిటీ నాన్‌టీచింగ్ సిబ్బంది నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. అప్పటికి రాష్ట్ర ప్రభుత్వఉద్యోగుల సమ్మె విజయవంతంగా కొనసాగుతూనే ఉంది. సికింద్రాబాదులో వెండిబంగారు నగల వర్తకులు ఒక ప్రత్యేక ఊరేగింపును నిర్వహించారు.

జంటనగరాలలోని న్యాయవాదులు నాలుగు వందల కార్లలో ఊరేగింపుగా బయలుదేరి రాజభవన్‌కు చేరుకుని గవర్నర్‌ను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని భర్తరఫ్


www.etelangana.org

చేసి రాష్ట్రపతిపాలనను విధించాలని మహాజరును సమర్పించారు. న్యాయవాదులు రంగంలోకి దిగి అటువంటి కార్ల ఊరేగింపు నిర్వహించటం అంతవరకు కనీవినీ ఎరుగని అద్భుత దృశ్యం.

జూన్ 27న ఉదయం తొమ్మిది గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఢిల్లీలోని కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు నిజలింగప్పకు సమర్పించారు. రాజీనామా లేఖను గవర్నర్‌కు ఇవ్వకుండా కాంగ్రెసు పార్టీకి ఇవ్వడంలోనే ఆయన కుటిలనీతి తెలిసిపోయింది. దీని వెనుకగల నేపథ్యాన్ని గమనించాలి.

### తెలంగాణా మంత్రుల రాజీనామాల ప్రహసనం :

క్రిందటి రోజు సాయంత్రమే తెలంగాణా మంత్రులందరూ తమ పదవులకు రాజీనామా సమర్పిస్తున్నారని నగరంలో పెద్ద ఎత్తున వదంతులు వ్యాపించాయి. వాస్తవం కూడా అదే. అగ్రనాయకుల అరెస్టులకు, పోలీసుల దమనకాండకు నిరసనగా తెలంగాణా మంత్రులందరూ తమ మూకుమ్మడి రాజీనామాలు ఆరోజు అనగా 27 సాయంత్రం నాలుగు గంటలకు గవర్నర్‌కు సమర్పించాలని రహస్య నిర్ణయం తీసుకున్నారు. దీని వలన ప్రభుత్వం సహజంగానే రద్దు అయ్యే అవకాశం కూడా ఉంది. ఇది సరైన కీలక నిర్ణయం. అయితే ఆ మంత్రులలో ఒకరైన పరిశ్రమల శాఖా మంత్రి గురుమూర్తి తొందరపడి తాను ఒక్కడే ఆ ఉదయం ఎనిమిది గంటల సమయంలో ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి తన ఏకైక రాజీనామా లేఖ ఇవ్వటంతో రహస్యం పొక్కిపోయి రాబోయే ప్రమాదం ఏమిటో ముఖ్యమంత్రికి తెలిసిపోయింది. కర్ర విరగకుండా పాముచావకుండా అన్న కుటిల నీతితో ఆయన తెలివిగా ఉదయం తొమ్మిది గంటలకు తన రాజీనామాను గవర్నర్‌కు కాక కాంగ్రెసు అధ్యక్షుడికి సమర్పించారు. ఆ లేఖకు కాంగ్రెసు అధ్యక్షుడు ప్రతిస్పందిస్తూ కాంగ్రెసు అధిష్ఠాన వర్గం తదుపరి నిర్ణయం తీసుకునే వరకు ఆయనే ముఖ్యమంత్రి పదవిలో కొనసాగాలని ఆదేశించారు. తెలంగాణా మంత్రులు నిస్సహాయస్థితిలో పడిపోయి గురుమూర్తి తొందర పాటు చర్యను తీవ్రంగా విమర్శించారు.



### ముఖ్యమంత్రి రాజీనామా - చెలరేగిన జన సందోహం :

ఆరు నెలల సుదీర్ఘ తెలంగాణా ఉద్యమ పోరాట ఫలితమే ముఖ్యమంత్రి రాజీనామా. ఇది తెలంగాణా ప్రజలనైతిక విజయం. రాజీనామా వార్త తెలిసిన ప్రజల ఆనందం హద్దులు దాటింది. ఆ మధ్యాహ్నం నిషేధాజ్ఞలు ధిక్కరించి నగరం నలుమూలలా ఊరేగింపులు చేశారు. ఈ సారి సికింద్రాబాదు రక్తపుటేరుల్లో మునిగిపోయింది. తెలంగాణా ప్రజలకు ప్రతిరోజూ ఏదో ఒక చోట తమ రక్తాన్ని, ప్రాణాల్ని "సాకబొయ్యటమే" తమ పవిత్ర ధర్మంగా మారిపోయింది.

ముఖ్యమంత్రి రాజీనామా వార్త వినగానే ఆనందపరవశులైన ప్రజలు నాట్యాలు చేస్తూ కనిపించిన వాహనాలలో, లారీలలో ఎక్కి వీధులలో ఊరేగింపులు తీశారు. ఆ ఉత్సాహంతో పోలీసులకు ప్రజలకు మధ్య ఘర్షణలు జరిగాయి. సికింద్రాబాదులోని అన్ని వీధులు యుద్ధ భూములైనాయి. పోలీసుల లాఠీచార్జీలకు, టియర్ గ్యాస్‌లకు జవాబుగా ప్రజలు దహన కాండసాగించారు. చాలా చోట్ల పోలీసు కాల్పులు జరిగాయి. ఆ కాల్పులలో ప్రభుత్వ లెక్కల ప్రకారమే 20 మందికి తీవ్రగాయాలై ప్రాణాపాయ స్థితిలో గాంధీ ఆసుపత్రికి చేరుకున్నారు. కాల్పుల్ని లెక్క చేయకుండా ప్రజలు గెరిల్లా పద్ధతిలో పోలీసులతో దాగుడుమూతలాడుకున్నారు. ఎన్ని సార్లు చెదరగొట్టినా చిన్న చిన్న గల్లీల నుండి మెరుపు తీగల్లాగ మళ్లీ ఇవతలికి వచ్చి పోలీసులతో కొట్లాటలకు దిగారు. దాడులు చేసి మాయం అయ్యారు.

సికింద్రాబాదు హెడ్ పోస్ట్ ఆఫీసును దహనం చేశారు. రాష్ట్రపతి రోడ్డు, మహాంకాళి, మార్కెట్టు రోడ్డులలోని దుకాణాలలోని ఫర్నీచర్‌ను రోడ్డుమీదికి లాగి దహనం చేశారు. కాల్పులు జరుపుతామని హెచ్చరికలు చేసినా బేఖాతరు చేశారు. ఒక రాష్ట్రపతి రోడ్డులో జరిగిన కాల్పులలోనే పద్నాలుగు మంది గాయపడినారు. జాఫర్ అనే రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టరు రివాల్వర్ లాక్కుని అతడిని చితక గొట్టారు. మంటలు ఆర్పటానికి ఫైర్ ఇంజన్లు వస్తే వాటిని సైతం దహనం చేశారు. సి.ఆర్.పి. దళం ఉన్న లారీని ప్రజాసమూహాలు మనోహర్ టాకీసువద్ద నాలుగు మూలల్నుండి ముట్టడించి దిగ్బంధనం చేసి దాడులకు దిగారు. వారు మెషిన్ గన్‌లతో కాల్పులు చేస్తూ గంట తర్వాత ఇవతలికి వచ్చారు. నిజానికి అదొక యుద్ధ బీభత్స భయానక దృశ్యం. రోడ్లు రణరంగాలై ప్రజలు శివతాండవం


www.etelangana.org

చేశారు. ఆ ప్రజాశక్తి పత్రికల వారిని కూడా అబ్బురపరచింది. వీధులలో ప్రక్కనున్న ఎలక్ట్రిక్, టెలిఫోను స్తంభాల్ని అవలీలగా పీకేసి రోడ్లకు అడ్డంగా పడేశారు. ఫలితంగా ఆ రోజు రాత్రంతా జంటనగరాలలో కరెంటు లేదు. రోడ్లమీద రాళ్లురప్పలతో బారికేడ్లు కట్టారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లటం చాలా కష్టమయ్యింది. ఆ గొడవల వలన జంటనగరాలలో మళ్లీ 24 గంటల కర్ఫ్యూ విధించారు. నగరంలో జనజీవితం ఒక జైలుగా మారిపోయింది.

జూన్ 29న మిగిలిన తెలంగాణా మంత్రులందరూ తమ రాజీనామాలను సమర్పించారు. వారు వి.బి. రాజు, జె.వి. నర్సింగరావు, కె.వి. నారాయణరెడ్డి, పి.వి.నర్సింహరావు, మహ్మద్ అలీ అన్సారి, శీలం సిద్దారెడ్డి మరియు అరిగె రామస్వామి.

జులై ఒకటిన వెయ్యి మంది ఆటోడ్రైవర్లు, టాక్సీడ్రైవర్లు తమ సంఘాల ఆధ్వర్యంలో ఒక ఊరేగింపు తీసి గవర్నర్‌కు మెమోరాండం సమర్పించారు. ఆ వెయ్యికార్లు, ఆటోల సుదీర్ఘ యాత్రలో ట్రాఫిక్ మొత్తం జాం అయ్యింది. వారు ఖైరతాబాద్ రైల్వేస్టేషన్ మైదాన్‌లో బహిరంగ సభ నిర్వహించారు.

జులై రెండున తెలంగాణా ప్రజాసమితి సమావేశమై జులై పన్నెండవ తేదిన "తెలంగాణా లిబరేషన్ డే" పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

ఆ రోజు ఢిల్లీలో కాంగ్రేసు పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశమై ముఖ్యమంత్రి రాజీనామా లేఖపై తీసుకునే నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఒక వైపు తెలంగాణా అగ్నిగుండంగా మారుతున్నా కేంద్రానికి కొంతైనా కనికరం లేదన్న సంగతి తెలంగాణా ప్రజలకు తెలిసిపోయింది.

ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు సికింద్రాబాదులో విద్యార్థి నాయకుడు పి.జె. సూరిని పి.డి. చట్టం క్రింద అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు పంపించారు. గాంధీ ఆస్పత్రిలో ఉన్న గాయపడిన వారిని పరామర్శించడానికి ఆయన వెళ్లగా అక్కడ ఆసుపత్రిలోనే అదుపులోకి తీసుకున్నారు.

ఆ మరునాడు మల్లికార్జున్‌ను కూడా అదే చట్టం క్రింద అరెస్టు చేసి అక్కడికే పంపించారు. ఆ రోజు పి.డి. చట్టం క్రింద అరెస్టు అయిన డిటెన్యూలందరూ హైకోర్టులో తమ విడుదల కోసం రిట్లు దాఖలు చేశారు.



ఆదే రోజు ఢిల్లీలో కాంగ్రేసు పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశమై ప్రత్యేక తెలంగాణాకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంది.

**ప్రభుత్వ డాక్టర్ గోపాల్ కిషన్ అరెస్టు :**

జులై నాలుగున మరో ఆరుగురు తెలంగాణా నాయకులను ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం క్రింద అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు తరలించారు. వారిలో తెలంగాణా ప్రజాసమితి కోశాధికారి రామకృష్ణధూత్ మరియు డాక్టర్ గోపాల్ కిషన్ ఉన్నారు. ఇతను ఉస్మానియా హాస్పిటల్‌లో అసిస్టెంట్ సర్జన్‌గా పని చేస్తున్నారు. ఇంతకు పూర్వం ఇతను ఆంధ్ర ప్రదేశ్ వైద్యవిద్యార్థుల సంఘానికి అధ్యక్షుడుగా పనిచేశారు. మొత్తం భారత దేశంలోనే పి.డి. చట్టం క్రింద అరెస్టు చేయబడిన గజిటెడ్ ఆఫీసర్లలో ఇతను మొదటి వాడు. ఉద్యమంలో మామూలు ప్రజలే గాక మేధావులు, వృత్తి విద్యానిపుణులు కూడా ఎట్లా పాల్గొన్నారో ఎట్లా త్యాగాలు చేశారో మనకు తెలుస్తున్నది. ఇంకా అరెస్టు కాబడిన వారిలో విద్యార్థి నాయకుడు జి. వెంకటరెడ్డి మరియు అమీర్‌పేట టి.పి.యస్. అధ్యక్షుడు కె.రాజయ్య కూడా ఉన్నారు.

ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె 24వ రోజుకు చేరుకుంది. రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన విధించనిచో ఆందోళన ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆ రోజు సచివాలయం ముందు 15 మంది ఉద్యోగులతో పాటు వారికి చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులను కూడా సత్యాగ్రహం చేసినందుకు అరెస్టు చేసి జైలుకు పంపారు. బొల్లారం రైల్వే స్టేషన్‌లో వెయ్యిమంది ప్రజలు రైలు పట్టాలపై గంటసేపు బైఠాయించి సత్యాగ్రహం చేశారు. బర్కత్‌పురాలో కూడా ప్రజలు సత్యాగ్రహం చేశారు.

తెలంగాణాకు చెందిన మంత్రి వి.బి. రాజును ప్రజలు చుట్టుముట్టి ఆయన కార్యాలయంలో గంటలతరబడి సత్యాగ్రహం చేసి ఆయన్ని కదలనివ్వలేదు. ఆయన గత్యంతరం లేక అట్లనే నేల మీద వారిమధ్య కూచున్నారు. ప్రత్యేక తెలంగాణాకు ఒప్పుకోవాలని వారి డిమాండు. ఈ సత్యాగ్రహం జట్టుకు గుప్తా అనే ఒక మందుల కంపెనీ యజమాని నాయకత్వం వహించారు. విభిన్న వర్గాల ప్రజలు ఉద్యమంలో ఎలా పాల్గొన్నారో ఇది మరొక ఉదాహరణ. వి.బి. రాజును


www.etelangana.org

ఘెరావ్ చేసిన ప్రజలు నినాదాలు చేయకుండా భజనలు చేశారు. వారు వత్తిడులు, బలప్రయోగం ద్వారా కాక గాంధీగారు ప్రవచించిన ఆత్మ ప్రబోధ పద్ధతులను పాటించారు.

జులై ఐదున మాజీమంత్రి శ్రీమతి సదాలక్ష్మి ఒక ప్రకటనలో తెలంగాణా ఉద్యమాన్ని సమర్థించి అందులో పాల్గొనని తెలంగాణా ప్రాంత మంత్రులను సంఘ బహిష్కరణకు గురి చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జులై ఆరున కాంగ్రెసు అధ్యక్షుడు నిజలింగప్ప హైద్రాబాదు రాక సందర్భంలో సంపూర్ణంగా హైద్రాబాదు బందు జరిగింది. ఖైర్తాబాదులో పోలీసుకాల్పులు జరిగాయి. నిషేధాజ్ఞలను ఉల్లంఘించి ఊరేగింపు తీయప్రయత్నించిన పార్లమెంటు సభ్యులు జి. మేల్కోటే, సంగం లక్ష్మిబాయమ్మలను అరెస్టు చేశారు. నిజలింగప్ప వెళ్తున్నపుడు రోడ్లపై ప్రదర్శనలు జరిపారు.

ఆయన రాక సందర్భంగా కాంగ్రెసు లెజిస్లేటర్స్ పార్టీ సమావేశం హైద్రాబాదులో జరిగింది. ముఖ్యమంత్రి పట్ల తమ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, సాధారణ శాంతియుత పరిస్థితులు ఏర్పడే వరకు ఆయన తన పదవిలో కొనసాగాలని తీర్మానం చేశారు. 25 మంది తెలంగాణా శాసనసభ్యులు ఆ సమావేశానికి హాజరు కాలేదు. తెలంగాణా వారికి ముఖ్యమంత్రి పదవి ఇవ్వడానికి తాను సిద్ధమేనని బ్రహ్మానందరెడ్డి ప్రకటించారు. కేవలం నాయకత్వం మార్పు సరిపోదని అది పరిష్కారం కాదని తెలంగాణా ప్రజాసమితి స్పష్టపరచింది. ఇంకో వైపు తెలంగాణా ఉద్యోగుల నిరవధిక సమ్మె అట్లానే కొనసాగుతున్నది. ప్రభుత్వ యంత్రాంగం పాక్షికంగానే నడుస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదు.

బొంబాయి, బెంగుళూరు పట్టణాలలో తెలంగాణాను సమర్థిస్తూ సమావేశాలు, తీర్మానాలు జరుగుతున్నాయి.

వరంగల్‌లో జైలు నిండిపోయినందున కాకతీయ మెడికల్ కాలేజీని జైలుగా మార్చారు. అనేక పాఠశాలలను, కాలేజీలను కూడా జైలుగా మార్చారు.

జులై ఏడున రాష్ట్ర కాంగ్రెసు శాసన సభ్యుల సమావేశం బ్రహ్మానందరెడ్డిపై విశ్వాసం ప్రకటించింది. రాజీనామా ఉపసంహరించుకోమని, తెలంగాణా



నాయకునికి ప్రశాంతంగా నాయకత్వం అప్పగించేవరకు ఉండాలనికోరారు. ఆయన తర్వాత ముఖ్యమంత్రి అయిన పి.వి.నర్సింహారావు ఈ తీర్మానం ప్రవేశపెట్టారు. తెలంగాణా శాసనసభ్యులలో అధిక సంఖ్యాకులు దీనిని సమర్థించారు.

జులై ఏడున తెలంగాణా ప్రాంతానికి చెందిన ఉపముఖ్య మంత్రి మరియు సమైక్యతావాది ఐన జె.వి. నర్సింగరావు ఇంటిపై బాంబును విసిరారు. ఇదొక నిరసన చర్య. ప్రజల సత్యాగ్రహం వలన సికింద్రాబాదు డివిజన్‌లో అనేక రైళ్ల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. అనేక హైస్కూళ్లకు చెందిన బాలికలు లేక్‌వ్యూ అతిథి గృహంలో చొరబడి అక్కడ బస చేసిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నిజలింగప్పను ఘెరావ్ చేసి ప్రత్యేక తెలంగాణాకు మద్దతు తెలుపాలని నినాదాలు చేశారు.

జులై 8న హైద్రాబాదు నగరంలో నాలుగు చోట్ల పోలీసు కాల్పులు జరిగాయి. పూర్తి హర్తాల్ జరిగింది. ఖాజీపేట, బల్హార్షా సెక్షన్‌లో ఒక రైలు ఇంజన్‌కు నిప్పుపెట్టారు.

జులై పదిన తెలంగాణా ఉద్యమంలో పాల్గొంటున్న కాంగ్రెసు పార్టీ నాయకుల చిత్తశుద్ధిని శ్రీధర్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. తెలంగాణా ఉద్యమం కాంగ్రెసు పార్టీ వారి ఉద్యమం కాదని అది ప్రజల ఉద్యమమని, అధికారం కోసం పాకులాడే కాంగ్రెసు వారి అంతర్గత వ్యవహారం కాదని ఆయన హెచ్చరించారు.

ఆరోజు హైస్కూలు విద్యార్థులు గవర్నర్‌గారిని కలుసుకుని ప్రత్యేక తెలంగాణా ఏర్పడాలని ఒక మెమోరాండం సమర్పించారు.

జులై పదకొండున హైద్రాబాదు నగరంలో తెలంగాణా ఉద్యోగుల కుటుంబాలు పిల్లలు ఆబిడ్స్‌లో సత్యాగ్రహం చేయగా వారిపై కూడా లాఠీచార్జీ జరిగింది. చాలా మంది గాయపడినారు. సనత్‌నగర్‌లో ప్రదర్శకులపై బాష్పవాయువును ప్రయోగించారు.

ఆ రోజు బెంగుళూరులో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ సభలు జరిగాయి. అందులో ప్రత్యేక రాష్ట్రం ప్రస్తావనే రాలేదు. కనీసం చర్చ కూడా జరుగలేదు. ఈ


www.etelangana.org

విషయంలో కేంద్ర కాంగ్రేసు నాయకులు బధిరులుగా మారిపోయారు. ఆ అఖిల భారత కాంగ్రేస్ సభల ముందు హైద్రాబాదునుండి వెళ్లిన 22 మంది తెలంగాణా వాదులు నిరాహార దీక్ష ప్రారంభించారు. వారిలో 11 మంది నగర మున్సిపల్ కౌన్సిలర్లు కూడా ఉన్నారు.

**తెలంగాణా పతాక దినోత్సవం :**

జులై పన్నెండున తెలంగాణా అంతటా 'ఫ్లాగ్‌డే' నిర్వహించారు. జంటనగరాలలో అనేక చోట్ల తెలంగాణా పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మేల్కోటేను అరెస్టు చేశారు. అనేక భవనాలపై, చౌరాస్తాలలో, వీధులలో, కార్లు, బస్సులు, సైకిళ్లు, రిక్షాలపై తెలంగాణా పతాకాలు రెపరెపలాడాయి. జైళ్లల్లో కూడా పతాకాలను ఆవిష్కరించారు. ఆర్టీసీ, మున్సిపల్ ఆఫీసుల ముందు అందులో పనిచేసే ఉద్యోగులు పతాకాలను ఆవిష్కరించారు. చివరికి చార్మినార్ పైన కూడా తెలంగాణా పతాకం ఎగురవేయబడింది.

జులై 16న గత 37 రోజులుగా కొనసాగుతున్న తెలంగాణా ఉద్యోగుల సమ్మె విరమించబడింది. ఉద్యోగులు విధులలో చేరారు. దానితో తాత్కాలిక ఉద్యోగులందర్నీ ప్రభుత్వం ఉద్యోగాలనుండి తొలగించింది. వారు బలిపశువులైనారు. తెలంగాణా ఎన్‌జివోల సంఘంలో అభిప్రాయభేదాలు బయలుదేరి ఆమోస్ తన పదవికి రాజీనామా చేశారు. రెండు నెలలుగా జీతాలు లేని ఉద్యోగులు చేసే రాజకీయ పోరాటాలకు పరిమితులుంటాయని తెలిసింది. ప్రభుత్వం కొంతమంది. ఉద్యోగ నాయకుల్ని లొంగదీసుకొని చీలికలని సృష్టించింది. ముఖ్యమైన ఉద్యోగ నాయకులు జైళ్లల్లో ఉన్న సందర్భంలో ముఖ్యమంత్రి ఐ.ఎన్.టి.యు.సి. అధ్యక్షుడు జి.సంజీవరెడ్డిని ఉపయోగించి సమ్మె చేస్తున్న ఉద్యోగులలో విభేదాలను సృష్టించి సమ్మె విరమణ చేయించారు.

జులై 20న తెలంగాణా బంద్ జరిగింది. హైద్రాబాదులో బాష్పవాయువు ప్రయోగం అనేక చోట్ల జరిగింది.

జూలై 23న ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యోగులు కూడా తమ సమ్మెను విరమించారు.



ఆగస్టు మూడున చాలా కాలంనుండి అజ్ఞాత వాసంలో ఉన్న శ్రీధర్‌రెడ్డిని పోలీసులు గోషామహల్‌లోని ఒక ఇంటిలో అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు తరలించారు. మరునాడు హైస్కూలు విద్యార్థినాయకుడు జలీల్ పాషాతో సహా మరో పది మంది విద్యార్థినాయకులను అరెస్టు చేసి అదే జైలుకు తరలించారు.

ఈ తెలంగాణా ఉద్యమంలో అనేక మంది మహిళలు చురుకుగా పాల్గొన్నారు. వారిలోని ముఖ్య మహిళా నాయకురాండ్రు నగరమేయర్ రాణి కుముదినీ నాయక్, టి.యన్. సదాలక్ష్మి, జె. ఈశ్వరీబాయి, శాంతాబాయి, సుమిత్రాదేవి (వీరంతా శాసనసభ్యులు) సంగం లక్ష్మీబాయమ్మ, పార్లమెంటు సభ్యురాలు, రోడామిస్త్రీ, మొదలగువారు.

**కొత్తగూడెంలో పోలీసు కాల్పులు :**

ఆగస్టు ఆరున ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో పోలీసు కాల్పులు జరిగి నలుగురు చనిపోయారు. కొత్తగా హోం మినిస్టర్ పదవి అలంకరించిన జలగం వెంగళరావు దీనికి ప్రధాన బాధ్యులు. కాల్పులకు ఒక రోజు ముందు ఆయన ఖమ్మం పట్టణంలో జరిగిన ఊరేగింపులో పాల్గొని వెళ్లుతున్నప్పుడు అక్కడ ఒక బాంబు పేలింది. వీధులలో ప్రత్యేక వాదులు, సమైక్యతా వాదులు కొట్లాడుకున్నారు. ఈ సభలో వెంగళరావు రెచ్చగొట్టే ధోరణిలో ఉపన్యాసం ఇచ్చారు. దీనికి కోపించిన ప్రజలు మరుసటిరోజు కొత్తగూడెంలో ఆయన సభ జరుగుతున్నప్పుడు టౌన్ హాలులోకి చొచ్చుకుని వెళ్లి నినాదాలు చేయగా పోలీసులు కాల్పులు జరిపారు. వీధులలో కూడా కాల్పులు జరిగినవి. మరణించినవారిలో రాంచందర్ (25) దస్తగీర్ (10) మదనయ్య అను మరో కళాశాల విద్యార్థి వున్నారు.

ఒకప్పుడు ఖమ్మంలో రవీంద్రనాథ్‌ను నిరాహారదీక్షకు ప్రోత్సహించింది ఈ వెంగళరావుగారే. జిల్లా కాంగ్రేసు కుమ్ములాటలతో శీలం సిద్దారెడ్డి వర్గాన్ని చిత్తు చేయటానికి ఈయన తెలంగాణా రక్షణల అమలు పేరిట రవీంద్రనాథ్‌ను రెచ్చగొట్టారని చివరికి పరిస్థితులు ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి దారితీయగా మళ్లీ తనే చొరవతీసుకుని రవీంద్రనాథ్‌ను నిరాహారదీక్షనుండి విరమింప చేసినట్లు తెలిసింది. అప్పటి కాంగ్రేసు నాయకులు ప్రత్యేక తెలంగాణా వాదాన్ని తమ గ్రూపుల కుమ్ములాటలలో ఒక పావుగా ఎలా వాడుకున్నారో తెలుస్తున్నది.


www.etelangana.org

1969 జనవరిలో ఖమ్మం జిల్లాలో ప్రారంభమైన ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని రవీంద్రనాథ్ నిరాహారదీక్ష విరమణ ద్వారా కొంత వరకు చల్లబరచటంలో విజయం సాధించిన జలగం వెంగళరావు తన సత్తాను ముఖ్యమంత్రిగారికి తెలియ చేసి హోం మంత్రి పదవిని సంపాదించి లాభం పొందారు.

**మేం ముందుకు పోతాం, ప్రపంచం మా వెంట వస్తుంది :**

"యువతరం శిరమెత్తితే
నవతరం గళమెత్తితే
ఈ లోకమే మారిపోదా
ఈ చీకటే మాసిపోదా"

- నార్ల చిరంజీవి.

అదే రోజు ఆగస్టు ఆరున హైద్రాబాదు నగరంలో 53 మంది పికెటింగ్ చేసి అరెస్టు అయ్యారు. అందులో 38 మంది యువతులు. సికింద్రాబాదులోని హైదర్‌బస్తీలో కుమారి గీతాంజలి పిళ్లే నాయకత్వాన పన్నెండు మంది యువతులు నినాదాలు చేస్తూ జనరల్‌బజార్ వీధులగుండా ఊరేగింపుగా వెళ్లి రాష్ట్ర పతిరోడ్డు చౌరాస్తాలో సత్యాగ్రహం చేసి అరెస్టు అయ్యారు. ఆ అరెస్టులకు ముందు ప్రజలు కూడా వందలసంఖ్యలో ఊరేగింపుగా వారితో పాటు నడిచి జై తెలంగాణా నినాదాలు చేశారు.

ఇసామియాబజార్‌లోని చాదర్‌ఘాట్ వంతెన వద్ద రెండు జట్లు సత్యాగ్రహం చేశాయి. యువతుల జట్టుకు కుమారి హంసవాణి నాయకత్వం వహించగా యువకుల జట్టుకు సురేష్ కుమార్ నాయకత్వం వహించాడు.

ఆబిడ్స్‌లో సత్యాగ్రహం చేసిన 17 మంది మహిళల జట్టుకు కుమారి నర్సమ్మ నాయకత్వం వహించింది. దుకాణాల గుమస్తాల సంఘం అధ్యక్షుడు పి. వాసుదేవ్ నాయికత్వంలో అనేకమంది గుమస్తాలు సికింద్రాబాదులోని రాష్ట్రపతిరోడ్డులో సత్యాగ్రహం చేసి అరెస్టయ్యారు.

ఈ సత్యాగ్రహ కార్యక్రమం మొదలయినప్పటినుండి ఒక మహబూబ్‌నగర్ జిల్లాలోనే లక్ష మందికిపైగా సత్యాగ్రహం చేశారు. 30 వేల మందిని అరెస్టు



చేసి అందులోనుండి 3 వేల మందిని జైళ్లల్లో నిర్బంధించినట్లు జిల్లా తెలంగాణా ప్రజాసమితి ప్రకటించింది. జిల్లాలలో సాగిన ఉద్యమానికి ఇదొక చిన్న ఉదాహరణ.

**సికింద్రాబాదు 'చేపల బావి' అమరవీరుడు రవీంద్రనాథ్ :**

ఆగస్టు ఏడున సికింద్రాబాదులో సత్యాగ్రహం చేస్తున్న వారిపై పోలీసులు కాల్పులు జరుపగా చేపలబావి బస్తీకి చెందిన రవీంద్రనాథ్ అనే 18 సంవత్సరాల యువకుడు మరణించాడు. ఆ రోజు సికింద్రాబాదు అంతటా అల్లర్లు వ్యాపించాయి. స్టేషన్ రోడ్డులోనూ, మార్కెట్ వీధిలోనూ, మనోహర్‌టాకీసు వద్ద పోలీసులు లాఠీచార్జీలు, బాష్పవాయువులు ప్రయోగించారు. పోలీసు కాల్పులలో రవీంద్రనాథ్ చనిపోగా మరోఐదుగురు తీవ్రంగా గాయపడినారు. వారు చంద్రశేఖర్ (14), జి.గోపాల్ (17), ఉమేష్ (18), సయ్యద్‌ఖాదర్ (15). ఆ రోజు జరిగిన సత్యాగ్రహంలో వందల సంఖ్యలో ప్రజలు, వృద్ధులు, స్త్రీలు, పిల్లలు పాల్గొన్నారు. నిషేధాజ్ఞల్ని ఉల్లంఘించి అరెస్టు అయ్యారు. మోండా మార్కెట్, రాజేశ్వరీటాకీసు వద్ద తీవ్రంగా అల్లర్లు చెలరేగాయి. పోలీసులపై రాళ్లురువ్వగా చాలా మంది పోలీసులకు తీవ్రగాయాలైనాయి. కాల్పులలో గాయపడిన ఆ యువకులు శాశ్వతంగా జీవితాంతం అవిటివాళ్ళుగానే బ్రతికినారు. వారు చేసిన త్యాగాలను ఎవరూ విలువకట్టలేరు.

కాల్పులలో రవీంద్రనాథ్ చనిపోగానే అతని మృతదేహాన్ని చేపలబావి ప్రాంతానికి చెందిన ప్రజలు మూడుగంటల సేపు దాచిపెట్టారు. చివరికి పోలీసులు బ్రతిమిలాడి ఆ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించారు.

ఆ రోజు సికింద్రాబాదులో సత్యాగ్రహం చేసిన మహాదేవ్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు కాల్పులకు నిరసనగా మరునాడు సికింద్రాబాదు బందు జరిగింది.

**వరంగల్‌లో కాళోజీ అరెస్టు :**

ఆగస్టు పదిన వరంగల్‌లో సత్యాగ్రహం జరిగింది. శ్రీ కాళోజి నారాయణ రావును మరియు వరంగల్ వైద్య విద్యార్థి నాయకుడు కొల్లూరి చిరంజీవిని


www.etelangana.org

పోలీసులు 151వ సెక్షన్ క్రింద అరెస్టు చేశారు. ఆరోజు రాత్రి హసన్‌పర్తి, ఉప్పల్ స్టేషన్ల మధ్యగల రైలు వంతెనను పేల్చివేయటానికి ఉద్యమకారులు ప్రయత్నించారు. దానివలన రైళ్ల రాకపోకలు ఆగిపోయాయి.

ఆగస్టు పద్నాలుగున హైద్రాబాదులో ముగ్గురు శాసన సభ్యులను పి.డి. చట్టం కింద అరెస్టు చేశారు. దీనితో ఈ చట్టం కింద అరెస్టు అయిన్న శాసన సభ్యుల సంఖ్య పదిహేనుకు పెరిగింది. అరెస్టయినవారు జె. ఈశ్వరీబాయి, పాల్వాయి గోవర్ధనరెడ్డి, డి.వి. సుధాకర్‌లు. ఆరోజు మల్కాజిగిరి రైల్వేస్టేషను తగులబెట్టారు. నాంపల్లిలోని పోలీసు కంట్రోల్ రూమ్‌పై బాంబు వేశారు. సైకిల్‌పై పారిపోతున్న ఇద్దరిలో ఒకరు పట్టుబడ్డారు. అతను నరసింహ అను ఉస్మానియా వైద్య కళాశాల విద్యార్థి. మంత్రులు, శాసనసభ్యుల కార్లపై యువతులు టమాటాలను విసిరేశారు.

అసెంబ్లీ ఆవరణలోకి ఊరేగింపు తీస్తు చొచ్చుకొనిపోయిన నగర విద్యార్థుల సంయుక్త కార్యాచరణ సమితి అధ్యక్షుడు శ్రీ గొట్టం గోపాలరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు.

**లాఠీలు విరిగి రక్తం చిందిన పంద్రా ఆగస్టు :**

ఆగస్టు పదిహేను స్వాతంత్ర్య దినం నాడుకూడా నగరంలో పోలీసులు లాఠీచార్జీలు, బాష్పవాయువులు ప్రయోగించారు. ప్రజలు రాళ్ళువిసిరినందున 25 మంది పోలీసులు కూడా గాయపడినారు.

ఆ రోజు వివేకవర్ధని కళాశాలలో తెలంగాణా ప్రజాసమితి ఆధ్వర్యంలో ఒక పెద్ద సభను ఏర్పాటు చేసి జాతీయ పతాకంతో పాటు తెలంగాణా పతాకాన్ని కూడా ఎగరేశారు. ఆ సభలో సదాలక్ష్మి, సుమిత్రాదేవి, కొండా వెంకట రంగారెడ్డిలు ప్రసంగించారు. తర్వాత వేలాదిమంది ప్రజలు నిషేధాజ్ఞల్ని ఉల్లంఘించి రోడ్డుపైకి వచ్చి ఊరేగింపు తీయటానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. లోపలి నుండి రాళ్ళవర్షం కురిసింది. దానితో లాఠీచార్జీ, బాష్పవాయువులు ప్రయోగించారు. లాఠీచార్జిలో శాసనసభ్యురాలు సుమిత్రాదేవి కూడ గాయపడింది. ఆమె రక్తసిక్తమైన చీరను మరునాడు అసెంబ్లీలో స్పీకర్‌కు



చూపెట్టారు. సదాలక్ష్మి మరియు కురువృద్ధుడు కె.వి. రంగారెడ్డి ఆ అల్లర్ల గుంపులో చిక్కుకొని కింద పడిపోయారు.

**పార్లమెంటులో దద్దరిల్లిన తెలంగాణా :**

ఆగస్టు పద్దెనిమిదిన లోకసభలో తెలంగాణా ప్రాంతం పార్లమెంటు సభ్యులైన జి. వెంకటస్వామి, డాక్టర్ మేల్కోటేలు తెలంగాణాపై చర్చలో పాల్గొంటూ కేంద్రం జోక్యం చేసుకొని, ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతిపాలన విధించాలని ప్రసంగించారు.

డాక్టర్ మేల్కోటే ఆవేశపూరితంగా ఉపన్యసిస్తూ 'ఈ వలస పద్ధతి మాకువద్దు. మేము ఎవరికింద బానిసలుగా బ్రతకదలుచుకోలేదు అని గర్జిస్తూ ఇది ఎదో కుర్రకారు ఉద్యమం కాదని 280 మందిని పి.డి. చట్టం కింద, 50 వేల మందిని ఇతరత్రా అరెస్టు చేశారని చెప్పుతూ చనిపోయినవారందరి ఫోటోలను ప్రదర్శిస్తూ తెలంగాణాను సాధించేవరకు పోరాడుతామని అన్నారు'.

తర్వాత జి.వెంకటస్వామి మాట్లాడుతు ఇప్పటివరకు 250 మంది మరణించారని తానుకూడ తుపాకి గుండ్లను కొద్దిలో తప్పించుకొని ఈ సభకు వచ్చానని, తెలంగాణా సాధించేవరకు పోరాడుతానని చెప్పి జై తెలంగాణా అన్న నినాదంతో తన ఉపన్యాసాన్ని ముగించాడు.

ఆగస్టు ఇరవై ఒకటిన తెలంగాణా ఉద్యమాన్ని చల్లార్చే కుట్రబుద్ధితో రామగుండం వద్ద 60 కోట్ల ఖర్చుతో ఎరువుల ఫ్యాక్టరీని స్థాపిస్తామని ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డి వాగ్దానం చేశారు. సంస్కరణల పుణ్యమా అని ఆ ఫ్యాక్టరీ ఇప్పుడు మూతపడే స్థితికి చేరుకుంది.

ఆగస్టు ఇరవై మూడున ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీని ఉద్యమ నాయకుల భార్యలు శ్రీమతి చెన్నారెడ్డి, శ్రీమతి అచ్యుతరెడ్డి, శ్రీమతి నరోత్తమరెడ్డి నాయకత్వాన అనేక మంది మహిళలు ఢిల్లీలో ప్రధానిని కలిసి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమం విరమించనిదే, శాంతి నెలకొననిదే తాను జోక్యం చేసుకోనని ప్రధాని తెగేసి చెప్పారు. ఉద్యమం విరమించిన తర్వాతనే సాయుధబలగాలను వెనుకకు తీసుకుంటానని అన్నారు.



www.etelangana.org

**అగ్రనాయకుల విడుదల :**

ఆగస్టు ఇరవై నాలుగున రాజమండ్రి జైలునుండి 23మంది డిటెన్యూలను విడుదల చేశారు. తెలంగాణా ఏర్పాటుకు ప్రధాని హామి ఇస్తేనే ఉద్యమం విరమిస్తామని సదాలక్ష్మి ప్రకటించింది.

ఆగస్టు ఇరవై ఎనిమిదిన మల్లికార్జున్, చెన్నారెడ్డి మొదలగు అగ్రనాయకులందరిని సుప్రీం కోర్టు జోక్యం ద్వారా ప్రభుత్వం జైళ్లనుండి విడుదల చేసింది.

ఆగస్టు ఇరవై తొమ్మిదిన లక్ష్యాన్ని సాధించేవరకు ఉద్యమాన్ని విరమించే ప్రసక్తే లేదని రెడ్డి హాస్టల్లో జరిగిన బహిరంగసభలో చెన్నారెడ్డి, మల్లికార్జున్ ప్రభృతులు ఉద్ఘాటించారు. ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు తప్ప రాష్ట్ర నాయకత్వం మార్పుతో నిమిత్తం లేదని తెలియచెప్పారు.

**Come September కాదు Bad September:**

సెప్టెంబర్ నెలనుండి ఉద్యమం నెమ్మదిగా తగ్గింది. అప్పటికే ఉద్యోగులు సమ్మె విరమించి పనుల్లో చేరారు. ఉద్యమ నాయకులే విద్యార్థులను క్లాసులకు హాజరుకమ్మని చెప్పారు. అన్నిటికంటే ముఖ్యంగా జైళ్ళ నుండి వచ్చిన అగ్రనాయకత్వం పోరాటాన్ని వీధుల్లో నుండి తప్పించి అసెంబ్లీకి పరిమితం చేసింది. ఉద్యమ తిరుగుముఖం ఒక ప్రణాళిక ప్రకారం నెమ్మదిగా జరిగింది. సెప్టెంబర్ నెల హైద్రాబాదుకు మంచిది కాదని, కీడు జరుగుతుందని పాతకాలం నాటి పెద్ద మనుషులు అంటూఉంటారు. అట్లానే ఉవ్వెత్తున చెలరేగిన తెలంగాణా ఉద్యమం ఈ సెప్టెంబర్ నెలలోనే చల్లారటం ప్రారంభమైంది.

సెప్టెంబర్ ఒకటిన కళాశాలలు, పాఠశాలలు ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

సెప్టెంబర్ రెండున తెలంగాణా పరిస్థితిని చర్చించటానికి నిరాకరించటంతో కొండా లక్ష్మణ్ బాపూజీ నాయకత్వాన శాసనసభ గంటన్నర సేపు స్తంభించింది. చివరికి 15 మంది తెలంగాణా శాసనసభ్యులు వాకౌట్ చేశారు.



సెప్టెంబర్ ఐదున విద్యార్థులు తరగతులకు హాజరుకావాలని ఉస్మానియా వైస్ ఛాన్స్లర్ రావాడ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఆరోజు ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలతో శోకదినాన్ని పాటించారు.

సెప్టెంబర్ ఆరున మిగిలిన డిటెన్యూలందరిని విడుదల చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

విద్యార్థులు మాత్రం తరగతులకు హాజరుకావటం లేదు.

**దోపిడీలేని నవ తెలంగాణా :**

సెప్టెంబర్ ఎనిమిదిన శ్రీధర్ రెడ్డి జైలునుండి విడుదలైన తర్వాత వివేకవర్ధని కాలేజీ ఆవరణలో జరిగిన సభలో ప్రసంగిస్తూ నవ తెలంగాణాకై తుదివరకు పోరాటం చేస్తామని, అవినీతికి, దోపిడీకి ఆస్కారంలేని నవ తెలంగాణాకై ప్రజలే ఉద్యమాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అధికార పార్టీ తెలంగాణా శాసన సభ్యులు తమ స్థానాలను స్వార్థంతో పట్టుకొని వేలాడుతున్నారని, వారు ప్రభుత్వం ఇచ్చే వేతనాలు అలవెన్స్లు, సౌకర్యాలు పొందుతు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎట్లా కొట్లాడుతారని ప్రశ్నిస్తూ వారు తమ పదవులకు రాజీనామా ఇచ్చి తమ చిత్తశుద్ధిని వెల్లడించుకోవాలని సవాల్ చేశారు. ఆయన తనకు వేయబోయిన పూలదండలను నిరాకరిస్తూ వ్యక్తి ఆరాధన తగదని సలహా ఇచ్చాడు.

సెప్టెంబర్ తొమ్మిదిన కేంద్ర ప్రభుత్వం నియమించిన న్యాయ కమిటి (వాంఛూ కమిటి) 'ముల్కీ నిబంధనల కొనసాగింపునకు ఏ విధమైన ఆస్కారం లేదని, రాజ్యాంగాన్ని సవరించేందుకు సైతం వీలుపడదని' ప్రకటించింది.

సెప్టెంబర్ పదిన తరగతులు నడుస్తున్న ఒకటి రెండు పాఠశాలలు, కళాశాలలపై బాంబులు వేశారు. తరగతులను బహిష్కరించమని చెప్పటానికి వెళ్లిన మల్లికార్జున్, పుల్లారెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి మూడు రోజుల తర్వాత జామీనుపై విడుదల చేశారు.

సెప్టెంబర్ పదిహేడున మల్లికార్జున్ ఒక విద్యార్థుల సభలో ప్రసంగిస్తూ నెలాఖరులోగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడకపోతే ప్రజావిప్లవం తీసుకొస్తామని, పోటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.


www.etelangana.org

ఆ రోజు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర నాయకత్వాన్ని మార్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యమ పతనానికి ఇదొక ఉదాహరణ.

సెప్టెంబర్ పద్దెనిమిదిన వరంగల్ వైద్యవిద్యార్థులు కె.చిరంజీవి నాయకత్వంలో సమావేశమై విద్యార్థులు ఉద్యమాన్ని తాత్కాలికంగా విరమించాలని పరీక్షలకు హాజరు కావాలని, సంవత్సరాన్ని వృధా చేసుకోరాదని నిర్ణయించారు. ఇంజనీరింగ్ విద్యార్థులుకూడ వీరినే అనుసరించారు.

సెప్టెంబర్ పందొమ్మిదిన రాష్ట్ర నాయకత్వం మారాలని 70 మంది తెలంగాణా శాసనసభ్యులు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందిస్తూ తెలంగాణా సమస్యపై చర్చలకు రావాలని కేంద్రం ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిని ఆహ్వానించింది.

సెప్టెంబర్ ఇరవైన పోటీ తెలంగాణా ప్రజాసమితి ఉపాధ్యక్షుడు వీరారెడ్డి ఒక ప్రకటన చేస్తూ చెన్నారెడ్డి ఉద్యమం నుండి తప్పుకొని, చిత్తశుద్ధి, నిజాయితీ గలవారికి ఉద్యమాన్ని అప్పగించాలని సలహా ఇచ్చాడు.

కొంత మంది తెలంగాణా నాయకులు ఢిల్లీలో ప్రధాన మంత్రిని కలిసి సత్వరమే ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటుచేయాలని విజ్ఞాపన పత్రాన్ని అందించారు. ఈ ప్రతినిధి వర్గంలో జి.వెంకటస్వామి, టి. అంజయ్య, సదాలక్ష్మి, మొదలగు వారున్నారు. ప్రజా ఉద్యమాన్ని వదిలి విజ్ఞాపన పత్రాల సమర్పణకు నాయకులు పరిమితం కావటం వారి దిగజారుడు ధోరణికి ఉదాహరణ.

**ఏరు దాటినాం ఇక తెప్ప తగలేయండి :**

సెప్టెంబర్ ఇరవై రెండున కొండా లక్ష్మణ్ బాపూజీ మరో ప్రకటన చేస్తూ ముఖ్యమంత్రి వైదొలగితే ఉద్యమం వాయిదా పడవచ్చని సూచించారు. ఇది ఉద్యమం వెనకడుగుకు ఒక సూచన.

సెప్టెంబర్ ఇరవై మూడున విద్యార్థులు వెంటనే తరగతులకు హాజరు కావాలని తెలంగాణా ప్రజా సమితి మరియు విద్యార్థుల కార్యాచరణ సమితి ఒక ప్రకటన చేసింది. ఉద్యమం మాత్రం కొనసాగుతుందని వారు ప్రకటించారు.



అట్లా ఉద్యోగులను, విద్యార్థులను నెమ్మదిగా రంగంపై నుండి తప్పించారు. ఆప్రకటనపై చెన్నారెడ్డి మరియు మల్లికార్జున్‌లు సంతకాలు చేశారు. తొమ్మిది నెలలపాటు ఉద్యమాన్ని కొనసాగించి చరిత్ర సృష్టించిన విద్యార్థులకు వారు తమ అభినందనలను తెలియచేస్తూ వారు చదువులు కొనసాగిస్తూనే ఉద్యమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు తరగతులకు హాజరుకావాలన్న తమ నిర్ణయాన్ని హైదరాబాదులో బసచేసిన రాష్ట్రపతి వి.వి. గిరిగారికి తెలియజేయగా ఆయన హర్షం ప్రకటించారు. స్వయంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి వెళ్లి చెన్నారెడ్డి ఈ నిర్ణయాన్ని రాష్ట్రపతికి స్వయంగా చెప్పారు.

రాష్ట్రపతి చెన్నారెడ్డి నిర్ణయానికి స్పందిస్తూ త్వరలోనే అన్నివర్గాలకు సంతృప్తి కరంగా తెలంగాణా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ శుభవార్తకు ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తమ హర్షం ప్రకటించారు.

మరునాడు కాంగ్రేసు అధ్యక్షుడు నిజలింగప్ప తన ప్రకటనలో రాష్ట్ర నాయకత్వం వెంటనే మారాలని, ఆ స్థానంలో తెలంగాణానుండి ముఖ్యమంత్రి ఎన్నిక జరగాలని సూచించారు.

విద్యార్థుల వ్యతిరేకతని గమనించిన మల్లికార్జున్ ఒక ప్రకటన చేస్తూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న జాప్యం దృష్ట్యా విద్యార్థుల చదువులకు భంగం వాటిల్లవద్దనే దూరదృష్టితోనే తాము ఆ నిర్ణయం తీసుకున్నామని, లక్ష్యం నెరవేరేవరకు ఉద్యమం కొనసాగుతుందని, భవిష్యత్తులో విద్యార్థులు వారానికి ఒకరోజు అనగా శనివారం ఉద్యమం కోసం సమయం కేటాయించాలని అన్నారు.

సెప్టెంబర్ ఇరవై ఐదున తెలంగాణా ప్రదేశ్ కాంగ్రేస్ కమిటీ అధ్యక్షుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ నేతృత్వంలో రాష్ట్రపతి వి.వి. గిరిని కలుసుకొని తెలంగాణా ఏర్పాటుకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణా ప్రజాసమితి నాయకుడు కెప్టెన్ అన్సారీ చెన్నారెడ్డిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణా ఉద్యమాన్ని కాంగ్రేస్ పార్టీవారు తమ అంతర్గత పోరాటంగా



www.etelangana.org

మలుచుకున్నారని ఒక కీలకమైన ప్రకటనలో విమర్శించారు. పలువురు విద్యార్థినాయకులు ఒక ప్రకటన చేస్తూ తెలంగాణా శాసనసభ్యుల రాజీనామాలను తప్పించడానికే ఒక ఎత్తుగడగా విద్యార్థులను తరగతులకు పంపిస్తున్నారని విమర్శించారు.

**మాట వినని విద్యార్థులు - గోవింద్ నిరాహార దీక్ష :**

తరగతులకు హాజరుకావాలన్న మల్లికార్జున్ నిర్ణయంపై సికింద్రాబాదు విద్యార్థులు తీవ్ర నిరసనను తెలియచేస్తూ వీధులలో అల్లర్లకు పాల్పడ్డారు.

ప్రజా ప్రతినిధులందరు మున్సిపల్ కౌన్సిలర్ మొదలుకొని పార్లమెంటు సభ్యుడి వరకు తమ పదవులకు రాజీనామాలు చేసి ఉద్యమాన్ని బలపరచాలని హైద్రాబాదు పాతనగరం విద్యార్థులు చార్‌కమాన్ వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. వారిలో కె.గోవింద్ (గుజరాత్ గాయం ఫోటోగ్రాఫర్), స్వయంప్రకాష్, తమీజోద్దీన్ ఆహమ్మద్, మహోమ్మద్ అలి ఊద్దీన్ ఖురేషిలు ముఖ్యులు.

విద్యార్థులు ప్రారంభించిన ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని రాజకీయ నాయకులు, తెలంగాణా ప్రజాసమితి వారు ఆపజాలరని హైస్కూల్ విద్యార్థి కార్యాచరణ సమితి తీవ్రంగా విమర్శించింది. తరగతుల బహిష్కరణ కొనసాగవలసిందేనని దాని నాయకులు జలీల్‌పాషా, జనార్ధన్, వెంకట్రావు, రాబర్ట్ బ్యూస్‌లు ప్రకటించారు.

తెలంగాణా ప్రజాసమితి ఉపాధ్యక్షుడు బి.వీరారెడ్డి కూడా ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించి డాక్టర్ చెన్నారెడ్డి ఉద్యమాన్ని లోపలినుండి మోసం చేశారని ఆరోపించారు.

పదమూడు సంవత్సరాలనుండి జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటు ఉద్యమమే ఈ తెలంగాణా ఉద్యమం అని ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపక సంఘం రాష్ట్రపతికి ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పించింది.

పోటి తెలంగాణా ప్రజాసమితి అధ్యక్షుడు శ్రీధరరెడ్డి ఒక ప్రకటన చేస్తూ నిర్ణయం తీసుకొవలసింది విద్యార్థులుకాని చెన్నారెడ్డి లేదా మల్లికార్జున్‌లు కాదని



విమర్శించారు. రెడ్డి హాస్టల్‌లో మార్చినెల 8,9 తేదీల సదస్సులో జరిగిన నిర్ణయాలకు ఈ తీర్మానం వ్యతిరేకమని తిరిగి అటువంటి సదస్సును ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు.

ప్రత్యేక తెలంగాణాను సమర్థిస్తున్న శాసనసభ్యులను రాజీనామాలు సమర్పించమని వత్తిడి చేస్తున్న విద్యార్థులను చూసి ఆందోళన, భయం చెందిన వృత్తి రాజకీయవాదులు విద్యార్థులను తరగతులకు పంపించాలని నిర్ణయం తీసుకున్నారని కూడా ఆయన విమర్శించారు.

తొమ్మిదినెలల పోరాటం చేసి, మూడువందలకుపైగా ప్రాణాలు త్యాగాలు చేసి వెయ్యిమందికిపైగా తీవ్రంగా గాయపడి చివరికి ఉద్యమాన్ని ఆపటం సహించరానిదని పలువురు విమర్శించారు. మామా అల్లుళ్ళు 1952, 1956లలో కూడా తెలంగాణా ప్రజలను ఇదేవిధంగా మోసం చేశారని పలువురు అనుభవజ్ఞులు అన్నారు.

ప్రజా ఉద్యమాన్ని విస్మరించిన తెలంగాణా కాంగ్రేస్ నాయకులు శాసనసభను వేదికగా చేసుకున్నారు. చివరికి అది కాంగ్రేస్ పార్టీ అంతర్గత అధికార పోరాటంగా రూపుదాల్చింది.

సెప్టెంబర్ 29న తెలంగాణా సమస్యపై కేంద్ర నాయకులు తెలంగాణా ఉద్యమ నాయకులను విడివిడిగా పిలిపించి చర్చలు మొదలు పెట్టారు. కాసు బ్రహ్మానందరెడ్డి తర్వాత ఎవరు తెలంగాణా నుండి ముఖ్యమంత్రి కావాలన్న విషయంలో వారందరి మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు తెలుసుకున్నారు. మరో వైపు కేంద్రం తెలంగాణా ప్రాంతీయ కమిటి సభ్యులతో ఒక రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇటువంటి ప్రయత్నాలన్నీ ఉద్యమాన్ని నీరు కార్చటానికి తోడ్పడినాయి.

సెప్టెంబర్ 30న తెలంగాణా శాసనసభ్యుల రాజీనామాలకోసం కూడా ఉద్యమం నడపాలని శ్రీధర్ రెడ్డి విద్యార్థులను ఉద్బోధించారు. అయితే ఆయన కూడా పరిస్థితిని గమనించి ఒక నిస్సహాయ స్థితిలో పడిపోయి అక్టోబర్ 10వరకే తరగతులను బహిష్కరించి ఆ తర్వాత కేవలం ప్రతి శనివారం మాత్రమే బహిష్కరించాలని సూచించాడు.


www.etelangana.org

సికింద్రాబాదులో ఒక పౌరసదస్సు జరిగింది. ఆ సభ వృత్తి రాజకీయ నాయకుల అవకాశవాదాన్ని విమర్శించింది. కేవలం ముఖ్యమంత్రి మారితే తెలంగాణా ప్రజలు సంతృప్తి పడరని చెప్పింది. ప్రత్యేక తెలంగాణాను కోరే శాసనసభ్యులు తమ స్థానాలకు రాజీనామాలు ఎందుకు చేయరని ఆ సదస్సు ప్రశ్నించింది.

అక్టోబర్ ఏడున చెన్నారెడ్డి ఒక పత్రికా ప్రకటన చేస్తూ అక్టోబర్ 10 నుండి తెలంగాణా అంతట 3 లక్షల మంది ప్రజలు సత్యాగ్రహం చేయనున్నారని అయితే 18 సంవత్సరాలలోపు విద్యార్థినీ విద్యార్థులెవరు అందులో పాల్గొనరాదని షరతు పెట్టారు. దీనికి విద్యార్థులు ప్రతిస్పందిస్తూ తెలంగాణా శాసనసభ్యులందరూ తమ పదవులకు రాజీనామాలు చేసి తిరిగి ఎన్నికలలో నిలబడాలని సవాలు చేశారు.

రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం సభ్యుడు హెచ్.ఎన్. కుంజ్రూ ఈ సమస్యపై ఆంధ్రప్రదేశ్‌లో ఉప ఎన్నికలు జరపాలని సూచించగా చెన్నారెడ్డి దానిని సమర్థించాడు. ఇదేకాలంలో అఖిల భారత కాంగ్రేస్‌లో చీలికలు, ఘర్షణలు ప్రారంభమైనాయి. కాంగ్రేసు పార్టీ ఇండికేటు మరియు సిండికేటుగా చీలిపోవటం మొదలైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి తమ పదవినుండి తప్పుకోవాలని కామరాజ్, నిజలింగప్పలు సూచించగా ప్రధాన మంత్రి శ్రీమతి గాంధీ దానిని వ్యతిరేకించారు. ఫలితంగా తెలంగాణా సమస్యపై కాంగ్రేస్ పార్లమెంటరీ బోర్డు చర్చను వాయిదా వేసింది.

అక్టోబర్ ఎనిమిదిన దుకాణాల గుమస్తాల సంఘం అధ్యక్షుడు పి. వాసుదేవ్ ఒక ప్రకటన చేస్తూ ఇప్పటికే వర్తక వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, దసరా, దీపావళి తర్వాత సత్యాగ్రహం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశాడు.

కొందరు విద్యార్థులు ఇంకా డిటెన్యూలుగా జైళ్ళల్లోనే వున్నారు. అయినా అనేక విద్యార్థి సంఘాలు పదమూడు నుండి ప్రారంభమైయే స్కూల్, కాలేజీలకు హాజరుకావాలని నిర్ణయించుకున్నాయి.

అక్టోబర్ పదిన జంటనగరాలలో 18 చోట్ల ఆబిడ్స్‌తో సహా అనేక జిల్లాలో సత్యాగ్రహం ప్రశాంతంగా జరిగింది. ఆబిడ్స్‌లో బస్సులను తగులబెట్టటానికి ప్రయత్నించిన గుంపును చెదరగొట్టటానికి బాష్పవాయువు ప్రయోగం



లాఠీచార్జీలు జరిగాయి. అయితే అధికారులు పైనుండి ఆదేశాలు ఉండటంవలన చాలా సంయమనం పాటించి ఎవరినీ అరెస్టు చేయలేదు. రెండు మాసాల విరామం తర్వాత ఈ సత్యాగ్రహం మళ్ళీ ఒక సంచలనం సృష్టించింది. తెలంగాణాలోని తొమ్మిది జిల్లాలలో కూడా ఇదే మాదిరి సత్యాగ్రహాలు జరిగాయి. విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. అయితే ఈ సత్యాగ్రహంలో కొండా లక్ష్మణ్ బాపూజీతో సహా అనేక మంది నాయకులు పాల్గొనలేదు.

**మల్లికార్జున్ నిరాహార దీక్ష :**

ఆ రోజు నుండి సికింద్రాబాదులోని గాంధీ విగ్రహం వద్ద మల్లికార్జున్ నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు విషయంలో కేంద్ర చూపుతున్న నిర్లక్ష్యానికి నిరసనగా తాను ఆ నిరాహార దీక్ష ప్రారంభించినట్లు చెప్పుకున్నారు. తరగతులకు హాజరుకావాలని విద్యార్థులను ఆదేశించినందున వచ్చిన నిరసన, వ్యతిరేకతలను చల్లబరచటానికి ఆయన ఈ ఎత్తుగడ వేశాడని పలువురు విద్యార్థినాయకులు విమర్శించారు.

అక్టోబర్ 11న తెలంగాణా కాంగ్రేస్ కమిటి అధ్యక్షుడు కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణా ప్రజాసమితికి రాజీనామా చేశారు.

అక్టోబర్ 14న మల్లికార్జున్ ఒక ప్రకటన చేస్తూ తన ఆరోగ్యం విషయంలో విద్యార్థులు ఆందోళన పడరాదని వారు రాబోయే పరీక్షలకు సిద్ధం కావాలని సలహా ఇచ్చారు.

అదే రోజు కాంగ్రేస్ కేంద్ర నాయకత్వం తెలంగాణా ప్రజాసమితి మరియు తెలంగాణా కాంగ్రేస్ కమిటి నాయకులను ఢిల్లీకి పిలిపించి చర్చలు చేస్తామని ప్రకటించింది.

అక్టోబర్ 15న ప్రభుత్వం ఒక ప్రకటన చేస్తూ నవంబర్ 17 నుండి తెలంగాణాలో హెచ్.ఎస్.సి, మల్టీపర్పస్ పరీక్షల నిర్వహణకు సంసిద్ధతను తెలియజేసింది.

అక్టోబర్ 17న సికింద్రాబాదులో చెదురుమదురు అల్లర్ల సంఘటనలు జరిగాయి. మల్లికార్జున్ నిరహారదీక్ష ఎనిమిదవ రోజుకు చేరుకుంది.


www.etelangana.org

తెలంగాణా ఉద్యోగులకు సంబంధించిన రెండువేల ప్రమోషన్ వివాదాలను పరిష్కరించటానికి కేంద్రం ఒక బృందాన్ని హైద్రాబాదుకు పంపుతుందని ప్రధాన మంత్రి వాగ్దానం చేశారు. ఉద్యోగులను సంతృప్తి వరచటానికి ఇదొక నాటకం. తెలంగాణా సమస్యను సత్వరమే పరిష్కరించటానికి అన్నిరకాల చర్యలు తీసుకుంటామని ప్రధాన మంత్రి మరియు హోం మంత్రి తెలంగాణా ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడైన జె. చొక్కారావుకు హామీ ఇచ్చారు.

అక్టోబర్ 22న మల్లికార్జున్ నిరహారదీక్ష 12వ రోజుకు చేరుకున్నది. అంతకు పూర్వం నాలుగు రోజుల కిందట తెలంగాణా విద్యార్థినుల విభాగం కన్వీనరైన కుమారి సి.హెచ్. రమాదేవికూడా నారాయణగూడలో నిరవధిక నిరాహారదీక్షలో కూర్చున్నది.

నవంబర్ ఒకటిన ఆంధ్రప్రదేశ్ వ్యతిరేక దినం జరుపాలని, రిలే నిరహారదీక్షలు, పాదయాత్రలు చేయాలని తెలంగాణా ప్రజాసమితి నిర్ణయించింది. అక్టోబర్ 23న కుమారి సి.హెచ్. రమాదేవి ఆరోగ్యం క్షీణించింది. ఆబిడ్స్‌లో నెహ్రూ విగ్రహం వద్ద జలీల్‌పాషా, విష్ణువర్ధన్‌రెడ్డిలు కూడా నిరహారదీక్ష ప్రారంభించారు.

వివిధ సంఘటనలలో బాంబులు విసిరారన్న కేసులో సికింద్రాబాదు కాలేజీ విద్యార్థి యం.ఏ. వహీద్‌ను నిజాం కాలేజీ విద్యార్థి వి.పి. రాఘవేందర్‌రావును పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.

అక్టోబర్ 23న వరంగల్ జిల్లాలో తెలంగాణా విమోచన సమితి అధ్యక్షుడు కె. నర్సింహారెడ్డి పన్నుల నిరాకరణ ఉద్యమానికి పిలుపునిచ్చాడు.

అక్టోబర్ 24న కుమారి రమాదేవి ఆరోగ్యం ప్రమాద పరిస్థితికి చేరుకుంది. ఆమె 14 పౌండ్ల బరువు తగ్గి, విపరీతమైన కడుపునొప్పితో కోమాలోకి జారుకునే స్థితికి వచ్చింది. మల్లికార్జున్ నిరహారదీక్ష 14వ రోజుకు చేరుకుంది. ఆయన విద్యార్థులను మళ్ళీ పరీక్షలకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశాడు.



అక్టోబర్ 25న పోలీసులు కుమారి రమాదేవిని అరెస్టు చేసి ఉస్మానియా హాస్పిటల్‌లో చేర్పించి గ్లూకోజ్ ఇంజెక్షన్‌లు ఇప్పించారు. ఆమె ఏడు రోజులుగా నిరహారదీక్ష చేసింది.

సికింద్రాబాదులో మల్లికార్జున్ నిరహారదీక్ష 15వ రోజుకు చేరుకుంది. ఆయన 20 పౌండ్ల బరువు తగ్గారు.

ఆరోజు వరంగల్ జిల్లా పరకాలలో కె. నర్సింహారెడ్డి నాయకత్వంలో ప్రజలు పన్నుల నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఇది జాతీయోద్యమ స్ఫూర్తితో జరిగింది.

అక్టోబర్ 26న బాంబుల సూత్రధారి త్యాగరాజ్ (40) ను పోలీసులు అరెస్టు చేశారు. ఇతనే వహీద్, రాఘవేందర్‌రావులకు బాంబులు సరఫరా చేశాడని పోలీసులు అన్నారు. ఇతని ఇంటిలో పేలుడు సామాగ్రి యంత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇతని ప్రోత్సాహం వలన మంత్రులు, శాసనసభ్యుల ఇళ్లపై, కార్లపై బాంబు దాడులు జరిగాయి. ఇతను వృత్తిరీత్యా స్విమ్మర్. ఈ అనామకులు, ఈ సామాన్యులు చేసిన సాహసాలకు, త్యాగాలకు ఎట్లా విలువ గట్టాం? వారి కష్టనష్టాలు, కన్నీళ్లగురించి మనకేమైనా తెలుసా? ప్రస్తుతం అనామకంగా, un sung song గా, ఎక్కడో ఏ మూలలోనో రోజు గడిస్తే చాలన్నట్లు జీవన సమరంలో మునిగి ఉంటారు. తమ త్యాగాలను తర్వాత కాలంలో 'క్యాష్' చేసుకునే లౌక్యం తెలియని అమాయకులు వాళ్లు.

**సామ్రాజపు దండయాత్రలో**
**సామాన్యుల సాహసమెట్టిది?**
**- శ్రీశ్రీ**

ఆ రోజు నగరంలో కుమారి రమాదేవి మరణించిందన్న పుకారు బయలుదేరి జంటనగరాలలో మరియు వరంగల్‌లో అల్లర్లు, దహనాలు, రాళ్ళువిసిరిన సంఘటనలు జరిగాయి. బొల్లారం, అల్వాల్‌లలో బస్సులపై, రైళ్లపై దాడులు జరిగాయి. అది కేవలం పుకారు అని తర్వాత తెలిసింది.

మల్లికార్జున్ నిరహారదీక్ష 16వ రోజుకు చేరుకుంది. బొగ్గులకుంటలో సుశీల్ కుమార్ అనే విద్యార్థి గత ఐదురోజులనుండి నిరవధిక నిరాహారదీక్షలో కూర్చున్నాడు.


www.etelangana.org

అక్టోబర్ 27న తెలంగాణా ప్రజాసమితి ఒక ప్రకటన చేస్తూ నవంబర్ ఒకటి రాష్ట్రావతరణకు నిరసనగా తెలంగాణా బందుకు పిలుపునిచ్చింది.

అక్టోబర్ 29న మల్లికార్జున్ నిరాహారదీక్ష 19వ రోజుకు చేరుకుంది. ఆయన 23 పౌండ్ల బరువు తగ్గాడు. ఆయన నిరహారదీక్ష వ్యక్తిగత నిర్ణయం అని విద్యార్థి కార్యాచరణ సమితి విమర్శిస్తూ నిరాహారదీక్షల బదులు ఉద్యమాలను నిర్మించాలని సూచించింది. ఆయన ఉద్యమాన్ని పక్కదారి పట్టించటంకోసమే నిరహారదీక్షలో కూర్చున్నాడని, ఆయన తెలంగాణా ప్రజాసమితి ఏజెంట్ అని పలువురు విద్యార్థి నాయకులు విమర్శించారు. దానితో విద్యార్థి కార్యాచరణ సమితిలో విభేదాలు బయలుదేరాయి.

అక్టోబర్ 30న చెన్నారెడ్డితో తనకు విభేదాలు లేవని కొండా లక్ష్మణ్ బాపూజీ ప్లేట్ ఫిరాయించారు. ముఖ్యమంత్రి పదవి పోటీలోకి వి.బి. రాజు ప్రవేశించడంతో ఈయన ప్లేట్ ఫిరాయించి చెన్నారెడ్డితో కలిసి గూడుపుఠాణి ప్రారంభించారు. రాజకీయాలలో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని ఈ సంఘటన మళ్ళీ మరో సారి తెలియచేసింది.

అక్టోబర్ 31న మల్లికార్జున్ నిరహారదీక్ష 21 రోజులకు చేరుకొని ఆయన 24 పౌండ్ల బరువు తగ్గారు.

అదే రోజు కొండా లక్ష్మణ్ బాపూజీ ఒక ప్రకటన చేస్తూ నవంబర్ ఒకటి నుండి తాను కూడా 11రోజుల నిరహారదీక్ష ప్రారంభిస్తున్నట్లు తెలియచేశారు. ప్రజా ఉద్యమాన్ని విస్మరించి నిరహారదీక్షల సాకుతో ఉద్యమాన్ని నీరు కార్చటం ఇదేనని ప్రజలు భావించారు.

నవంబర్ మూడున మల్లికార్జున్‌ను పోలీసులు అరెస్టు చేసి ఉస్మానియా హాస్పిటల్‌లో చేర్పించారు. ఆతని 24 రోజుల నిరాహారదీక్ష ముగిసింది. ఈ వార్త తెలియగానే నగరంలో కొన్ని చోట్ల విద్యార్థులు గొడవలు చేశారు.

ఈ నెలలోనే ఇటు తెలంగాణా ఉద్యమంలో స్తబ్దత ఏర్పడి అటు జాతీయ స్థాయిలో కాంగ్రేస్ పార్టీలో చీలికకు రంగం సిద్ధమైంది. ఈ సందర్భంలో తెలంగాణా ప్రదేశ్ కాంగ్రేస్ కమిటి మొత్తం ప్రధాని ఇందిరాగాంధీవైపు నిలబడింది. దీనిని ఒక అవకాశంగా తీసుకొని తెలంగాణా నాయకులైన కొండా



లక్ష్మణ్ బాపూజీ, వి.బి. రాజు ప్రధాన మంత్రిని కలిసి ముఖ్యమంత్రి పదవికోసం మంతనాలు మొదలు పెట్టారు. ఉద్యమాన్ని మరిచిపోయి తెలంగాణా నుండి ఎవరు ముఖ్యమంత్రి కావాలనేదే వారి తాపత్రయం. ఈ సందర్భంగా మళ్ళీ చెన్నారెడ్డి మరియు కొండాలక్ష్మణ్ బాపూజీకి మధ్య విభేదాలు మొదలయ్యాయి.

**ఉద్యమం విరమణ చెన్నారెడ్డి ప్రకటన :**

నవంబర్ 26న చెన్నారెడ్డి ఒక ప్రకటన చేస్తూ విద్యార్థులు పరీక్షలలో నిమగ్నమైనందున, గ్రామీణులు వ్యవసాయ పనులలో ఉన్నందున ఉద్యమంలో స్తబ్దత ఏర్పడిందని అన్నారు.

నవంబర్ 27న ఢిల్లీ నుండి తిరిగి వచ్చిన చెన్నారెడ్డి ప్రస్తుతానికి ఉద్యమాన్ని వాయిదా వేస్తున్నామని వచ్చేసంవత్సరం జనవరి ఒకటినుండి ఉద్యమాన్ని పునరుద్ధరించటం జరుగుతుందని అన్నారు. ఈ ప్రకటనతో సంవత్సర కాలం రక్తతర్పణాలతో, అశ్రుఅభిషేకాలతో, త్యాగాలతో, బలిదానాలతో కొనసాగిన ఉద్యమం ముగిసింది.

డిసెంబర్ ఆరున తెలంగాణా ప్రజా సమితి అధ్యక్ష పదవినుండి చెన్నారెడ్డిని తొలగిస్తున్నామని సదాలక్ష్మి మరో ముగ్గురు ఒక ప్రకటన చేశారు. ఆయన వ్యక్తి ఆరాధనా పద్ధతిని, పెత్తందారీ పద్ధతిని ప్రవేశపెట్టారని వారు విమర్శించారు. కేంద్ర నాయకులతో ఆయన ఏకపక్ష చర్చలు నిర్ణయాలు చేసి, ఉద్యమాన్ని నిర్మించేబదులు నిరాహారదీక్షలను ప్రోత్సాహించాడని, ప్రజాప్రతినిధుల రాజీనామాల సంగతిని మూలకు నెట్టాడని, ఉద్యమాన్ని బలిపెట్టి పరిపాలన, రాజకీయ స్థాయి మార్పులకు అంగీకరించాడని వారు తీవ్రంగా విమర్శించారు. తెలంగాణా ప్రజా సమితి విస్తృత నిర్మాణానికి ఆయన వ్యతిరేకి అని, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, మహిళలు ఉద్యమానికి దూరం కావటానికి ఆయనే బాధ్యుడని వారు ధ్వజమెత్తారు. అయితే 58 మంది సభ్యులలో నలుగురు మాత్రమే ఈ ప్రకటనపై సంతకాలు చేశారు.

డిసెంబర్ 8న చెన్నారెడ్డి మరో ప్రకటన చేస్తూ ఉద్యమం ఆగదని, ప్రధానికి ఈ ఏడాది చివరివరకు గడువు ఇచ్చామని ఆమె ఒప్పుకోకపోతే జనవరి ఒకటి


www.etelangana.org

నుండి తిరిగి ఉద్యమాన్ని ప్రారంభిస్తామని అప్పటివరకు విద్యార్థులుకూడా పరీక్షలు ముగించుకొని ఉద్యమంలోకి వస్తారని ఆయన అన్నారు.

డిసెంబర్ 11న తెలంగాణా ప్రజా సమితి ఒక ప్రకటన చేస్తూ జనవరి 11, 12 తేదీలలో సంస్థాగత ఎన్నికలు జరుగుతాయని తెలిపింది. ఈసారి మళ్లీ కొండాలక్ష్మణ్ బాపూజీ తెలంగాణా ప్రజా సమితికి రాజీనామా చేశారు. ఇదే రోజు సికింద్రాబాదు బాంబుకేసులో నరేందర్ మరియు కుమార్‌లకు మూడు సంవత్సరాల జైలు శిక్షను కోర్టు విధించింది. వీరు గతంలో సికింద్రాబాదులో పోలీసు వాహనంపై బాంబు విసరగా ఒక జవాను మృతి చెందాడు. వీరిలో ఒకరు చంచల్‌గూడ ప్రింటింగ్ ప్రెస్‌లో కంపోజిటర్, మరోకరు సికింద్రాబాదులో పాలవ్యాపారి. ఈ యువకుల వీరోచిత సాహసాన్ని తెలంగాణా ప్రజలు ఎన్నడు మరిచిపోరు.

**"వీరగంధము తెచ్చినారము**
**వీరులెవ్వరో తెల్పుడీ.**
**పూసిపోదుము, మెడలొ వేతుము**
**పూలదండలు భక్తితో"**

**- త్రిపురనేని రామస్వామి చౌదరి.**

ఈ గీతాన్ని విన్నప్పుడు వీరే జ్ఞాపకానికి వస్తారు.

డిసెంబర్ 15న ప్రత్యేక తెలంగాణా ప్రదేశ్ కాంగ్రేస్ కమిటిని ఏర్పాటు చేయాలన్న అభ్యర్థనను మన్నించరాదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రేస్ కమిటిలోని 135 మంది తెలంగాణా సభ్యులలో 82 మంది ప్రధానమంత్రికి విజ్ఞాపన పత్రం సమర్పించారు. ఈ ప్రత్యేక కాంగ్రేస్ కమిటి ఏర్పాటు ప్రత్యేక రాష్ట్రానికి దారి తీస్తుందని వారు వాదించారు. ఈ సంఘటనతో తెలంగాణా కాంగ్రేస్ నాయకులలో మెజారిటీ వర్గం సమైక్యతను కోరుతుందని తెలిసింది. ఈ విజ్ఞాపన పై సంతకాలు చేసినవారిలో తెలంగాణాకు సంబంధించిన జె.వి. నర్సింగరావు, ఉపముఖ్యమంత్రికూడా ఉన్నారు.

డిసెంబర్ 16న ముఖ్యమంత్రికి వ్యతిరేకమైన 90 మంది తెలంగాణా కాంగ్రేస్ నాయకులు సమావేశమయ్యారు. చెన్నారెడ్డి, కొండాలక్ష్మణ్ బాపూజీ,



వి.బి. రాజు, నూకల నరోత్తమరెడ్డి మొదలగు గ్రూపులవారు అందరూ కలిసి వందమందిని పిలిస్తే తొంభైమంది హాజరైయ్యారు. అయితే ఈ సమావేశానికి తెలంగాణాకు చెందిన మంత్రులెవ్వరిని పిలువలేదు. ఈ సమావేశం కేవలం ముఖ్యమంత్రికి వ్యతిరేకం, తెలంగాణాకు అనుకూలమైనవారినే పిలిచామని నిర్వాహకులు చెప్పారు. అన్ని గ్రూపుల మధ్య ఐక్యతను సాధించడమే ఈ సమావేశ లక్ష్యం అని అన్నారు. వీరందరూ తెలంగాణా ప్రదేశ్ కాంగ్రేస్ కమిటి ఏర్పాటుకు తమ ఏకగ్రీవ నిర్ణయాన్ని తెలియచేశారు. దీనితో చాలా మంది గోడమీద నిలుచున్న పిల్లులని తెలిసిపోయింది. ఒక రోజు క్రితం వరకు తెలంగాణా కాంగ్రేస్ కమిటి అక్కరలేదన్న వారుకూడా ఈ సమావేశానికి హాజరై ప్లేట్ ఫిరాయించారని తెలుస్తున్నది. వీరి మరో ద్వంద్వ వైఖరి ఏమనగా రాష్ట్రంలో ముఖ్యమంత్రిని వ్యతిరేకిస్తూనే కేంద్రంలో ప్రధాన మంత్రిని బలపరచాలని. అవకాశవాద కాంగ్రేస్ సంస్కృతిని ప్రజలు గమనించారు.

డిసెంబర్ 23న బొంబాయిలో జరిగిన ఇందిరా కాంగ్రేస్ సభలలో ప్రత్యేక తెలంగాణా మాటనేగాక కనీసం ప్రత్యేక కాంగ్రేస్ కమిటి విషయం కూడా చర్చకు రాలేదు. దీనివలన కేంద్ర కాంగ్రేస్ నాయకత్వం నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా తెలిసింది.

డిసెంబర్ 26న చెన్నారెడ్డి తెలంగాణా ప్రజా సమితి అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

డిసెంబర్ 29న విద్యార్థి ఐక్య కార్యాచరణ సమితికి మల్లికార్జున్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

డిసెంబర్ 31న బొంబాయి కాంగ్రేస్ సమావేశాల నుండి తిరిగి వచ్చిన చెన్నారెడ్డి ఒక ప్రకటన చేస్తూ తెలంగాణా సమస్యపై కేంద్రానికి శ్రద్ధ లేదని తెలియచేశారు.

**నష్టాలపై ప్రభుత్వం అంచనాలు, వివరాలు :**

నిజానికి ఉద్యమంలో 360 మంది చనిపోగా, ప్రభుత్వ లెక్కల ప్రకారం 57 మంది చనిపోయారు. అందులో 12 మంది విద్యార్థులు. మొత్తం 96 సార్లు పోలీసు కాల్పులు జరిగాయి అందులో గాయపడినవారి సంఖ్య 217. అందులో


www.etelangana.org

విద్యార్థులు 26 మంది. ఈ వివరాలు హైద్రాబాదు పట్టణాన్ని కలుపుకొని చెప్పినవి. ఇక హైద్రాబాదులో 53 సార్లు పోలీసు కాల్పులు జరిగాయి. అందులో 35 మంది చనిపోయారు. 125 మంది గాయపడ్డారు. ఈ లెక్కలన్నీ ప్రభుత్వం తగ్గించి చెప్పినవనేది జగమెరిగిన సత్యం.

ఇక ఆస్తి నష్టం వివరాలు కేంద్ర ప్రభుత్వం ఆస్తులు 12.04 లక్షలు, ఆర్.టి.సి. ఆస్థులు 28.31 లక్షలు, ఇతర ప్రభుత్వ శాఖ ఆస్తులు 3.20 లక్షలు మరియు ప్రైవేటు వ్యక్తుల ఆస్తులు 18.81 లక్షలు. తెలంగాణాలో పోలీసు మరియు మిలటరి బందోబస్తుకు అయిన ఖర్చు అక్షరాల 1,37,37,900 రూపాయలు. (సండే స్టాండర్డ్ 28-9-1969 దినపత్రిక ఆధారంగా)

**మూగబోయిన అగ్ని వీణ :**

ఇట్లా ఒక సంవత్సరం పాటు అగ్నిగుండంగా మారిన తెలంగాణా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించి, వీరోచిత త్యాగాల చరిత్రను సృష్టించి, సంవత్సరం చివరలో ఒక 'మౌన వీణగా' మూగబోయింది. నాయకుల ద్రోహానికి గురై నిలువెల్ల గాయాలతో మిగిలిపోయింది.

"మా మౌనం మూగది కాదు
గోడకు వేలాడే తుపాకీ కూడా
మౌనంగానే ఉంటుంది"

- నందిని సిధారెడ్డి

**అనుభవాలు - గుణపాఠాలు :**

(1) ఈ ఉద్యమం ప్రజలనుండి వచ్చింది. విద్యార్థులు, యువకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులే ముందు ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఉద్యమం ఉధృతమయ్యేసరికి అవకాశవాద రాజకీయ నాయకులు అందులో ప్రవేశించి నాయకత్వాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. దానితో అది కాంగ్రేసు పార్టీ ఉద్యమంగా మారి చివరికి కాంగ్రేసు పార్టీ అంతర్గత వ్యవహారంగా తయారయ్యింది. పోరాటం వీధుల్లోనుండి, ప్రజలలోనుండి దూరమై అసెంబ్లీకి పరిమితమై నాయకత్వ మార్పుకోసం 'మ్యూజికల్ చైర్' ఆటగా మిగిలిపోయింది.



ఈ ఉద్యమం వలన తెలంగాణా కాంగ్రేసు నాయకత్వంలో మూడు గ్రూపులు ఏర్పడినాయి. ఒకటి మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలోని తెలంగాణా ప్రజాసమితి. రెండు శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ నాయకత్వంలోని తెలంగాణా కాంగ్రేసు కమిటి. మూడు వి.బి. రాజు మరియు నూకల నరోత్తమరెడ్డి నాయకత్వంలోని తెలంగాణా యునైటెడ్ ఫ్రంట్. ఎన్ని గ్రూపులు ఏర్పడినా మొత్తం 74 మంది తెలంగాణా కాంగ్రేసు శాసన సభ్యులలో 24 మంది మాత్రమే ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని సంపూర్ణంగా సమర్థించారు. వీరుకూడా ఉద్యమం బలం పుంజుకున్న తర్వాత వచ్చిన బాపతే. అసెంబ్లీలో మెజార్టీ తెలంగాణా శాసన సభ్యులు (అన్ని పార్టీలవారితో కలిపి) సమైక్యతకు కట్టుబడి వుండటం ఉద్యమానికి బలం చేకూరలేదు. మరో బలహీనత ఏమనగా ప్రత్యేక తెలంగాణాను కోరే కాంగ్రేసు నాయకత్వం కేవలం ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డికి మాత్రమే వ్యతిరేకులు తప్ప కేంద్ర కాంగ్రేసు అధిష్టాన వర్గానికి గాని, కేంద్ర ప్రభుత్వాని గాని, ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీకి గాని వ్యతిరేకులు కారు. 1971 మధ్యంతర ఎన్నికలలో 'గరీబీహఠావో' నినాదంతో ఇందిరాకాంగ్రేసు పార్లమెంటులో సంపూర్ణ మెజర్టీ సాధించటంవలన పది సీట్లు మాత్రమే కలిగి వున్న తెలంగాణా ప్రజాసమితి నిరుపయోగంగా మారింది. ఈ బలహీనతే కాక జాతీయ, అంతర్జాతీయ కారణాలు కూడా తెలంగాణా ఉద్యమానికి దోహదపడలేదు. కాంగ్రేసు పార్టీలో పాతతరానికి కొత్తతరానికి జరిగిన ఘర్షణ పార్టీ చీలికకు దారితీసి ఇందిరా కాంగ్రేసు ఎదురులేని శక్తిగా మారింది. తెలంగాణా కాంగ్రేసు నాయకులంతా "ఇందిర పందిరికిందర" చేరటంవలన వారు వ్యక్తిత్వం కోల్పోయారు. అప్పుడే బంగ్లాదేశ్ విముక్తి పోరాటం జరుగుతున్న సందర్భంలో భారతదేశం ఆ పోరాటానికి మద్దతు తెలియచేయటం, భారత పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం రావటం, దానివలన ఇందిరా గాంధీ ఒక 'విజేత'గా ప్రజల ముందు నిలబడటం ఇవన్నీ ఉద్యమానికి వ్యతిరేకకారణాలైనాయి. జాతీయ పార్టీలైన జనసంఘ్, ఉభయ కమ్యూనిస్టుపార్టీలు మొదటినుండి ఉద్యమ వ్యతిరేక వైఖరిని తీసుకున్నాయి. ఒక ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలంటే పార్లమెంటు చట్టం అవసరం. కేవలం పది సీట్లు వున్న తెలంగాణా ప్రజా సమితి ఇతర పార్టీల మద్దతు లేకపోవటం, పైగా కాంగ్రేసు పార్టీకి పార్లమెంట్‌లో సంపూర్ణ మెజార్టీ వుండటం అనే సాంకేతిక కారణాలవలన ఉద్యమం వైఫల్యం చెందింది. ఆనాడు దేశంలో



www.etelangana.org

ఒక ప్రత్యేక విదర్భ రాష్ట్ర ఉద్యమం తప్ప మరే ఉద్యమం బలంగా లేదు. చిన్న రాష్ట్రాల ఏర్పాటు వాదనకు అస్కారమే లేదు. ఉద్యమం ముగిసిన తర్వాతనే ఈ చర్చ మొదలైంది. దానివలన ఉత్తర భారతంలోని ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు బలపడినాయి.

చివరికి ఈ ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని తన స్వార్థానికి ఉపయోగించుకుని ప్రధాని, ఇందిరాగాంధీ కాసు బ్రహ్మానందరెడ్డిని 24 సెప్టెంబర్ 1971 నాడు పదవినుండి రాజీనామా చేయించింది. ప్రధాని అనేక పర్యాయాలు చెన్నారెడ్డి, చొక్కారావు, వి.బి.రాజు మొదలగు నాయకులతో మాట్లాడి ప్రత్యేక వాదనను వదులుకోవాలని, బ్రహ్మానందరెడ్డిని తొలగించటం పట్ల దృష్టి కేంద్రీకరించాలని ఒప్పించింది. దీనితో రోగి కోరుకున్నది, వైద్యుడు కోరుకున్నది ఒకటే అయ్యింది. ఆ స్థానంలో తెలంగాణాకు చెందిన శ్రీపి.వి. నర్సింహరావుగారు ముఖ్యమంత్రిగా నియమించబడ్డారు. తర్వాత కొద్ది రోజులలోనే తెలంగాణా ప్రజా సమితి అధికార కాంగ్రెసు పార్టీలో విలీనమై ఉద్యమాన్ని, ప్రజలను నిలువునా ముంచేసింది. త్వరలో జరుగబోయే (1972) అసెంబ్లీ ఎన్నికలలో 70 శాతం సీట్లు సంపాదించే అవకాశం వున్నా తెలంగాణా ప్రజా సమితి తెలంగాణా ప్రజలను రాజకీయ విద్రోహానికి గురిచేసింది. ఉద్యమం రాజకీయంగా ఓడిపోయినా నైతికంగా మాత్రం విజయం సాధించింది.

(2) 'రాజకీయాలలో కులం ఒక రసాయనిక చర్యను కలిగివుంటుంది'. (ప్రొఫెసర్ రజనీకోఠారి)

ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని కులం కోణం నుండి కూడా మనం పరిశీలించాలి. ఉద్యమానికి నాయకత్వం కాంగ్రెసు పార్టీదే కాక అందులో వున్న రెడ్డికులమే ప్రధానంగా నాయకత్వం వహించింది. దీనికి వ్యతిరేకంగా వెనుకబడిన వర్గాల ప్రతినిధి శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ నాయకత్వాన తెలంగాణా కాంగ్రెసు కమిటీ, బ్రాహ్మణుడైన వి.బి. రాజు నాయకత్వాన తెలంగాణా యునైటెడ్ ఫోరంలు ఏర్పడినాయి. ఈ మూడు గ్రూపులవలన ఉద్యమం తనంత తానే ధ్వంసం అవుతుందని అటు కేంద్ర కాంగ్రెసు నాయకత్వం, ఇటు ఆంధ్రా కాంగ్రెసు నాయకత్వం లోలోపల సంతోషించింది. చివరికి కథ అట్లనే ముగిసింది.

వర్తమానంలో కూడా దళిత, బహుజన, మైనార్టీ వర్గాల ప్రజలలో కూడా ప్రత్యేక తెలంగాణా వచ్చినా అగ్రకులాలకే రాజ్యాధికారం లభిస్తుందని



అనుమానాలు, భయాలు వున్నాయి. కావున భవిష్యత్తులో సాధించబోయే "ప్రజాస్వామిక తెలంగాణాలో" ఆ వర్గాల వారందరికి "సామాజిక న్యాయం" దొరుకుతుందన్న బరోసా కలిగించాలి. వారే సమాజంలో అత్యధిక శాతం ప్రజలు కావున వారికి రాజ్యాధికారం కూడా దొరుకుతుందన్న హామీ ఇవ్వాలి. సాధించబోయే తెలంగాణా భూస్వామ్య, మత శక్తులకు వ్యతిరేకంగా కూడా వుంటుందన్న నమ్మకం కలిగించాలి. అప్పుడే ఆ వర్గాలవారు ఉద్యమంలో చురుకుగానే కాక ముందు వరుసలో పాల్గొంటారు.

(3) 1969లో జరిగిన ఉద్యమం పట్టణ ప్రాంతాలకే పరిమితమైంది. జిల్లాకేంద్ర పట్టణాలకు, చిన్న చిన్న తాలుకా టౌన్లకు మాత్రమే విస్తరించింది. ఫలితంగా తెలంగాణా ఉద్యమం అంటే గ్రామీణ ప్రాంతాల ప్రజలలో అది కేవలం పట్టణ ప్రాంతాలలో చదువుకున్న నిరుద్యోగుల సమస్య అని సంకుచిత అభిప్రాయం ఏర్పడింది. అందువలన 1970లో జరిగిన పంచాయితీ రాజ్ ఎన్నికలలో 115 సీట్లలో 20 మాత్రమే తెలంగాణా ప్రజా సమితి గెలుచుకుంది. ఒక్క జిల్లా పరిషత్తు సీటు కూడా గెలుచుకోలేదు. ఆ ఉద్యమం గ్రామీణ పునాదిగా నిర్మించబడలేదు. ఆ రోజులలో ఉద్యమానికి భవిష్యత్తు పట్ల ఒక స్పష్టత, ఒక 'విజన్' లేదు.

వర్తమానంలో ఈ లోపాన్ని సరిదిద్దుకోవాలి. సాధించబోయే 'ప్రజా స్వామిక తెలంగాణా' కేవలం పట్టణ ప్రాంత, చదువుకున్న, మధ్యతరగతి మేధావి వర్గాల ప్రయోజనాలని, వారి నిరుద్యోగ సమస్యనే పరిష్కరిస్తుందన్న అపార్థాలను తొలగించి గ్రామీణ వ్యవసాయ రంగంపై, భూపంపకంపై, వ్యవసాయాభివృద్ధిపై, చిన్న నీటిపారుదల సౌకర్యాలపై, చేతివృత్తులు, కుల వృత్తుల పరిరక్షణ-అభివృద్ధిపై కూడా కృషి చేస్తుందని గ్రామీణ ప్రజలకు నచ్చచెప్పాలి. అప్పుడే వారు ఉద్యమంలోకి వస్తారు.

(4) 1969 జూన్ నెల చివరిలో నాయకత్వం మొత్తాన్ని జైళ్లల్లో పెట్టగానే ప్రత్యామ్నాయ, రెండవ శ్రేణి నాయకత్వం లేక ఉద్యమం వెనకడుగు వేసింది. దీనితో ప్రభుత్వం ఉద్యమాన్ని లొంగదీసుకుంది. తెలంగాణా ప్రజా సమితికి చెందిన టి.ఎన్. సదాలక్ష్మి, డాక్టర్ మెల్కోటే మొదలగు ఒకరిద్దరే మిగిలిపోయారు. ప్రత్యామ్నాయ నాయకత్వం, ప్రజలలో నుండి వచ్చిన నాయకత్వం లేక ఉద్యమం ఒంటరిగా మిగిలిపోయింది.


www.etelangana.org

కావున వర్తమానంలో నాయకత్వం ప్రజలలోనుండి రావాలి. అప్పుడే ప్రజలకు ఆ నాయకులపై పట్టువుంటుంది. మనకు మహా నాయకులు, హీరోలు వద్దు ప్రజలనుండి వచ్చిన నాయకులే కావాలి అని శ్రీ కేశవరావ్ జాదవ్ పదేపదే చెప్పుతుంటారు. ఇకనైనా ప్రజలలో నుండి వచ్చిన అంచెలంచెల నాయకత్వాన్ని, ప్రజాస్వామిక దృష్టి కల్గిన నాయకత్వాన్ని తయారు చేసుకోవాలి. మరియు అన్ని రాజకీయ పార్టీల అవకాశవాదం పట్ల ప్రజలు అప్రమత్తతతో వుండాలి. గతంలోని చేదు అనుభవాలనుండి గుణపాఠాలు నేర్చుకొని జాగ్రత్తగా అడుగుముందుకు వెయ్యాలి.

(5) 1969 ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో అత్యధిక శాతం ముస్లిం ప్రజలు, మజ్లీస్ పార్టీతో సహా తటస్థంగా, దూరంగా వున్నారు. కాంగ్రేసు పార్టీ ప్రభావంలో వున్న లౌకిక వాద దృక్పథం కలిగిన కొంత మంది మాత్రమే ఉద్యమానికి మద్దతు ఇచ్చారు. కాని మెజార్టీ ముస్లింలు ఉద్యమాన్ని అర్థం చేసుకోలేదు. పైగా ఆంధ్రా హిందువుల కంటె తెలంగాణా హిందువులు తీవ్ర మతతత్వ వాదులని, ముస్లిం వ్యతిరేకులని అనుమానించారు. కావున ప్రస్తుతం నడుస్తున్న తెలంగాణా ఉద్యమం మతతత్వ వ్యతిరేక వైఖరి తీసుకుంటుందన్న బరోసా కలిగించాలి. గుజరాత్ మత కల్లోలాల చేదు గాయాల నేపథ్యంలో వర్తమాన తెలంగాణా ఉద్యమం లౌకిక వాదాన్ని గౌరవిస్తుందని తెలియచెయ్యాలి. ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి రాజధాని హైద్రాబాదు కేంద్ర బిందువు కావున, రాజధానిలో అత్యధిక ముస్లిం ప్రజల మద్దతును కూడ గట్టుకోవటం, మజ్లీస్ పార్టీని అంగీకరింపచేసి దాని మద్దతును సంపాదించటం చాలా కీలకమైన విషయం. రాబోయే ప్రజాస్వామిక తెలంగాణాలో మైనార్టీ ముస్లింలకు రక్షణ, ప్రయోజనాలతో పాటు ఉర్దూ భాషాభివృద్ధికి స్థానం వుంటుందని తెలియచెయ్యాలి. ఉర్దూ భాష మొత్తం తెలంగాణాకు సంబంధించినదే తప్ప ఒక ముస్లింలకే పరిమితం కాదన్న హామీని ఆచరణలో చూపాలి. జాతీయోద్యమంలో హిందు ముస్లింల ఐక్యతను సాధించినట్లే ఈ ఐక్యతను సాధించాలి. ఇందులో భాగంగానే విస్తృతమైన ప్రచారం ఉర్దూ భాషలోని పత్రికలు, పుస్తకాలు, కరపత్రాల ద్వారా జరగాలి. ముస్లిం మేధావులు, రచయితలు, కవులు, కళాకారుల్ని కూడగట్టాలి.



(6) 1968 ఉద్యమం ఒక ఉద్రేకపూరిత ఉద్యమంగా నడిచింది. అన్యాయాలు, అవహేళనలు, ప్రాంతీయ అసమానతలు ఎలా జరిగాయో ప్రజలకు తెలియచేయకుండా, ప్రచారం చేసే రచనలు, పుస్తకాలు లేకుండా, వివేకవంతమైన ఉపన్యాసాలు ఇవ్వకుండా కేవలం ఉద్రేకపూరిత నినాదాలు, రెచ్చగొట్టే ఉపన్యాసాలు, అక్కడక్కడా గోడలపై అశ్లీలమైన రాతలతో సామాన్య ఆంధ్ర ప్రజలపై దాడులతో కొనసాగింది. తెలంగాణా జాతి జనుల్ని చైతన్య పరిచే పద్ధతులతో ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలి. రాజకీయ ఉద్యమంలో భాగంగా భావ విప్లవం రావాలి. ప్రజలను మేధోపరంగా వివేకవంతుల్ని చేసేందుకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. ఆత్మ గౌరవ ఉద్యమాలు, సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాలు జాతీయోద్యమ స్ఫూర్తితో కొనసాగాలి. జాతీయోద్యమ రోజుల్లో రాజకీయ పోరాటంతో పాటు సాంస్కృతిక, పునరుజ్జీవన ఉద్యమాలు నడిచాయన్న సంగతిని మరిచిపోరాదు. ఈ భావవిప్లవ కార్యక్రమంలో రచయితలు, కవులు, కళాకారులు మరియు మేధావులు చురుకుగా పాల్గొనాలి. 40 సంవత్సరాలనుండి కొనసాగి విజయం సాధించిన జార్ఖండ్ ఉద్యమంలో రచయితలు, కవులు, కళాకారులు, మేధావులు నిర్వహించిన పాత్రను ఆదర్శంగా తీసుకోవాలి.

1969 ఉద్యమం నడుస్తున్న రోజులలో మనలో ఆత్మన్యూనతా భావాలు వుండేవి. మన భాష నిజంగానే అందంగా వుండదని, విద్యలో మనం వెనుకబడినవారమని, ఇంగ్లీష్ భాష సరిగ్గా రాదని, సాహిత్య, సంస్కృతిక పరంగా రెండవ శ్రేణికి చెందినవారమని మనల్ని మనమే కించపరుచుకునేవాళ్లం. అది పొరపాటు ఆలోచన. ఆంధ్రుల 'థాట్ పోలీసింగ్' మనను అట్లా చేసింది. కాని ఇప్పుడిప్పుడే అందులోనుండి బయటపడుతున్నాం. నిజంగా మన భాష, మన యాస గొప్పదని, అసలు మన జాతేవేరని, మన ఆచార వ్యవహారాలు, ఆహారపద్ధతులు, కట్టుబొట్టు, నైతిక విలువలు విభిన్నం అని వాటిని పరిరక్షించుకోవాలని, గర్వంగా భావించాలని సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాలు, ఆత్మ గౌరవ ఉద్యమాలు బలం పుంజుకుంటున్నాయి. అటు ప్రత్యేక తెలంగాణా రాజకీయ పోరాటం ఇటు తెలంగాణా సాహిత్య, సాంస్కృతిక పునరుజ్జీవన పోరాటం రెండూ మిళితమై ప్రజలను చైతన్య పరిచేవిధంగా


www.etelangana.org

ముందుకు సాగాలి. ప్రజల్ని జాగృతం చేయాలి. ఈ ప్రయత్నంలో భాగంగా అనేక రచనలు, అనేక పుస్తకాలు పుంఖానుపుంఖాలుగా రావాలి. వాటన్నింటిని మిసైళ్ళుగా మార్చి ఆంధ్ర వలస పాలకులపై గురిపెట్టి వదలాలి.

ఈ సందర్భంగా రెండువేల సంవత్సరాల క్రితం ప్రభుత్వం చేతిలో చిక్కి, శిలువనెక్కి, మరణించబోయే ముందు బానిసల నాయకుడు "స్పార్టకస్" అన్న మాటల్ని ఒక సారి జ్ఞాపకం చేసుకుందాం.

**" ఈ సారి నేను లక్షమందితో తిరిగి వస్తాను."**




# 1969 ఉద్యమంలో ప్రాణాలు త్యాగం చేసిన కొందరి అమరవీరుల ఫోటోలు - వివరాలు

"వందనాలు, వందనాలమ్మో
నా బిడ్డలు .............
దిక్కు చూపే చుక్కలయినారా
నా బిడ్డలు ............."




www.etelangana.org

**ప్రకాష్ కుమార్ జైన్ (21)**




ఇతను జామే ఉస్మానియా రైల్వే స్టేషన్ తగులబడుతున్నపుడు మంటలలో చిక్కుకుని చనిపోయాడు. ఖమ్మం జిల్లా గార్ల గ్రామం నివాసి. ఏకైక పుత్రుడు. అన్వర్‌లూమ్ కాలేజీలో పియుసి చదివి తర్వాత ఉస్మానియాలో ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నపుడు చనిపోయాడు. అందగాడే కాక సంగీతం, నాట్యం అతని అభిరుచులు. బ్రతికుంటే ఈరోజు గొప్ప ఇంజనీర్‌గా ఉండేవాడు.

**పి. సర్వారెడ్డి (23)**



ఇతను ఇంటికి పెద్ద కొడుకు తండ్రిపేరు పాశం వేణుగోపాల్‌రెడ్డి. మహబూబునగర్ జిల్లా, గద్వాలలోని చెంగనవల్లి గ్రామం. ప్రకాష్ కుమార్‌తో పాటు రైల్వే స్టేషన్ దహనంలో మార్చి 28న చనిపోయాడు. ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం విద్యార్థి. ముగ్గురు తమ్ముళ్ళు ఇద్దరు చెల్లెళ్ళను, తల్లిదండ్రులను వదిలి కనపడని లోకాలకు వెళ్ళిపోయాడు.

**ప్రకాష్‌రావు (18)**



ఇతను సికింద్రాబాదు కలాసిగూడ హైస్కూల్‌లో 11వ తరగతి విద్యార్థి. ఏప్రిల్ నాల్గున సికింద్రాబాదులోని అంజలి టాకీస్ వద్ద జరిగిన కాల్పులలో మరణించాడు. ఈ నాటి తెలంగాణా కవి వేణుసంకోజు బాల్యమిత్రుడు. మద్రాస్ పోలీసులు ఇతన్ని దగ్గరనుండి మూడు బుల్లెట్లతో కాల్చిచంపారు. ఇతని తండ్రి పేరు రత్నయ్య. సికింద్రాబాదులోని కంచరిబస్తీ నివాసి.



**రాములు (24)**



తండ్రిపేరు మల్లయ్య పాన్‌బజార్ నివాసి. ఏప్రిల్ నాల్గున అంజలి టాకీస్ వద్ద జరిగిన కాల్పులలో మరణించాడు. కాల్పులలో చిక్కుకున్న స్త్రీలను రక్షించడంకోసం సాహసంతో ముందుకు ఉరుకగా పోలీసుల తుపాకీ గుండ్లకు బలైనాడు. "సాహసపు సమక్షంలో మృత్యువు ఒక లెక్కకాదు". అని నిరూపించి ఊపిరి వదిలాడు.

**వేణుగోపాల్ (10)**



తండ్రిపేరు శ్రీనివాసచారి. మహబూబునగర్ జిల్లాలోని గద్వాల నివాసి. ఆరవ తరగతి చదువుతున్న ఈ పసిబాలుడు బిస్కట్లకోసం ఏప్రిల్ 9న ఉదయం 11.30 గంటలకు వీధిలోకి వెళ్లగా పోలీసు కాల్పులకు గురైనాడు. బిస్కట్లు మట్టిపాలైనాయి. లేత బ్రతుకు కూడా మట్టిపాలైంది. ఈ పాపం ఎవరిది? పూసి, కాసే చెట్టు మొగ్గ దశలోనే మట్టిలో కలిసింది.

**ఉమేందర్ (25)**



సికింద్రాబాదులోని జీరా నివాసి. తండ్రి కృష్ణారావు. మేడే నాడు రాజ్‌భవన్ ముందు జరిగిన కాల్పులలో కాలంచెందాడు. సికింద్రాబాదు సాయం కళాశాల విద్యార్థి సంఘానికి అధ్యక్షుడు. బి.ఏ. మూడవ సంవత్సరం విద్యార్థి. చెలరేగిన విద్యార్థులను శాంతపరచటానికి రెండు చేతులెత్తి విజ్ఞప్తి చేస్తున్నపుడు పోలీసులు వెనుకనుండి వీపులో గుండ్లను కురిపించారు. అతని తల్లి కాశీ యాత్రలో ఉంది. ఇంట్లో చెల్లెలు ఒకతే వుంది. స్నేహితులే అంత్యక్రియలు జరిపారు.



www.etelangana.org

### ప్రేమ్ కిశోర్ (22)



"గరిబోళ్ల బిడ్డా మరువదు నిన్ను ఈ తెలంగాణ గడ్డ". తెలంగాణా ఉద్యమం ఇతని సాహసాన్ని, త్యాగాన్ని ఎన్నడు మరువదు. ఆబిడ్స్‌లోని దుర్గావిలాస్ అనే ఆంధ్రా హోటల్ ఈ యువకిశోరాన్ని మింగేసింది. కత్తులతో పొత్తి కడుపు కింద కసిదీరా పొడిచింది. పోలీసులు చూస్తూనే ఉన్నారు. కాని రక్షించలేదు. మార్వాడీ హిందీ విద్యాలయ, కేశవ మెమోరియల్ హైస్కూల్ విద్యార్థి. మోటార్ సైకిల్ మెకానిక్‌గా పని నేర్చుకుంటున్నాడు. ఈ అందమైన బిడ్డ ఇప్పటికి కండ్లల్లో కదులుతూనే వుంటాడు.

### పి. వెంకటేశ్వర్ (16)



8వ తరగతి విద్యార్థి. 1 మే 'కోర్కెల దినం' సందర్భంగా రాజ్‌భవన్ ముందు కాల్పులలో చనిపోయాడు. గవర్నర్‌కు మెమోరాండం సమర్పించటానికి వెళ్ళుతుంటే జరిగిన పోలీసు కాల్పుల పరిణామం. ఇతను ఉద్యమంలో చురుకుగా పాల్గొని, విద్యార్థులను ఉత్తేజ పరచటానికి సిద్ధిపేట, వికారాబాద్, నిజామాబాద్‌లు పర్యటించాడు. అనేక సార్లు నిరాహార దీక్షలు చేశాడు. ఒక తిరుగుబాటు దారుడిగా మరణించాడు. ఇతని మృతదేహం ఫోటో చూడండి. ఇప్పటికి కళ్ళు తెరిచి రాబోయే తెలంగాణా కోసం నిరిక్షిస్తూనే వున్నాడు.

### మాస్టర్ ఆనంద్ (13)



తండ్రి నారాయణరావు గౌలిగూడా నివాసి. జూన్ 2న సాయంత్రం 3 గంటలకు గౌలిగూడా బస్సు స్టాపులో బస్సుకోసం నిరీక్షిస్తుండగా కాల్పులకు గురై మరణించాడు. ఒకటిన్నర సంవత్సరం ముందే తండ్రి మరణించగా అతను ముసలితల్లిని ఇద్దరి చెల్లెళ్లను, ఒక దుఖాణంలో పని చేస్తూ పోషించుకుంటున్నాడు. కూలీ కోసం, కూటికోసం బతుకుదామని రోడ్డుమీదికోస్తే ఒక తుపాకి గుండు అతడిని బలితీసుకుంది. ఆ ముసలి తల్లిని, చిన్న చెల్లెళ్లను ఎవరు ఓదార్చారో? నోటికాడికోచ్చిన ముద్ద మట్టిపాలైంది.




### వినోద్ కుమార్ పటేల్ (20)




తండ్రి పేరు రామారావు. గౌలీగూడా నివాసి. 26 జూన్‌న సాయంత్రం 5 గంటలకు గౌలీగూడాలో పోలీసులు ఇతడిని కాల్చివేశారు. చాలా పేదవాడు. కుటుంబాన్ని పోషించటానికి ఒక బట్టల దుఖాణంలో పనిచేసేవాడు. ఇతని మరణానికి ముందు సరిగ్గా 25రోజుల క్రిందట అనగా జూన్ 2న ఇతని తమ్ముడిని (చిన్నాన్న కొడుకు) మాస్టర్ ఆనందును పోలీసులు బస్సు స్టాపులో నిలబడి వుండగా కాల్చివేశారు. ఒక్క నెలలో ఒకే కుటుంబంలో ఇద్దరి మరణం.

### ఒగ్గురాములు (21)



తండ్రి ఎల్లయ్య జాంబాగ్ నివాసి. జూన్ 2న మధాహ్నం 2 గంటలకు అన్నం తిని పనిలోకి వెళ్ళుతుంటే ఉస్మాన్ గంజిలో పోలీసు కాల్పులకు బలైనాడు. అతను అక్కడి జై ప్రకాష్‌రామ్ అండ్ కంపనీలో పనిచేసేవాడు. స్వగ్రామం పాలమూరులోని బొమ్మన పాడు. ఈ పాలమూరు బిడ్డను ఆంధ్రులు ఆక్రమించుకున్న హైద్రాబాదు పట్నం బ్రతుకనీయకుండా బలి తీసుకుంది.


### మాస్టర్ కె. డేవిడ్ (16)



చెప్పల్‌బజార్ నివాసి. తండ్రి కె.జె.రూబెన్. కాచిగూడ చౌరస్తాలోని నృపతుంగా హైస్కూల్ విద్యార్థి. సంగీతం అతని హాబీ. అతను జూన్3న రోడ్డు మీద చెల్లె కోసం నిరీక్షిస్తుంటే జరిగిన కాల్పులలో ఒక తూటా నారాయణరావు అనే అతడిని చీల్చి ఇతని శరీరంలోకి దూసుకపోయింది. ఇతని మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించే విషయంలో పోలీసులు ముప్పు తిప్పలు పెట్టారు.


www.etelangana.org

ఆకుల నరేందర్ (15)




తండ్రి మాదవ రావు. సికింద్రాబాదులోని కవాడిగూడా నివాసి. ఆదయ్య మెమోరియల్ హైస్కూల్ విద్యార్థి. జూన్ 4న తన ఇంటి మేడపై గదిలో కూర్చుని హెచ్.ఎస్.సి. పరీక్షలకు శ్రద్ధగా చదువుకుంటుండగా ఒక తుటా అతడిని బంగారు భవిష్యత్తు నుండి దూరం చేసింది. ఇతను చదువుకుంటూనే తన బస్తీలోని తెలంగాణా ఉద్యమంలో చురుకుగా పాల్గొనేవాడు. ఇతడి కళ్లలోని ఆశల మిలమిలలను గుంజుకున్నదెవరో?

ఎర్రమాడ బండి నర్సిరెడ్డి (49)



తండ్రి రాంరెడ్డి. ఇతను జూన్ 4న తన ఎడ్ల బండిని తోలుకుంటు ఇంటికి తిరిగి వస్తుండగా ఒక బుల్లెట్ పుణ్యమా అని ఇంటికి ఎప్పటికీ చేరుకోనే లేదు. ఇతని మృతదేహాన్ని అప్పగించటానికి పోలీసులు నిరాకరించటంతో అతడి భార్య ఉస్మానియా ఆస్పత్రి ముందు స్పృహ తప్పి పడిపోయింది. చనిపోయిన తర్వాత కూడా కనికరం చూపని సర్కారు, రాజ్యాలు ఎందుకు ఏలుతరో !

నారాయణ (24)



ఇతను దక్కన్ ఆయుర్వేదిక్ ఫార్మాసీలో డ్రైవర్‌గా పని చేసేవాడు. ఇతని తండ్రి పేరు మల్లయ్య. జూన్ 3న తను పని చేసే ఆఫీసు ముందు నిలబడి చూస్తుండగా ఒక బుల్లెట్ వచ్చి అతడికి తగిలింది. అతడి శరీరంలో నుండి ఆ బుల్లెట్ దూసుకపోయి ఒక పిల్లవాడి శరీరాన్ని కూడా చేధించుకుని ఇవతలికి వచ్చి విద్యుత్ స్తంభానికి తగిలి కింద పడిపోయింది. పోలీసులే ఈ శవాలకు అంత్యక్రియలు చేశారు.




కుమారి డి. రేణుక (11)



చాదర్‌ఘాట్ ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థిని. ఉస్మాన్‌పురా నివాసి. తండ్రి పేరు డి.లింగయ్య జూన్ 3న ఇంటి ముందు నిలబడి వున్న ఈ బాలికకు మూడు బుల్లెట్లు తగిలాయి. ఈమె గతంలో నిరాహారదీక్షలో కూడా పాల్గొంది. ఈమె మరణిస్తే బస్తీ మొత్తం ఏడ్చింది. పెద్ద ఎత్తున బహిరంగ సభ జరిగింది.

టీకారాం (28)



తండ్రి పేరు బజరాంసింగ్. దూద్‌బౌలి నివాసి. జూన్ 3న ఇతను తన కుల వృత్తి అయిన ఇస్త్రీ పని చేసుకుంటుంటే మూసి వున్న తలుపులను చేధించుకుని బుల్లెట్ అతడి శరీరంలోకి దూసుకుపోయింది. ఇతనికి భార్య ఇద్దరు మొగపిల్లలు, ఒక కూతురు వున్నారు. పోలీసులు జరిపిన విచక్షణారహిత కాల్పులకు ఇతని మరణం ఒక ఉదాహరణ.

మాస్టర్ మోజెస్ (11)




ఇతని తండ్రి లారెన్స్ జోసెఫ్. గన్‌ఫౌండ్రీ నివాసి. అక్కడే వున్న సెంట్‌పీటర్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్నాడు. పాపం పుణ్యం ప్రపంచ మార్గం ఏమీ తెలియని ఈ పసి బాలుడిని ఆంధ్ర సర్కారు పొట్టన పెట్టుకుంది. ప్రత్యేక తెలంగాణా ఒక్కటే తన కడుపు దుఖాన్ని మరిపిస్తుందని తండ్రి పదే పదే అన్నాడు.



www.etelangana.org

**కె. వెంకటేశ్వరరావు, న్యాయవాది (30)**



తండ్రి పేరు దేవిరావు. ఇతను బోనగిరిలో న్యాయవాదిగా పని చేసేవాడు కాని హైద్రాబాదు పాతనగరంలోని అలియాబాద్ నివాసి. కుటుంబాన్ని చూడటానికి వచ్చి పోలీసు కాల్పులకు ఎర అయినాడు. అవతల కాల్పులు జరుగుతుంటే తన చిన్న బాబు ఉత్సాహంతో బయటికి వెళ్ళగా వాడిని తీసుకురావటానికి వీధిలోకి వెళ్ళి తలకు తుపాకి గుండు తగిలి మరణించాడు. ఆ న్యాయవాదికి చివరికి లభించిన న్యాయం ఇదే.

**రాపోలు కృష్ణ (26)**



తండ్రి రాపోలు చంద్రయ్య. గొలిపురా నివాసి. జూన్ 4న సిగరెట్ల కోసం కందికల్ గేటుకు వెళ్ళగా అక్కడ కాల్పులలో గాయపడి ఉస్మానియా ఆస్పత్రిలో జూన్ 11న మరణించాడు. భార్య మరియు 2 సంవత్సరాల కొడుకును వదిలి అర్ధాంతరంగా చనిపోయాడు. అకాల మరణాలు, అర్ధాంతర మరణాలు.


**ఎం.ఏ. రషీద్ (22)**



తండ్రి పేరు ఎం.ఏ. మజీద్. సికింద్రాబాదులోని చిలకలగూడ నివాసి. 4 జూన్‌న జరిగిన పోలీసు కాల్పులలో మృతి చెందాడు. మోండా మార్కెట్ వీధిలో పోలీసు కాల్పులు జరుగుతుంటే బయపడి పక్క సందులోకి పరుగెత్తగా పోలీసులు ఉదయం 10.30 ప్రాంతంలో ఇతనిని చంపారు. ఇతనికి ఐదుగురు అన్నదమ్ముళ్ళు. ముసలి తల్లిదండ్రులను ఆదుకునేందుకు ఇతను చిలకలగూడలోని మున్నీ ఆటోవర్క్స్ దుఖాణంలో పని చేసేవాడు. చెట్టంత కొడుకు కుప్పకూలితే రొట్టెముక్క దొరుకని తల్లిదండ్రులు దిక్కులేనివారైనారు.




**కె. పెంటయ్య (40)**



తండ్రి పేరు లక్ష్మయ్య. ముషీరాబాద్ నివాసి. ఇతను మోజంజాహీ మార్కెట్‌లోని కింగ్స్ ఉడ్ దుఖాణంలో వడ్రంగిగా పని చేసేవాడు. జూన్ 4న ఒక పెళ్ళికి వెళ్ళుతుండగా నాంపల్లి ప్రాంతంలో పోలీసు కాల్పులకు గురైనాడు. గుండు తలకు తగిలి అక్కడిక్కడే మరణించాడు. భార్య ఇద్దరు మొగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు దిక్కులేనివారైనారు. అన్నం పెట్టేటోడు ఆకాశం అవతలి వైపుకు వెళ్ళిపోయాడు.

**నందగిరి భూషణం (22)**



తండ్రి ఎన్. జంగయ్య. సికింద్రాబాదులోని గాస్‌మండి నివాసి. జూన్ 4న జరిగిన కాల్పులలో మరణించాడు. నిరుద్యోగి. ఒక పసి పిల్లవాడి శరీరంలోంచి దూసుకొచ్చిన తూటా ఇతడిని కూడా గాయపరచగా ఆస్పత్రిలో మరణించాడు. అతడి తల్లి ఆ మరణవార్తను విని కుప్పకూలి పోయింది. పోలీసులే అనామక శవంగా భావించి అంత్యక్రియలు జరిపించారు.

**శ్రీమతి సావిత్రి, మాస్టర్ శివకుమార్ (21, 4)**



తల్లికొడుకుల అనుబంధాన్ని చివరికి మృత్యువు కూడా విడదీయలేకపోయింది. ఆమె భర్త శంకరయ్య. సికింద్రాబాదు, మార్కెట్ వీధిలోని తన ఇంటి ముందు ఆమె నిలుచుని వుండగా జరిగిన పోలీసు కాల్పులలో వారిద్దరు మరణించారు. ఆమె భర్త నిజంగానే పిచ్చివాడై పోయాడు. సామాన్య ప్రజలు కూడా ఎట్లా బలైనారో ఇదొక ప్రత్యక్ష ఉదాహరణ.




www.etelangana.org

### మహమ్మద్ షఫీక్ అహమ్మద్ (17)




తండ్రి పేరు ఎం.ఏ. మన్నాన్. చిలకలగూడా నివాసి. జూన్ 5న కర్ఫ్యూ సమయంలో ఈ యువకుడు వీధిలోకి రాగా కుల్వంత్ సింగ్ అను పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ నిర్ధాక్షిణ్యంగా కాల్చివేశాడు. ఇతను చురుకైన విద్యార్థి. సికింద్రాబాదులోని వెస్లీ బాయిస్ హైస్కూల్‌లో 11వ తరగతి చదువుకుంటున్నాడు. ఎన్.సి.సి. క్యాడెట్‌గా 1969 గణతంత్ర దినం నాడు ఢిల్లీ ఊరేగింపులో పాల్గొన్నాడు. ఇతని తమ్ముళ్ళు కర్ఫ్యూ సమయంలో అవతలికి వెళ్ళినందున వారిని తీసుకురావటానికి వీధిలోకి వెళ్ళగా ఆ ఎస్.ఐ. అతడి నుదుటికి రివాల్వర్ గురిపెట్టి కాల్చాడు.

### ఎం.ఆర్. కృష్ణారెడ్డి (19)



తండ్రి నారాయణరావు. శంషాబాద్ నివాసి. జూన్ 2న గౌలిగూడాలో జరిగిన కాల్పులలో అమరుడైనాడు. ఇతని తండ్రి సికింద్రాబాదులోని మడ్‌ఫోర్ట్ హైస్కూలులో అటెండర్‌గా పని చేసేవాడు. కృష్ణారెడ్డి శంషాబాదు నుండి 10వ తరగతి పరీక్ష పాస్ అయ్యి, కాలేజీ చదువు కోసం పట్నం వస్తే ఈ విషాదం జరిగింది.

### బుద్ధులాల్ (19)



తండ్రి పేరు కోసులాల్. సికింద్రాబాదులోని వెూండా మార్కెట్ నివాసి. జూన్ 27న సికింద్రాబాదు, అశోక్‌నగర్‌లోని గ్రీన్ హోటల్ వద్ద పోలీసులు ఇతడిని కాల్చివేశారు. ఇతను పండ్ల వ్యాపారి. నలుగురు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్లు మరియు వృద్ధులైన తల్లిదండ్రులకు ఇతనే ఏకైక ఆధారం. స్థానిక ప్రజాసమితిలో ఇతను చురుకైన కార్యకర్త. ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి రాజీనామా చెసిన రోజు జరిగిన అల్లర్లలో ఇతను బలైనాడు.



### సూర్యపల్లి నర్సింగ్‌రావు (14)




తండ్రి పేరు సత్తయ్య. పురానాపూల్ సత్తన గల్లీ నివాసి. జూన్ 7న సాయంత్రం 5 గంటలకు తల్లికోసం వెదుకుతూ వీధిలోకి రాగా పోలీసులు కాల్చివేశారు. ఈ పిల్లవాడు రహీంపురా స్కూల్‌లో 7వ తరగతి చదివేవాడు. చాలా తెలివైన విద్యార్థి. నుదుటికి గుండు తగిలి తల బద్దలైంది. తల్లికోసం వెదుకుతూ బయలుదేరిన ఆ పిల్లవాడిని, ఆ తల్లి ఎన్నిలోకాలు వెతికినా వాడు కానరాలేదు.



www.etelangana.org


# సభలు, సత్యాగ్రహాల ఫోటోలు - వివరాలు



మార్చి 8-9 రెడ్డి హాస్టల్ సదస్సులో ప్రసంగిస్తున్న కొండా వెంకటరంగారెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి మరియు సభికులు.




శోభాగాంధి
www.etelangana.org



వివేక వర్ధని కాలేజీ మైదానంలో విద్యార్థుల సభ - పోలీసుల బందోబస్తు.








జజ్జనకరి జనారే……. జనక జనా జనారే……




www.etelangana.org



కర్ఫ్యూలో నిశ్శబ్ద నముద్రమైన మొజంజాహీ మార్కెట్ రోడ్డు.






మారో, కాటో, గోలి చలావో, భాగావో ...............




www.etelangana.org



కదం తొక్కిన కవాతులు - అడ్డగించిన బారికేడ్లు:





రణరంగమైన బజారు వీధులు:



www.etelangana.org



ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర పటం ఆవిష్కరణ - ఆబిడ్స్‌లో నెహ్రూ విగ్రహం వద్ద సత్యాగ్రహం







లాఠీ, గోలీ ఖాయింగే - తెలంగాణా లేయింగే.



www.etelangana.org



నరకలోకపు జాగిలమ్ములు........



అగ్ని శిఖలాంటి త్యాగాలకు బయలు దేరిన రోజు - పక్షుల మోహనుల ప్రవాహం.





www.etelangana.org



సత్యాగ్రహానికి బయలుదేరిన మహిళాలోకం






యువతరం శిరమెత్తి - నవతరం గళమెత్తి




www.etelangana.org



కాల్జేతులు విరిగిన తెలంగాణా తమ్ముండ్లు.





మోజాంజాహీ మార్కెట్‌లోని తెలంగాణా ఎన్.జి.వో.ల సంఘం భవనంపై సత్యాగ్రహానికి సిద్ధమౌతున్న ఉద్యోగులు మరియు మోజాంజాహీ మార్కెట్ చౌరస్తాలో సత్యాగ్రహ దృశ్యాలు.



www.etelangana.org



సత్యాగ్రహానికి బయలుదేరిన మహిళల జట్టు శ్రీమతి పి. వెంకటమ్మ, శాంతాబాయి మొదలగు వారు (ప్రక్కన నిలుచున్నవారు పి. ఆర్. గోవర్ధన్)






టి.ఎన్. సదాలక్ష్మి నాయకత్వంలో శాంతాబాయి, వెంకటమ్మ తదితరులు సత్యాగ్రహం చేస్తున్న దృశ్యం



www.etelangana.org



హైద్రాబాదు పాతనగరం, అలియాబాద్‌లోని శారద బాలికల పాఠశాల ముందు సత్యాగ్రహం చేస్తున్న విద్యార్థినులు.



# కాల్పులలో హతులు వికలాంగులైనవారి వివరాలు

(హైద్రాబాదు, సికింద్రాబాదులలో కేవలం ఒక జూన్ మాసంలోనే జరిగిన పోలీసు కాల్పులు. అట్లా జూన్ 'రక్తాక్షి' మాసంగా చరిత్రలో నిలిచిపోయింది)

**మరణించిన వారి వివరాలు :**

1. మాస్టర్ ఆనంద్ (13) తండ్రి నారాయణరావు, గౌలిగూడ. 2-6-69
2. ఎం.ఆర్. కృష్ణారెడ్డి (19) తండ్రి మామిడి రాంరెడ్డి, శంషాబాద్. 2-6-69
3. ఒగ్గురాములు (21) తండ్రి ఎల్లయ్య, జాంబాగ్. 2-6-69
4. మాస్టర్ డేవిడ్ (16) తండ్రి కె.జె. రూబెన్, చప్పల్ బజార్ (నృపతుంగా హైస్కూలు విద్యార్థి) 3-6-69
5. నారాయణ (24) తండ్రి మల్లయ్య, రాంకోటి. 3-6-69
6. కుమారి డి.రేణుక (11) తండ్రి లింగయ్య, ఉస్మాన్‌పురా (చాదర్‌ఘాట్ ప్రభుత్వ హైస్కూల్‌లో 6వ తరగతి విద్యార్థిని) 3-6-69
7. మాస్టర్ మోజెస్ (11) తండ్రి లారెన్స్ (సెయింట్ పీటర్ స్కూల్, గన్‌ఫౌండ్రీ) 3-6-69
8. టీకారాం (28) తండ్రి బజరాంసింగ్, దూద్‌బౌలి. 3-6-69
9. ఆకుల నరేందర్ (15) తండ్రి మాధవరావు, కవాడిగూడ. 4-6-69
10. ఎర్రమాడబండ నర్సిరెడ్డి (49) తండ్రి రామిరెడ్డి. 4-6-69
11. కె. వెంకటేశ్వరరావు, అడ్వకేట్. తండ్రి దేవిరావు, (అలియాబాద్ కాల్పుల్లో చనిపోయారు) 4-6-69
12. రాపోలు కృష్ణ (26) తండ్రి రాపోలు చంద్రయ్య, గౌలిపురా (కందికల్ గేట్ ఫైరింగ్‌లో చనిపోయాడు) 4-6-69
13. ఎం.ఎ. రషీద్ (22) తండ్రి మజీద్, మోండామార్కెట్, సికింద్రాబాద్. 4-6-69



శోభాగాంధీ
www.etelangana.org

14. కె. పెంటయ్య (40) లక్ష్మయ్య, ముషీరాబాద్, (నాంపల్లి ఫైరింగ్‌లో చనిపోయాడు) 4-6-69

15. నందగిరి భూషణం (22) తండ్రి జంగయ్య, ఘాస్‌మండి, సికింద్రాబాద్. 4-6-69

16. శ్రీమతి సావిత్రి (21) తండ్రి శంకరయ్య, మరియు 4 సంవత్సరాల కుమారుడు శివకుమార్ (ఇంటి ముందు కూర్చుంటే కాల్పుల్లో చనిపోయారు, మార్కెట్ స్ట్రీట్ సికింద్రాబాద్) 4-6-69

17. మాహ్మెద్ షఫీ అహమ్మద్ (17) తండ్రి ఎం.ఎ. మన్నాన్, చిలకలగూడ కర్ఫ్యూలో బయటకు వచ్చినందుకు కుల్వంత్‌సింగ్ ఎస్ఐ చిలకలగూడలో కాల్చిచంపాడు. 4-6-69

18. వినోద్‌కుమార్ పటేల్ (20) తండ్రి రామారావు, గౌలిగూడ. 26-6-69

19. బుద్దులాల్ (19) తండ్రి కౌసులాల్, మోండామార్కెట్ అశోక్‌నగర్, సికింద్రాబాద్. 27-6-69

20. సూర్యపల్లి నర్సింగ్ రావు తండ్రి సత్తయ్య, పురానాపూల్. 7-6-69

**బుల్లెట్ గాయాలకు శాశ్వత అంగవైకల్యం పొందినవారు :**

1. విజయకుమార్ (18) తండ్రి రాంచందర్, గౌలిగూడ. 2-6-69
2. ఎస్. నరేందర్ (27) తండ్రి రాజయ్య, కార్వాన్ సాహు. 3-6-69
3. చంద్రయ్య (22) తండ్రి రాజలింగం, చుడీబజార్. 3-6-69
4. బద్రినాథ్ (20) తండ్రి సుందర్‌రావు, నిజాంషాహిరోడ్-రాంకోఠి. 3-6-69
5. మణెమ్మ (30) భర్త వెంకటస్వామి, ఇసామియా బజార్. 3-6-69
6. సుశీలా (25) భర్త రంగారెడ్డి, ఇసామియా బజార్. 3-6-69
7. వెంకటస్వామి (35) తండ్రి శంకరయ్య, ఇసామియా బజార్. 3-6-69
8. సి. జగదీష్ (25) తండ్రి రాజన్న, సుల్తాన్‌బజార్. 3-6-69



9. రహమతుల్లా బేగ్ (60) తండ్రి జాజుల్లా బేగ్, దూద్‌బౌలీ. 3-6-69
10. సత్యనారాయణ (15) తండ్రి చుక్కప్ప, ఉస్మాన్‌గంజ్. 3-6-69
11. రామస్వామి (15) తండ్రి నారాయణ, దౌల్తాబాద్. 3-6-69
12. శంకరయ్య (62) ఇసామియా బజార్. 3-6-69
13. రామలింగం (40) తండ్రి లక్ష్మయ్య, ఇసామియా బజార్. 3-6-69
14. నరేందర్ (16) తండ్రి శేషాచారి, గోషామహల్. 3-6-69
15. ప్రకాష్ (22) తండ్రి దేవేందర్, ఫీల్‌ఖానా. 3-6-69
16. అహ్మద్‌బిన్ అబ్దుల్లా (11) తండ్రి అబ్దుల్లాబిన్ అహ్మద్, మిరాలమండి. 3-6-69
17. ముస్తఫా అబుదీ (20) తండ్రి ముర్తుజా అబుదీ, డబిర్‌పురా. 3-6-69
18. మహమ్మద్ ఇబ్రాహీం (21) తండ్రి మహమ్మద్, షఫీరోద్దీన్, మలక్‌పేట. 3-6-69
19. చోటేరాం (30) తండ్రి నాగోజి, దూద్‌బౌలి. 3-6-69
20. జ్ఞానేశ్వర్ (25) తండ్రి పాండు, యాకుత్‌పురా. 4-6-69
21. రామదాస్ (25) గౌలిపురా. 4-6-69
22. సక్కుబాయి (25) భర్త సుదర్శన్, యాకుత్‌పురా. 4-6-69
23. బాలకృష్ణ (35) తండ్రి చంద్రయ్య, బోయిగూడ. 4-6-69
24. మహమ్మద్ నవాజ్ (25) తండ్రి మహ్మద్ ఇబ్రాహిం, మల్లేపల్లి. 4-6-69
25. లచ్చుమయ్య (20) తండ్రి లాల్‌రెడ్డి, సికింద్రాబాద్. 4-6-69
26. అలీమోయిన్ (8) తండ్రి ఇనాయత్‌అలీ, యాకుత్‌పురా. 4-6-69
27. వెంకటేశ్ (19) తండ్రి నర్సయ్య, చిలకలగూడ. 5-6-69



శోభాగాంధి

www.etelangana.org

# BIBLIOGRAPHY

1. Whither Hyderabad ? (1934) Abid Hussain.

2. Modern History of Andhra Pradesh (1978) - P.R. Rao.

3. Telangana a Study of Regional Committes in India (1972) - Prof. K.V. Narayana Rao.

4. 'The Telangana Agitation & Politics of Andhra Pradesh' Indian Journal of Political Science (1970 January, Vol. 31) - Prof. K. Sheshadri.

5. 'The demand for Separate Telangana State in India'. Asian Survey, May 1971 - Hugh Gray (Prof. of Political Science & British Parliament Member)

6. Andhra - Telangana Bifurcation, Radical Humanist (May 1973, Vol. 37) - N. Innaiah.

7. Telangana Bulletin (April 1999).

8. Deccan Chronical News papers (1969 - 70).

9. ఆంధ్రుల సంస్కృతి, చరిత్ర - 2 : కంబంపాటి సత్యనారాయణ.

10. ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర (1990) - పి. రఘునాధరావు.

11. 50 సంవత్సరాల హైద్రాబాదు - ముందుముల నర్సింగరావు.

12. ఆంధ్రప్రదేశ్ చరిత్ర, ఆధునిక యుగం - జి. వెంకటరామారావు.

13. తల్లడిల్లుతున్న తెలంగాణా (2000) సెంటర్ ఫర్ తెలంగాణా స్టడీస్.

14. మరోదారి, మాసపత్రిక : ఏప్రిల్ 1998.

15. చూపు, తెలంగాణా ప్రత్యేక సంచిక, నవంబర్-డిసెంబర్ 2001.



16. చార్మినార్ కథలు (1981) నెల్లూరి కేశవస్వామి.

17. ప్రసారిత సంచికలు (1969-73).

18. తెలంగాణా ఎంప్లాయీస్ అసోసియేషన్ : కరపత్రం.

19. ఆంధ్రభూమి, విశాలాంధ్ర, ఆంధ్ర ప్రభ, ఆంధ్రపత్రిక దినపత్రికలు (1952 మరియు 1969-70).

20. నా తెలంగాణా, ముల్కీ మాస పత్రిక, మే-జూన్, 2002

*Personal interviews :*

1. Prof. N.G. Rajurkar. (Political Science)
2. Dr. S. Sadashiva, Retd. Prinicipal.
3. Dr. A. Venugopal, Telugu, Degree College Lecturer.
4. S. Yadagiri, M.A., M.Phil., Degree College Lecturer, Political Sceince.
5. Sri P. Yadagiri, Journlist.



www.etelangana.org